సంపుటి: 22
సంచిక :1

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

ఆగస్టు, 1976

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. పీ. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము గత నెలతో "అపరాధపరిశోధన"కు పదకొండు ఏళ్లు నిండాయి. పన్నెండవ ఏడులోకి అడుగు పెట్టిన శుభ సందర్భములో మిత్రులు, అభిమానులు అనేక మంది శుభాకాంక్షలు పంపారు. వారందరికి మా కృతజ్ఞతలు.

పత్రిక నిర్వహణ వ్యయం రోజు రోజుకు పెరిగి పోతూనే వున్నందున ఈ నెలతో "ఉచిత చందా పథకం"ను రద్దు చేస్తున్నాము. దాని స్థానే 'జీవిత చందా' ఏర్పాటు చేశాము. దీనిలో రు. 250/—లు ఒకేసారి చందా కట్టిన వారికి వారి జీవిత కాలమంతా పత్రిక ఉచితంగా అందజేయ బడుతుంది. ఒకసారి 'జీవిత చందా' సభ్యులుగా చేరిన తర్వాత పత్రిక ధరలోంచి చందా రేటులోగాని ఎన్నిమార్లు మార్పు జరిగినా అది సభ్యులకు వర్తించదు.

ప్రస్తుతం 'ఉచిత చందా పథకం'లో నున్న సభ్యులందరినీ 'జీవిత చందా'లోకి మార్పు చేశాము. కావున సభ్యులలో ఎవరికైనా అభ్యంతరముంటే మీ నెలాఖరు లోపల తెలియజేయాలి. మీ నెలతో చందా రేట్లలో ఇచ్చిన తగ్గింపు గడువు కూడా ముగిసినది.

జులై '76 నెల "సప్లిమెంట్"లో నిర్వహించిన బ్యాలెట్‌లో శ్రీమతి 'వసుంధర' (జొన్నలగడ్డ రామలక్ష్మి) గారి నవల 'నకిలీబాస్' అత్యధిక మెజారిటీతో ఉత్తమ నవలగా ఎన్నికైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. రచయిత్రికి బహుమతి రు. 116/—లు అందజేయబడినవి.

సెలవా మరి— మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. మనిషిలో మనిషి—వై. రాజేశ్వరి.
16. సింహాపు పిల్ల—ఏ. వీ. మోహన్రావ్.
30. పవిత్రతకు పరీక్ష—వసుంధర.
68. తలుపులు మూసి పడుకోండి—అజీజ్.
85. విమాన దొంగలు—వెంకట్రామ్.
95. టెలిఫోన్ టెక్నిక్—శ్యాంబాబు.
118. తెలివి ఒకరి సొత్తు కాదు—పెందుర్తి మాస్టర్జీ.
126. కలికి—కంచర్ల రమణ.
151. సుమిత్రా దేవి—సంపత్.
181. పరలోక ప్రాప్తి—రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. హంతకులు–ఆగంతకులు—కురుమద్దాలి విజయలక్ష్మి
46. పదిసంవత్సరాల ప్రతీకారం–ఏ. వీ. మోహన్రావ్.
82. ప్రాణాలు దక్కితే చాలు—అజీజ్.
155. వందకు పది వేలు—వసుంధర.

ఇవికాక–చెప్పుకోండి చూద్దాం, క్రైమ్‌లో తమాషాలు, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!!

మనిషిలో మనిషి!

వై. రాజేశ్వరి

"హోటల్ దిల్‌కుష్" చాలా పెద్దది. డబ్బున్న వాళ్ళకు అది భూతల స్వర్గంలా వుంటుంది.

ఆ భూతల స్వర్గం మూటపదకొండో నెంబరు ఏ.సి. డబుల్ రూమ్‌లో—

మందు సీసాలకెదురుగా, సోఫాకి బరువుగా కూర్చొని వున్నాడు యానమ్.

అతని కెదురుగా, కుదురుగా కూర్చున్నతని పేరు— కంప్యూటరు శాస్త్రి.

"అయితే కుదరదంటారా?" యానమ్ మాట ముద్దుగా వున్నా, ధాటీగా వుంది.

"నాకేమీ ఆలోచన తట్టటం లేదు" కంప్యూటరు శాస్త్రి జవాబిచ్చాడు.

"ఆల్రైట్ యాభై వేలు" రేటు పెంచాడు యానమ్.

"అది సరే కాని, నాకు మొదటినుండీ ఇటువంటి

లైన్‌లో అనుభవంలేదు. ఏ పద్ధతయితే మీకు అనుకూలంగా వుంటుందో ఆలోచించనివ్వండి. కొంచెం వ్యవధి ఇవ్వండి." కొద్దిగా చికాకుగా అన్నాడు శాస్త్రి.

యానమ్ పరిస్థితి గ్రహించి "ఆల్‌రైట్ రేపు మధ్యాహ్నం వరకు ఆలోచించండి. రేపు ఇక్కడ కలవొద్దు. నా సెక్రెటరీకి ఫోన్‌చేస్తే చెప్తుంది, ఎక్కడ కలవాలో. మీకు ఏభై వేలు కేష్. రేపొద్దున్న అందజేస్తాను. ఓకే గుడ్ నైట్!" అంటూ సమావేశాన్ని ముగించి లేచాడు.

శాస్త్రి వెళ్ళిపోయాడు.

ఆర్కే-యానమ్‌కి, మనసు మనసులో లేదు.

అసలు, అతనికి మనసే లేదంటారు అతని కింద పని చేసేవాళ్ళు.

యానమ్, తన మీదనున్న ఆఫీసర్‌కి తలలో నాల్కలాంటివాడు.

తన క్రింద పనిచేసే వాళ్ళకి, తన చుట్టూ తిరిగే కాళ్ళకి తలలో పేనులాంటి వాడు. కుక్కి మంచానికి పట్టిన నల్లిలా ఆ కంపెనీని గత దశాబ్దంగా ఏలుతున్నాడు.

అతను తెలుగుతో సహా ఎనిమిది భాషలు స్వచ్ఛంగా మాట్లాడుతాడు. అతనికి భార్య ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు వున్నారు.

అయితే, జీవితం బుద్బుద ప్రాయమని గ్రహించిన యానమ్, దొరికిన ప్రతి అవకాశాన్ని రూపాయల్లోకి మార్చుకొన్నాడు, కొంటున్నాడు.

ఒకడికి వుద్యోగం రావాలన్నా, మరొకడికి పోవాలన్నా; ప్రమోషన్లు ట్రాన్స్‌ఫర్లు రావాలన్నా, ఆగాలన్నా; కాంట్రాక్టు సంతకం అవాలన్నా. కొత్త కాంట్రాక్టు క్రియేటవాలన్నా; ఏదన్నా; ఏదీ అనకున్నా; ప్రతీ దానికీ ఒకరేటు పెట్టేసి,

రెండు చేతులా ఆర్జిస్తున్నాడు.

కంపెనీ సమస్త రాజలాంఛనాలతోను అమర్చిపెట్టిన ఇల్లు వాకిలి; కారు కాక, ఇప్పటివరకు సుమారు యాభై లక్షల ఆస్థిని వెనకేసాడని నమ్మకమైన అనధికార వార్తలు వున్నాయి.

2

ఇనప్పెట్టిలోనుంచి ఏభై వేల రూపాయలు బయటకు తీసాడు యానమ్. ధనం నల్లదైనా నోట్లు కొత్తగానే వున్నాయి.

"భీముడూ...." యానమ్ పిలవగా, భీముడు వచ్చాడు।

"చాలా జాగ్రత్తగా తీసుకెళ్లాలి....మూడో కంటివాడికి తెలియకూడదు. వెళ్ళు।" యానమ్ ఆజ్ఞాపించాడు.

భీముడు వెళ్ళిపోయాడు, చేతిలో నిండు బ్రీఫ్‌కేస్‌తో।

భీముడు వెళ్ళిపోయాక ఆలోచనల్లోపడ్డాడు, యానమ్.

"తన పాపం పడిందా?....ఛ....లేదు....శాస్త్రికి యాభై వేలు అందచేయటం వరకూ అంతా అనుకొన్నట్టే జరుగుతోంది. ఇక ఆలోచించవల్సింది అసలు సమస్యకు పరిష్కారం అదే అదే, కుదిరి చావటం లేదు. ఆల్రైట్.... చూద్దాం శాస్త్రి ఏమిటి సజెస్ట్ చేస్తాడో" ఆలోచనలు వాయిదా వేసి భోజనానికి లేచాడు యానమ్.

యానమ్ లంచాలతో బాబు, ఒకపూట వెస్ట్రన్ భోజనం ఒక్కపూట రొొట్టెలు తింటాడు.

యానమ్ అంతలాగ లంచాలు తింటూవుంటే కంపెనీ ఎలా వూరుకొొందాని కొంత మందికి అనుమానం రావడం సహజం.

ప్రతీ దుష్ట రాక్షసుడికీ ఒక పతివ్రతా శిరోమణి భార్యగా వుండేదట. వాడెన్ని దుష్కార్యాలు చేసినా ఆయమ్మ పాతి

ప్రత్య మహిమ వలన వాడి సిగలో పువ్వేనా వాడేదికాదట.

అలాగే, యానమ్‌కి ఒక అసిస్టెంటు వున్నాడు. అతని పేరు దివాకర్. దివాకర్‌లోని భగవద్భక్తి, స్వామి భక్తి పోటీలు పడుతూ వుంటాయి. అతని భక్తే యానమ్‌ని కాపాడుతోందని చాలామంది సమాధానం చెప్పుకొంటూ వుంటారు.

దివాకర్, వుల్లిపాయ కూడా ముట్టని నిష్టాగరిష్టుడు. 'వెధవ' అన్న మాట కూడా నీటితో వుచ్చరించని సత్పురుషుడు. సోమవారం నుంచి ఆదివారం వరకు ప్రతీ రోజూ, ఆ రోజు ఏదేమునికి ప్రీతి అయితే ఆ దేఁవుడి పేర పూజ చేయించే భక్తితత్పరుడు. ఆఫీసు పనిలో అతి నికార్సయిన మనిషి. కాణీ పుచ్చుకోడు. కాగితాలు ఆపడు. అతన్నందరూ 'కర్మయోగి' అంటుంటారు.

వీటన్నిటినీ మించినది అతని స్వామి భక్తి. యానమ్ కోటు బొత్తాము మీదో, లేక పైనాట్ మీదో ఈఁగవాలినా భరించలేడు.

యానమ్ కూడా, తన ఇనప్పెట్టి కంటే, బాంకు బాలెన్సు కంటే కూడా ఎక్కువగా నమ్ముతాడు దివాకర్‌ని.

అటువంటి దివాకర్ స్వామి భక్తే యానమ్‌ని కాచుకొంటోందని చాలా మంది గాఢంగా నమ్మడంలో ఆశ్చర్యం లేదని మిగిలిన వారి వుద్దేశం.

ఏది ఏమైనా యానమ్ మీద 'ఏక్షన్' తీసుకోగలిగిన వాడు ఒక్కడే ఒక్కడు. అతను యానమ్‌పై ఆఫీసరు. అతను యానమ్ పై ఏకైక అధికారి.

'ఆ పై అధికారికి యానమ్ చేస్తున్నవన్నీ తెలియవేమిటిచెప్మా?' అని ఆశ్చర్యపోతారు కొందరు.

'ఆఁ....ఎందుకు తెలియవు? అన్నీ తెలుసు....తలచు కొంటే ఒక్క కలం పోటుతో అతన్ని తీసెయ్య గలిగిన అధికారం, అవకాశం, ఋజువులు వున్నాయి. కాని వాటిన్ని టితో బాటు అతనికున్న మొహమాటాలూ అతనికున్నాయి.' అని జవాబిస్తారు మరికొందరు.

యానమ్ ధర్మమా అని లంచగొండితనం కంపెనీలో వున్న ఎటెండెరు దగ్గర్నించి ఏరియా మేనేజరు వరకు చాలామందికి చిదుములా వ్యాపించి పుడుములా పట్టుకొంది. ప్రతివాడు కడుపు పట్టినంత తిని, జేబు పట్టినంత నింపు కొంటున్నాడు.

అయితే, దేశం ఇంత సుభిక్షంగా వున్నప్పుడు.... లంచాలు కుంచాలతో కురిసి గాదెలు, గాద్రేజ్‌లు నిండుతూ వున్నప్పుడు, మరి యానమ్ మనసు ఘనసులో ఎందుకు లేదు?

3

"ఇవాళ శాస్త్రి అన్నతను ఫోన్ చేస్తాడు. ఎక్కడ కలుసుకోవాలో అడుగుతాడు. కామాక్షిలో మాట్నీకి రమ్మను. నాలుగున్నర టికెట్టు కొనుక్కోమను."

"అలాగే సార్."

"రెండు లెటర్సు తీసుకో. వెంటనే టైప్‌చేసి తీసుకురా. అవి కాక ఇంకేమైనా అర్జెంటు కాగితాలుంటే సంతకాలు తీసుకో. మధ్యాహ్నం నేను రాబోవటంలేదు. ఆరున్నర తర్వాత యింటికి ఫోన్‌చేసి, అర్జెంటు విషయాలేమైనా వుంటే చెప్పు..."

"యస్సార్...."

పనులన్నీ యాంత్రికంగా సాగిపోతున్నాయి. యానమ్ కేమీ పాలుబోవటం లేదు. ఈ పరిస్థితి నుంచి ఎలా గట్టె

క్కాలో తెలియటం లేదు. అసలీ పరిస్థితి ఎందుకొచ్చిందో అర్థం కాలేదు.

ఈ పరిస్థితి రాకపోను! యానమ్ అండ్ కో వారి అరాచ కాన్ని చూడలేక విధి రెండు కళ్ళూ కుట్టుకొంది.

సరిగ్గా అప్పుడే కంపెనీ డైరక్టర్లు రెండు కళ్ళూ విప్పారు. కళ్లు విప్పడమేమిటి రెండు అత్యవసర సమావేశా లలో రహస్యంగా ఏకబిగిని చర్చించేసారు. కంపెనీ దుస్థితికి వాపోయారు. చీడ పురుగులని ఏరి పారెయ్యాలనుకొన్నారు.

దాని ఫలితంగా ముగ్గురు వ్యక్తులు గల టీమ్ ఒకటి, ఒక మెషీన్‌తో సహా బయలుదేరింది. ఆ మెషీన్ మనిషిలో నున్న మరో మనిషిని బయటపెడుతుంది.

ఆ మెషీనే, యానమ్‌గారి (డబ్బుచూస్తే) వెన్నలా కరిగిపోయే మనసుని కలతపెట్టింది! అందుకే అతని మనసు మనసులోంచి లేచిపోయింది.

మరొక మనిషి కనకనా డబ్బుతో నోరు నొక్కడానికి! వెల్‌డిజైన్డ్ అల్ట్రా మోడరన్ ఎక్యూప్‌మెంటట అది!

ఆ టీమ్ ఢిల్లీలో రహస్యంగా బయలుదేరిన అయిదారు గంటలకి యానమ్‌కి పూర్తి వివరాలు అందిపోయాయి.

"ఆ మిషను అంతా కలిపి మూడడుగుల పొడవు అడుగు న్నర వెడల్పు, ఆరంగుళాల మందం వుంటుందట. ఒక వ్యక్తి దానిని ఆపరేట్ చేస్తాడట. ఒక మనిషి దాని మెయింటెనెన్స్ చూస్తాడట.

ఒక వ్యక్తి తాలూకా ఆలోచనా పరంపరలను రికార్డు చేసి, ఎనలైజ్ చేసి, ఆ వ్యక్తి తాలూకా స్వభావాది గుణాలను రిపోర్టు ఢిల్లీలో 'డిసైఫర్' చెయ్యబడుతుందట. అయితే ఆ మెషీను, ఆపరేటరు, మెయింటెనెన్సు టెక్నీషియను

ఒక అజ్ఞాతస్థావరంలో వుంటారట.

ఆ టీమ్‌లోని మూడవ వ్యక్తి, తన దగ్గరున్న 'థాట్ రీడర్' అనే పోర్టబుల్ ఇనుస్ట్రుమెంటు ద్వారా, తనకు కావలసిన వ్యక్తియొక్క ఆలోచనలు రికార్డుచేసి, ఆ మెషీన్‌కు ఫీడ్ చేస్తాడట.

ఒక వ్యక్తి తాలూకా ఆలోచనలు అతనికి తెలియకుండా, అతి నిపుణతగా రికార్డు చెయ్యటం అన్నది ఒక 'మనిషి' పని అని తెలిసాక, యానమ్ మనసు మళ్ళీ గూడు చేరు కుంది. చేరుకోవట మేమిటీ, తర్వాత కార్యక్రమాన్ని చక చక ఆలోచించి అమలుపరిచింది.

మనుష్యులను లొంగదీసుకోవటం యానమ్‌కు, ఫ్రిజ్ లోంచి తీసిన బ్రెడ్‌కు జామ్ పూసుకుని తిన్నంత సులువైన పని.

యానమ్ ప్లాన్ ప్రకారం ఆలోచనలు రికార్డ్ చేసే 'కంప్యూటర్ శాస్త్రి' వలలో పడ్డాడు. యాభై వేలు శాస్త్రికి అందాయి. ఇంతవరకు అంతా అనుకొన్నట్టే జరిగింది. ఇక జరగవలసిందే అనుకోవలసి వుంది. అది, మధ్యాహ్నం 'మాట్నీ' ప్రోగ్రాంలో.

4

ఆ మధ్యాహ్నం ఆర్కే-యానమ్, శాస్త్రి, 'కామాక్షి' హాలు దగ్గర కలుసుకొన్నారు. ఏదో పాత క్రైమ్ పిక్చర్ అందులో నడుస్తూంది. అట్టే రద్దీలేదు.

హాయ్ అంటే హాయ్ అనుకున్నాక, ఇద్దరూ హాల్లోకి వెళ్ళారు. వాళ్ళువెళ్ళిన క్లాసు యానమ్ అంతస్థుతో సరితూగే అంత ఎత్తులో వుంది.

యానమ్ మనసులోని దిగులులాగా, మసక వెలుతురు ఆ హాల్లో పలచగా పరుచుకొని వుంది.

వాళ్ళిద్దరూ కాక ఆ క్లాసులో మరొక అరమనిషి వున్నాడు. అతను లోపలికి వెళ్ళి కూర్చోలేదు. టిక్కెట్లు చింపడానికి గేటు దగ్గరే నిలుచున్నాడు.

సినిమా జరుగుతుండగా యిద్దరూ చర్చించుకొన్నారు. వాళ్ళ లిస్టులో మొత్తం పదిహేను మంది పెద్దవాళ్ళ పేర్లు వున్నాయట. అందులో మొదటిది యానమ్ పేరేనట! చిన్న వాళ్ళ పేర్ల లిస్టు తరువాత తయారవుతుందేమో! యానమ్ పేరు అండర్లైన్ కూడా చేసారట. పని మార్నాటినుంచే మొదలవ్వాలట.

యానమ్ కొంతసేపు మాట్లాడలేదు.

"....పోనీ! ఒకలా చేస్తే? రేపంతా నేను జాగ్రత్త పడితే??" అడిగాడు యానమ్.

"జాగ్రత్త పడటమంటే??"

"పార్టీస్ నెవర్నీ కలవకుండా,....వాటి వేటిగురించి ఆలోచించకుండా రేపంతా జాగ్రత్తగా గడపగలిగితే...."

"నోనోనోనో....ఇట్సింపాజిబుల్....ఆలోచనలని అరికట్టడం....అందులోకీ, ఇటువంటి ఆలోచనలను....నో.... మనలాంటి వాళ్ళకి సాధ్యం కాదు!....అదీ కాక, అవతల ఒక మెషీన్‌లో మన ఆలోచనలన్నీ రికార్డవుతున్నాయి అంటే సైకలాజికల్‌గా మనస్సంతా అటే వుండి....ఒక్క క్షణం కూడా ఖాళీ లేకుండా అహరహం లంచాల గురించే ఆలోచనలు వస్తాయి. మరింత చక్కటి క్లియర్ రిపోర్టు వస్తుంది. అందుకే మనలాంటి మనుష్యులని నమ్మకుండా, ఈ మెషీన్‌ని నమ్మారు, మీవాళ్ళు. లక్ష రూపాయలు ఇచ్చి మా వాళ్ళ దగ్గర అద్దెకు తీసుకొన్నారు."

తెరమీద 'దుష్టుడు అండ్ కో'కి చెడ్డ రోజులు ఆరంభ

మయ్యాయి. అంతా కూర్చొని మందు సేవిస్తూ, ముందు చెయ్యవలసిన పని గురించి సమాలోచన చేస్తున్నారు. ఆపద ఎలా తప్పించుకోవాలో బోధపడలేదు వాళ్ళకి.

"మెషీన్ని ఏఁవీ మేనిప్లేట్ చెయ్యలేమంటారా?"

"అది అస్సలు కుదరదు.... దేనికీ లొంగదు. ఒకటే కరెక్టు ఎనాలిపిస్సేనా యిస్తుంది....లేకపోతే ఇవ్వడమేనా మానేస్తుంది. అంతే! ఇది ఇచ్చిన రిపోర్టుకు ఇక తిరుగుండదు. అందుకే దీన్ని పంపారు."

"మరెలాగండీ ఈ గండం గడవటం? శతకోటి దరిద్రాలకి అనంతకోటి వుపాయా లుండాలి. సొల్యూషన్ లేని ప్రోబ్లెమ్ వుండదు. ఉపాయం లేకుండా అపాయం వుండ కూడదు. అపాయం లేని ఉపాయం ఏదైనా చూడండి!" విసుగ్గా అన్నాడు ఆర్కే యానమ్.

విలన్‌గారికి అశక్తి వలన అసహనం పెరిగిపోతోంది. ఆ సహనం వున్న ప్రేక్షకులలో ఆసక్తి పెరిగిపోతోంది. రెండు జేబుల్లోంచి రెండు పిస్టల్స్ తీసి, అందం కోసం చుట్టూ వేలాడగట్టిన పూల కుండీలని పిచ్చిగా పేల్చేస్తున్నాడు విలన్!

"ఆఁ....వన్ మినిట్....ఇంకొకరి ఆలోచనలను రికార్డు చేసి, అవి మీవని మెనిప్లేట్ చెయ్యొచ్చు" మిరికిల్‌గా 'శాస్త్రి'కి బ్రిలియంట్ అయిడియా తట్టింది.

"అదెలాగా??...." యానమ్ కనుబొమ్మలు ముడి వడ్డాయి.

"మీరు....మీ ఆఫీసులో ఎవరి పేరైనా సజెస్ట్ చెయ్యండి...."

"యస్...."

"నేను అతని ఆలోచనలు రికార్డు చేస్తాను...."

"దెన్...."

"అవి మీవేనని సర్టిఫై చేస్తూ. మెషీన్‌కి ఫీడ్ చేస్తాను...."

"వెల్...."

"కాని, మీరు సజెస్ట్ చేసే పేరు విషయంలో చాలా జాగ్రత్త తీసుకోవాలి. అప్పుడే మనకి ఫేవరబుల్ రిపోర్టు వస్తుంది...."

"బాగుంది....చాలా బాగుంది....రియల్లీ లీక్ ప్రూఫ్ అయిడియా...." మెచ్చుకోలుగా శాస్త్రి వీపు తట్టి, తృప్తిగా సోఫాలో జారగిలబడి, ఆలోచనలో పడ్డాడు. అతని కళ్ళకు గజేంద్రుని రక్షింప వచ్చిన మహావిష్ణువులా అసిస్టెంట్ దివాకర్ కనిపించాడు.

"నా అసిస్టెంటు దివాకర్ ఆలోచనలు మీరు రికార్డు చేయవచ్చు" చిరునవ్వుతో చెప్పాడు యానమ్.

"ఆర్యూ ష్యూర్?"

"అతన్ని గురించి ఏమీ ఆలోచించనక్కరలేదు. చీమకైనా హాని తలపెట్టని వ్యక్తి అతను. నా తెలివితేటల తర్వాత నేను నమ్మేది ఒక్క దివాకర్‌నే!" యానమ్ నమ్మకంగా, తృప్తిగా అన్నాడు.

5

మర్నాడు, తమ ప్లాన్ ప్రకారం యానమ్ అసిస్టెంట్ దివాకర్ ఆలోచనల్ని రహస్యంగా రికార్డు చేశాడు శాస్త్రి. అవి మెషీన్‌కి ఫీడ్ చేశాడు. అవి "యానమ్‌గారి"వే అని సర్టిఫై చేసాడు. కోడ్‌లో ఎనాలిసిస్ రిపోర్టు వచ్చింది.

దాన్ని మరొక మిషన్‌మీదే డిసైఫర్ చెయ్యాలి తప్ప, మామూలుగా చదవటానికి ప్రయత్నిస్తే పిశాచ భాషలాగ ఏమీ అర్థమవదు.

ఎనాలిసిస్ రిపోర్టు ఎయిర్‌లో ఢిల్లీ వెళ్ళి, డీకోడ్ అయి, అయిదో రోజున ఫ్లైట్‌లో అసలు రిపోర్టు వచ్చింది. అది కాన్ఫిడెన్షియల్ కవర్‌లో, ఒక కవర్‌లో, ఒక కవరింగ్ లెటర్‌తోబాటు, యానమ్ పై అధికారికి చేరింది.

యానమ్‌ని పిలిపించాడు పై అధికారి.

బాస్ గదిలోకి అడుగుపెట్టాడు యానమ్.

"మీ రిలాంటివారనుకోలేదు!" కోపంగా అన్నాడు బాస్.

ఎలాంటివారో బోధపడలేదు యానమ్‌కి.

"మెషీన్ గేవ్‌మి వెరీ వెరీ బాడ్ రిపోర్టు ఎబౌట్యూ.... ఐ మస్ట్ టేక్ సమ్ సీరియస్ ఏక్షన్...." 'ఏక్షన్' అన్న మాట వత్తి పలుకుతూ అన్నాడు బాస్.

"నో నో.... దేర్మస్ట్ బి సంథింగ్ రాంగ్" కుర్చీలో ఈజీగా చేరబడుతూ అన్నాడు యానమ్.

సర్కస్‌లోంచి రాత్రికి రాత్రి తప్పించుకుని పారిపోయి అడవిలోకి చేరుతూ, ధీమాగా నడుస్తున్న పులిలా నమ్మకంగా ధైర్యంగా వున్నాడు యానమ్.

బాస్ మౌనంగా ఒక ఫైలు యానమ్ ముందుకు తోసాడు.

ఫైలంతా చదవటానికి ముప్పై నిమిషాలు పట్టింది. ఆ చదవటం పూర్తి చేసేసరికి వళ్ళంతా చమట పట్టింది యానమ్‌కి.

అంతవరకూ పళ్ళు కొరుకుతూ, పడికిళ్ళు బిగిస్తూ, యానమ్‌వైపు చూస్తూ కూర్చొన్నాడు, యానమ్ పై అధికారి.

చదవటం అంటే పూర్తిచేశాడు కాని పొరపాటు ఎక్కడ జరిగిందో బోధపడలేదు యానమ్‌కి.

"మెషీన్ తప్పుచేసిందా? లేక కంప్యూటర్ శాస్త్రి మోసం చేశాడా?? లేక.... లేక...." యానమ్ మనస్సు అంతకంటే ముందుకు ఆలోచించటానికి వప్పుకోలేదు.

కళ్ళకు ఎదురుగా వున్నదాన్ని నమ్మకుండా వుండలేక పోతున్నాడు.

అలా అని, తన తెలివిని, నమ్మకాల్ని, వమ్ముచేసుకో పోతున్నాడు.

పూర్తిచేసిన ఫైలు మూసాడు యానమ్.

"పోనీకదా అని నిన్ను చూసీ చూడనట్లు వూరుకుంటే, నాకే ఎసరు పెడతావనుకోలేదు. నో మోర్ ఎక్స్‌ప్లనేషన్ లంచగొండివని రిపోర్టువస్తే కవర్ చెయ్యటానికి ట్రైచేసి వుందును.... బట్.... బట్.... నో.... నో.... ఐ డోంట్ హెల్ప్ యూ.... ఐ డోంట్.... కమాన్.... సైన్ యువర్ రిజిగ్నేషన్...." నిప్పులు కక్కుతున్నాడు బాస్.

యానమ్ గత్యంతరం లేక రాజీనామా వ్రాసి సంతకం పెట్టాడు.

లేవబోతూ ఆఖరిసారిగా ఆ ఫైలు మరొకసారి తీసాడు.

పది పేజీల రిపోర్టుకి ఆరులైన్లలో సమ్మరీ వుంది.

"ఇతను పైకి ఒక మనిషి. లోపల మరొక మనిషి. అతనున్న స్థాయికి అనర్హుడు. అనుక్షణం తనమీద వాడిని ఎలా సాగనంపాలా, ఆ స్థానం తానెలా ఆక్రమించాలా అని ఆలోచిస్తూ వుంటాడు! మొదటి తరగతి స్వామి ద్రోహి!! ప్రస్తుతం తనపై అధికారికి స్థానభ్రంశం కల్గించే ప్రయత్నాలు అవిరామంగా చేస్తున్నాడు!!!"

"యూ.... బ్లడీ.... దివాకర్...." ఈ సారి పళ్ళు కొరుక్కోవటం ఆర్కేయానమ్ వంతయ్యింది. ***

సింహపు పిల్ల??

ఏ. వీ. మోహన్‌రావ్

"దొంగ! దొంగ! దొంగ!"

వీథంతా అరుపులు మార్మోగాయి. రాత్రి పన్నెండు గంటలయింది. ఆ అరుపులకు కొంతమంది జనం లేచి, బిడాయించిన తలుపులు తెరచుకొని. వెలుపలకు వచ్చారు.

ఆ దొంగ పరుగు పందెంలో వెళ్తున్నట్లు ముందుకు వేగంగా పరుగెత్తుతున్నాడు. వీధి మొగలోకివచ్చి టర్నింగ్ తిరుగబోయాడు.

ఎదురుగా పోలీస్ కానిస్టేబుల్ కనిపించాడు రాక్షసుడిలా. అతని చేతిలో లాఠీవుంది. క్షణం అటు ఇటు చూశాడు. వెనుకనుండి జనం గుంపు తరుముకు రావడం కనిపించింది.

చటుక్కున జేబులోంచి పిస్తోలు వెలికి లాగాడు. కానిస్టేబుల్ గుండెలకు గురిపెట్టి, సేఫ్టీకాచ్ వదులుచేసి, బటన్ నొక్కాడు. లోపలున్న ఆరుగుళ్ళు అమాంతం శరవేగంతో

ప్రవహించాయి. కానిస్టేబుల్ కూలిపోయాడు. రక్తపు మడుగు ఏర్పడింది. వెనుకనుండి పరుగెత్తిన జనం, ముందుకు రావడం మాని వెనక్కి వెళ్ళారు.

పది నిమిషాల్లో ఊళ్ళో వున్న పోలీసు బలగమంతా దొంగ కోసం వేట మొదలెట్టండి. పెట్రోలింగ్‌వాళ్లు ఊళ్లో నుండి వెలుపలకువెళ్ళే అన్నిదారులు కాయడానికి వెళ్ళి పోయాయి.

ఇన్‌స్పెక్టర్ మూర్తి గుర్రం ఎక్కి, పదినిముషాల్లో ఊరంతా చుట్టివేశాడు. ఉత్తరం వేపునుండి వెళ్ళే రోడ్ పైన పరుగెత్తుతున్న ఓ ఆకారం కనిపించింది. అతనే దొంగయి వుండాలి. స్పీడు యింకా స్త హెచ్చించాడు.

ముందుకెళ్తున్న దొంగ వెడల్పాటి కాలవపైన కట్టబడిన బ్రిడ్జిమీదకు చేరుకున్నాడు. వెనుక వస్తున్న ఇన్‌స్పెక్టర్‌ని గమనించి, ఒక్క ఉదుటున పిట్టగోడనెక్కి నిండుగా, పారుతున్న నీళ్ళలోకి దూకాడు.

మూర్తి మోటార్ ఆఫ్‌చేసి, పిట్టగోడ వద్దకెళ్ళి చూశాడు. దొంగ జాడ కనిపించలేదు. నీళ్ళు మాత్రం దాదాపు ఇరవై అడుగుల లోతున పారుతున్నాయి. వెనక్కి తిరిగి వచ్చి, మోటార్ సైకిలెక్కి, ఊళ్ళోకి వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్ మూర్తి.

కానిస్టేబుల్ శవంచుట్టూ గుంపుగాచేరిన జనం, రకరకాలుగా చెప్పుకొంటున్నారు జరిగిన సంఘటన గురించి.

మూర్తి గుంపు మధ్యకు జొరబడి అందర్నీ దూరంగా వెళ్ళమని ఆదేశించాడు. పోలీస్ వాన్ వచ్చింది. శవాన్ని ఫోటోలు తీశారు. వేలిముద్రలకోసం వెతికారు, ఆ తర్వాత శవాన్ని వాన్‌లోకి ఎక్కించారు. వాన్ వెళ్ళిపోయింది.

"దొంగను మీలో ఎవరైనా చూశారా?" అడిగాడు గుంపు నుద్దేశించి మూర్తి మెల్లగా.

"నేను చూశాను సార్!" అన్నా డొకతను.

"మీ పేరు!"

"కృష్ణమూర్తి?"

"ఏంచేస్తుంటారు?"

"చిట్ ఫండ్ కంపెనీలో పని చేస్తుంటాను." అన్నా డతను.

"ఎలా చూశారతన్ని?"

"అతను మా యింటికి వచ్చాడు దొంగతనానికి. కిటికీ కమ్ములు వంచి, లోనికి దూకాడు. దబ్బున ఏదో పడ్డ శబ్ద మయింది. కళ్ళు తెరచాను. ఏమీ కనుపించలేదు. పడుకుం దామనుకుంటూండగా, మనిషి నడచిన చప్పుడయింది. చీకట్లోనే, తలగడ క్రిందున్న టార్చి తీసి వేశాను. గోడ వారగా మునివ్రేళ్ళమీద గొంతు కూర్చుని వున్న దొంగ కనుపించాడు. భయంతో 'దొంగ, దొంగ' అని అరచాను. అతను పారిపోయాడు!" అన్నాడతను.

"వెంట మీరు పరుగెత్తారా?"

"లేదండీ! అరుస్తూనే కూర్చున్నాను. నా భార్య కూడా నా అరుపులు విని పెడబొబ్బలు పెట్టింది!"

"మీ ఇంట్లో డబ్బుందా?"

"ఉందండీ! ఇవాళ కలెక్షను చేశాను. దాదాపు ఇరవై వేలు తెచ్చాను."

"రోజూ ఎంత తెస్తారు?"

"దాదాపు అంతే తెస్తుంటాను. రాత్రి పదింటిదాకా వసూలు చెస్తాను. డబ్బు ప్రొద్దున్నే తీసుకెళ్ళి కంపెనీలో కడతాను."

"దొంగెలా వుంటాడు?"

"లావుగా, పొట్టిగా, నల్లగా వున్నాడు. వెంట్రుకలు పొట్టిగా వున్నాయి." అన్నాడు కృష్ణమూర్తి.

"అతని ఫొటోను చూపి గుర్తుపట్టగలుగుతావా?"

"ఓ! సులభంగా!"

మూర్తి అతడిని తనతో స్టేషన్‌కు వెంటబెట్టుకువెళ్ళి, ఓ పాతిక మంది పాత కేడీల ఫొటోలు తీసి చూపించాడు. అన్నింటినీ లైటు వెలుగులో పరీక్షగా చూసి ఒకదాన్ని విడిగా తీసి "ఈ ఫొటో, ఆ దొంగదిలా వుంది!" అన్నాడు కృష్ణమూర్తి.

ఇన్‌స్పెక్టర్ మూర్తి ఆ ఫొటోను చూచి ఆశ్చర్యపోయాడు. చిత్తూరు జైల్లోంచి తప్పించుకున్న పాత కేడీ, దీనదయాళుదా ఫొటో. కిటికీకమ్మిలు వంచి ఇళ్ళల్లో జొరబడి, దొంగతనాలు చేసే పద్ధతి, అతని పేటంటని మూర్తికి తెలుసు.

దీనదయాళు కోసం పోలీసు బలగమంతా వెతుకుతూంది. గత నెలరోజులనుంచి అతనిక్కడొచ్చి తేలడం, దానికి ఇప్పుడు గవర్నమెంటువారి ఆజ్ఞలకొరకు శాంతి, భద్రలు కాపాడేందుకు కంకణం కట్టుకొన్న ఉద్యోగిని హత్య చెయ్యడం, మూర్తికి ఒకింత కంపరం, మరింత కోపం కలిగించింది.

బ్రిడ్జీ పైనుంచి కాలువలోకి దూకిన దొంగ గుర్తుకు రాసాగాడు. తను కూడా అతని వెంట దూకి వుండ వలసింద నుకున్నాడు. వైర్‌లెస్‌లో, దొంగపేరు, ఫొటో నెంబరు, అన్ని చోట్లకూ చెప్పాడు. రెండు గంటల వ్యవధిలో ఆ దొంగ కోసం, ప్రతి పోలీసు వెతకడం ప్రారంభించాడు.

రైళ్ళలో, బస్సుల్లో, టాక్సీల్లో. దీనదయాళు కోసం గాలింపు నిర్విఘ్నంగా సాగుతూంది. కానీ అతనే కనుపించ లేదు.

2

రూపారాణి మెడదాకా దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోసాగింది. పైన ఫాన్ తిరుగుతూంది. ప్రక్కనే పదేళ్ళ బాబు పడుకుని వున్నాడు.

ఆమె భర్త రాఘవ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్. కాన్ఫరెన్సుకు హైదరాబాద్ వెళ్లాడు. వెళ్ళి రెండ్రోజులయింది. మరో నాలుగు రోజులుగ్గాని రాడు.

'భౌ-భౌ' మంటూ జాకి అరచినట్లు వినిపించింది నిద్ర లోనే. కళ్ళు తెరచి చూసింది. పైన ఫాన్ తిరుగుతూంది. చుట్టూ చీకటిగానే వుంది. ప్రక్కలో వున్న బాబు బోర గింతలా మంచానికి అడ్డంగా పడుకుని వున్నాడు.

ఊరికే అరిచి వుంటుందనుకుంది కుక్క. నిద్ర పోదా మని మళ్ళా కనురెప్పలు మూసింది. మళ్ళీ అరుపు విని పించింది. ఈమారు అది ఇంకా స్త పెద్దగా విడవకుండా అర వడం రూపారాణిని క్షణకాలంభయభ్రాంతులలో ముంచింది. ఉన్నట్లుండి కుక్క పెద్దకేక పెట్టినట్లు అరిచింది. ఆగి పోయింది శబ్దం తర్వాత.

కుక్కకు ఏమయిందని ఆలోచిస్తూ లేచి కూర్చుంది మంచంపై. లైటు వేసుకుని గదిలోంచి వెలుపలకొచ్చింది. తలుపులు తీసుకొని ఒక్కొక్క లైట్ వేసుకుంటూ పోర్టికోలోకి వచ్చింది.

మెట్లదగ్గర పడుకునే కానిస్టేబుల్ ప్రక్క ఖాళీగా ఉంది. అతనేమయినాడని విస్తుపోయింది. కుక్క వెల్లకిలా పడుంది. దాని నోట్లోంచి రక్తం కారుతోంది.

ఆ సీన్ చూడగానే నిలువునా వొణికిపోయింది రూపా రాణి. వేగంగా లోనికి పరుగెత్తబోయింది. అంతలోనే వెనుకనుంచి "ఆగు!" అన్న అరుపు వినిపించింది.

తల త్రిప్పి చూసింది.

పొట్టిగా, లావుగా, ఇనుప మొద్దులా, నెత్తిన వెంట్రుకలు లేని అసహ్యపు ఆకారం ప్రత్యక్షమైంది. అతని చేతిలో రివాల్వరు నల్లగా మెరిసింది. కుడికాలి మోకాటి చిప్ప దగ్గరనుంచి రక్తం కారుతూందతనికి.

"నే నెవరో తెలుసా?" అడిగాడు దీనదయాళు.

"తెలీదు!" అంది రూప తల అడ్డంగా త్రిప్పుతూ.

"పచ్చి నెత్తురు త్రాగే పిచ్చి సన్నాసిని. దీనదయాళ్ నా పేరు."

"ఇక్కడి కెందుకొచ్చావ్?"

"పోలీసులు నా కోసం గాలిస్తున్నారు!"

"అయితే నన్నేం చెయ్యమంటావ్?"

"నోరు మూసుకుని, నే చెప్పినట్లు చెయ్యాలి. లేకుంటే నీ ప్రాణం తీస్తాను."

"ఇది పోలీస్ సూపరింటెంటు ఇల్లు."

"తెలుసు. మిష్టర్ రాఘవ్ నాకు చిరపరచితుడే. డి. యస్. పీ.గా పనిచేస్తూ అతనే నన్ను పట్టుకుని జైలుకు పంపాడు. ఇక్కడ సూపరెండెంటుగా పని చేస్తున్నాడని విన్నాను. అందుకే వచ్చాను."

"ఆయన ఊళ్ళో లేడు."

"అయితే చాలా మంచిది!"

"పోలీసులు తెల్లవారితే వస్తా రిక్కడకు!"

"రానీ, ఆలోగా నేను వెళ్ళిపోతాను. అందాకా నేను

ఇక్కడ వుంటాను. ఇంతకన్నా సురక్షితమైన స్థలం ఈ ఊర్లో లేదు!" అన్నాడు దీనదయాళు.

రూపారాణి ఆలోచించసాగింది. మెల్లిగా లోనికెళ్ళి పోలీసులకు ఫోన్‌చేసి, దీనదయాళ్ విషయం చెప్పాలనిపించింది. అన్యాయంగా కుక్కను చంపిన వ్యక్తి, తన్ను మాత్రం వదులుతాడన్న గ్యారంటీ ఏమీ ఆమెకు కనుపించలేదు.

"తెల్లవారిందాకా ఇక్కడే వుంటాను. ఈలోగా పిచ్చి పిచ్చివేషాలు వేశావంటే ఆ కుక్క గతే నీకూ పడుతుంది! జాగ్రత్త!" అన్నాడు.

రూపారాణి మాట్లాడలేదు.

"లోపలకు పదా!" దట్టించాడు.

రూప మాట్లాడకుండా లోపలకు నడచింది.

ఆమె వెంట అతను లోపలకు నడచాడు. లోపలకు రాగానే వెనుకనుండి రెండు తలుపులూ మూసిగొళ్ళెం పెట్టాడు.

"అలా కూర్చో!" అంటూ సోఫా చూపించాడు.

"నేను నా రూంలో వుంటాను. నీ యిష్టం వచ్చినంత సేపు వుండి వెళ్ళిపో?" అంది రూపారాణి బాబు గుర్తుకు వచ్చి.

"అలా వీల్లేదు! నా ఎదురుగా వుండాలి!"

దీనదయాళు వెళ్ళి, ఫోన్ రిసీవరు తీసి, దానికున్న వైర్ పీకి పారేశాడు. వచ్చి ఇంకో సోఫాలో కూర్చున్నాడు ఠీవిగా. ఎదురుగా రూపారాణి వుంది.

దీనదయాళుకు నీరసంగా వుంది. ఆకలి వేస్తుంది. బ్రిడ్జి పైనుండి కాలవలో దూకినపుడు, అతని మోకాలు పెద్ద రాయికి గుద్దుకోవడంతో గాయమైంది. అది సలుపుతూంది.

"టించర్ దొరుకుతుందా?"

"తెచ్చేదా?"

"వద్దు! ఎక్కడుందో చెప్పు నేనే తెచ్చుకొంటాను."

"అదిగో ఆ అల్మైరాలో వుంది." అంటూ చూపించింది రూప.

దీనదయాళు లేచి వెళ్ళాడు అల్మైరాకు. అతని వీపు ఆమె వైపు వుంది. అదే అదనుగా భావించి రూపపిల్లిలా మెల్లిగా సోఫాలోంచి లేచి, తన గదివైపు వెళ్ళాలనుకొంటూ పరుగెత్తి పోయేందుకు తయారయింది.

దీనదయాళు ఠక్కున వెనక్కి తిరిగి, ఆమె పైకి దూకాడు. రూప నిర్ఘాంతపోయింది. వెనక్కి భయంతో విరుచుకుపడింది. రివాల్వరును త్రిప్పి, రూప తలపైన బలంగా కొట్టాడు. నుదుట గాయమైంది. చిట్లిన చర్మం లోంచి రక్తం కారింది. చేతులతో తుడుచుకొని చూసుకుంది. ఎర్రని రక్తం చూడగానే ఆమె కళ్ళు బైర్లు క్రమ్మాయి. స్పృహతప్పి పడిపోయింది సోఫాలో.

దీనదయాళు మెల్లిగా అల్మైరావద్దకు వెళ్ళి, తలుపులు తెరచి అందులోంచి మందులు, కాటన్ తీసుకొని, తన గాయన్ని కడుక్కొని డ్రెస్ చేసుకొన్నాడు.

వచ్చి సోఫాలో కూర్చుని బీడి ముట్టించాడు.

చైతన్యహీనంగా పడివున్న రూపారాణి, తలకు గాయం కావటంతో బాధగా మూలగసాగింది. ఆ మూలుగులు గదిలో ఆవరించి వున్న నిశ్శబ్దాన్ని బ్రద్దలు కొడుతున్నాయి.

3

బెడ్ రూంలో పడుకునివున్న ప్రశాంత్‌కు బాత్‌రూం వెళ్లాల్సిన అవసరం వచ్చింది.

బొరగింతలా పడుకునే "అమ్మా! అమ్మా!" అని పిలిచాడు.

అతని పిలుపుకు ప్రతిగా రోజూ వినవచ్చే "ఏంటి బాబూ:" అనే తల్లి మాటలు వినరాలేదు.

"అమ్మా!" అని గట్టిగా పిలిచాడు.

దానికీ జవాబు లేదు.

ప్రశాంత్ లేచి కూర్చున్నాడు. కళ్ళు తెరచాడు. గదంతా తెల్లగా వెలుగుతో నిండిపోయివుంది.

తల్లికోసం చుట్టూ చూశాడు. ఎక్కడా కనుపించ లేదామె.

మెల్లగా దిగి అటా చెడ్ బాత్‌రూం వద్దకెళ్ళి నిలబడ్డాడు. బోల్టు కనుపించింది. అంటే ఆమె లోపలలేదన్న విషయం అర్ధమైంది.

హాల్లో వుండేమోననుకొని అటు వెళ్ళబోతూ, సన్నగా విన్పిస్తున్న మూల్గులను ఆలకించాడు. భయం పుట్టింది. అంతలోనే తన్ను తను తమాయించుకొన్నాడు.

అతనిలో వున్న పోలీసు రక్తం, పిరికితనాన్ని తరిమి వేసింది. మెల్లిగా వొంగి చూశాడు, హాల్లో సోఫాలో పడున్న తల్లి, ఎదురుగా కూర్చుని వున్న ఆగంతుకుడు కనుపించాడు. అతని చేతిలో వున్న రివాల్వరు కూడా కనుపించింది.

దీనదయాళు రివాల్వరు ఓపెన్ చేసి చూసి, పెదవి విరచి మళ్ళీ యధాప్రకారం మూసి వెయ్యడం గమనించాడు ప్రశాంత్. అంటే అందులో గుండ్లు లేవన్నమాట, అనుకున్నాడు.

ప్రశాంత్‌కు పదేళ్ళుంటాయి.

ప్రశాంత్‌కు నాన్నగారి తుపాకీ, రివాల్వరు గుర్తొచ్చాయి. వాట్ని తాకగూడదన్న ఆంక్ష కూడా జ్ఞప్తి కొచ్చింది.

మెల్లిగా వెళ్ళి అల్మైరా తెరిచాడు ప్రశాంత్.

క్రింది అరలోని బట్టల క్రింద వున్న తుపాకీ తీశాడు.

దాన్ని తెరిచాడు. అందులో గుండ్లు లేవు. అమ్యూనిషన్ దాచిన కార్డ్‌బోర్డ్ పెట్టితీసి, దాంట్లోంచి కొన్ని తూటాలు తీశాడు. వాట్ని లోడ్ చెయ్యాలని ప్రయత్నించాడు. అతి కష్టంమీద ప్రయాసతో ఒకే ఒక్క తూటా లోడ్ చెయ్యగలిగాడు.

తుపాకీని యధా ప్రకారం సరిచేసి, గుండె దిటవు పరచుకొని లేచాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ, ఆగంతకుడికి గురి పెట్టి తుపాకీతో హాల్లోకి ప్రవేశించాడు.

"చేతులు పైకెత్తు!" గట్టిగా అరచాడు ప్రశాంత్.

దీనదయాళ్ ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు.

ఎదురుగా పొడవాటి తుపాకీ తనకు గురిపెట్టి నిల్చొన్న పిల్లవాడు కనుపించాడు.

"చెప్పినట్లు చెయ్యి! లేకుంటే నిలువునా చంపుతాను!" అరచాడు ప్రశాంత్ మళ్ళీ.

"అందులో గుండ్లున్నాయా?"

"కాల్చి చంపాక తెలుస్తుంది. ఇందులో తూటాలు వున్నదీ, లేనిదీ." అన్నాడు ప్రశాంత్.

దీనదయాళకు ప్రశాంత్ మాటలు పిల్లతనం చేష్టల్లా అనిపించకపోవడంతో చేతులు పైకెత్తాడు.

ప్రశాంత్‌కు ఆ తర్వాత ఏం చెయ్యాలో తోచలేదు. కాల్చి చంపడం తప్పనిపించింది. చిన్నతనం నుంచి తల్లీ, తండ్రీ నూరిపోసిన నీతులు అతన్ని అంత సాహసానికి

తయారు కానివ్వలేదు. పట్టుకొని కాళ్ళు చేతులూ కట్టేసి, పోలీసులకు అప్పగించడానికి, అది తనవల్ల సాధ్యమయ్యేది కాదని తెలుసుకున్నాడు. ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు ప్రశాంత్.

"నీకు బ్రతకాలన్న ఆశ వుంటే మర్యాదగా వెళ్ళిపో!" అన్నాడు.

"అలాగే వెళ్తాను!" అంటూ అడుగులో అడుగు వేస్తూ చటుక్కున ప్రశాంత్ మీద పడి తుపాకి లాక్కున్నాడు దీనదయాళ్.

"ఇప్పుడు నే చెప్పినట్లు చెయ్యి. లేకుంటే నిన్నూ మీ అమ్మనూ, ఇద్దర్నీ కాల్చి చంపుతాను!" అన్నాడు దీనదయాళు కఠినంగా.

"అంతపని చెయ్యకు. మా అమ్మను ఏమీ అనకు." అన్నాడు ఏడుపుతో.

"సరే. నాకు మీ నాన్నగారి బట్టలు తెచ్చివ్వు. మార్చుకుంటాను." అన్నాడు.

ప్రశాంత్ వెళ్ళి తెచ్చిచ్చాడు,

బట్టలు మార్చుకున్నాడు. సూపరింటెంటు పెట్టుకునే టోపీ కూడా పెట్టుకున్నాడు.

4

రూపారాణి కళ్లు తెరచింది. ఎదురుగా కుమారుడు కనుపించాడు. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

"నాయనా! ప్రశాంత్ నువ్వా! ఇక్కడికెందుకొచ్చావ్?" అడిగింది ఏడుస్తూ. ప్రశాంత్ బేలగా తల్లినే చూడసాగాడు.

గోడ గడియారం ఐదు కొట్టింది.

"నే నిక్కడనుండి వెళ్ళిపోదలచుకున్నాను." అన్నాడు దీనదయాళు.

"చాలా సంతోషం!" అంది రూపారాణి, అతనిని అస హ్యంగా చూస్తూ.

"నా కోసం ఊరంతా పోలీసులు గాలిస్తున్నారు. నన్ను క్షేమంగా ఊరవతలకు చేర్చే బాధ్యత నీది."

"ఎలా?" అడిగింది రూప.

"నీ భర్త పోలీసు సూపరిండెంటు. మీ కారు అందరికీ తెలుసు. అందువల్ల ఎవ్వరూ ఆపరు." అన్నాడు.

"సరే! అలాగే దిగబెడతాను." అంది రూప.

ముగ్గురూ కారెక్కారు. రూప స్టీరింగుదగ్గర కూర్చుంది ప్రక్కనే ప్రశాంత్ కూర్చున్నాడు. అతన్ని ఆనుకుని దీన దయాళు కూర్చున్నాడు.

తన రివాల్వరును ప్రశాంత్ గుండెలకు గురిపెట్టివుంచి "ఇది చూశారుగా! ఏమాత్రం పిచ్చివేషాలు వేసినా మీ అబ్బాయికి నూరేళ్ళు నిండుతాయి! జాగ్రత్త!" అన్నాడు. రూపారాణి బెరుకుగా తలూపింది. ప్రశాంత్‌కు అందులో గుళ్ళులేవని తెలుసు. మాట్లాడకుండా కూర్చున్నాడు.

కారు మెల్లిగా పోసాగింది వీధులవెంట.

రెండు మూడు చోట్ల కారు ఆపారు పోలీసులు. కానీ నెంబరు చూడగానే వదిలేశారు క్షమాపణలు చెప్పుకుంటూ.

సూపరిండెంటుగారి కారును పొరపాటున తాము చెక్ చేసిన విషయం ఇన్‌స్పెక్టర్ మూర్తికి చెప్పారు. అతనికి అర్థంగాలేదు. అంత పెందలకడనే, అయ్యగారు ఊళ్ళో లేనప్పుడు ఎక్కడికి వెళ్తుందా కారని ఆలోచించాడు. ముగ్గురున్నారనీ, ఎడంవేపు డోర్ కానుకుని కూర్చున్న వ్యక్తి హాట్ పెట్టుకుని వున్నాడని చెప్పారు.

మామూలుగా ఊరుదాటి వెళ్ళాలనుకుంటే డ్రైవరును

పిలుస్తారు. అలాంటిది రూపారాణిగారే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం విచిత్ర మనిపించి, మోటార్‌సైకిల్ ఆ త్రోవకు పట్టించాడు. ఐదు నిమిషాల్లో కారు దగ్గరకు చేరుకున్నాడు మూర్తి. కారు స్లోగా పోతూంది.

రూపారాణి మోటార్‌సైకిల్ శబ్దంవిని మిర్రర్‌లో చూసింది. యూనిఫారంలోవున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ కనుపించగానే ధైర్యం వచ్చింది.

తను అపాయంలో వున్న విషయం అతనికి తెలిపేం దుకు మార్గమేమిటాని ఆలోచించసాగింది.

"స్లోగా పోతున్నావెందుకు. స్పీడు హెచ్చించు. వెనక ఎవరో తరుముతున్నారు!" అన్నాడు దీనదయాళు.

"ఎలక్ట్రికల్ పంపు రిపేరులోవుంది. పెట్రోల్ సరిగా అందలేదు!" అంది రూప.

ఆమెకు మెరుపులా ఆలోచన మెదలింది. రెండు మూడు సార్లు అనవసరంగానే బ్రేకు వేసింది. వెనుకనున్న ఎర్ర లైట్లు బ్రైట్‌గా వెలిగాయి.

ఆ ఎరుపు రంగును చూసి, మూర్తి అదిరిపోయాడు. పోలీసులు ఆపదలో వున్నప్పుడు అలాంటి సంకేతాలు ఉపయోగిస్తుంటారు.

ఆగంతకుడు అందులో వున్నాడన్న విషయం అర్థ మైంది మూర్తికి. వైర్‌లెస్‌లో అందరికీ సమాచారం అందిం చాడు. పది నిముషాల్లో, ఆ కారు వెళుతున్న వీధి నానుకున్న వీధులనిండా పెట్రోల్ కార్లు చేరిపోయాయి.

మూర్తి కారువెంట బడ్డాడు.

మోటార్‌సైకిల్ దగ్గరకావడం గమనించిన దీనదయాళు "స్పీడుగా పోనిస్తావా? లేక మీ అబ్బాయిని కాల్చమం టావా?" అడిగాడు.

ఆక్సిలేటర్ తొక్కింది గట్టిగా. కారు స్పీడందుకుంది.

ప్రశాంత్ తల్లివేపు చూసి సైగ చేశాడు కళ్ళతోనే. కొడుకు ఆలోచనకు అబ్బురపడింది.

అలాగేనన్నట్లు కళ్ళతో సైగచేసింది.

"అమ్మా! పొట్టలో నొప్పిగావుంది!" అన్నాడు చేత్తో కడుపు పట్టుకుని మెలితిరుగుతూ, దీనదయాళ్ మీదకు ఒరిగి పోయాడు.

స్పీడుబాగా హెచ్చించి ఎడంవేపు రోడ్‌లోకి టర్న్ చేసింది కార్ను రూపారాణి. అదే అదనుగా మెలికలు తిరుగుతున్న ప్రశాంత్, దీనదయాళు కూర్చున్నవేపు వున్న డోర్ లాక్ ఊడేటట్లు హాండిల్ పట్టుకుని క్రిందికి నొక్కి కదిలాడు.

డోర్ విసురుగా వూడిపోయింది.

దీనదయాళ్ దబ్బున వీధిలోకి జారిపడ్డాడు. ప్రశాంత్ పడిపోకుండా ముందుగానే ఎడమచేత్తో రూప పట్టుకొని వుంది. కారు కొంతదూరం వెళ్ళి ఆగింది.

వెనుకనుంచి వస్తున్న మూర్తి మోటర్‌సైకిల్‌ను చటుక్కున దీనదయాళు ప్రక్క నాపి, పైనుంచి అతనిమీదకు దూకాడు. మరో నిమిషంలో పోలీసు బలగం వచ్చి దీనదయాళును అదుపులోకి తీసుకున్నారు.

"మీ సాహసం మెచ్చుకోవాలి!" అన్నాడు మూర్తి రూపారాణిని.

"నా సాహసంకాదు! మా అబ్బాయి తెలివిని మెచ్చుకోవాలి! వాడే ఉపాయం ఆలోచించాడు. తలుపు హాండిల్ నొక్కుతానని సైగచేశాడు. నేను టర్నింగ్ త్రిప్పాను. ఆ దొంగ వెలుపలికి పడ్డాడు!" అంతే.

"నువ్వు నిజంగా సింహపు పిల్లవోయ్!" అన్నాడు పదేళ్ళ ప్రశాంత్‌ను ఎత్తుకుని ముద్దాడుతూ మూర్తి. ***

పవిత్రతకు పరీక్ష

వసుంధర

"ఆ అమ్మాయి చాలా బాగుంది కదూ" అన్నాను బీచ్‌లో దూరంగా ఒంటరిగా కూర్చున్న ఒక పడుచు పిల్లను చూపించి.

శర్మ నవ్వాడు. "అమ్మాయేం కర్మ—ఇక్కడున్న పిల్లల్లో చాలామందే బాగున్నారు. అందువల్ల ఆ అమ్మాయి బాగుంది కదూ అన్న నీ వాక్యంలో సబబు లేదు. ఆ అమ్మాయి నీకు కావాలా—అన్నది చెప్పు!"

తడబడ్డాను. నాకు కట్టుబాటులేని మనసైతే ఉందేమో కానీ, కట్టుబాట్లమీద అపనమ్మకం మాత్రం లేదు. ఆడవాళ్ళ వంక కాంక్షతో చూడవచ్చు. అంత మాత్రాన చూసిన ప్రతి ఆడదాన్నీ పొందగలననే అవివేకం నాకు లేదు.

శర్మ అలా అనగానే నేను "అందంగా ఉందన్నాను కానీ—పొందాలనుకుంటున్నా ననలేదుగా—" అన్నాను.

"ఎక్కడో కొంతమంది తప్ప ఆడవాళ్ళలో బాగుండని వాళ్ళెవరు? ఆడదంటేనే అందమని అర్థం. ప్రతి ఆడదాని లోనూ ఏదో ఒక విలక్షణ సౌందర్యం ఉన్నదని నా సిద్ధాంతం. అందువల్ల ఏదైనా ప్రత్యేకమైన కోరిక ఉంటే తప్ప, ఒక ఆడపిల్లను చూపించి అందంగా ఉన్నదని చెప్పడం అనవసరం" అన్నాడు శర్మ.

"సరే—నీ అర్థమే రైటనుకుందాం. ఆ పిల్ల నాకు కావాలి అని నేనన్నాననుకో—ఇప్పుడేం జరిగింది?" అన్నాను కాస్త చిరాగ్గా.

"నీ కోరిక బలమైనదై—నువ్వు డబ్బుకు వెనుదీయని పక్షంలో—ఆ పిల్ల నీ స్వంతం కావడానికి సుమారు వారం రోజుల వ్యవధి చాలు" అన్నాడు శర్మ ఒక్క పిసురు గంభీరంగా.

"పవిత్ర భారత దేశంలోని ఆడవాళ్ళ శీలాన్ని ఊహలో కూడా నీ అంత దారుణంగా కించపర్చలేదు. అస్తమానూ ఒకేలా కాక అప్పుడప్పుడు కొంచెం సీరియస్‌గా ఉండడం నువ్వు నేర్చుకోవాలి శర్మా!" అన్నాను.

శర్మ ముఖం నిజంగానే సీరియస్‌గా మారింది. "నే నెప్పుడు ఏది మాట్లాడినా సీరియస్‌గానే మాట్లాడుతా నన్న నిజం నీకింకా తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉంది. అవలంభించవలసిన పద్ధతులు సరిగా తెలుసుకోవాలిగానీ, ఈ లోకంలో ఆడదాన్ని లొంగదీసుకోవడం పెద్ద విశేషమేం కాదు. పవిత్ర భారతదేశంలోని ఆడవాళ్ళు ఒక ఎక్సెప్షనూ కాదు. నీకు తెలియనంత. మాత్రాన ఇది నిజం కాదను కోకు—"

నాకు కోపం వచ్చింది. "ఊహలను నిజమనుకోవడం నేనింకా ప్రారంభించలేదు'' అన్నాను.

శర్మ నవ్వాడు. నువ్వు చంద్రమండలం చూడలేదు. కానీ అక్కడ ప్రాణకోటి ఉన్నదనీ, భయంకర జంతువులు తిరుగాడుతుంటాయనీ నమ్ముతున్నావనుకో—ఆ విషయం చంద్రమండలం వెళ్ళొచ్చిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో వాదిస్తున్నావనుకో—జవాబుగా అతనేం చేయగలడు? ఒక చిన్న నవ్వు నవ్వి ఊరుకుంటాడు. ఇప్పుడు నేనూ అందుకే నవ్వుతున్నాను" అని శర్మ నవ్వసాగాడు.

నేను ఉడుకుమోతునని చెప్పలేను కానీ ఆ క్షణంలో నా రక్తం ఉడికింది. శర్మ నవ్వు నా శరీరాన్ని కంపింపజేస్తోంది. ఈ ప్రపంచంలో తను కావాలనుకున్న ప్రతి స్త్రీనీ పొందగలననుకుంటున్న శర్మ మాటలు నిజమెలాగౌతాయి? కానీ అతను తన్ను నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పోల్చుకుంటున్నాడు. అంత ఖచ్చితమైన అనుభవం తనకున్నదే గదా—అతని మాటల కర్థం?

"చాలా నమ్మకంగా చెబుతున్నావ్? ఏమిటి విశేషం? ఇందులో ఏదైనా కిటుకుంటే నాకూ చెప్పకూడదూ" అన్నాను కుతూహలంగా.

"నీకు హోటల్ మేనకా గురించి తెలుసా?" అన్నాడు శర్మ.

"ఈ ఊళ్ళోకల్లా కాస్త ఖరీదైన లాడ్జి. అంతే కదా!" అన్నాను శర్మ చెప్పబోయే విషయం అంతే కాదని తెలిసుండి కూడా.

"అది నీ బోంట్లకు తెలిసిన సమాచారం. మా బోంట్లకు సంబంధించినంత వరకూ—స్త్రీ సుఖం విషయంలో కల్పతర్వది" అన్నాడు శర్మ.

"అంటే—నీక్కావలసిన ఏ ఆడదాన్నయినా సృష్టించి ఇస్తుందా?" అన్నాను.

"కాదు. సృష్టిలో ఉన్న ఏ ఆడదాన్నయినా నీకు స్వంతం చేయగలదు. నువ్వు చేయవలసినదల్లా సరైన వివరా లివ్వడమే—"

ఒక్క క్షణం నివ్వెరపోయాను. శర్మ చెప్పేది నిజమా?....

"ఇలాంటి విషయాలు నమ్మడానికి కనీసం నా మాత్రపు టనుభవం అవసరం—ఇంతకూ నీ కా అమ్మాయి కావాలా, చెప్పు?" అనడిగాడు శర్మ.

శర్మకు తెలుసు—నేను నలుగురూ మంచిదని పిలిచే దారిలోనే ఇంతవరకూ నడుస్తున్నాననీ, మనిషి పతనం స్త్రీ విషయంలో కట్టుబాట్లు పాటించకపోవడంవల్లనే ప్రారంభ మవుతుందని నమ్మేవారిలో నే నొకడిననీ—

పరాయి స్త్రీని కాంక్షించడం—మగాడికి—ముఖ్యంగా వివాహితుడికి తగదని—నా నరనరాల్లోనూ ఒక నమ్మక ముంది.

శర్మ ఇప్పుడు నా నమ్మకాన్ని సవాలు చేస్తున్నాడు!

ఆ అమ్మాయి వంక ఒక్క క్షణం పరీక్షించి చూశాను.

నిజంగానే ఆ పిల్ల చాలా బాగుంది. వయస్సు పద హారుకూ ఇరవైకీ మధ్యలో ఉండవచ్చు. ముఖంలోని అమాయకత ఆమె అందానికి వన్నె తెచ్చింది. నేను కోరితే ఆమె నా స్వంతమయే అవకాశముందంటున్నాడు శర్మ!

శర్మ సవాలుకు పై సవాల్ చేయాలనిపించింది. శర్మ మాటలు అబద్ధం చేయాలనే పట్టుదల నాలో పెరిగింది.

"నేను రెడీ శర్మా! ఆ అమ్మాయి అడ్రస్ సంపాదిద్దాం" అన్నాను.

శర్మ నా భుజం తట్టి "గుడ్!" అన్నాడు.

మరో ఇరవై నిమిషాల కనుకుంటాను—ఆమె లేచింది. మేమూ లేచాము. ఆమె నడిచింది. మేమూ నడిచాం—ఆమె వెనుకనే. అయితే ఆ తర్వాత ఆమె ననుసరించలేక పోయాం. కారణం—మాకులా బస్సుకోసం ఎదురు చూడడం లేదామె. ఆమె కోసం కారు డ్రైవర్ ఎదురు చూస్తున్నాడు. నేను నివ్వెరపోయాను. కానీ శర్మ కారు నంబర్ నోట్ చేసుకున్నాడు.

2

మర్నాడు నే నాఫీసులో ఉండగా శర్మ దగ్గర్నించి ఫోన్ వచ్చింది. ఆ అమ్మాయి పేరు శాంతి అనీ—ఆమె బట్టల వ్యాపారస్తుడు గోవిందయ్యగారి రెండో కూతురనీ—ఇంకా అవివాహిత అనీ వివరాలిచ్చి, గోవిందయ్యగారి చిరునామా ఇచ్చాడు నాకు. నన్నొకసారి వెళ్ళి ఈ వివరాలు సరైనవే నని రూఢి చేసుకోమన్నాడు. అనంతరం తను మిగతా ఏర్పాట్లు చేస్తానని చెప్పాడు.

సాయంత్రం అయిదున్నర ప్రాంతంలో నేను శర్మ ఇచ్చిన చిరునామా పట్టుకుని గోవిందయ్యగారింటికి వెళ్లాను.

డాబా ఇల్లు. ఇంటి చుట్టూ కాస్త ఆవరణ వుంది. ఇల్లు మరీ అంత పెద్దదీ కాదు, చిన్నదీ కాదు.

నేను కాలింగ్ బెల్ మ్రోగించగానే తలుపు తెరుచుకుంది. ఎవరో పనివాడులా ఉన్నాడు—"ఎవరు కావాలి సార్?" అనడిగాడు.

"ఎవరో ఒకరు—ఇంట్లో వాళ్ళతో మాట్లాడాలి!" అన్నాను.

"అయితే చిన్నమ్మగారిని పిలుస్తానుండండి"—అంటూ వాడు నాకు కూర్చోడానికి సోఫా చూపించి—లోపలకు

వెళ్ళాడు. నేను కూర్చోకుండా నిలబడే చుట్టూ చూస్తున్నాను.

"నమస్కారం!" అన్న తియ్యని కంఠం వినిపించి అటే తిరిగాను.

అదృష్టమంటే అదే—బీచి వద్ద కనపడ్డ అందమైన అమాయకపు ముఖపుటమ్మాయి — "నమస్కారం!" అన్నాను అప్రయత్నంగా చేతులు జోడించి.

"కూర్చోండి"—అందామె. నేను కూర్చోగానే ఎదురుగా తనూ కూర్చుంది.

నాకు మాటలు రావడం లేదు. మర్యాదనుకూడా మరిచిపోయి ఆమెను కళ్ళప్పగించి చూస్తున్నాను. అందులోనూ కావాలనుకుంటే ఆమె నా స్వంత మవుతుందేమో మరింత పరీక్షగా చూస్తున్నాను. నా చూపులు తప్పక ఆమెను ఇబ్బంది పెట్టి ఉంటాయి-"ఏదైనా పనిమీద వచ్చారాండీ-" అనడిగిందామె.

"అవునండీ—గోవిందయ్యగారితో పనుండి వచ్చాను-"

"ఈ టైములో నాన్నగారింట్లో ఉండరు. దుకాణానికి వెడితే...."

ఆమెను వాక్యం పూర్తి చేయనీకుండానే "నాన్నగారంటే గోవిందయ్యగారేనాండీ?" అనడిగాను. ఆ సమాచారం నాకు చాలా అవసరం.

"అవును — మా దుకాణం...." అని ఏదో చెప్పబోతూండగా—

"నాకు దుకాణంతో పని ఏముందిలెండి! అయినా గోవిందయ్యగారి షాపు ఎరుగని వాళ్ళెవరు? మీ ఇంట్లో ఏదైనా వాటా కాళీ ఉందేమో కనుక్కుందామని వచ్చాను-" అన్నాను.

"మా ఇల్లు అద్దెకివ్వబడదు!" కొంత హాస్యం ధ్వనించినా సీరియస్‌గానే చెప్పిందామె ఈ మాట.

"కానీ మా స్నేహితుడిస్తారని చెప్పాడండీ-" అన్నాను.

"ఎవరో మీ స్నేహితుడు — చాలా పొరబడ్డాడని చెప్పాలి—" అందామె.

శర్మ పొరబడ్డాడని నేనూ అనుమానపడుతున్నాను. నేను లేచి నిలబడి "శ్రమ ఇచ్చినందుకు మరోలా అనుకోకండి—మరోచోట ప్రయత్నిస్తాను—" అని వెళ్ళబోతున్నవాడినల్లా ఆగినట్లుగానటించి— "అనుకోకుండా మీ అంత అందమైన అమ్మాయిని చూశాను, మీ పేరు తెలుసుకోవచ్చా?" అనడిగాను.

"నా పేరు శాంతి — మీ పేరు?" అందామె అమాయకంగా నా వైపు చూస్తూ.

నిజమే చెప్పాను. నా ఉద్యోగంకూడా చెప్పాను. నాకు పెళ్లైన విషయం మాత్రం చెప్పలేదు.

3

పేరు, వివరాలు, ఇంటి చిరునామా చెప్పాను.

అతను అన్నీ వివరంగా పుస్తకంలో నోట్ చేసుకున్నాడు.

"ఈ వేళ తారీఖు పదకొండు. మీరు పదమూడవ తేదీన వస్తే మీరు కోరుకున్న అమ్మాయి ఫోటో చూపిస్తాం. అవునో కాదో కన్ఫర్మ్ చేసుకుందురుగాని. ఈ ఫైనల్ వెరిఫికేషన్ అయిపోతే సరిగ్గా మరో రెండ్రోజులు చాలు. అంటే పదిహేనవ తేదీన మీ ఈప్సితం నెరవేరుతుందన్నమాట-" అన్నాడతను.

బయటకు వచ్చేక—"నమ్మకం కుదిరిందా?" అనడిగాడు శర్మ.

"కానీ వ్యవహారమింత రహశ్యంగా నడుస్తోందేమిటి? అసలు విషయం తెలుసుకునేందుకు చాలాసమయం పట్టింది-" అనడిగాను.

"అవునుమరి—ఇది భారతదేశం. ఎందరో అమ్మాయిలిక్కడ శీలం కోల్పోతున్నారు. అయినా ఆ విషయం రహశ్యంగా ఉంచబడాలి. అటు అమ్మాయికీ, ఇటు అబ్బాయికీ, మధ్య వ్యాపారికీ నష్టం లేకుండా వ్యవహారం జరగాలి. ప్రభుత్వానికి తెలియకూడదు. ఇందులో ఎన్ని సమస్యలు? అందుకే పాత కష్టమర్ ఒకడు పరిచయం చేయనిదే కొత్త కష్టమర్‌ని నమ్మరు వీళ్ళు—" అన్నాడు శర్మ.

"మరి పాత కష్టమర్స్‌నెలా గుర్తుపడతారు?"

"ఇందాకా చూడలేదూ—నేనొక రెండు మడతల గ్రీన్ పేపరిచ్చాను. అది అయిడింటిఫికేషన్ కార్డు. ఒకసారి కష్టమర్ కాగానే ఈ హోటల్ వాళ్ళది ఇస్యూ చేస్తారు. దాంతో నన్ను నేను పరిచయం చేసుకుని—వాళ్ళకు నిన్ను కూడా పరిచయం చేశాను."

"చాలా పకడ్బందీగా ఉందే వ్యవహారం—" అన్నాను.

"అప్పుడే ఏం చూశావ్? స్వానుభవంలో చాలా తెలుసుకుంటావ్!" అన్నాడు శర్మ.

శర్మ మాటలు నిజమే ననిపించింది—పదమూడవ తేదీ మధ్యాహ్నం అక్కడికి ఫోటో చూసుకోడానికి వెళ్ళినప్పుడు. బయటకంటె అందంగా మెరిసిపోతున్న శాంతిని ఆ ఫోటోలో చూస్తూ పిచ్చెక్కిపోయాను.

"ఫోటో గురించి పాతికరూపాయలు కట్టవలసి ఉంది." అన్నాడతను.

"ఫోటో నాకిచ్చేస్తారా?"

"నోనో-పడతినే స్వయంగా అందించే సంస్థ. కానీ ఏ పరిస్థితుల్లోనూ ఫొటోలను మాత్రం ఇవ్వలేము. ఈ ఫొటో తీయడానికి మేము చాలా శ్రమ తీసుకోవలసి వచ్చింది— మా శ్రమతో పోలిస్తే పాతిక రూపాయలు కన్‌ఫర్‌మేషన్ ఛార్జి బహు స్వల్పం!" అన్నాడతను.

"అవునవును—" అంటూ పాతిక రూపాయలు కట్టాను.

"మీ దగ్గర్నుంచి అడ్వాన్సుగా ఏమీ తీసుకోడంలేదు. కానీ మీ బిల్లు నాలుగు ఐదు వందలకు మధ్యలో ఉంటుందని చెప్పడం నా ధర్మమనుకుంటున్నాను—" అన్నాడు.

4

చిరునవ్వుతో గుమ్మంలో ఎదురైంది శ్రీమతి. నేను మాత్రం ఆమె కళ్ళలోకి సూటిగా చూడలేక తల వంచుకుని ఇంట్లో అడుగుపెట్టాను. శ్రీమతి తలుపులు వేసింది.

నేను కుర్చీలో కూర్చోగానే నా బూటు లేసులువిప్పింది. సాక్సు లాగి బూట్లలో పడేసింది.

"ఇదిగో లుంగీ - ఇది కట్టుకుని ఇంట్లో షర్టువేసుకుని- వెళ్ళి కాళ్ళూ ముఖం కడుక్కుని రండి-" అంది శ్రీమతి.

మౌనంగానే వెళ్ళి ఆమె చెప్పిన పనులు చేసివచ్చాను. నేను తిరిగి వచ్చేసరికి టేబిల్‌మీద ఒక ప్లేట్లో పులిహోర, ఒక చిన్న కప్పులో పాయసం ఉన్నాయి,

"ఏమిటిది సీమా!" అన్నాను. శ్రీమతిపేరు శ్రీ మహాలక్ష్మి. నేనామెను ముద్దుగా సీమా అని పిలుస్తాను.

"ఈ రోజు మనమీ ఊళ్ళో కాపురం ప్రారంభించిన రోజు—" అంది శ్రీమతి.

"అందులో పెద్ద విశేషమేముంది?" అన్నాను.

"అలాగంటారేమిటండీ — మీతోటి నా జీవితంలోని

ప్రతి సంఘటనా నాకు ప్రత్యేకమైనదిగా తోస్తుంది. ఆ ప్రత్యేక దినాలే నా జీవితంలోని పండుగ రోజులు. నాకు మీరు తప్ప ఎవరున్నారు చెప్పండి!"

అవును - తల్లీ తండ్రీ పోయిన నా శ్రీమతి మేనమామల ఇంట్లో పెరిగింది. వాళ్ళే ఆమెను పెంచి పెద్దచేసి ఓ ఇంటి దాన్ని చేశారు. వాళ్లామెను ప్రేమగానే చూసినప్పటికీ కన్న వారి సాటి రాలేరుగదా!

"ఈ రోజు ప్రత్యేకంగా గడవాలి — మీకూ నాకూ గుర్తుండిపోయే విధంగా!" అంది శ్రీమతి.

అప్రయత్నంగా లేచి నిలబడ్డాను—శ్రీమతిని దగ్గరగా తీసుకున్నాను. అనుకోకుండానే ముద్దు పెట్టుకుని ఆమె కళ్ళ లోకి చూశాను. ఆమె కళ్ళలో వెలుగులు నన్ను ఇబ్బంది పెట్టాయి.

భార్యాభర్తల అనుబంధం చాలా గొప్పది. వాళ్ళ మధ్య సంబంధం పవిత్రమైనది. వాళ్ళ ఆకర్షణ తిరుగులేనిది. ప్రస్తుతం నా మనసు నీరైపోతోంది.

"ముందు అవి తినండీ—" అంది శ్రీమతి.

"ఈ లేత పెదాలు రుచి చూసిన మీదట అవి నాకు రుచిస్తాయా?" అన్నాను. శ్రీమతి సిగ్గుపడింది. అమెకు మాటకు మాట చెప్పడం, చిలిపిగా మాట్లాడడం చేతకాదు. చాలా అమాయకురాలు. నేను కాస్త శృంగారపరంగా మాట్లాడితే సిగ్గుపడిపోతుంది.

"ఈ రోజు పులిహోర మీ కిష్టమైన రీతిలో కుదిరింది. తీసుకోండీ—" అంది శ్రీమతి.

"అలాగే—కానీ కలిసితిందాం—" అన్నాను.

ఇద్దంర పక్కపక్కగా కూర్చుని కలిసి పులిహోర

తిన్నాం కలిసి పాయసం తాగాం.

"ఈ రోజంతా ఇలాగే గడవాలండీ—" అంది శ్రీమతి.

ఉలిక్కిపడ్డాను. "సీమా! నువ్వేమీ అనుకోనంటే చిన్న విషయం చెప్పాలి — విన్నాక నువ్వెలా చెబితే అలా చేస్తాను—"

శ్రీమతి ముఖంలో ఏ విధమైన అనుమానమూ ద్యోతకం కాలేదు. చాలా మామూలుగా—"చెప్పండి!" అంది.

"ఈ రోజు రాత్రి ఎనిమిది గంటలకు నేనొక చిన్న పార్టీకి వెళ్ళవలసి ఉంది. తిరిగి వచ్చేసరికి ఒంటిగంట దాట వచ్చు. మా కంపెనీలో ఆఫీసర్లకు ఒక ప్రయివేటు ఇండస్ట్రీ వాళ్ళు ప్రత్యేకంగా ఇస్తున్న పార్టీ ఇది. కేవలం పార్టీ అంటే పార్టీ కాదు. కంపెనీ వ్యవహారాలకు సంబంధించిన ముఖ్య వ్యవహారాలు కూడా కొన్ని చర్చించాలి. ఈ పార్టీకి నేను వెళ్ళకపోతే కంపెనీలో చాలా విమర్శలకు గురికావలసి ఉంటుంది. కానీ ఏ పనీ నిన్ను కాదని చేయలేను నేను. నువ్వు వెళ్ళవద్దంటే ఒంట్లో బాగోలేదని చెప్పి మానేస్తాను-"

శ్రీమతి నావంక చాలా ప్రేమగా చూసింది—"ఇలాంటి విషయా లాడవాళ్ళకేం తెలుస్తాయండీ. నాకైతే మిమ్మల్నొక్క క్షణమైనా వదలకూడదనుంటుంది. కానీ మగ వాళ్ళు మీరు. లక్ష పనులుంటాయి. మీరుమాత్రం ఏంచేసినా నాగురించే కద! ఆలశ్యంగా రావడమే ఈ రాత్రికి ప్రత్యేకత అనుకుంటాను—" అంది. తన అనుమతిమీదనే నేను బయటకు వెడుతున్నానన్నగర్వం ఆమె కళ్ళలో కనబడింది.

ఒక అమాయకురాలిని మోసం చేస్తున్నానన్న గుర్తింపు నాకు బాధ కలిగిస్తోంది. కానీ భారతదేశంలోని స్త్రీజాతి శీలాన్నే సవాలుచేసిన శర్మ సంగతి తేల్చకుండా ఎలా?

5

ఆ భవంతులు, ఆ ఆవరణ, ఆ వాతావరణం—హోటల్ మేనకా నిజంగానే అపూర్వమైనది.

రిసెప్షన్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి వాళ్ళిచ్చిన రసీదిచ్చాను దానిమీద ఈః రోజు రాత్రి 7-45కు నాకు అపాయింట్ మెంటున్నట్లుగా రాసి ఉంది. రిసెప్షనిస్ట్ నావంక చూసి "—మీరు కౌంటర్ నంబర్ తొమ్మిదికి వెళ్ళండి—" అని చెప్పింది.

అక్కడ మొత్తం ఇరవై రెండు కౌంటర్లున్నాయి. నేను తొమ్మిదో నంబరు కౌంటర్‌కు వెళ్ళాను. రసీదు ఇచ్చాను.

కౌంటర్లో అతను టైమ్ చూసుకున్నాడు — "వంద రూపాయలివ్వండి—" అన్నాడు.

ఇచ్చాను. నా చేతికో టికెట్ ఇచ్చాడు. అందులో విశేషాలేం రాసి లేవు. హోటల్ మేనకా పేరూ, టికెట్ విలువరాసి ఉన్నాయి.

"మీరు వెయిటింగ్ రూమ్ నంబర్ 27లోకి వెళ్ళండి-" అన్నాడతను.

ఆ హాల్లో అన్నీ వివరంగా రాసి ఉన్నాయి. ఏయే వెయిటింగ్ రూమ్సు కెలా వెళ్ళాలో డైరక్షన్సు కూడా ఉన్నాయి. నేను సులభంగానే 27వ నంబరు గది పట్టుకో గలిగాను.

గది బయట ఒకతను ఎదురుచూస్తున్నాడు. అతనికి నా టికెట్ చూపించాను. "లోపలకు వెళ్ళండి—" అన్నా డతను. నేను లోపలకు వెళ్ళగానే తలుపులు మూసు కున్నాయి. చిన్న కుర్చీ ఉంటే కూర్చున్నాను.

హఠాత్తుగా నా కెదురుగా ఉన్న గోడమీద సినిమా ప్రద ర్శన ఆరంభమైంది. స్త్రీ పురుషులను నేను చూసి ఉండని

భంగిమలలో చూపించే పోర్నోచిత్రమది. అటువంటి చిత్రాలుంటాయని విన్నాను కానీ పడకగది రహస్యాలనింత పచ్చిగా చిత్రీకరించడాని కంగీకరించే స్త్రీ పురుషులుంటారని ఊహించలేకపోయాను.

పదిహేను నిముషాలసేపు చిత్రం నడిచింది. తర్వాత సినిమా అయిపోయింది. గదిలో లైటు వెలిగింది. తలుపులు కూడా తెరుచుకున్నాయి.

"మీ రిప్పుడు స్పెషల్ రూమ్ పన్నెండుకు వెళ్ళాలి—" అన్నాడు బయట ఉన్నతను.

చూసిన చిత్రం నా శరీరంలో విపరీతమైన వేడిని పుట్టించింది. మనసుకు ఎనలేని ఉద్రేకాన్ని కలిగించింది. స్పెషల్ రూమ్ పన్నెండు చేరుకున్నాను.

గదిముందు ఒకతను ఎదురుచూస్తున్నాడు.

"మీరేకదూ మిస్టర్ భాస్కర్!" అన్నాడు నన్ను చూస్తూనే.

"అవును—" అంటుండగానే తలుపులు తీశాడు. నేను లోపలకు వెళ్ళాను. అతనూ వచ్చాడు.

"ఇది ఒక ప్రత్యేక యంత్రం. దీని సహాయంతో మీరు హోటల్ వెలుపల ఏంజరుగుతున్నదీ చూడగలరు-" అతను ఆ యంత్రంలోకి చూపి—ఏదో మీటను అడ్జస్ట్ చేశాడు. "—ఇప్పుడిందులోకి చూడండి—మీరు కోరిన అమ్మాయి రిసెప్షనిస్టుతో మాట్లాడుతూంటుంది—ఆమె ఏం చేస్తుందో చూడండి—" అన్నాడు.

నేనా యంత్రంలోకి చూశాను—సినిమా తెరమీద చూసిన విధంగా శాంతి కనబడింది. నాకు గంగ వెర్రులెత్తినట్లయింది. ఇప్పుడు నా మనసులో వేరే ఆలోచనలు లేవు. నా శరీరం శాంతిని కోరుతోంది. తీవ్రంగా కోరుతోంది.కొద్ది

నిముషాల క్రితం చూసిన చిత్రం కళ్ళముందు మెదుల్తూనే ఉంది.

శాంతి రిసెప్షనిష్టతో మాట్లాడేక వెళ్ళి అక్కడున్న సోఫాలో కూర్చుంది. ఒక్క పిగురు అసహనంగా కన బడింది. చాలా చక్కని బట్టలు కట్టుకుంది శాంతి.

ఇంతలో హుందాగా ఉన్న ఒక నడివయస్కురాలు వచ్చి శాంతి పక్కన కూర్చుంది. ఇద్దరూ ఏమేమిటో కబుర్లు చెప్పుకుంటున్నారు. బహుశా అయిదు నిముషాల సేపు వాళ్ళలా మాట్లాడుకున్నారనుకుంటాను. తర్వాత ఆ నడివయస్కురాలు లేచింది. యంత్రంలో అంధకారం అలముకుంది.

జరిగింది చెప్పాను నేను అక్కడున్న అతనితో.

"బయల్దేరండి మీరు. మీరు కోరిన అమ్మాయిప్పుడు వెయిటింగ్‌రూమ్ నంబరు 24 కు వెళ్ళిందన్నమాట. అక్కడ ఆమె సైకలాజికల్‌గా మీలాగా తయారవుతుంది. అక్కణ్ణించి బయల్దేరి అండర్‌గ్రౌండ్ రూమ్ నంబర్ పదిహేడుకు వస్తుందామె. మీరు ఎదురుగా వున్న అద్దాల గదిలో నిలబడితే ఆమె గదిలోకి వెళ్ళడం కనబడుతుంది. ఆమె వెళ్ళేక రెండు మూడు నిముషాలాగి మీరూ వెళ్ళ వచ్చు. తర్వాత—" అంటూ ముసి ముసి నవ్వులు నవ్వా డతను.

"థాంక్యూ వస్తాను!" అంటూ బయల్దేరబోయాను.

"ఒక్క మనవి-" అన్నాడతను "ఇది సొసైటీలో హైక్లాసుకు సంబంధించిన విషయం. మేమెంతో కష్టపడి ఒక అమ్మాయిని మీ కోరికల కనుగుణంగా బ్రెయిన్‌వాష్ చేశాము. అందువల్ల మీరేం మాట్లాడినా గదిలో ఆ అమ్మాయి చేత ఎక్కువగా మాట్లాడించడానికి ప్రయత్నించ

కండి," అని అండర్‌గ్రౌండ్ గదికి వెళ్ళవలసిన దారి చెప్పాడు.

అండర్‌గ్రౌండ్ రూమ్‌నంబర్ పదిహేడుకు ఎదురుగా ఉన్న టెలిఫోన్ బూత్‌లాంటి అద్దాల గదిలోకి వెళ్లాను. దూరంగా ఎవరో స్త్రీమూర్తి రావడం కనిపించింది. దగ్గరవుతోంది. ఆమె శాంతి! మసక చీకట్లో ఆమె మరింత అందంగా కనబడుతోంది. ఆమె సరాసరి గది దగ్గరకు వెళ్ళి తలుపులు తోసుకుని లోపలకు వెళ్ళింది. మళ్ళీ తలుపులు వేసుకున్నాయి.

నా మనసు తొందరపడుతోంది. శరీరం ఉద్రేక పెడుతోంది.

ఇంతలో ఎవరో వచ్చారు. అతను—"క్షమించాలి. ఒక పర్యాయం మిమ్మల్ని చెక్ చేయవలసి ఉంది" అన్నాడు.

"ఎందుకు?" అన్నాను చిరాగ్గా.

"మీ పాకెట్సులో బ్యాటరీలైటు, మినీ కెమెరా వగైరా వస్తువులేమైనా ఉంటే తీసుకునేందుకు" అన్నాడతను.

"కనీసం సిగర్‌లైటర్ కూడా లేదు. చెక్ చేసుకోవచ్చు!" అన్నాను.

అతను చెక్‌చేసుకుని "విష్‌యూబెస్టాఫ్‌లక్!" అని సంతృప్తిగా తలాడించి వెళ్ళిపోయాడు.

నేను నెమ్మదిగా 17 వ నంబర్ గదికి కదిలాను. ఎన్నడూ చేయని పని చేస్తున్నాను. ఇప్పుడు నా మనస్సులో శర్మ గురించిన సవాల్ బెంగలేదు. శాంతి నాది కావాలి. అపరస్వర్గంలో నా తనువూ, మనసూ తేలిపోవాలి.

తలుపులు తెరుచుకుని లోపల అడుగుపెట్టాను.

శర్మ నెగ్గాడు. నేనోడిపోయాను.

అనుభవించిన అనుభవాల మత్తులో నేను చిన్న కునుకు కూడా తీసినట్లున్నాను. మెలకువ వచ్చేసరికి టైము ఒంటి గంటం పావయింది. శాంతి వెళ్ళిపోయింది.

గదిలోంచి బయటకు వచ్చాను. పరిచయమైన దారిగుండా రిసెప్షన్ కౌంటర్ దగ్గరకు వెళ్ళాను.

"కౌంటర్ నంబర్ 9 కి వెళ్ళండి!" అందామె.

వెళ్ళాను "మూడువందల డెబ్బైరెండు రూపాయలు" అన్నాడతను.

నాలుగు వందరూపాయల నోట్లిచ్చాను. అందుకుని ఒక గ్రీన్ కార్డు ఇచ్చాడు. "ఇది అయిడింటిఫికేషన్ కార్డ్!" అన్నాడతను. "మళ్ళీ వచ్చినపుడు ఈ కార్డే మిమ్మల్ని పరిచయం చేస్తుంది. మీ పేరు మా కస్టమర్సులో నమోదైంది. వుయారాల్వేస్ యట్ యువర్ సర్వీస్."

"థాంక్యూ!" అన్నాను.

"చిన్న రిక్వెస్ట్ మిస్టర్ భాస్కర్! మిస్ శాంతిని మీరిక మరిచిపోవాలి. ఏ పరిస్థితుల్లోనూ ఆమెను మీరు మా హోటల్లో కలుసుకున్నట్లు ఆమె వద్ద అనరాదు. బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నించరాదు. ఎన్నో గ్యారంటీల నిచ్చిన మీదటే అమెను మేమిందుకు ఒప్పించగలిగాం. మీకూ ఆమెకూ పరిచయముందన్న విషయం మరెవ్వరి వద్దా చెప్పకూడదు మీరు. ఒక ఆడపిల్ల జీవితానికి సంబంధించిన విషయం మరి." అన్నాడతను,

"అలాగే" అని అక్కణ్నించి బయటపడ్డాను, మధుర మైన తలపులతో.

6

దొంగను శిక్షిస్తే ఎవ్వరికీ పెద్ద బాధగా ఉండదు. కానీ నిర్దోషిని దండిస్తే బాధగానే ఉంటుంది. సహజంగా తప్పు

కలవాటుపడని నేను అమాయకురాలూ సహృదయురాలూ అయిన స్త్రీకి అన్యాయం చేశానని బాధపడసాగాను. ఇప్పుడు సీమ ప్రేమలో నాకు కొత్త అమాయకత్వం కనిపిస్తోంది. విశేషానురాగం కనిపిస్తోంది. ఇవి నన్ను బాధిస్తున్నాయి.

ఇటువంటి మానసిక స్థితిలో ఉన్న నేను ఆలోచనల్లో మరో కొత్త పథం తొక్కుతానని ఎన్నడూ అనుకోలేదు.

"సృష్టిలో వున్న ఏ ఆడదాన్నయినా నీకు స్వంతం. చేయగలను, నువ్వు చేయవలసిందల్లా సరైన వివరాలివ్వడమే" అన్నాడు శర్మ హోటల్ మేనక గురించి మాట్లాడుతూ. అది సవాల్ చేయడం కోసం నేను శాంతిని కోరాను. శర్మనెగ్గాడు.

ఎందుకో నాకు భయం వేసింది. సీమా అందంగా వుంటుంది. ఏ మగవాడి దృష్టయినా ఇలాగే మా ఆవిడ మీద పడి మేనకకు వెడితే?

శాంతి ముఖం చూస్తూంటే ఆమె అటువంటిదనిపించదు. స్వానుభవం లేకపోతే ఆమె గురించి ఎవరైనా ఏమైనా కల్పించి చెప్పినా నేను నమ్మకపోదును. అందువల్ల ముఖం చూసి మోసపోరాదు. అయినా వాళ్ళు కోరుకున్న ఆడదాన్ని ఎలా యీ పనికి అంగీకరింపజేస్తున్నారో, నా బుర్రకు అవగాహన కావటంలేదు.

ఆలోచించిన కొద్దీ నా బుర్ర తిరుగసాగింది.

ఏం చేయాలో తెలియడంలేదు. ఏదో మార్గం చూడాలి దీనికి.

మేనకా హోటల్లో శర్మ చెప్పిన వ్యవహారం జరగడం లేదని నమ్మదామంటే శాంతి ప్లస్ నేను అందుకు సాక్ష్యం! ఇంక మరొక్క మార్గమే వుంది. అది సీమ పవిత్రమైన

దని నమ్మడం. అది నమ్మాలంటే గట్టి పరీక్ష అవసరం, ఎలా పరీక్షించడం?

ఎలా పరీక్షించడం?? సీమ దగ్గర ఆ హోటల్ వాళ్ళ ఎత్తులు సాగవని ఎలా ధృవపరచుకోవడం?

హఠాత్తుగా బుర్రలో ఏదో మెరిసింది. అదే మార్గం. నా సమస్య లన్నింటికీ అదే పరిష్కారమార్గం. హోటల్ మేనకా పటిష్టమైన పథకాలతో నడపబడుతూండవచ్చు. కానీ సీమ వంటి ఆడవాళ్ళ దరిదాపులకు కూడా వాళ్లు రాలేరని నేను ఋజువు చేసుకోవాలి.

లేచి నిలబడ్డాను.

"ఈ ఫొటో మన బెడ్రూంలోకి మార్చేస్తున్నాను సుమా!" అన్నాను, డ్రాయింగ్ రూమ్‌లో వున్న మా పెళ్ళి నాటి ఫొటోను తీస్తూ.

"ఎందుకండీ—" అంది సీమ,

"డ్రాయింగు రూంలోకి కొత్త ఫొటో తీయించుకున్నాక పెడదాం. అయినా డ్రాయింగురూంలో మన ఫొటో లేక పోతేనేంలే" అన్నాను.

"మీ ఇష్టమే నా ఇష్టం—" అంది సీమ.

డ్రాయింగురూంలో కొద్దిగా మార్పులు చేశాను. ఎక్కడా నా గురించిన ఆనవాలు లేకుండా చేశాను. నా పేరు, ఆఫీసు వివరాలు వగైరాలేవీ అక్కడ లభించకుండా చేశాను.

"సీమా ఎవరైనా అపరిచయస్థులొచ్చి నిన్ను పలకరించారనుకో-సాధ్యమైనంతవరకు నా ప్రసక్తి రానీయకు. ఒక వేళ తప్పనిసరై పేరు చెప్పినా నా ఆఫీసు అడ్రసు మాత్రం ఇవ్వకు. నేనెక్కడ ఉద్యోగం చేస్తున్నానో తెలియదని చెప్పేయ్. ఏ పరిస్థితుల్లోనూ నా ఫొటో మాత్రం చూపిం

చకు. ఈ విషయం మర్చిపోకు సుమా!" అన్నాను. సీమ తలూపింది, ఆశ్చర్యపోతూ.

తిన్నగా హోటల్ మేనకకు బయలుదేరాను. కౌంటర్లో నా అయిడెంటిఫికేషన్ కార్డు అందజేశాను.

"పేరు?" కౌంటర్లో వ్యక్తి అడిగాడు. చెప్పాను.

"అడ్రస్."

చెప్పాను.

"ఉహూ" అని తల పంకించాడతను. "ఆమెకు సంబంధించిన మరికొన్ని వివరాలు చెప్పగలరా - అంటే ఇంట్లో ఎంత మంది సభ్యులుంటారు? ఆమె ఏంచేస్తోంది చదువుకుంటోందా వగైరాలన్నమాట."

"అన్నీ వివరాలు చెప్పలేను. నాకు తెలిసిందల్లా ఆమె పేరు, చిరునామా మాత్రమే. అయితే ఏ పరిస్థితుల్లోను నా గురించి ముందుగా ఆమెకు తెలియనివ్వవద్దు" అన్నాను.

"అలాగే ఆమె పేరేమిటన్నారూ" అని ఒక్కసారి తన నోట్ బుక్‌లోకి చూసుకుని "శ్రీ మహాలక్ష్మి గుడ్ మీరు ఎల్లుండి సాయంత్రం నాలుగున్నరకు వస్తే ఆమె ఫొటో చూసుకోవచ్చు. ఫైనల్ కన్‌ఫర్మేషన్ అయ్యేక మరో రెండ్రోజుల్లో ఆమె మీకు లభిస్తుంది."

"నిజంగానే తప్పకుండా లభిస్తుందంటారా?" అన్నాను దీనంగా.

"మీర్చిన వివరాలు సరైనవైతే మీ కోరిక తప్పక సిద్ధిస్తుంది."

అతని మాటలు నన్నానందపర్చలేదు. దారుణంగా నిరుత్సాహ పర్చాయి. నీరసంగా అక్కణ్నించి బయటపడ్డాను.

ఇప్పుడేం జరుగుతుంది? మేనక ఏజంట్లు మా ఇంటిని పడతారు, సీమను కలుసుకుని మాట్లాడతారు. అప్పుడేం

జరుగుతుంది? సీమవాళ్ళకెలా బుద్ధి చెబుతుంది? తమ హోటల్ పూనుకున్న పనెంత అసాధ్యకరమైనదో సీమ మూలంగా వాళ్ళకు తెలియవస్తుందా?

7

"ముప్పై వెరెండ్రూపాయలివ్వాలి సార్!"

"ఇదివరలో ఒక ఫొటోకు పాతిక రూపాయలకు మాత్రమే ఖర్చయింది."

"బాగుంధండీ కేసునుబట్టి ధర మారుతుంది. ఈమె భర్తతో కాపురం చేసుకుంటున్న ఇల్లాలు. సుఖంగా జీవితం గడుపుతోంది. ఫొటో తీయడానికెంత కష్టమైందో తెలుసా?"

అయే ఉంటుందనిపించింది. నా అర్ధాంగి శ్రీమహాలక్ష్మి అద్భుత సౌందర్యం కళ్ళు చెదిరిపోయేలా ఆ ఫొటోలోకి వచ్చింది. నేను నవ్వి. "ఈ ఫొటో కాపీ ఒకటి నాక్కావాలి. ఎంతయినా ఇస్తాను." అన్నాను.

"మీరు లక్షరూపాయలిస్తానన్నా ఈ ఫొటో ఇవ్వం. మీ వ్యవహారం అనంతరం ఈ ఫొటో మరెవ్వరికళ్ళా పడకుండా చేస్తాం. లేకపోతే ఇలాంటి బిజినెస్సు చేయలేం." అన్నాడతను.

"అది సరే. ఇంతకూ ఎప్పుడు?" అన్నాను.

"ఎల్లుండి మధ్యాహ్నం రెండుగంటలకి. నాలుగున్నరకల్లా మీరామెను వదిలిపెట్టవలసి ఉంటుంది. ఎందుకంటే ఆమె వివాహితురాలు. భర్త ఆఫీసునించి తిరిగి వచ్చే సమయానికల్లా ఆమె ఇంటివద్ద వుండాలిమరి!" అన్నాడతను.

"ఇంతకూ ఛార్జి ఎంత?"

"కాస్త ఎక్కువగానే ఉంటుంది. వివాహితురాలు. సంప్రదాయపు మనిషి. మా నేర్పూ ఓర్పూ పరీక్షించిం

దామె. చిట్ట చివరకు విజయం సాధించాం. మీ బిల్లు ఎనిమిది వందలు దాటవచ్చు—"

మనసంతా బాధగా అయిపోయింది. "వస్తాను...." అని బయటపడ్డాను ఫార్మాలిటీస్ ముగించుకుని.

ఇంటిదగ్గర శ్రీమతి నా కోసం ఎదురు చూస్తోంది. నేను రాగానే నవ్వి "మీకో తమాషా కబురు చెప్పనా?" అంది.

"చెప్పు-" అన్నాను.

"నాకొక కొత్తపరిచయం దొరికింది."

"ఎవరు?" అన్నాను కుతూహలంగా.

"కూర్చోండి ముందు చెబుతాను!" అన్నాక ఇద్దరం కూర్చున్నాం.

"ఆవిడ చాలా గొప్పవ్యక్తి. బాగా భాగ్యవంతురాలని కూడా అనుకుంటాను-" అంది శ్రీమతి సాలోచనగా.

నా మనసు కుదుటపడింది. ఎవరో స్త్రీతో పరిచయం! "ఊ చెప్పు" అన్నాను.

"నిన్న మధ్యాహ్నం మనింటికొచ్చింది—" అంది శ్రీమతి.

"ఎందుకు?"

"ఏదో లేడీస్ క్లబ్ కావిడ ప్రెసిడెంటుటలెండి—మెంబర్స్ నన్వేషిస్తూ మనింటి కొచ్చింది—"అంది శ్రీమతి.

"నువ్వూ చేరావా?"

"అంత గొప్పావిడొచ్చి అడుగుతూంటే కాదనడమెలా గండీ—అయిదు రూపాయలు మాత్రం ఎంట్రెన్సు ఫీజు. ఆ అయిదు రూపాయల విలువా అప్పుడే ముట్టేసిందిలెండి. ఆవిడ నాకో ఫోటో తీసింది కూడా. క్లబ్ మెంబర్సు ఫొటో లొక ఆల్బంలో పెడతారట. ఈ రోజప్పుడే ఆవిడ

స్వయంగా వచ్చి నాకు ఫొటో కాపీ అందజేసి వెళ్ళింది." అంది శ్రీమతి. అంటూ ఒక ఫొటో తీసి నాకు అందిచ్చింది. అంతవరకూ ఆమె చేతిలో ఉన్న ఆ ఫొటోను నేను గమనించనేలేదు.

చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ ఫొటో సరిగ్గా నేను మేనకా హోటల్లో చూసిన ఫొటోయే!

"సీమా—ఆవిడ ఇంకా ఏమైనా చెప్పిందా?" అనడిగేను.

"ఇంకేమీ చెప్పలేదండీ. ఎప్పుడైనా క్లబ్ మీటింగ్ ప్రత్యేకమైనది ఉన్నప్పుడు కారు పంపిస్తాను, తప్పక రావాలని చెప్పింది. క్లబ్ మీటింగ్సెక్కడ జరుగుతుంటాయో తెలుసా? హోటల్ మేనకలో. అది ఈ ఊళ్ళోకల్లా గొప్ప హోటలని చెప్పుకోగా విన్నాను'' శ్రీమతి కళ్ళలో మెరుపు కనపడింది.

నా బుర్ర గిర్రున తిరుగసాగింది.

రేపే నా జీవితంలోని ముఖ్య ఘట్టం. మేనకా హోటల్లో ఏదైనా మోసముంటే తెలుస్తుంది. లేదా సీమ వంచితురాలని ఋజువౌతుంది. అదే జరిగితే నా సంసార జీవితంలో ఇది చరమ ఘట్టమౌతుంది.

8

తొమ్మిదో నంబరు కౌంటర్లో వందరూపాయలు కట్టాను. వెయిటింగ్ రూమ్ నెంబర్ 27లో సినిమా చూసేను. స్పెషల్ రూమ్ పన్నెండులో యంత్రంలోకి చూస్తున్నాను.

సీమ ఒక నడి వయస్కురాలితో మాట్లాడుతోంది. నేను వచ్చేటప్పుడు ఇంట్లో ఏ బట్టలతో అయితే చూశానో అవే బట్టలు ధరించి ఉంది. ఆ నడి వయస్కురాలిని కూడా గుర్తుపట్టాను. శాంతితో సంభాషించిన ఆమే ఈమె!

ఓ పదినిముషాల అనంతరం యంత్రంలో అంధకారం అలుముకుంది. పక్కనున్నతనికి చెప్పాను.

"గుడ్. ఆమె బయల్దేరింది. వెయిటింగ్‌రూమ్ 27 కు వెడుతోంది. మీతో అనుభవానికి సైకలాజికల్ ప్రిపరేషన్ జరుగుతుంది. మీరు అండర్‌గ్రౌండ్ రూమ్ నంబర్ 6 ముందుండే గ్లాస్‌రూంలో ఎదురు చూడండి. ఆమె గదిలోకి వెళ్ళగానే ఒక్క నిమిషం ఆగి మీరూ వెళ్ళవచ్చు—" అన్నాను.

"థాంక్యూ—" అని బయల్దేర బోయాను.

"చిన్న రిక్వెస్ట్. ఇది ఒకస్త్రీ పచ్చని కాపురానికి సంబంధించిన విషయం. గదిలో ఉన్నంతసేపూ ఆమెను మాట్లాడించడానికి ప్రయత్నించవద్దు. ఆమె ముఖాన్ని వెలుగులో చూడ్డానికి ప్రయత్నించవద్దు. గదిలోంచి బయటకు రాగానే ఆమెనీ, ఆమెతో అనుభవాల్నీ మరిచిపోవాలి. మా హోటల్ పది కాలాలపాటు మీ బోటివారికి సర్వీస్ చేయగలగాలంటే ఈ మాత్రపు సహాయం మీరు చేయాల్సుంటుంది." అన్నాడతను.

నేను నీరసంగా అక్కణ్నుంచి బయటపడి నిర్ణీత స్థలంలోకి చేరుకున్నాను. గ్లాస్‌రూంలో అడుగు పెడుతూండగానే నా ఒళ్ళు తిరిగినట్లనిపించింది. నా మీద నాకే ఒంట్రోలు తప్పి కుప్పలా కూలిపోబోతూండగా యెవరో పట్టుకున్నట్లు గుర్తు.

తర్వాత యెవరిదో కంఠం వినపడింది. "మెలకువ వచ్చిందా?" అనడుగుతోందో పురుషకంఠం.

"నే నిప్పుడెక్కడున్నాను?" లేవడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

"అండర్‌గ్రౌండ్ రూం నంబర్ సిక్స్‌లో ఉన్నారు. గ్లాస్‌రూంలోకి వెళ్ళగానే యెందువల్లనో పడిపోయారు. నేను మిమ్మల్ని మంచంమీదకు చేర్చాను. నౌ యూ ఆర్ రైట్?—" అనడిగాడతను.

"ఊఁ" అన్నాను.

"గుడ్. ఆమె వచ్చే టైమవుతోంది. మీరు బయటకు రాకండి. గదిలోనే ఉండండి. నేను వెడుతున్నాను. విష్యూ హేపీ టైమ్." అతను బయటకు వెళ్ళిపోయాడు.

నాకు స్పృహ తప్పడం హోటవాళ్ళ పన్నాగమే అనిపించింది. గదిలోకి రాబోయేది సీమకాదు. అందుకనే అలా చేశారు. ఈ ఆలోచనరాగానే నా మనసు తేలికపడింది. అప్రయత్నంగా పాంట్ లోపలి పాకెట్ తడిమి చూశాను. నా పెన్ టార్చి, క్లోరోఫాం బాటిల్ అలాగే ఉన్నాయి.

ఈ రోజుతో హోటల్ మేనకా బంగారం బయటపడిందనుకున్నాను.

అంతలో గది తలుపులు తెరచుకుని మూసుకున్నాయి. ఆమె సీమకాదని నాకు తెలుసు. ఆ తలపు అంతవరకూ జరిగిన అనుభవం నాలో ఎనలేని ఉద్రేకాన్ని కలిగించగా వెళ్ళి ఆమెను సమీపించాను.........

అనుభవం పూర్తయింది. ఆమె పరవశంగా నన్ను పెనవేసుకుని ఉంది. వెళ్ళిపోబోయేముందు ఒక్కసారి ఆమె ముఖాన్ని చూపితీరాలి! నాకీ తలపువచ్చిన మరుక్షణంలో నా చేతిలోని క్లోరోఫాంగుడ్డ ఆమె ముక్కుకు అదిమిపెట్టాను. కొద్దిక్షణాల్లో ఆమె మంచంమీదకు జారిపోయింది.

కటిక చీకట్లో నా పెన్ టార్చివెలుతురు కిరణాలు ప్రసరిం

చింది. అవి మామూలు కిరణాలు. అణువును భిన్నం చేసి ఆటంబాంబును పేల్చగల కిరణాలు....

నా గుండెల్లో ఆటంబాంబు బ్రద్దలైంది!

ఆమె సీమ!

మేనకా హోటల్లో ఒక గంటసేపు స్వేచ్ఛా శృంగారం అనుభవించిన యువతి నిజంగా సీమే!

అయినా అనుమానం తీరక నేనామె ముఖాన్ని గోళ్ళతో గోకాను. చేతులతో పామును - ఒకవేళ ఏదైనా మాస్కు వాడేరేమో లేక బాగా కోటింగ్ కొట్టి దగ్గర పోలికలున్న అమ్మాయి నలా తయారు చేశారేమోనన్న అనుమానంతో.

కానీ అటువంటి దేమీ జరుగలేదు. ఈమె అక్షరాలా సీమే!

ఏణ్ణర్థంగా కాపురం చేస్తున్నాను. నా సీమను గుర్తుపట్టడంలో నేను తప్పు చెయ్యలేదు.

నేను సీమ నెలా తప్పు పట్టగలను? తప్పు నాదే— మేనకా హోటల్‌ని పరీక్షించే ఉద్దేశ్యంతో సీమను బలి పశువు చేశాను. మేనకా హోటల్‌వాళ్ళ తెలివితేటలముందు ఏ పతివ్రతలూ ఆగరని తెలిసిపోయింది.

ఏమిటి వాళ్ళు చేస్తున్నది? అయినింటి ఆడపిల్లల నిలాంటి పనులకెలా ఒప్పించ గలుగుతున్నారు?

ఇప్పుడు నా కెంతో భయం పట్టుకుంది. అదృష్టవశాత్తూ ఆ రోజు ఆస్థానంలో నే నున్నాను. అదేస్థానంలో మరో పురుషుడుంటే....

అఫ్‌కోర్స్—సీమ దృష్టిలో ఇప్పుడు అక్కడ మరో పురుషుడే ఉన్నాడు. అయినా ఆమె విచ్చలవిడిగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించింది. ఆమె అలా ప్రవర్తించే స్థితికి ఏ విధంగా తీసుకురాబడింది?

సీమ పతివ్రతగా మసలలేదని తెలిసిన ఆక్షణంనించీ నా మనసు ఆమె నసహ్యించుకోవడం ప్రారంభించింది. ఆమె అసహ్యం ద్వేషంగా కూడా మారుతోంది.

ఒక భయంకర రహస్యాన్ని తన మనస్సులో దాచుకో గలిగిన సీమ అటువంటి రహస్యాల నింకా ఎన్నింటినైనా ఇముడ్చుకోగలదు. ఆమె ఒక పాపపు రూపం అని నాకు తోచసాగింది.

క్రమంగా నాలో బలబడిన కోరిక ఒక్కటే. సీమను హత్య చేయాలి!

అయితే అది అనువైన సమయం కాదని బలవంతాన నిగ్రహించుకున్నాను. దానికి పటిష్టమైన పథకం వేయాలను కున్నాను.

9

"శ్రీమతి కె. వసంత—" పేరు చెప్పాను.

"అడ్రస్!"

"కేరాఫ్ కె. కృష్ణశర్మ. లక్ష్మీనివాస్, రంగారావు పేట."

"గుడ్—ఎల్లుండి సాయంత్రం వచ్చి ఫొటోగ్రాఫిక్ కన్‌ఫర్మేషన్ చేస్కుందురుగాని—"

అలాగేనని బయటపడ్డాను. నేను చేయబోయేది మిత్ర ద్రోహం కావచ్చు. కానీ హోటల్ మేనక లాంటి సంస్థలను పోషించే శర్మవంటి మిత్రులకీ పరాభవం అవసరమే!

అనుకున్న ప్రకారం వెళ్ళి ఫోటో చూసుకువచ్చాను.

అది ముమ్మూర్తులా శ్రీమతి శర్మ ఫోటోయే. ఆ ఫోటోలో ఆమెను చూశాడంటే శర్మ మరే ఆడదాని వంకా కన్నెత్తైనా చూడడనిపించింది. ఈ మేనక హోటల్‌వాళ్ళు

ఫోటో స్టుడియో పెట్టకు బ్రతకొచ్చు—ఎందుకీ దిక్కు-మాలిన వ్యాపారం మొదలుపెట్టారోగానీ—

ఎందుకేమిటి? డబ్బుకోసం—సీమ గురించి నేను కొద్ది సేపటి అనుభవానికి ఎనిమిదివందలఅరవై ఖర్చు పెట్టాను. అందులో సీమకేమైనా ముట్టిందేమో తెలియదు. మనిషికి రెండొందలొచ్చిందనుకున్నా రోజుకు పదిమంది ఆడ వాళ్ళను తీసుకుంటే రెండువేల రూపాయలు!

శర్మా—నువ్వు తీసిన గోతిలో నువ్వే పడుతున్నావ్—అనుకున్నాను కసిగా.

నాకు వసంతా శర్మమీద ప్రత్యేకమైన కోరిక ఏమీ లేదు. ఒకప్పుడైతే గౌరవ భావమే ఉండేది. ఈ మేనక హోటల్ అనుభవం అనంతరం—అందులోనూ సీమ నక్కడికి రప్పించేక—కేవలం పగ తీర్చుకోవాలన్నకసితో-ఆమెమీద కోరిక పెంచుకున్నాను.

10

నా పగ తీరే రోజు వచ్చింది. ఆఫీసునించి తిన్నగా మేనక హోటల్‌కు వెళ్ళాను. శర్మలాంటి వుద్యోగస్తుల భార్యలకు వీలున్నది ఆఫీసు టైములోనే గదా! ఒక్కో-కార్యక్రమమే ముగించుకుంటూ స్పెషల్ రూముకు వెళ్లాను. అక్కడ యంత్రంలో వసంతాశర్మ, నడివయస్కురాలు—ఆ ప్రక్క నున్నది ఎవరు? నా కళ్ళు నన్ను మోసం చేయ లేవు....

సోఫాలో వసంతాశర్మకి ప్రక్కన సీమ కూర్చుని ఉంది. ఇదెలా జరిగింది?

"ఇద్దరు యువతులు కనబడుతున్నారు?" అనడిగాను.

"బహుశా ఇద్దరికి ఒకేసారి అపాయింట్‌మెంటిచ్చి

ఉంటారు. మీక్కావలసినవారే మీ గదికి వస్తారు. మీక్కావలసినామె ఉంది గదా!" అనడిగేడతను.

"ఉంది!" అన్నాను.

"అయితే ఆ రెండో ఆమె గురించి పట్టించుకోకండి—మరొకరి కోసం గదికి వెడుతుంది లెండామె!" అన్నాడతను.

ఈ పర్యాయం నా శరీరంలో విపరీతమైన ఆవేశముంది. ఎవడో సీమను కోరాడు. వాడికోసం సీమ వచ్చింది. "సీమా—ఇక నీ చావు తప్పదు" అనుకున్నాను ఉద్రేకంగా మనస్సులోనే.

సీమ, వసంత లేచి నిలబడ్డారు—యంత్రంలో అంధకారం అలముకుంది.

అతను నాకన్నీ వివరంగా చెప్పాడు.

అండర్‌గ్రౌండ్ రూమ్ నెంబరు పదకొండుకి ఎదురుగానున్న అద్దాల గదిలో నిలబడ్డాను.

శ్రీమతి వసంతాశర్మ వచ్చింది. గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది.

రెండు నిముషాలాగాను. ఒకతను వచ్చాడు నన్ను చెక్ చేయడానికి. ఒళ్ళంతా తడిమాడు. ఏదో అనుమానం వచ్చింది. నా పాంట్ అండర్ జేబులోని క్లోరోఫారంసీసా, పెన్ టార్చి తీశాడు. అతని ముఖం అంత ప్రసన్నంగా లేదు.

"మా రెగ్యులర్ కస్టమర్స్ దగ్గర్నించి ఇటువంటిది ఎక్స్‌పెక్ట్ చేయలేము దయయుంచి మీరు పక్క గదిలోకి రండి. మిమ్మల్ని పూర్తిగా పరీక్షించాలి" అన్నాడతను.

అతన్ననుసరించి పక్క గదిలోకి వెళ్ళాను. ఫరో చెకింగయింది.

"ఏమీ అనుకోవద్దు—మేము చేస్తున్న వ్యాపారం అటు వంటిది" అన్నాడతను.

"అటువంటప్పుడు నాదో చిన్న సందేహం—ఇప్పుడు నేను ప్రవేశించబోయే గదిలోంచి నేను కోరినామె బయటకు వెళ్ళిపోయుండవచ్చు—" అన్నాను.

"మా వ్యాపారంలో అటువంటి మోసాలుండవు. అవసరమనుకుంటే నే నామెను బయటకు పిలుస్తాను. మీ రద్దాల గదిలోంచి చూద్దురుగాని—" అన్నాడు.

నేను మళ్ళీ అద్దాల గదిలోకి వెళ్ళాను. అతను తలుపు తట్టి "మేడమ్!" అన్నాడు. వసంత ఒకసారి బయటకు వచ్చి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఆయనింకా గదిలోకి రాలేదా?" అనడిగాడతను. ఆమె నోరు విప్పకుండా తల అడ్డంగా ఆడించింది.

"మీరు లోపలకు వెళ్ళవచ్చు. ఆయన ఇప్పుడే వస్తారు" అన్నాడతను. ఆమె లోపలకి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత అతను నా దగ్గరకు వచ్చాడు. "ఇంకేమైనా సందేహాలున్నాయా?" అనడిగాడు.

"లేవు!" అన్నాను.

"విషూ్య ఆల్ ది బెస్ట్!" అని వెళ్ళిపోయాడు.

లోపల ఉన్నది ఒకనాడు నన్ను ఛాలెంజి చేసి గెలిచిన మిత్రుడి భార్య అన్న విషయం నా ఆవేశాన్నీ, కోరికనూ పెంచింది. సీమ ఇప్పుడు నిజంగా పతితురాలై పోయిందన్న బాధ వాటికి కలవగా ఒక విచిత్ర మానసిక స్థితిలో ఆ గదిలో నే నడుగుపెట్టాను.

11

మనశ్శాంతి లేదు. ఎక్కడెక్కడో పిచ్చివాడిలా తిరిగి ఏడు గంటలకు ఇంటికి వెళ్ళాను. తాళంవేసి ఉంది. ఉద్రే

కంలో నా పళ్ళు కటకటమన్నాయి.

"ఎన్నిగంటలో ఈవిడగారి ఎంగేజిమెంట్—" అనుకున్నాను అసహ్యంతో.

డూప్లికేట్ కీతో తాళం తీశాను. తలుపులైనా వేయకుండా నిస్పృహగా కుర్చీలో కూర్చున్నాను. ఇంట్లో చీకటి—నా మనసులో చీకటి—అసలు నా బ్రతుకే చీకటి.

అలా ఎంతసేపు కూర్చున్నానో తెలియదు. హఠాత్తుగా ఇంట్లో దీపం వెలిగింది. ఉలిక్కిపడి తల ఎత్తాను. ఎదురుగా కనపడ్డ వ్యక్తి నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాడు.

"నువ్వా శర్మా!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును—నేనే—ఏమైపోయావ్—ఎక్కడికెళ్లావ్?" అన్నాడు శర్మ.

"హఠాత్తుగా నామీద...." నేనేదో అనబోతుండగా—

"కబుర్లు తర్వాత—ముందు బయటకు నడు—" అన్నాడు చిరాగ్గా శర్మ.

శర్మ ముఖంలో చిరాకు చూస్తూంటే నాకు అనుమానం కలిగింది—ఇతగాడికి నా గురించి తెలిసిపోయిందని. "నాకు చిరాగ్గా ఉంది. నేను రాను!" అన్నాను.

"ఏం మగాడివి నాయనా! ఇంటి కొచ్చావు. ఇంటికి తాళంవేసి ఉంది. రాత్రి ఎనిమిది గంటలు దాటింది—ఇల్లాలేమైపోయిందోనని పట్టించుకున్నావా?" అనడిగాడు శర్మ.

"నాకు లేని శ్రద్ధ నీ కెందుకోయ్—నా ఇంటి ఇల్లాలి మీద" అన్నాను విసురుగా.

శర్మ ముఖం ఎర్రబడింది. "మాటలు కాస్త జాగ్రత్తగా రానివ్వు. నీ భార్య అవతల చావు బ్రతుకుల్లో ఉంది. మధ్యాహ్నంనించి ప్రయత్నిస్తున్నాను. ఆఫీసులో లేవు,

ఇంటిదగ్గర్లేవు. ఏం చేయాలో తెలియదు. మరో ప్రయత్నంగా ఇప్పుడొచ్చాను—"

ఉలిక్కిపడ్డాను "ఏమిటన్నావ్?"

"పద—మిగతా విశేషాలు దార్లో చెబుతాను."

ఇద్దరం నర్సింగ్‌హోమ్‌కు బయలుదేరాము.

"దొరికారా?" అంది శ్రీమతి వసంత. మమ్మల్ని చూడగానే.

"ఎలాగో దొరకపుచ్చుకుని లాక్కొచ్చాను" అన్నాడు శర్మ.

"ఏమండీ—ఏం జరిగింది?" అనడిగాను ఆతృతగా.

"మధ్యాహ్నం మేము షాపింగ్‌కు వెళ్ళాము. అనుకున్న ధరకు చీర బేరం చేయగలిగామన్న ఉత్సాహంతో—షాపులోంచి రోడ్డుమీదకు వచ్చాం. ఒకే ఒక్క నిముషం తర్వాత శ్రీమహాలక్ష్మి నన్ను పక్కగా తోసేసినట్లయింది. కాసేపటి తర్వాత తెలిపింది, ఆమె కారుకింద పడింది. నేను పక్కన పడ్డానని—వెంటనే దగ్గర్లో ఉన్న మంచి నర్సింగ్ హోమ్‌కు చేరాం. నావి చిన్న చిన్న గాయాలే కానీ మీ ఆవిడ బాగా గాయపడ్డారు."

ఉలిక్కిపడ్డాను. "యాక్సిడెంటెప్పుడయింది?" అన్నాను అనుమానంగా.

"మధ్యాహ్నం సుమారు మూడుగంటలకు...."అన్నాడు శర్మ నన్ను పరీక్షగా చూస్తూ.

"ఇంపాసిబుల్" అన్నాను గట్టిగా.

"బీక్వైట్ సర్టైనషైము కావాలంటే పోలీసులు రిటిస్టర్ చేసుకున్న ప్రకారం రెండుగంటల యాభైయారు నిముషాలు" అన్నాడు శర్మ.

"నీకు తెలియదు శర్మా—ఇందులో ఏదో మోస ముంది—" అన్నాను.

"ఏమిటా మోసం?"

ఎలా చెప్పేది? ఆ సమయంలో నీ భార్య నాతో మేనక హోటల్లో అండర్‌గ్రౌండ్ రూములో ఉన్నదని శర్మకు నే నెలా చెప్పేది?

నేను మాట్లాడకపోవడం చూసి "ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకోకు. మీ ఆవిడ కిప్పుడు కులాసాగా ఉంది. ప్రాణ గండం గడిచింది. వచ్చి చూస్తావా?" అనడి గాడు.

12

"ప్రస్తుతానికి ఆమెచేత మరీ ఎక్కువ మాట్లాడించ కండి—" అని వెళ్ళిపోయింది నర్స్.

శర్మ. శ్రీమతి వసంత ఇంటికి వెళ్ళిపోయారు. భోజనం చేసి వచ్చి సీమాకు తోడుగా పడుకుంటానని చెప్పింది శ్రీమతి వసంత.

తల నిండా కట్లతో ఉన్న సీమను చూస్తుంటే నా గుండె చెరువై పోయింది.

"సీమా!" అన్నాను.

"మీ కోసం బ్రతికానండీ—" అంది సీమ నీరసంగా.

నే నామె వైపే చూస్తూండిపోయాను.

ఆమె మళ్ళీ అంది "ఈ లోకంలోనేకాదు. ఆ లోకంలో కూడా నా కెవ్వరూ లేరండీ. ఎక్కడైనా మీ రొక్కరే. మీ కోసం ఏమైనా చేయాలనీ, ఏమైనా అయిపోవాలనీ, ఏ పరి స్థితుల్లోనైనా మీతోటే ఉండాలనీ బ్రతికానండీ—"

"ఎక్కువ మాట్లాడవద్దు సీమా—మన కింకా ముందు ముందు బోలెడు సమయముంది—"

"ఉండవచ్చు. కానీ మీతో గడిపే ప్రతి క్షణమూ అపూర్వమైనదే నాకు—"

సీమ కళ్ళలో మెరుపు కనిపిస్తోంది. ఆమె ముఖంలో ఉత్సాహం కనిపిస్తోంది. ఆమెను చూస్తూ ఆలోచిస్తున్నాను నేను—ఈమెను నేను హత్య చేయాలనుకున్నాను. విధి కారణంగా ప్రమాదానికే లోనైంది.

"అసలేం జరిగిందో చెప్పు సీమా!"

"మీకు గుర్తుందో లేదో కానీ—రేపు మన పెళ్ళిరోజు. అందు గురించి కొత్తబట్టలు కొందామని బయల్దేరాను. చీరల ఎన్నికలో నాకు వసంతగారు చాలా పర్యాయాలు సహాయం చేశారు. అందుకని వాళ్ళింటికి వెళ్లాను. ఇద్దరం కలిసి బయల్దేరి...." ఇక్కడ సీమ ఒక్క క్షణం ఆగింది.

"ఊఁ బయల్దేరి—" అన్నాను కుతూహలంగా.

"బయల్దేరి మార్కెట్‌కు వచ్చాం—" అంది సీమ.

"తిన్నగా మార్కెట్‌కే వచ్చారా—లేక మరెక్కడికైనా వెళ్లారా?"

సీమ తటపటాయించింది.

"భర్త దగ్గర రహస్యం దాచకూడదు. చెప్పకపోతే నేను చచ్చినంతొట్టు" అన్నాను.

ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఒట్లు ఆడవాళ్ళమీద అద్భుతంగా పని చేస్తాయని నాకు తెలుసు.

భారంగా నిట్టూర్చి సీమ చెప్పసాగింది—

"నేను వసంతగారింటికి వెళ్ళేసరికి—ఆమె కాస్త హడావుడిగా కన్పించింది. చాలా నీటుగా ముస్తాబవుతోంది. అడిగేసరికి చెప్పిందామె. తను మేనక హోటల్లో, లేడీస్ క్లబ్ మీటింగుకి వెళ్ళవలసి ఉన్నదని. నేను వచ్చిన పని విని—'ఫరవాలేదు, ఆ హోటల్లో పావుగంట కంటె పని

ఉండదు—కలిసి వెళ్ళి కలిసి వచ్చేద్దాం—ఎట్టొచ్చీ ఈ సంగతి చాలా రహస్యంగా ఉంచాలన్నదావిడ' అని చెప్పింది.

సరిగ్గా ఒంటిగంటంపావుకి కారు వచ్చింది. పది నిముషాల్లో హోటలుకు వెళ్లాం. ఇదివరలో నాకు ఫొటోలు తీపిందన్నానే—ఆవిడే అక్కడ మమ్మల్ని రిసీవ్ చేసుకుంది. సుమారు పదిహేను నిముషాలసేపు కూర్చుని కబుర్లు చెప్పుకున్నాం. ఆవిడ వసంతగారికో చిన్న కవరిచ్చింది. అందులో నూట పదహారు రూపాయలున్నాయి. ఆ క్లబ్‌వారు అప్పుడప్పుడు తమ సభ్యుల్ని సన్మానిస్తూ ఉంటారట. మళ్ళీ కారులో మమ్మల్ని మార్కెట్లో వదిలేశారు.

రెండు గంటలకల్లా మార్కెట్లో ఉన్నాం మేము. ఆ తర్వాత షాపులో దూరాం. ఒక చీర నాకు చాలా బాగా నచ్చింది. బేరంచేసి తీసుకున్నాను. నెక్స్ట మీ గురించి ఒక షర్టు తీసుకోవలసి ఉంది. ఉత్సాహంగా రోడ్డుమీదకు వచ్చాం—అంతే!".

సీమ ఇప్పుడబద్ధం చెబుతోందనుకోడానికి అవకాశం లేదు. చాలా ఋజువులూ, సాక్ష్యాలూ ఉన్నాయి. అన్నింటినీ మించిన యాక్సిడెంటే ఉంది?

అయితే ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలనించి నాలుగు గంటలవరకూ వసంత పేరుతో నాతో గడిపిన స్త్రీ ఎవరు? ఆమె నిశ్చయంగా వసంతేనని నేను భావించాను. కానీ నిశ్చయంగా వసంత కాదని ఇప్పుడు ఋజువయింది.

సీమను వదిలి గది బయటకు వచ్చాను. మనసులో ఎన్నో రకాల ఆలోచనలు—ఒక్కటీ తెగడంలేదు.

ఈ మేనక హోటల్ వ్యవహారమేమిటి? ఎలా నిర్వహిస్తున్నారు వీళ్ళ కార్యక్రమం?

స్పెషల్ రూములో వాళ్ళు చూపించే యంత్రం పెరిస్కోప్ ప్రిన్సిపుల్ ఆధారంగా చేసుకుని తయారైనది. అందువల్ల అందులో చూపించడంకోసం వసంతను ఏదో వంకతో హోటలుకు పిలిపించారు. అంతవరకూ బాగానే ఉంది. ఆ తర్వాత ఆమెను బయటకు పంపేశారు. మరి నా గదిలోకి వచ్చినామె కూడా వసంతలాగానే ఉంది.

అదీకాక ఇటువంటి మోసాలు కొనసాగిస్తున్నారా అనుకుందామన్నా సీమ విషయంలో ఇంకో రకంగా జరిగింది. నా గదిలోకి వచ్చిన అమ్మాయి సీమ తప్ప మరెవ్వరూ కాదు. ఆ విషయం నేను గదిలోనే ఋజువు చేసుకున్నాను. అయితే శాంతి వసంతలను గదిలో పరీక్షించే అవకాశం నాకు లేకపోయింది.

అప్పుడే మరో చిన్న అనుమానం నాలో కలిగింది. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ పటిష్టమైన పథకాలతో ఈ హోటల్ నడపబడుతూంది, అటువంటప్పుడు సీమతో నేను గడపడానికి వెడుతున్నప్పుడు నన్ను సరిగ్గా ఎందుకు చెక్ చేయలేదు?

తమ నిజాయితీని నిరూపించుకునేందుకు ఒక అవకాశమిస్తారా—ఈ హోటల్‌వాళ్లు, అటువంటప్పుడు శాంతివద్ద నా కా అవకాశాన్నెందు కివ్వలేదు?

బాగా ఆలోచించగా ఒక్కటనిపించింది. ఇంతవరకూ వాళ్ళు నాకు గదిలో మనిషిని చూసే అవకాశం ఒకే ఒక పర్యాయ మిచ్చారు. ఆ మనిషి నా భార్య.

సీమా వంక సూటిగా చూశాను.

"ఒక పర్యాయం నువ్వు మేనక హోటల్లో వ్యభిచారం చేశావు. దానికి సంబంధించిన వివరాలు చెప్పాలి" అన్నాను సూటిగా.

సీమ కాస్త తీవ్రంగా "వ్యభిచారం చేయాలని విపరీతంగా మనసున్న మీబోటివారు—దాన్ని వ్యభిచారమని పిలవ్వచ్చు. కానీ ఎక్కడ కలుసుకున్నా—నా భర్తతో అనుభవాన్ని వ్యభిచారంగా అంగీకరించలేను" అన్నది సీమ.

"వ్హాట్—" ఉలిక్కిపడ్డాను. "అక్కడ కలుసుకున్నది నన్నేనని తెలుసా నీకు?"

"అన్నీ తెలుసు నాకు. ఆ లేడీస్క్లబ్ ఆమె చెప్పింది. మీరు వ్యభిచరించలేక, ఆ కోరికను చంపుకోలేక, నానా అవస్థ పడుతున్నారట. ఆ కోర్కె మీలో బలంగా పాతుకుపోవడంవల్ల—త్వరలో మీకు పిచ్చిపట్టే అవకాశం కూడా ఉన్నదని అందావిడ. తమది చాలా గౌరవనీయమైన సంస్థ అనీ—ఏ మోసమూ ఉండదని నచ్చజెప్పింది. సగం నమ్మాను. తర్వాత మీ ప్రవర్తనలో నాకు చాలా ఋజువులు కనపడ్డాయి. నా నమ్మకం దృఢమైంది.

హోటల్‌కు వచ్చాను. గదిలో మిమ్మల్ని కళ్లారా చూస్తే కానీ వెళ్ళనని చెప్పాను. అప్పుడు మీకు స్పృహ పోగొట్టి, గదిలో మంచంమీద పడుకోబెట్టారు. మిమ్మల్ని చూస్తే నవ్వొచ్చింది. అంతా రూఢి చేసుకున్నాక—మీకా వ్యభిచారపుటనుభూతు లివ్వడంకోసం—కాస్త శృతి కూడా మించాను—" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నాకు మీరు తప్ప మరెవ్వరూ లేరు. మీకోసం ఏమైనా చేస్తాను, చేయగలను. అందుకే ఆ రోజలా ప్రవర్తించాను. హోటల్‌వాళ్ళు చెప్పిన ప్రకారం నేను ఈ ప్రసక్తి మళ్ళీ ఎన్నడూ మీవద్ద తీసుకురాలేదు. నేను వ్యభిచరించానన్న అనుభూతిని పొందుతున్నట్లు మీరు భావించాలట. ఏమిటో ఈ విచిత్ర మనస్తత్వం నా కర్థం కాదు—కానీ మీ క్షేమం

కోరి అలాగే చేశాను—" ఆ తర్వాత కొద్దిగా వెక్కిళ్ళు వచ్చాయి శ్రీమతికి.

"నన్ను మన్నించు సీమా!" అన్నాను. నా కళ్ళ ముందు కప్పుకున్న మంచుతెరలు తొలగిపోయాయి. జరిగిందేమిటో తెలియవచ్చింది.

"ఈ ఊళ్ళో హోటల్ మేనక ఉన్న సంగతి తెలుసా? దాన్ని గురించి శర్మ నాకొక రహస్యం చెప్పాడు—" అంటూ ఆ వివరాలన్నీ ఇచ్చి—

"ఆ వేళంలో నేను శాంతి అనే అమ్మాయిని కోరాను. పొందగలిగాను. ఆ క్షణంనించీ నాకు బెంగ పట్టుకుంది. ఎవరైనా కోరితే—అందజేయగల సమర్థత హోటల్‌వాళ్ళ కుందా? వాళ్ళను పరీక్షిద్దామని నేను ప్రయత్నిస్తే నా వేలితో నా కన్నే పొడిచారు వాళ్లు! అసలు వాళ్ళాడే నాటక మేమిటంటే—కోరుకున్న అమ్మాయిని హోటల్‌కు పిలిపించి, ఓ గంటసేపు కబుర్లు చెప్పి పంపించేస్తారు. ఆ పావుగంటా ఆమె హోటల్లో ఉన్నట్లు మా బోంట్లకు తెలుస్తుంది.

తర్వాత ఎత్తులోనూ, రూపంలోనూ యువతికి దగ్గర్లో ఉన్న అమ్మాయిని అలాగే మేకప్ చేసి వుంచి గదికి పంపిస్తారు. మగవాడప్పుడుండే మానసిక స్థితిలో ఆ మాత్రపు తేడాను గుర్తించడం కష్టం. అందులోనూ గదిలోకి వెళ్ళే అమ్మాయిని మసక చీకట్లో ఒక అద్దాల గదిలోంచి చూస్తాం. బాగా పరిచయమున్న మనిషిని కూడా ఆ మాత్రపు దూరం నించి తేడాలతో గుర్తించడం కష్టం. తర్వాత అంతా కటిక చీకటి వ్యవహారం—"

యాక్సిడెంటయ్యేవరకూ కూడా నా అనుభవాల నన్నింటినీ పూస గుచ్చినట్లు శ్రీమతికి చెప్పాను.

అన్నీ విని ఆమె నెమ్మదిగా ఇలా అంది "ఒక తప్పు

చేసి నేను తప్పు చేస్తానేమో భయపడి అసహ్యించుకోవడం ప్రారంభించారు. కానీ మీరు తప్పు చేశానని ఎన్నడూ గుర్తించినట్లు కనపడదు" అంది.

నేను సిగ్గుతో తల వాల్చాను.

* * *

అంతా విని, శర్మ ముఖంలో రంగులు మారాయి. "ఏమిటి నువ్వు చెప్పేది? మేనక హోటల్‌వాళ్ళు ఇంత మోసం చేస్తున్నారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఈ పవిత్ర భారతదేశంలోని ప్రతి ఆడదీ శీలవతి అని ఋజువు చేయలేను. కానీ కాదని ఋజువు చేద్దామనుకున్న నువ్వు ఫెయిలయ్యావని చెప్పడానికి విచారిస్తున్నాను—"

శర్మ మౌనంగా ఉన్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. అతనికి బుర్రలో మార్పు ప్రారంభమై ఉండాలని నా అనుమానం. అతనికి కనువిప్పు కలిగిందని నా అనుమానం.

"ఆ అమ్మాయి బాగుంది కదూ?" అన్నాను దూరంగా కూర్చుని వున్న ఓ అమ్మాయిని చూపించి.

"పెళ్ళైనవాళ్ళం—మనకు అమ్మాయిల జోలి ఎందుకు లెద్దూ!" అన్నాడు శర్మ.

"అందాన్ని అనుభవించాలనుకోవటం తప్పవుతుందేమో కానీ, పెళ్ళైనంత మాత్రాన అందాన్ని చూసి ఆనందించ డంలో తప్పేముంది?" అన్నాను.

"తప్పులేదు. కానీ అది తప్పుకు మొదలు. ఆ అమ్మా యేం ఖర్మ. అడుగో—నించుని ఆ అమ్మాయికేసి చూస్తున్న ఆ అబ్బాయీ బాగున్నాడు. వాణ్ణి మెచ్చుకోవేం?" అనడిగాడు శర్మ.

"ఈ మనస్తత్వం మనిద్దరిలో కలకాలం నిల్చుగాక!" అన్నాను. దేవుడు తథాస్తు అన్నాడో, లేదో తెలియదు. ***

తలుపులు మూసి పడుకోండి!

అజీజ్

"ఏవండీ! మిమ్మల్నే. ఏడు కావస్తోంది. ఇహ లేస్తారా?" వీణా రవళిలా వినిపించిన భార్యామణి మేలు కొలుపుతో మెల్లిగా కళ్ళు తెరిచేడు సారంగపాణి.

నుదుట ఎర్రని కుంకుమ తిలకంతో పున్నమి జాబిల్లిలా మీదకి వంగివున్న కావ్యసుధ కనిపించగానే సారంగపాణి అధరాలు విచ్చుకున్నాయి. ఆమె మెడచుట్టు చేయివేసి చటుక్కున మీదికి లాక్కుని పెదాలు బిగించి వదిలాడు.

"సరసాలు చాలుగానీ, లేచి త్వరగా తెమలండి." అంది కావ్యసుధ మృదువుగా విడిపించుకుంటూ.

చిన్నగా నవ్వి పక్కకి చూసేడు సారంగపాణి. టీపాయ్‌మీద ఆవిర్లు విడుస్తున్న కాఫీ కప్పు, దాని పక్కనే సిగరెట్ పాకెట్, లైటర్ కనిపించగానే అతనిలో హుషారు జీవం పోసుకుంది.

పెళ్ళైన ఆ నాలుగేళ్ళలో క్రమం తప్పకుండా జరుగుతున్న దినచర్య అది. సారంగపాణికి రాత్రి ఆలస్యంగా పడుకుని, ఉదయం ఆలస్యంగా నిదరలేవడం అలవాటు.

కావ్యసుధవంటి ఇల్లాలు నూటికి ఏ ఒక్కరో ఇద్దరో వుంటారు. పెందరాళే లేచి, తలంటి పోసుకుని, తులసి పూజముగించి, పొయ్యిమీద కాఫీనీళ్ళు పడేసి, కమ్మగా సుప్రభాతం వినిపించేలా రేడియో ట్యూన్ జేస్తుంది. సారంగపాణి. కళ్ళుతెరవగానే మొదట కనిపించేది కావ్యసుధ. తరవాత తనకి ప్రియమైన కాఫీ, సిగరెట్ పాకెట్టు.

వేడివేడి కాఫీ జుర్రుకుని, కూనిరాగం తీస్తూ సిగరెట్ అంటించేడు సారంగపాణి. కావ్యసుధ ఖాళీ కప్పు అందుకుని వెళ్ళిపోయింది. దిండు కిందనించి స్పెక్టికల్ కేస్‌తీసి, కళ్ళజోడు పెట్టుకుని మంచం దిగుతున్న సారంగపాణి దృష్టి గదిగోడమీద పడగానే ఊపిరి ఆగినట్టు స్తంభించేడు. కూనిరాగం ఆగిపోయింది. రెప్పవెయ్యకుండా గోడని అలా చూస్తుండిపోయేడు.

"బాత్‌రూంలో వేణ్ణీళ్ళు పెట్టేను. త్వరగా గెడ్డం గీసుకుని స్నానం జెయ్యండి...." అంటూ గదిలోకి వచ్చిన కావ్యసుధ భర్తవున్న తీరుచూపి ఆగిపోయింది.

గోడనిచూపిస్తూ—"వాటీజ్ దిస్?" అడిగేడు సారంగపాణి గంభీరంగా.

అటు చూసిన కావ్యసుధ నోరు తెరుచుకుంది.

"ఎవ్వరు రాసేరు?" అడిగేడు సారంగపాణి.

"తెలీదండీ! నేనూ ఇప్పుడే చూస్తున్నాను!" అంది కావ్యసుధ వణికే కంఠంతో.

మంచందిగి చెప్పులు వేసుకుని అటునడిచేడు సారంగపాణి. గోడ అడుగుభాగంనించి రెండు గజాల ఎత్తున లిప్

స్టిక్‌తో రాసిన పెద్దపెద్ద అక్షరాలు అవి!

మనసులో మరోమారు చదువుకున్నాడు సారంగపాణి.

"తలుపులు మూసి పడుకోండి!"

భార్యవేపు తిరిగి-"ఇంత పెద్ద అక్షరాలు కొట్టవచ్చినట్టు రాసి ఉంటే నీకు కనిపించలా?" అడిగేడు ముఖంచిట్లిస్తూ.

"నేను గమనించలేదండీ! ఉదయం లేవగానే సవాలక్ష పనులు మరోవేపు ధ్యాస ఉండదు. అదీగాక, కిటికి పరదాలు ఇప్పుడే తొలగించేను!" అంది కావ్యసుధ బెదురుతూ.

సారంగపాణి సాలోచనగా తలూపుతూ టేబిల్ వేపు నడిచాడు. టేబిల్ దగ్గిరున్న కుషన్ ఛెయిర్, టేబిల్‌వైపు కాక మంచంవైపు తిప్పి ఉంది. ఛెయిర్‌లో కూర్చో బోతున్న సారంగపాణి దృష్టి టేబిల్ మీద ఏష్‌ట్రేమీద పడ గానే కనుబొమ్మలు ముడిపడ్డాయి.

ఏష్‌ట్రేలో ఫిల్టర్ టిప్ సిగరెట్ పీకలు! తను కాల్చేది పనామా ప్లేన్! అవి ఫిల్టర్ ఫోర్ స్క్వైర్ సిగరెట్ పీకలు ఎలా వచ్చేయి?

"సుధా! రాత్రి తలుపులు సరిగ్గా మూసేవా?" అడిగేడు భార్యని.

"వీధితలుపూ, కిటికీలూ ఎలాగూ తప్పని సరిగా మూస్తాను. ఇంట్లోని మిగతా తలుపులు మూసే అవసరం ఉండదు. ఆస్త్రీ లోనికి ఎలా వచ్చివుంటుందో నాకేమీ పాలు పోడంలేదు" అంది కావ్యసుధ అయోమయంగా.

"స్త్రీయా? వచ్చింది స్త్రీ అయుంటుందని ఎలా అనగలుగు తున్నావ్?"

"ఆడవాళ్ళేకదా లిప్‌స్టిక్ వాడేది. నాకెలాగూ ఆ అల వాటు లేదు. మనింట్లో ఇలా రాయడానికి లిప్‌స్టిక్ దొరికే

అవకాశంలేదు. సాధారణంగా ఆంగ్లోండియన్ ఆడవాళ్ళు, పెదాలకి లిప్‌స్టిక్ రాసుకుంటారు. సిగరెట్లు కాలుస్తారు. దానికేం పోయేకాలం వచ్చిందో ఇలా పరాయి ఇంట్లో దొంగ చాటుగా దూరి భార్యాభర్తలు పడుకునే గదిలోవచ్చి వెళ్ళిందంటే, అది బాగా బరితెగించిందల్లేవుంది!" అంది కావ్యసుధ ఎర్రబారిన మొహంతో.

సారంగపాణి పలకలేదు. ఏష్‌ట్రేలోని సిగరెట్ పీకలని క్షణం పరీక్షగా చూసి అన్నాడు. "నీ అనుమానం సరైంది కాదు. వచ్చింది స్త్రీఅయుంటే, ఆమెకి లిప్‌స్టిక్, సిగరెట్ల అలవాటువుంటే, ఈ పీకల చివర అంతో ఇంతో లిప్‌స్టిక్ చిహ్నాలుండేవి. దీన్నిబట్టి ఆలోచిస్తే వచ్చింది స్త్రీకాదు మగాడు.

మనం గాఢనిద్రలో ఉండగా, ఏ అర్ధరాత్రో ఇంట్లోకి ప్రవేశించి, ఈకుర్చీని మన మంచంవైపు తిప్పుకు కూర్చుని నింపాదిగా సిగరెట్ కాలుస్తూ మనల్ని చూస్తూ గడిపేడు. పోతూపోతూ వెంటతెచ్చుకున్న లిప్‌స్టిక్‌తో గోడమీద హెచ్చరికరాసి మరీ వెళ్ళేడు. ఇదేదో మాయా మర్మంలా తోస్తోంది. దేనికైనా మంచిది, ఇంట్లోని వస్తువులేవైనా పోయాయేమో ఓసారి చూద్దాంపద!" అంటూ లేచాడు సారంగపాణి.

ఇల్లంతా ఓమారు చుట్టివచ్చేరు, ఎక్కడి వస్తువు ఎలా ఎక్కడ పెట్టివుందో అలాగే వుంది.

"నాకేదో భయంగా వుందండీ!" అంది కావ్యసుధ జీర బోయిన కంఠంతో.

సారంగపాణి నవ్వి—"వెర్రి వెంగళమ్మా! చెట్టంత నేను నీపక్కనుండగా భయందేనికి? టేకిట్ ఈజీ! నేను ఆఫీసుకెళ్ళాక తలుపులు మూసుకుని జాగ్రత్తగా ఉండు."

అని ఆదరాబాదరా తయారయి, బ్రేక్‌ఫాస్ట్ ముగించి తన ఫియట్ కారెక్కి బయలుదేరాడు.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తీరిక చేసుకుని ఓ సారిఇంటికిఫోన్‌జేసి భార్య యోగక్షేమాలు కనుక్కున్నాడు. అతను పనిజేసేది పిల్లల ప్లాస్టిక్ బొమ్మలు తయారుజేసే ఒక ఫ్యాక్టరీలో. నాలుగేళ్ళ క్రితం అఫ్యాక్టరీలో మేనేజర్‌గా అపాయింట్ అయ్యేడు. కావలసినంత జీతం, కారూ, సరి పడే ఇల్లూ, అణుకువగల ఇల్లాలు. మగాడికి మరేం కావాలి?

సాయంత్రం ఆరుగంటలకి ఇల్లు చేరగానే, కావ్యసుధ మామూలుగా గుమ్మంలో నిల్చుని చిరునవ్వుతో స్వాగతం పలికింది. దంపతులిద్దరూ ఉదయం జరిగిన సంఘటనని సాధ్యమైనంతవరకూ మరిచిపోడానికి ప్రయత్నిస్తూ మామూ లుగా గడిపేరు. ఉదయం సారంగపాణి ఆఫీసుకి వెళ్ళి నప్పుడే గోడమీద అక్షరాలని నేర్పుతో తుడిచివేసింది కావ్యసుధ! కాఫీ టిఫిన్ తీసుకునేటప్పుడుగానీ, భోజనాలు చేసేటప్పుడుగానీ మాటల్లో ఆ టాపిక్ ఎవ్వరూ ఎత్తలేదు.

రాత్రిపడుకునేటప్పుడు మాత్రం—"తలుపులు సరిగ్గా మూసేవా?" అడిగేడు సారంగపాణి.

కావ్యసుధ తలూపింది.

"దేనికైనా మంచిది, ఓమారు చెక్‌జెయ్!" అన్నాడు.

కావ్యసుధ మంచం దిగి, తలుపులన్నీ ఓమారు చెక్‌జేసి వచ్చింది.

ఇద్దరూ మామూలుగా నిదరలోకి జారుకున్నారు.

2

టైంపీస్ గణగణతో రోజులాగే కళ్ళు తెరిచింది కావ్య సుధ. మోగుతున్న టైంపీస్ బటన్ వత్తి అలారం ఆఫ్

జేసి, లేచికూర్చుంది. మంగళసూత్రం కళ్ళకద్దుకుని పక్కకి చూసింది.

సారంగపాణి పసిపిల్లాడిలా దిండుని కావలించుకుని బోర్లా పడుకున్నాడు. చిన్నగా నవ్వుతూ గోడవేపు చూసిన కావ్యసుధ ఉలిక్కిపడింది.

అవే అక్షరాలు! ఎర్రని చక్కని లిప్‌స్టిక్‌తో రాసిన పెద్ద పెద్ద అక్షరాలు!!

"మీరు తలుపులు దేనికి మూసుకోరు?"

దడదడలాడే గుండెతో భర్తని గట్టిగా కుదిపింది.

సారంగపాణి తృళ్ళిపడి లేచాడు.

"అటు చూడండి!" అంది.

గోడవైపు చూసిన అతని కళ్ళు పెద్దవయ్యేయి. క్షణం రెప్పవెయ్యకుండా అటే చూస్తుండిపోయాడు. తరువాత తేరుకుని, మంచం దిగి టేబిల్‌వైపు నడిచేడు! కుర్చీ నిన్నటి లాగే మంచంవైపు తిప్పివుంది. ఏష్‌ట్రేలో ఈసారి రెండు కాదు, మూడు సిగరెట్ పీకలు!

"రాత్రి తలుపులన్నీ సరిగ్గా మూసేనన్నావ్?" అన్నాడు భార్యవైపు తిరిగి.

కోపంతో అతని మొహం జేవురించి ఉంది.

"సరిగ్గానే మూసేనండీ!" అంది కావ్యసుధ జీవంలేని కంఠంతో.

తయారయి, ఆఫీసుకి వెళ్ళేవరకూ—తప్పంతా భార్యదే అన్నట్టు కోపంతో ఆమెతో మాట్లాడలేదు సారంగపాణి.

భర్త వెళ్ళాక దిండులో తల దూర్చి వెక్కివెక్కి ఏడ్చింది కావ్యసుధ. ఒంటిగంట ప్రాంతంలో సారంగపాణి ఏమనుకున్నాడో ఏమో, ఆఫీసునించి ఫోన్‌జేసి ఉదయం తన ప్రవర్తనపట్ల క్షమాపణ చెప్పుకున్నాడు.

ఆరాత్రి భార్యతో బాటు తనూ స్వయంగా తలుపులన్నీ పరిశీలించి పడుకున్నాడు.

3

గణగణ అలారం మోతతో ఈసారి కావ్యసుధతోబాటు సారంగపాణికూడా కళ్ళు తెరిచేడు. కళ్ళు తెరవగానే అతని దృష్టి చటుక్కున గోడవైపు వెళ్ళింది.

"తలుపులు మూసుకుంటేనే—

మీరు క్షేమంగా వుండగలరు!"

అదే హెచ్చరిక!

కావ్యసుధ భర్తని అతుక్కుపోయి, వెక్కివెక్కి ఏడవ సాగింది.

ఆమె వీపు తడుతూ—"ప్లీజ్! డోంట్ టేక్ ఎక్సైట్ మెంట్, దీని అంతేమిటో ఈ రాత్రి తేల్చిపారేస్తాను!" అన్నాడు సారంగపాణి ధృఢ స్వరంతో.

ఆ రాత్రి భార్యాభర్తలిద్దరూ కునుకు తియ్యకుండా మేల్కొనివుండి ఆ ఆగంతకుడి సంగతేమిటో తేల్చి వెయ్యాలని నిశ్చయించుకున్నారు. పెద్దఫ్లాస్కునిండా స్ట్రాంగ్ కాఫి పోసి మంచం పక్క టీపాయ్‌మీద పెట్టింది కావ్యసుధ. నిదర ముంచుకు వచ్చినప్పుడల్లా నాలుగు గుటకలు కాఫీ లాగించి నిదరపారదోలవచ్చు.

"బీరువాలోంచి నా పిస్తోలు తీసివ్వు!" అన్నాడు సారంగపాణి భోజనాలయ్యేక.

గోద్రేజ్ బీరవా అరలో అట్టడుగునవున్న పిస్తోలు తీసిచ్చింది కావ్యసుధ.

గుళ్ళు సరిగ్గా ఉన్నాయో, లేవో ఓమారు విరిచి చూసేడు, ఆరుగుళ్ళు తయారుగా వున్నాయి.

పదిగంటల ప్రాంతంలో బెడ్‌రూం తలుపులు దగ్గిరగా చేరవేసి ఇద్దరూ పక్కమీద వాలేరు. పిస్తోలు దిండుకింద, అవసరం పడితే వెంటనే అందుకోటానికి అనుకూలంగా పెట్టేడు సారంగపాణి. విసుగు పుట్టకుండా ఇద్దరూ చెరో నవల అందుకున్నారు.

గోడగడియారం చేసే చప్పుడు తప్ప ఇల్లంతా నిశ్శబ్దం. కావ్యసుధ కళ్లు పుస్తకం మీదవున్నా చెవులు మాత్రం ఇంటి లోపల ఏదైనా శబ్దం వినిపిస్తుందేమోనని తయారుగా వున్నాయి.

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది.

అప్పటికే ఇద్దరూ సగానికి పైగా ఫ్లాస్కులోని కాఫీ ఖాళీ జేసేరు.

రెండున్నర ప్రాంతంలో పెద్దగా ఏదో చప్పుడు కావడంతో కావ్యసుధ గుండె గుభిల్లుమంది. సారంగపాణి మెరుపులా దిండు కిందినించి పిస్తోలు తీసి, లేచి కూర్చున్నాడు.

కావ్యసుధ ఏదో అనబోతుండగా, "ష్!" అని వారించి తలుపువైపు చూడసాగేడు.

తిరిగి నిశ్శబ్దం! సూది పడితే వినిపించే నిశ్శబ్దం!

సారంగపాణి ట్రిగ్గర్ మీద వేలు రెడీగా పెట్టుకుని, మంచం దిగి తలుపు వేపు నడిచేడు. కావ్యసుధ దడదడలాడే గుండెతో భర్తని అనుసరించింది. తలుపు దగ్గిర ఆగి మెల్లిగా ఒకరెక్క తెరిచేడు సారంగపాణి, కిర్రుమంటూ తెరుచుకుంది. క్షణం ఆగి ఇద్దరూ హాల్లో అడుగు పెట్టేరు.

"చప్పుడు ఎక్కడినించి వచ్చింది?" అడిగేడు సారంగపాణి గుసగుస స్వరంతో,

కావ్యసుధ వేలితో ఓ గది వైపు చూపించింది.

సారంగపాణి అటు నడిచేడు. సవ్వడి కానివ్వకుండా తలుపు తెరిచేడు.

అంతే! అతన్ని చూడగానే, భయంకరంగా అరుస్తూ బూడిదరంగు పిల్లి ఒకటి వెంటిలేటర్ దూకి పారిపోయింది. అది కిచన్‌రూమ్! వెంటిలేటర్ కింద గోడకి ఆనించి వంట సామగ్రి ఉంచే పెద్ద చెక్క బీరువా ఉంది. వెంటిలేటర్ గుండా ఆ బీరువా మీదికి దూకి ఎలకల కోసం అప్పుడప్పుడూ ఆ పిల్లి వస్తుంటుంది. ఆ వెంటిలేటర్ గుండా మనిషి దూరడం అసంభవం! ఇనపకమ్మీలు అడ్డం ఉన్నాయి. సారంగపాణి నిట్టూర్చేడు. కావ్యసుధ గుండె తేలికపడింది.

తమ అనవసర భయానికి ఇద్దరూ నవ్వుకుంటూ తిరిగి బెడ్‌రూం చేరేరు. రాత్రంతా జాగరణ జెయ్యాలనుకున్న వారి ప్రయత్నం అట్టేసేపు ఫలించలేదు. పగలంతే ఆఫీసులో సారంగపాణీ, ఇంటి పనితో కావ్యసుధా అలసిపోయిన ప్రాణులు.

మూడు గంటల ప్రాంతంలో తమకి తెలీకుండానే ఇద్దరూ నిదరకి దాసులైపోయేరు.

4

తెల తెల వారుతుండగా ఏదో పీడకల వచ్చి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది కావ్యసుధ. కళ్ళు తెరవగానే చటుక్కున తల తిప్పి గోడవేపు చూసి కెవ్వుమంది. ఆ గావుకేకతో సారంపాణి త్రుళ్ళిపడి లేచి కూర్చున్నాడు.

మూగదానిలా వణికే చేత్తో గోడవైపు చూపించింది కావ్యసుధ.

అటు చూసిన సారంగపాణి స్థాణువైపోయేడు.

"తలుపులు మూసుకోండి! లేదా, చావడానికి సిద్ధంకండి!" ఆ హెచ్చరికతో బాటు దానికింద ఈసారి లిప్‌స్టిక్‌తోనే స్త్రీ పురుషుల నగ్నమైన బొమ్మలు ఒకరిమీద ఒకరు పడుకున్నట్టు చిత్రించబడి, వారి శరీరాలని చీల్చుతూ ఓ పదునైన కత్తి గీయబడివుంది.

సాలోచనగా తలూపేడు సారంగపాణి. "సుధా! ఇహ లాభంలేదు. వ్యవహారం ముదిరిపోయింది. ఇహ పోలీసులే మనకు శరణ్యం!" అంటూ మంచం దిగి ఫోన్ వేపు నడిచేడు.

క్రయింబ్రాంచి హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ జేసి, కుర్చీలో చతికిలబడ్డాడు.

"ఈ రోజు ఆఫీసుకి వెళ్ళకండి ఈ పాడు కొంప వదిలి మరేదైనా ఇల్లు చూసుకుందాం. ఇహ ఒక్కక్షణం ఈ కొంపలో నేనుండలేను!" కావ్యసుధలో ధైర్యం పూర్తిగా అడుగంటింది.

సారంగపాణి పలకలేదు. సిగరెట్ అంటించి తీవ్రంగా యోచిస్తున్నాడు.

పావుగంట తరవాత, హాల్లో కాలింగ్ బెల్ మోగింది. సారంగపాణి లేచి వెళ్ళి, క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, అతని అసిస్టెంట్ సార్జంట్ డేవిడ్‌తో తిరిగివచ్చేడు.

ఆ దంపతుల ద్వారా, మొదటినించీ చివరివరకూ జరిగిన సంఘటనలన్నీ విని ఏష్‌ట్రేలోని సిగరెట్ పీకలని, గోడమీది రాతనీ పరీక్షగా - చాలా పరీక్షగా చెక్ జేసేడు ఇన్‌స్పెక్టర్.

తరవాత సారంగపాణి వేపు తిరిగి "మీ కెవ్వరైనా ఆంతరంగిక శత్రువులుగానీ, ఎవ్వరితోనైనా లావాదేవీలుగానీ ఉన్నాయా?" అడిగేడు.

సారంగపాణి పలకలేదు. కాసేపు ఆలోచించి, "లేదు!" అన్నాడు.

"ఆల్‌రైట్! జరిగిన సంఘటనలనిబట్టి చూస్తే ఇదేదో మానసిక రోగి చేస్తున్న పనిలా తోస్తోంది. విదేశాల్లో ఇలాటివి సర్వ సామాన్యం. మనదేశంలో మాత్రం అప్పుడప్పుడూ అక్కడక్కడా ఇటువంటి విచిత్ర సంఘటనలు జరుగుతుంటాయి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఒక నిశ్చయానికి వచ్చి.

"ఆ సైకోపేషెంట్‌కి మేమే దొరికేమా? మాతో వాడికి ఏమిటి శత్రుత్వం?"

ఇన్‌స్పెక్టర్ నవ్వి "1967 లో న్యూయార్క్ నగరంలోని ఓ హాస్పిటల్లో ఎనమండుగురు నర్సులని అకారణంగా హత్య జేసిన ఆ హంతకుడికి వాళ్ళమీద ఏం శత్రుత్వం ఉండింది? ఈ సైకోపేషెంట్స్‌కి ఒకరిమీద వ్యక్తిగత శత్రుత్వం ఏమీ ఉండదు. వారి మస్తిష్కం ఎప్పుడే రంగు దాలుస్తుందో ఎవ్వరూ ఊహించలేరు. మనసుకి ఏది తడితే అది మంచో చెడో ఆలోచించే ఇంగితం వారిలో ఉండదు. తక్షణం చేసి పారేస్తారు. ఈ పేషెంట్స్‌లోనూ అనేక రకాలు ఉంటారు. అందులో ఇదోరకం అనుకోవచ్చు! గత నాలుగు రోజులనించీ, అతను తలుపులు మూసుకోండి, అని దేనికి హెచ్చరిస్తున్నాడో మీరు ఊహించేరా?"

"లేదు!" అన్నాడు సారంగపాణి కుతూహలంగా.

"తనకి మిమ్మల్ని చంపాలన్న బలహీనత కలుగుతోందనీ, తనచేత ఆ ఘాతుకం జరక్కుండా తను మీ ఇంట్లోకి వచ్చే మార్గాలన్నీ మూసివెయ్యండనీ ఈ మర్డర్ వార్నింగ్స్‌లోని అంతరార్థం!"

"అతను ఏ మార్గాన ఇంట్లో ప్రవేశిస్తున్నాడో మాకు అంతుచిక్కటంలేకదా, మూసి వేసేది?" అన్నాడు సారంగపాణి ఆశ్చర్యంగా.

"అది కనుక్కోవడం మా పని!" అంటూ సార్జంట్ డేవిడ్‌ని తన వెంటరమ్మన్నట్టు సైగజేసి బైటకి నడిచేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

ఇద్దరూ ఇంటి అణువణువూ వదలకుండా పరిశీలించి వచ్చేరు.

ఇన్‌స్పెక్టర్ పెదవి విరిచి "ఆశ్చర్యంగా ఉంది! దొడ్డి కంపౌండ్ గోడ ఎత్తయినది. ఐనా, ప్రయత్నిస్తే ఆ గోడ దూకి దొడ్లోకి ప్రవేశించే అవకాశం వుంది. కాని, దొడ్లోంచి మూసి వున్న తలుపుగుండా ఇంట్లోకి వచ్చే అవకాశంలేదు. పోతే, ఇంట్లోని వెంటిలేటర్స్ అన్నిటికీ, అడ్డంగా ఇనప కమ్మీలు బిగించి వున్నాయి. మరి ఆ ఆగంతకుడు ఎలా ప్రవేశిస్తున్నాడు?

నా దృష్టితో ఆలోచిస్తే ఇంట్లోకి దూరే అవకాశం ఒక్కటే వుంది. అదీ చాలా ప్రయాసతో కూడుకున్నది. వెంటిలేటర్స్ కడ్డంగా వున్న ఇనప కమ్మీలని వంచి, లోనికి దూరి తిరిగి ఇంట్లోంచి బైటపడి కమ్మీలని యధాతథంగా సాగదియ్యడం. దీనికి ఎంతో ఓర్పూ, శారీరక బలం కావాలి.

ఆల్‌రైట్! ఈ రోజునించీ ఆ ఆగంతకుడు పట్టుబడే వరకూ ఇద్దరు మఫ్టీ కానిస్టేబుల్స్‌ని నియమిస్తాను. ఒకడు రాత్రులు మీ ఇంట్లో ఎవ్వరికీ కనిపించకుండా దాగి, గమనిస్తుంటాడు. ఒకడు ఇంటిబైట మాటువేసి వుంటాడు. మీరు నిశ్చింతగా నిదరబోవచ్చు. నేను మళ్ళీ వస్తాను!" అన్నాడు సెలవు తీసుకుంటూ.

5

ఆ రోజు మొదలు ఐదు రోజుల వరకూ ఎటువంటి సంఘటన జరగలేదు. ప్రతి రాత్రీ ఒక మఫ్టీ కానిస్టేబుల్ ఇంట్లో దాగి గమనించేవాడు. మరో కానిస్టేబుల్ బైటవుండి చీకట్లో ఇంటిచుట్టూ గస్తీ తిరిగేవాడు. ఈ ఐదు రోజులూ ఆ దంపతులిద్దరూ నిశ్చింతగా నిదరబోయేరు. ఉదయం లేచి చూస్తే గోడ తేటతెల్లగా కనిపించేది.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో సారంగపాణి ఇంటికి వచ్చేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. ఈసారి కావ్యసుధ మొహంలో విషాదానికి బదులు జీవకళ కనిపించింది.

"మీ ఏర్పాటువల్ల ఆ అనామకుడు మళ్ళీ ఈ ఛాయలకి రాలేదు. ఈ ఐదు రోజులూ మేము నిశ్చింతగా నిదర బోయాం!" అన్నాడు సారంగపాణి కృతజ్ఞతగా.

ఇన్‌స్పెక్టర్ నవ్వి "మంచిదే! బహుశా, ఈ ఏర్పాటు వల్ల తన మనసు మార్చుకునుంటాడు. ఇక ఈ రోజునించి మఫ్టీ కానిస్టేబుల్స్‌ని ఉపసంహరించుకోవాలనుకుంటున్నాను, మీరేం భయపడకండి. మామూలుగా వుండండి." అన్నాడు.

సారంగపాణి తలూపేడు.

మఫ్టీ కానిస్టేబుల్స్ ఆ రాత్రి రాలేదు. భార్యాభర్త లిద్దరూ ఆ రాత్రి 'మధురంగా' గడిపేరు. కాని, ఉదయం గోడమీద మళ్ళీ హెచ్చరిక దర్శనమిచ్చింది.

"మొదట స్త్రీ చస్తుంది!"

అనే తాటికాయంత అక్షరాలతో బాబు దానికిందే, లిప్‌స్టిక్‌తో నగ్నమైన ఒక స్త్రీ భయంకరంగా అరుస్తూ చిత్రించబడివుంది.

సారంగపాణి తక్షణం ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డికి ఫోన్ జేసేడు.

ఇన్‌స్పెక్టర్ హుటాహుటిన అక్కడికి జేరుకున్నాడు.

గోడ మీది బొమ్మనీ, మర్డర్ వార్నింగ్స్‌నీ పరిశీలించి, ఇల్లంతా ఓమారు చుట్టివచ్చి—"మిస్టర్ సారంగపాణీ! వ్యవహారం తారాస్థాయినందుకుంది. ఈ రోజు దీని అంతే మిటో తేల్చందే నేను విశ్రాంతి తీసుకోను. నా కోసం వెయిట్ జెయ్యండి. సాయంత్రంలోగా తిరిగి వస్తాను!" అంటూ బయటికి నడిచేడు.

రాత్రి ఏడుగంటల ప్రాంతంలో తిరిగివచ్చేడు ఇన్‌స్పెక్టర్.

"ఏమైనా కనుక్కున్నారా?" అడిగింది కావ్యసుధ ఆతృతగా.

ఇన్‌స్పెక్టర్ తలూపి "కనుక్కున్నాను. అతను పిచ్చి వాడే కాదు. పరమ మూర్ఖుడూ, అత్యంత తెలివి తేటలు గలవాడూ?" అన్నాడు సోఫాలో చతికిలబడుతూ.

"హమ్మయ్య, బ్రతికించేరు. కావ్యసుధ పడుతున్న భయం ఇంతా అంతా కాదు. నన్ను ఆఫీసుకి వెళ్ళనివ్వ కుండా, ఈ కొంప ఖాళీ జెయ్యమని ఒకటే పోరు పెడు తోంది. ఇంతకీ వాణ్ణి అరెస్ట్ జేశారా లేదా?" అడిగేడు సారంగపాణి.

"ఇంకా చెయ్యలేదు. పగలంతా పరిశోధనలతో తిరిగి తిరిగి బాగా అలసిపోయేను. ఓ కప్పు కాఫీ పట్రా అమ్మాయ్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కావ్యసుధతో.

"ఆరాటంలో ఆ సంగతే మరిచేను. క్షమించండి. ఇప్పుడే వస్తాను." అంటూ గబగబా వంటింట్లోకి వెళ్ళింది కావ్యసుధ.

ఇన్‌స్పెక్టర్ సిగరెట్ కోసం కాబోలు చెయ్యి పాంటు జేబులోకి పోనిచ్చేడు. తిరిగి బైటికి వచ్చిన అతని చేతిలో నల్లగా నిగనిగ మెరుస్తున్న పిస్తోలు చూడగానే సారంగ పాణి నోరు తెరిచేడు.

"లే!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సోఫాలోంచి లేస్తూ.

"ఏమిటిది?" అన్నాడు సారంగపాణి ఆశ్చర్యంగా.

"చెప్పేది నీకే! లేచి నిల్చో!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కటువుగా.

సారంగపాణి గుటకలువేస్తూ సోఫాలోంచి లేచాడు.

"చేతులు ఎత్తు."

సారంగపాణి మరబొమ్మలా చేతులు పైకెత్తేడు.

ఇన్‌స్పెక్టర్ మెరుపులా చకచక అతని జేబులు తడిమి, కోటు లోపలి జేబులోంచి చిన్న ప్లాస్టిక్ పెట్టి బైటికి తీసి తెరిచేడు.

మూడంగుళాల పొడవు, ఎర్రని చక్కని లిప్‌స్టిక్ కడ్డీలు!

ఇన్‌స్పెక్టర్ సారంగపాణిని చూస్తూ చిన్నగా నవ్వేడు. "మిస్టర్ పాణీ! నీవు వేసిన ప్లాన్ అమోఘమైనది. అద్భుత మైనది. నిన్నటివరకూ నీ నాటకాన్ని నిజమే కాబోలని భ్రమించేను. నీ మీద నాకు అనుమానం ఎప్పుడు కలిగిందో తెలుసా?

మఫ్టి కాన్‌స్టేబుల్స్‌ని మీ ఇంటినించి ఉపసంహరించు కుంటున్నానని చెప్పి నిన్న రాత్రంతా వాళ్ళని మీ ఇంటి చుట్టూ గస్తీకి నియమించేను. రాత్రి మీ ఇంట్లో మనిషి కాదు కదా, ఎలక పిల్లకూడా దూరలేదని రిపోర్ట్ ఇచ్చారు వాళ్ళు. కాని, ఉదయం నీ నించి ఫోన్ రానే వచ్చింది.

అప్పుడే చూచాయగా నా అనుమానం నీ మీదికి మళ్ళింది.

నీ బ్యాక్‌గ్రౌండ్ గురించి ఎంతో ఓర్పుతో పరిశోధించేను. నా అనుభవానికి ఆధారాలు దొరికాయి. నీవు పనిజేసే ఫ్యాక్టరీ యజమానురాలు భర్తపోయిన విధవ. భర్త విడిచి వెళ్ళిన లక్షల ఆస్తికి అధికారిణి. వయసు నలభైకి దగ్గర పడుతున్నా, నైట్‌క్లబ్బుల్లో డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ తాగి తందనాలాడే రంగేళి.

అటువంటి నీతిలేని ఆడది, ఎర్రగా బుర్రగా అందు బాటులో ఉన్న నిన్ను తన డబ్బు ఉచ్చులో బంధీ జేసింది. నీవు ధనమోహంలో పడ్డావు. కావ్యసుధని వదలించు కోవాలి. ఎలా? న్యాయబద్ధంగా విడాకులు తీసుకోవాలంటే, ఆమెమీద ఏ నేరం మోపగలవు? కావ్యసుధ యెట్టి పరిస్థితి లోనూ దానికి సమ్మతించదు. చివరికి దేవతలాటి భార్యని మట్టుబెట్టడానికి ఈ పథకం అల్లేవు.

కావ్యసుధ నిదరలో వున్న సమయం చూసి, గోడమీద లిప్‌స్టిక్‌తో మర్డర్ వార్నింగ్స్ రాసేవాడివి. అది మతి స్థిమితంలేని ఎవ్వడో అనామకుడు జేస్తున్న చర్యగా ఇటు పోలీసుల్నీ, అటు బంధుమిత్రుల్నీ ముందు మభ్యపెట్టి చివ రికి ఆమెని చంపేవాడివి. మేమెలాగూ యింటి అణువణు వునీ చెక్‌జేస్తాం గనక, లిప్‌స్టిక్ పాకెట్ ఎక్కడ మా కంటబడుతుందో అని, దాన్ని ఎప్పుడూ నీ జేబులో భద్రం జేసుకునే వాడివి.

బహూశా, ఈ రోజు నీ బండారం బద్దలు కాకుంటే, కావ్యసుధ జీవితంలో ఇది చివరి రాత్రి అయ్యుండేది. మిస్టర్ సారంగపాణీ! కావ్యసుధవంటి వ్యక్తిని భార్యగా పొందడం అంత సులభమైన పనికాదు. దానికి ఎన్నో జన్మల తపస్సు అవసరం. అమాయకమైన ఆమె మొహం చూస్తూంటే నాకు భరించలేని జాలివేస్తోంది!"

సారంగపాణి ఎండుటాకులా వణకసాగేడు. "ప్లీజ్ ఇన్‌స్పెక్టర్! ఆమెకీ రహస్యం తెలీనీకండి, నన్ను క్షమించదు. ఎన్నడూ క్షమించదు. ఆమెకి నామీదగల నమ్మకం ప్రేమ, ఆరాధన అన్నీ మట్టిపాలై పోతాయి. నా కళ్ళ పొర యిప్పుడే తొలగింది. ధనవ్యామోహంతో అంధుణ్ణైపోయేను. కావ్యసుధ రాకముందే, ఆమెకి నా మొహం కనిపించక ముందే దయచేసి నన్ను తీసికెళ్ళండి!" అన్నాడు సారంగపాణి ఓడిపోయిన శత్రువులా.

రాజారెడ్డి పలకలేదు. కాసేపు తీవ్రంగా యోచించి, చివరికి ఏమనుకున్నాడో ఏమో, చేతిలోని పిస్తోలు జేబులో వేసుకుని, సారంగపాణిని కూర్చోమన్నట్టు సైగజేసి, తనూ సోఫాలో చతికిలబడ్డాడు,

"మిస్టర్ పాణీ! కావ్యసుధ మొహం చూసి నేనీ నిశ్చయానికి వచ్చేను. తలచుకుంటే నీ మీద హత్యా ప్రయత్న నేరం మోపి, కొన్నేళ్ళవరకూ ఇనప ఊచలు లెక్కపెట్టించగలను. నీ కళ్ళు తెరుచుకున్నాయి. అదిచాలు! నా స్వంత రిస్కుమీద నిన్ను వదలిపెడుతున్నాను. ఈ రోజు మొదలు నీ వల్ల కావ్యసుధకి ఏ చిన్న మానసిక, శరీరక వ్యధ కలిగినా, నిన్ను వదలిపెట్టను. ఆమె మరణం ఎటువంటి ఏక్సిడెండ్ వల్ల జరిగినా సరే, నిన్ను ముప్పు తిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. జాగ్రత్త!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సిగరెట్ అంటిస్తూ.

సారంపాణి కళ్ళు కృతజ్ఞతతో చెమ్మగిల్లేయి.

కాలి అందెల చప్పుడు విని తలెత్తి అటు చూసేడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

కావ్యసుధ ట్రేలో కాఫీ ఫలహారాలు పట్టుకుని, నిర్మలమైన నవ్వుతో వంటింట్లోంచి వస్తూ కనిపించింది. * * *

విమాన దొంగలు!

వెంకట్రామ్

విమానము వేగంగా ముందుకు దూసుకు పోతూంది. ప్రయాణీకులు ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. ఎయిర్ హోస్టెస్ నవ్వుతూ అందరికి కావలసినవి అందిస్తుంది.

కిటికీలోంచి బయటికి చూశాను. మేఘాలు వేగంగా వెనక్కి దాటిపోతున్నాయి. ఉదయము పదిగంటలవేళ కాబోలు కొంచెము ఎండ యెక్కువే పడుతుంది మేఘాల పైన.

ఇది ఇంటర్నేషనల్ ఫ్లైట్ కావడము మూలాన చాలా ఎత్తుగా వెళ్లుతూంది. గ్రామాలు చిన్నగా, తెల్లగా కన్పిస్తున్నాయి. పెద్ద పెద్ద టౌన్‌లు రంగుల మయంగా కన్పిస్తున్నాయి.

నాకు చాలా ఆనందంగా వుంది. ఇంకొంచెము సేపట్లో నేను మళ్ళీ నా జన్మభూమిని చూడబోతున్నాను. ఎందుకో మనస్సు ఆనందంతో ఉరకలు వేస్తుంది.

"ఏమైనా కావాలా?" ఎయిర్‌హోస్టెస్ అడిగింది నవ్వుతూ.

"ఒక గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ డబ్బా!" చెప్పాను నేనూ నవ్వుతూ.

సిగరెట్ వెలిగించాను.

సిగరెట్ పొగను రింగులు రింగులుగా వదులుతున్నాను.

విమానం భారత భాగంలోకి ప్రవేశించింది.

విమానంలోని ప్రయాణీకుల్లో ఒకడు లేచి నిలబడ్డాడు.

అజానుబాహుడు. సుమారు ఆరు అడుగుల ఎత్తు. ఫుల్ సూట్ వేసుకున్నాడు. కళ్ళకు గాగుల్స్. షూస్ వేసుకున్నాడు. దాదాపు ఏభై సంవత్సరాలు వుండొచ్చు. అక్కడక్కడ వెంట్రుకలు తెల్లగా వున్నాయి.

జేబులోనికి చేయి పోనిచ్చాడు. బహుశా సిగరెట్ ప్యాకెట్ తీయడానికేమో! అనుకున్నాను.

జేబులోని చేయి ఒక్క నిమిషము తర్వాత బయటికి వచ్చింది.

నేను పొరబడ్డాను.

ఇప్పుడతని చేతిలో నిప్పులు క్రక్కుతున్న రివాల్వర్ ఉంది.

ఒక్కసారిగా అందరితోపాటు నేను చూచి అదిరి పడ్డాను.

"ఎవ్వరూ అరవద్దు! అల్లరి చేశారో మీ ప్రాణాలు మీకు దక్కవు!" రివాల్వర్ అందరివైపు త్రిప్పుతూ హెచ్చరించాడు.

బూట్లను మూడుసార్లు టక టక లాడించాడు,

ఇంకో ముగ్గురు పిస్తోళ్ళతో లేచి నిలబడ్డారు. మిగతా

ముగ్గురు కూడా ఫుల్‌సూట్లు, గాగుల్స్, షూస్ వేసుకొని యున్నారు.

ప్రయాణీకుల్లో ఒకతను విసురుగా లేచాడు, ఎదురు తిరుగుతూ.

ఒక్కసారి నాలుగు పిస్తోళ్లు నిర్దాక్షిణ్యంగా మ్రోగాయి.

అంతే! అతను రక్తపు మడుగులో కొట్టుకుపోసాగాడు. మరో నిమిషంలో అతని ప్రాణాలు ఎగిరిపోయాయి.

అందరు భయపడుతూ వారివైపు చూడసాగారు. కొందరు భయంతో ఏడుస్తున్నారు. వారిని చూపి మరి కొందరు చేతులెత్తి పరమాత్ముడిని మ్రొక్కుతున్నారు.

వారిలో ఇద్దరు పైలట్ గదిలోకి వెళ్ళిపోయారు.

నాకు కొంచెము కొంచెముగా అర్థము కాసాగింది.

అంటే!

ఇప్పుడే విమానము హైజాకింగ్ చేయబడుతుంది. ఎదురుతిరిగి నతడిని ఘోరంగా కాల్చివేశారు. ఇప్పుడు పైలట్ కాబిన్‌లోకి వెళ్ళారు. విమానాన్ని దారి మళ్ళిస్తున్నారన్నమాట.

నేను చుట్టూ చూశాను. ఎవరి ముఖాల్లోను కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. మమ్మల్ని నిర్దాక్షిణ్యంగా చంపివేస్తారు. ఏం చేసేదీ? ఎదురు తిరిగితే తక్షణం ప్రాణాలు విడువవలసిందే!

విమానము వేగము తగ్గసాగింది. క్రిందికి చూశాను బెదిరే కళ్ళతో. అంతా అడవి. ఆ అడవి మధ్య పెద్ద గ్రౌండ్ తయారు చేసినట్టుంది. ముందే ఏర్పాటు చేసుకున్న గ్రౌండ్‌లో దింపుతున్నారన్నమాట.

విమానము క్రిందికి దిగుతోంది.

నాలో రానురాను భయము పెరుగసాగింది.

విమానము క్రిందికి దిగింది. గ్రౌండ్‌లో కొంచెము దూరము వెళ్ళి ఆగిపోయింది. క్రింద విమానము చుట్టూ యమభటుల్లా కొందరు నిలబడి వున్నారు. అందరి చేతుల్లో తుపాకులున్నాయి.

"ఊఁ. దిగండి" కసిరాడు హైజాకర్స్‌లో ఒకడు.

ప్రయాణీకులు బిక్కు బిక్కు మంటూ ఒక్కొక్కరే దిగసాగారు ఆనించిన లాడర్ పైనుండి.

నేను కూడా డోర్ దగ్గరకు వచ్చాను.

దిగిన ప్రయాణీకుల్ని వరుసగా నిలబెట్టుతున్నారు.

నేనూ దిగి వరుసలో నిలబడ్డాను.

మిగిలిన అందరూ దిగివచ్చి వరుసలో నిలబడ్డారు.

కొందరు హైజాకర్స్ విమానములో నుండి సామానును దింపుతున్నారు. సామానును గుట్టగా ఒక ప్రక్కన పడేస్తున్నారు.

చుట్టూ పరికించి చూశాను. వాళ్ళు మొత్తం పన్నెండు మంది వున్నారు.

ఏమాత్రము కదలినా కాల్చేలా వున్నారు.

వీళ్ళు మమ్మల్ని ఏం చేస్తారో నాకు అర్థము కాలేదు. కొందరు మాత్రము సామాన్లన్నీ వెతుకుతున్నారు. అంటే, అందులోని ధనాన్ని వెతుకుతున్నారన్నమాట!

మరి కొందరు మా దగ్గరకు వచ్చారు. అందరి జేబుల్లో ఉన్న డబ్బును, వస్తువులను, ఆయుధాలను తీసుకొసాగారు. ఒకడు నా దగ్గరకు వచ్చి నా జేబును చెక్ చేశాడు. ఏమీ దొరకలేదు. కర్చీఫ్, గాగుల్స్, నా డైరీ తప్ప. చేతికున్న రిస్టువాచీ పటాల్‌మని తెంపుకున్నాడు. బిక్కమొగముతో చూస్తున్నాను ఏమి చేసేదిలేక.

ఒకడు వైర్‌లెస్ మెసెజ్‌లో ఏదో చెప్తున్నాడు.

నాకు మాత్రం "ఎస్....ఇవెనింగ్ ఫోర్ వో క్లాక్...." అని వినపడ్డది. అంటే సాయంత్రము నాలుగు గంటలకు హెలికాప్టరు వస్తుందన్నమాట యీ దొంగలను తీసుకపోవ డానికి.

ఇద్దరు విమానంలో ఉన్నారు. మరో ఇద్దరు సామానులు అందుకుంటున్నారు. నలుగురు తీసిన సామానులను పరీ క్షిస్తున్నారు. ఇంకో ఇద్దరు ఏదో చేస్తున్నారు.

నా వెనుక పెద్ద పొదవుంది.

నేను నెమ్మదిగా వెనక్కి మళ్ళాను. పిల్లిలా అడుగులు వేశాను. ఒక పొద మాటుకు వెళ్ళి చూశాను. నన్నెవ్వరు గమనించినట్టులేదు. అదృష్టమే అనుకున్నాను.

కొద్ది దూరం అలాగే నడిచి, చిన్నగా పరుగెత్త నారం భించాను. ముళ్ళ పొదలు. పరుగెత్తుతుంటె చెట్లు, పొదలు వెనక్కి వెళుతున్నట్టనిపిస్తున్నాయి నాకు. ఎటు చూచినా ఏమి కనిపిస్తుందోనని భయము.

కాలి సత్తువకొద్ది పరుగెత్తుతున్నాను. అలా ఎంతసేపు పరుగెత్తానో! అలసట, నీరసం ఒక్కుమ్మడిగా నామీద దూకాయి. బాధతో అటు, యిటూ చూశాను. ఆ అడవికి అంతం కనిపించటంలేదు.

ఎటు వెళ్ళాలి? ఎటు వెళ్ళితే ప్రాణాలు దక్కించుకో గలను? ఇంకా ఎన్నిమైళ్ళు వెళితే అడవి దాటుతాను?

అంతులేని ప్రశ్నలతో మెదడు వేడెక్కింది.

కొంచెముసేపు సేద దీర్చుకొని తిరిగి పరుగెత్తసాగాను. ఇలా పరుగెత్తుతునే యున్నాను.

ఆ అడవిలో ఎక్కడో 'కెవ్వు'న అరచినట్టు విన్పిం

చింది నాకు. నా కాళ్లు టక్కున ఆగిపోయాయి.

మళ్ళీ కెవ్వున గావుకేక.

ఉలిక్కిపడ్డాను. కుడిప్రక్కగానున్న ఓ పొదలోనుండి ఆ కేక వినిపించింది.

ఆ పొదమాటుకు వెళ్ళి కేక వినిపించిన దిక్కుగా నక్కి నక్కి చూశాను.

భీకరి దృశ్యం.

ఓ కోయజాతివాడు భీకరంగా కొండ చిలువతో పోరాడుతున్నాడు.

ధైర్యము చేశాను.

ప్రక్కనున్న పెద్ద రాయిని బలంకొద్ది గురిచూసి కొండ చిలువమీదికి విసిరాను. గురి తప్పలేదు.

మెలికలు తిరుగుతూ పడిపోయింది కొండచిలువ.

కోయ జాతివాడు ఆశ్చర్యంతో చుట్టూ పరికించి చూశాడు.

నేను కన్పించానేమో నా దిక్కుగా ఒక్క పరుగున పరుగెత్తుకొస్తున్నాడు.

భయమేసింది నాకు. కోయజాతి వారు మామూలు మనుష్యులు కనిపిస్తే చంపుతారట.

నన్ను చంపుతాడేమో అనుకున్నాను. కాని—

నా దగ్గఱకు వచ్చి కృతజ్ఞత భావంతో చూస్తూ బయటికి రమ్మని సైగచేశాడు.

పొదలో నుండి బయటకు వచ్చాను.

నన్ను ఎత్తుకొని సంతోషముతో గిరగిరా త్రిప్పసాగాడు. దింపమన్నాను. దింపాడు.

తమ గూడెం రమ్మని ఆహ్వానించాడు ఆ కోయజాతి వాడు.

"సరేపద," అన్నాను, ఆ అడవిలో ఇక ఎటు వెళ్లాలో తెలియక.

ఇద్దరమూ బయలుదేరాము.

"నీ పేరేమిటి" అడిగాను.

"భీమే" చెప్పాడు.

"ఇక్కడెందుకొచ్చావు?''

''యేటకని ఒత్తె ఆ పాము నన్ను పట్టుకొని మింగుతుంటె, మీరొచ్చి రచ్చిత్తిరి." కృతజ్ఞతతో అన్నాడు వాడు.

మేమిరువురము అరగంటసేపు నడిచిన తర్వాత వాళ్ళ గూడెం వచ్చేసింది.

గూడెం పెద్దకు భీమే ఏదో చెప్పాడు.

అతడిని రక్షించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు కోయదొర. తేనె, పళ్ళు ఇంకా ఏవేవో వద్దంటున్నా నాకు తినిపించాడు. నాకు ఇప్పుడు తృప్తిగా వుంది. కాని విమానంలోని ప్రయాణీకులు ఏమైపోతారోనని నా మనస్సును కలహించి వేస్తూ వుంది. పరిస్థితి అంతా కోయదొరకు విన్నవించాను.

"మా ప్రయాణీకులను ఎలాగైనా రక్షించాలి,"అన్నాను చివరకు.

"ఆ దొంగలు ఇంకా అక్కడే వున్నారా?"

"వున్నారు."

కోయదొర ముఖము గంభీరంగా మారింది.

"ఎంతమంది వున్నారు?"

"పన్నెండుమంది. విమానంలోని వందమంది ప్రయాణీకులను నిర్దాక్షిణ్యంగా దోచుకున్నారు.'' చెప్పాను.

కోయదొర చప్పట్లు చరిచాడు.

ఒక కోయవాడు పరుగెత్తుకొచ్చి, వంగి నమస్కరించి, "ఏం, దొరా?" అన్నాడు.

"మన సింగన్న దొరను, రంగన్నదొరను, యల్లన్న దొరను అంతా పదిమందిని రమ్మను," ఆజ్ఞాపించాడు కోయ దొర.

"వాళ్ళు తుపాకులు, రివాల్వర్లతో వున్నారు."

అర్థమయ్యేటట్టు చెప్పాను.

"సింతిల్లకుదొరా! మీ పాణాలకు మా ప్రాణాలడ్డు. వాళ్ళ నెలాగయిన రక్షించడము మా పూచి," ధైర్యము చెప్పాడు కోయదొర.

నాక్కూడ కొంచెము ధైర్యము రాసాగింది. కోయవాళ్లు విల్లంబులు ఎక్కుపెట్టడములో, కత్తులు ఈటెలు విసరడ ములో నిపుణులు.

కొంతసేపటికి పదిమంది కోయవాళ్లు తమతమ ఆయుధా లతో మేమున్న చోటికి వచ్చారు.

"ఎళ్దాం పదండి.'' అంటూ నా వైపు చూశాడు కోయ దొర. నేను లేచి నిలబడ్డాను.

ఇంతకు ముందున్న అలసట నాలో లేదు. ఇప్పుడు నేను చాలా హుషారుగా వున్నాను. బహుశా నేను తిన్న తేనే, పళ్ళ ప్రభావమేమో!

వారికి దారి చూపించసాగాను. చెట్లల్లో, పుట్టల్లో హడా వుడిగా పరుగెత్తుకొచ్చినందుకు నాకు చాలా దూరమని పించలేదు. కాని, ఇప్పుడూహించుకుంటె చాలా దూరమని పిస్తుంది.

ఎక్కడో సింహ గర్జన వినిపించింది.

ఉలిక్కిపడి చూశాను. దూరంగా ఏదో సింహము వస్తుంది. అది మమ్మల్ని చూసి మాకేసి దూసుకురాసాగింది.

కోయజాతి వారంతా సంతోషంగా పొదలమాటుకు పరుగెత్తారు. నేను కూడా వారిని అనుసరించాను.

సింహము దగ్గరకు వచ్చింది.

అందరి చేతుల్లోని ఈటెలు ఒకేసారి సింహముపైకి దూసుకు పోయాయి. అడవి దద్దరిల్లేలా ఘర్జించింది సింహము. ఈటెల పోటుకు ఆగలేక క్రిందిపడి వెంటనే మరణించింది.

అందరు కలిసి దానిని దగ్గరున్న పొదలోకి లాగారు.

తిరిగి అందరము బయలుదేరాము.

నాకిప్పుడు పూర్తిగా ధైర్యమొచ్చేసింది. కోయవాళ్లు ఈటెలను సరిగ్గా విసురుతారనేది ఋజువైంది. హైజాకర్లను చిత్తుగా ఓడించగలరు.

మరో అరగంటలో విమానము దిగిన ప్రదేశము దగ్గరికి వచ్చాము.

నేను ఒక ఎత్తయిన చెట్టు ఎక్కాను. విమానాన్ని పరీక్షగా చూశాను. విమానానికి కొంచెము దూరంగా నీడలో నిల్చోబెట్టారు ప్రయాణీకుల్ని. ప్రయాణీకులకు కాపలాగా నలుగురు దొంగలు అటుప్రక్క, ఇటుప్రక్కగా నిలబడ్డారు. మిగతావారు అక్కడొకరు, అక్కడొకరు కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆకాశములోకి చూశాను. టైము మూడవుతుందొచ్చు. ఎండ తీవ్రంగానే వుంది.

చెట్టు దిగాను.

వాళ్లెలా నిలబడ్డారో అందరికి చెప్పాను.

మెల్లిగా బయల్దేరాము అందరము. ఇప్పుడు దొంగలు అందరు మాకు స్పష్టంగా కన్పిస్తున్నారు.

వెంటనే కోయవాళ్ళు పొదలచాటు నుండి విల్లంబులు ఎక్కుపెట్టి దొంగలను నేలకూల్చ సాగారు. ఈ హటాత్సంఘటనకు దొంగలు హడలెత్తి పోయారు, వాళ్ళు తుపాకులు పేల్చారుగాని, అవి ఎవరికీ తగలలేదు.

అప్పటికే చాలా మంది దొంగలు నేలకూలారు.

నల్గురు దొంగలు మిగిలారు.

వాళ్ళు పిచ్చిగా వెనక్కి మళ్ళి పరుగెత్తసాగారు. వారు కూడా ఎక్కువ దూరం వెళ్ళకుండానే కోయవాళ్ళ బాణాలకు ఆహుతై పోయారు.

ఆనందంగా పొదచాటునుండి బయటకు పరుగెత్తాను నేను.

ప్రయాణీకులందరు సంతోషముతో గాఢంగా ఆలింగనము చేసుకున్నారు నన్ను.

ఎవరి సామానులు వారు తీసుకున్నాము.

మరో అరగంటలో, కోయవాళ్ళ దగ్గర వీడ్కోలు తీసుకొని, మా విమానం తన గమ్యస్థానానికి బయలు దేరింది.

***

"ఒరేయ్, సుబ్బారావూ! రేపు నువ్వెలాగయినా మా యింటికి రావాలి."

"ఏం పని?"

"దొంగల్ని పట్టుకోవడంలో ట్రైనింగయిన కుక్కను కొన్నాను. దాన్ని టెస్ట్ చెయ్యడానికి."

—ఆడారి వెంకటరమణ, యలమంచిలి

టెలిఫోన్ టెక్నిక్

శ్యాంబాబు

రీజనల్ డైరెక్టర్ ఆఫ్ ఇంటిలిజెన్స్ విక్రాంత్ నిముషం పాటు నావైపు దీర్ఘంగా చూస్తూ వుండిపోయారు. నేను నిశ్శబ్దంగా ఆయన ముఖంవైపు చూస్తూ వుండిపోయాను.

"వారం రోజుల క్రితం పింకియా అనే చైనీస్ గూఢచారి స్వచ్ఛందంగా మనకి లొంగిపోయాడు" అన్నారు విక్రాంత్ చివరికి.

నేను మౌనంగా తల వూపాను.

"ఈ వారం రోజులూ మన కౌంటర్ ఇంటిలిజెన్స్ వాళ్ళు, డీబ్రీఫింగ్ స్పెషలిస్టులూ పింకియా నుండి మన దేశానికి ఉపయోగపడే అనేక రహస్యాలు రాబట్టారు. ఇందులో ముఖ్యమయినది. మన సెక్యూరిటీ సిస్టమ్‌కు సవాలులాంటి ఓ విషయం బయటపడింది.

పింకియా వృత్తి రీత్యా 'డిసిఫరింగ్' ఎక్స్‌పర్టు. పేరుకు అతను డెంటిస్టుగా ఢెల్లీలో ప్రాక్టీసు చేస్తున్నా, రకరకాల

కోడ్‌లలో వున్న రహస్య పత్రాలను విడగొట్టి తర్జుమా చెయ్యడం, మామూలు పత్రాలను కోడ్‌లో వ్రాయడం అతని పని. అతనికి తెలిపిన సమాచారాన్ని బట్టి, మన రక్షణ, విదేశ వ్యవహారాల శాఖలకు చెందిన, రహస్య కోడ్‌లో వున్న అనేక పత్రాలు ఇటీవల చైనీస్ గూఢ చార్లకు విరివిగా అందుతున్నాయి. శాంపిల్‌గా అతను మనకు లొంగిపోయే ముందురోజు తన వద్దకు 'డీసిఫరింగ్'కు వచ్చిన కొన్ని పత్రాలు చూపించాడు. అవి మన రక్షణ శాఖకు సంబంధించిన రహస్య పత్రాలు" విక్రాంత్ ఒక్క-క్షణం ఆగి సిగరెట్ వెలిగించారు.

"అంటే మన రక్షణ శాఖలోనూ, విదేశాంగ శాఖ లోనూ ఎక్కడో 'లీక్' ఉందన్నమాట" అన్నాను.

'లీక్' అనే మాటకు మా పదజాలంలో శత్రుపక్షానికి చెందిన మనిషి అని అర్థం.

"ఇక్కడో విషయం చెప్పాలి నీకు. రక్షణశాఖ, విదేశాంగ శాఖలకు ప్రతిరోజూ అనేకవేల సంఖ్యలో రక రకాల పత్రాలు వస్తోంటాయి. వీటిని ఆ యా శాఖలో యాధాతథంగా దాచిపెట్టడం అసంభవం. అలా అని వాటిని నాశనం చెయ్యడానికీ వీలులేదు. అంచేత వాటిని దాచడానికో మార్గం కనిపెట్టారు.

నేషనల్ డాటా ప్రాసిసెంగ్ అండ్ కంప్యూటింగ్ సెంటరు పేరు నువ్వు వినే వుంటావు. మంత్రివర్గ కార్యాలయాల్లో వివిధ పత్రాలతో పని అయిపోగానే ఆ పత్రాలను ఓ ప్రత్యేక కంప్యూటర్ కోడ్‌లో తిరగరాసి ఈ సెంటర్‌కు పంపుతారు. ఈ యన్. డి. పి. సి. సెంటర్లో ఆ కోడ్ పత్రాల నన్నిటినీ ప్రాసెస్‌చేసి, కంప్యూటర్లకు ఫీడ్ చేస్తారు.

ఈ పత్రాలలో విషయాలన్నీ కంప్యూటర్లలోకి ఎక్కించిన తరువాత ఆ పత్రాలను కూడా ధ్వంసం చేసేస్తారు.

తర్వాత ఆ పత్రాలలో వున్న సమాచారం ఏదన్నా కావలసి వస్తే కంప్యూటర్ని అడిగి డైరెక్టుగా తెలుసుకోవచ్చు. రోజుల తరబడి ఫైల్సు వెతుకుతూ, కావలసిన సమాచారం కోసం సమయం వృధా చెయ్యనవసరంలేదు.

సింకియా దగ్గర దొరికిన పత్రాలు ఆ కంప్యూటర్ కోడ్‌లో వున్నాయి. అంటే కంప్యూటర్ సెంటర్ నుండే ఎవరో ఈపత్రాలను బయటికిఅందజేస్తూ వుండాలి" అన్నారు విక్రాంత్ సిగరెట్ నుసిని ఆష్ట్రేలో దులుపుతూ.

" 'లీక్' కంప్యూటర్ సెంటర్లోనే వున్నట్లు నిశ్చయంగా ఎలా చెప్పగలరు? అన్ని పత్రికలనూ కంప్యూటర్ కోడ్ లోకి తర్జుమా చేసేది ఆయా మంత్రిత్వ శాఖల్లోనే కదా?" అడిగాను.

విక్రాంత్ నవ్వి "అన్ని పత్రాలనూ కంప్యూటర్ కోడ్ లోకి తర్జుమా చేసేది ఆ యా శాఖల్లోనే....అయితే అన్ని పత్రాలనూ రహస్య కోడ్‌లోకి తర్జుమా చెయ్యాలంటే ఎంతమంది 'కోడింగ్' ఎక్స్‌పర్ట్స్ కావాలో ఆలోచించు.... అందుచేత పని సులభతరం కావడానికి, సెక్యూరిటీ లీక్ లేకుండా వుండడానికీ ఓ ఫొటోగ్రాఫిక్ కంప్యూటర్‌ని వుపయోగిస్తారు. అంటే ఈ కంప్యూటర్‌కు పత్రాలను చూపించగానే, అది పత్రంలో విషయాన్ని కోడ్‌లో ప్రింట్ చేసి ఇచ్చేస్తుంది.

ఈ కంప్యూటర్ని ఒకే వ్యక్తి ఆపరేట్ చేస్తాడు. అతనికి టాప్ సెక్యూరిటీ క్లియరెన్స్ వుంటుందనే విషయం నీకు తెలిసే వుంటుంది. పైగా కోడ్‌లో తయారైన పత్రా

లను వెంటనే కంప్యూటర్ సెంటర్‌కు డిస్పాచ్ చెయ్యడం జరుగుతుంది. అంచేత ఈ 'లీక్' కంప్యూటర్ సెంటర్లోనే వుండి వుండాలని మనవాళ్ళు తేల్చారు—" అన్నారు విక్రాంత్.

"కాని మరొక్క సందేహం."

"ఏమిటది?"

"కంప్యూటర్ సెంటర్లోనే లీక్ వున్నదనుకొంటే, ఆ వ్యక్తి కోడెడ్ పత్రాలే ఎందుకు బయటికి అందిస్తున్నాడు. కంప్యూటర్ని అడిగి తనకు కావలసిన సమాచారం తెలుసు కొని అదే అందజేయవచ్చుగా?"

"మామూలు పరిస్థితుల్లో అయితే అలా సాధ్యపడేదేమో! కాని ఆ కంప్యూటర్స్‌నుండి ఇన్‌ఫర్‌మేషన్ తీసుకోవడానికి ఉపయోగించే సిష్టం లాక్ చేసి వుంటుంది. ఆ లాక్ యన్. డి. పి. పి. సెంటర్ డైరెక్టర్ దగ్గర మాత్రమే ఉంటుంది. ఏదయినా డిపార్ట్‌మెంట్ సమాచారాన్ని కోరినప్పుడు డైరెక్టరే స్వయంగా ఆ కంప్యూటర్ రిప్లై సిష్టం లాక్ తెరచి సమాచారం రాబట్టుతాడు."

"ఐసీ! అంటె ఆ కంప్యూటర్ల దగ్గర పనిచేసే ఆపరేటర్లకు, కంప్యూటర్లలోకి సమాచారం పంపడమేగాని, తీసుకోవడానికి వీలులేదన్నమాట" అన్నాను.

"అవును. ఇకపోతే కంప్యూటర్ సెంటర్లో పని చేసే ఆపరేటర్లు మొత్తం ఎనిమిదిమంది వున్నారు. ఈ ఎనిమిది మందిలో ఎవరో ఒకరు డిపార్టమెంట్‌లనుండి వచ్చిన కోడెడ్ పత్రాలను కంప్యూటర్‌కు ఫీడ్ చేస్తారు. అంటే వాళ్ళందరికీ ఆ పత్రాలు చూసే అవకాశం వుందన్నమాట. అందులో ఒకరు చైనీస్ గూఢచారులకు ఈ పత్రాలు అంద

జేస్తూ వుండి వుండాలి. ఆ వ్యక్తిని ఎవరో మనం పట్టుకోవాలి...." అన్నారు విక్రాంత్ నా కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఆ వ్యక్తిని పట్టుకొన్నంత మాత్రాన చైనీస్ గూఢచారు లెవరో దొరుకుతారని గ్యారెంటీ ఏమిటి? సింకియాకి వాళ్ళ నాయకు డెవరో తెలియదా? అతనికా పత్రాలు ఎవరు అందజేసేవాళ్ళు?" నా ఆలోచనలను, అనుమానాలను ఒక్కొక్కటే బయటపెట్టాను.

"లేదు! సింకియాకూ తన నాయకు డెవరో తెలియదు. ఎక్కడుంటాడో కూడా తెలియదు. ఎప్పుడూ ఎవరో మెసెంజెర్‌ద్వారా అతనికి ఇన్‌స్ట్రక్షన్స్ అందేవి. ఇకపోతే కంప్యూటర్ ఆపరేటర్ల'లో దేశద్రోహి ఎవరో బంధించినంత మాత్రాన మనకు చైనీస్ గూఢచారి దొరకడు. కాని ఆ దేశద్రోహి ఎవరో తెలుసుకొని అతన్ని రహస్యంగా కనిపెట్టడం వలన ఆ చైనీస్ గూఢచారిని పట్టుకోవాలని నా ఆలోచన" అన్నారు విక్రాంత్.

2

నేషనల్ డేటాప్రొసెసింగ్ అండ్ కంప్యూటింగ్ సెంటర్ డైరక్టరు మహదేవన్ నాకు అన్నివిధాలా సహకరించాడు.

కంప్యూటర్ సెంటర్ కర్జన్ రోడ్‌లో విశాలమైన ఆవరణంలో కట్టబడిన రెండంతస్తుల భవంతి. కంప్యూటర్లు చాలా సున్నితమైన యంత్రాలు కనుక, అవి చక్కగా పని చెయ్యాలంటే చల్లటి వాతావరణంకావాలి. అంచేత కంప్యూటర్ సెంటర్ భవంతి మొత్తం ఎయిర్ కండిషన్డ్ చేయబడ్డది.

సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ కూడా చాలా జాగ్రత్తగానూ, మెలకువతోనూ చేయబడ్డాయి. ఎంతో తెలివిగా చేస్తే తప్ప అక్కడినుండి పత్రాలు బయిటికి చేరవేయడం అంత సులభమైన పనికాదు.

ఎంప్లాయీస్ లోపలకు వెళ్ళబోయేముందు, లోపల నుండి బయటికి వచ్చేటప్పుడూ పూర్తిగా చెక్ చేస్తారు. ఎలాంటి కాగితాలు లోపలకు తీసుకు వెళ్ళడానికి కాని, బయటకు తేవడానికిగాని వీలులేదు.

ఇకపోతే కంప్యూటర్లన్నీ భవనం మధ్యగావున్న ఓ పెద్ద హాలులో వున్నాయి.

ఆ హాలు లోపలకు వెళ్ళడానికి డైరెక్టరుకు, అసిస్టెంట్ డైరెక్టరుకు, ఇంజనీర్‌కు, ఆపరేటర్స్‌కు తప్ప ఎవ్వరికీ అధికారంలేదు. ఇంజనీర్ ఎప్పుడన్నా రిపేర్ వచ్చినప్పుడు తప్ప ఆ హాలులోకి వెళ్ళడు. అలాగే అసిస్టెంట్ డైరెక్టర్ కూడా. డైరెక్టర్ మహదేవన్ మాత్రం రోజు రెండు పూటలా విజిట్ చేస్తారు. ఎనిమిదిమంది ఆపరేటర్లు మాత్రం ఉదయం పదినుండి, సాయంత్రం నాలుగువరకూ లోపలే వుంటారు.

ఈ ఎనిమిదిమందిలో ఎవరో ఒక దేశద్రోహి వున్నారన్నమాట నిజమనిపించింది. కాని ఎలా? ఇంత పకడ్బందీగా వున్న ప్రదేశంలోనుండి ఆ పత్రాలను రహస్యంగా బయటికి తీసుకుపోయి మళ్ళీ లోపలికి ఎలా తేగలుగుతున్నారు?

కంప్యూటర్ సెంటర్‌ని క్షుణ్ణంగా పరిశీలించాక నాకు చటుక్కున ఓ విషయం స్ఫురించింది.

కంప్యూటర్లు వుండే హాలుకు ప్రక్కగా మరో చిన్న గది

వున్నది. దానిలో ఓ నాలుగు టేబిల్స్, వాటిచుట్టూ చెయిర్స్ ఓ మూలగా టెలిఫోన్ దానికి అనుకొని టాయిలెట్ రూమ్స్ వున్నాయి.

లంచ్ అవర్లో కంప్యూటర్ ఆపరేటర్లు బయటికి వెళ్ళ అవసరం లేకుండా, ఆ గదిలోనే లంచ్ తీసుకొంటారు.

అయితే ఆ గదిలో నన్ను ఆకర్షించినది మూలనున్న టెలిఫోన్. అది సెంటర్ ఇంటర్నల్ స్విచ్ బోర్డుకు కనెక్ట్ చేయబడి వుంటుంది. అంటే ఆ గదిలోనుండి ఎవరన్నా ఫోన్ చెయ్యాలంటే ముందు ఆపరేటర్‌కు చెప్పి నెంబరుకు కనెక్షన్ తీసుకోవాలి. అలాగే బయటివాళ్ళెవరయినా మాట్లాడాలన్నా ఈ ఫోన్‌కు కనెక్షన్ యివ్వాలి.

అయినా పత్రాలలో సమాచారం బయటికి తీసుకెళ్ళకుండా డైరెక్టుగా ఫోన్‌లోనుండి అవతలి వ్యక్తికి చెప్పే అవకాశం వుంది.

"ఇటీజ్ ఇంపాజిబుల్!"—అన్నాడు డైరెక్టర్ మహాదేవన్ నా అనుమానం వినగానే.

"వై నాట్?"—అన్నాను సవాలుచేస్తున్నట్లు.

సమాధానంగా చిరునవ్వొకటి నవ్వాడు. "ఎందుకంటే రహస్య పత్రాలలోని విషయాలు ఆ ఫోన్‌ద్వారా బయటికి చెప్పడం చాలా రిస్క్‌తోకూడిన పని. స్విచ్‌బోర్డుఆపరేటర్ వినే అవకాశం వుంది. కోడ్‌లోవున్న మెసేజ్‌లను అదే పనిగా ఫోన్‌లో చదువుతూ పోతుంటే ఇట్టే కనిపెట్టవచ్చు. ఇది చూడండి—" అని ఓ కాగితం నాకు చూపించాడు.

అరఠావుకన్నా కాస్త తక్కువ పొడవుగావున్న కాగితం అది. ఎ బి సి డిలు ఇష్టంవచ్చినట్లు దానిమీద ప్రింట్‌చేసి వున్నాయి. కూడబలుక్కొని చదవడానికి వీలయిన మాట

గాని, పదంగాని అందులో లేవు. నేను ప్రశార్థకంగా మహాదేవన్ వైపు చూశాను.

"కంప్యూటర్ కోడ్‌లోవున్న పత్రమిది. ఆ పత్రాన్ని తీసుకొని ఫోన్‌లో చదువుతున్నా మనుకోండి. అప్పుడు మధ్యలోగాని ఆపరేటర్ వినడం తటస్థించిందనుకోండి. అప్పుడు వెంటనే అర్థం అవదా?"—

నేను రెండు నిముషాలపాటు దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాను. ఎందుకో నా సిక్స్‌త్ సెన్స్ నేను సరియైన పంథాలోనే వున్నట్లు చెపుతోంది.

"ఓసారి కంప్యూటర్స్ వుండే హాలు, ఆ ప్రక్క గది పరిశీలిద్దాముగండి"—అన్నాను చివరికి.

ఇద్దరం కలిసి కంప్యూటర్స్ హాల్‌లోకి వెళ్ళాము. ఎనిమిది మంది ఆపరేటర్లూ కంప్యూటర్ల ముందు కూర్చొని చకచకా పని చేసుకుపోతున్నారు.

ఒక్కొక్క కంప్యూటర్‌కూ ముందు భాగాన టైప్‌రైటర్ కీ బోర్డు లాంటిది వుంది. పత్రాలను చూసి టైపుచేస్తే అది ఆటోమాటిక్‌గా కంప్యూటర్‌ని ఫీడ్ చేస్తుంది.

వెనక లంచ్ రూమ్‌లో టెలిఫోన్‌ని చూడగానే నాకెందుకో మళ్ళీ సిక్త్ సెన్స్ ప్రేరణ మొదలయింది. టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి రిసీవర్ పైకి తీశాను.

"సాధారణంగా ఈ ఫోను ఎక్కువగా ఎవరు ఉపయోగిస్తారో ఆపరేటర్ని అడగండి"—అన్నాను రిసీవర్ మహాదేవన్ చేతికిస్తూ.

మహాదేవన్ ప్రశ్నకు టక్కున సమాధానం వచ్చింది. ఆపరేటర్ మిస్. కళ్యాణి రోజూ ఏదో ఒకవేళలో ఈ ఫోన్ ఉపయోగిస్తుంది.

సాధారణంగా ఏ నెంబరుకు ఫోన్ చేస్తుందో అడగమన్నాను.

మిస్ కళ్యాణి ప్రతిదినం ఒకే నెంబరుకు ఫోన్ చేస్తుంది. అది ఆమె స్వంత ఫోన్ నెంబరు. ఇంట్లో ఒక్కతే వుంటున్న తన అవిటి తల్లితో రోజూ ఏదో ఒక సమయంలో మాట్లాడుతుంది ఆమె. స్విచ్ బోర్డ్ ఆపరేటర్ ఆ విషయాన్ని చెప్పింది. మహదేవన్ ఫోన్ పెట్టేశాడు.

హాలులోంచి కంప్యూటర్లు చేసే రొద టక్, టక్ మంటూ వినిపిస్తోంది. మహదేవన్ నా వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఐ వాంట్ టు బగ్ దిస్ ఫోన్—" అన్నాను.

"వాట్?"—అన్నాడు మహదేవన్ ఆశ్చర్యంగా.

"అవును! ఈ ఫోన్‌కు రహస్యంగా ఓ టేప్ రికార్డరు ఎటాచ్ చేస్తాను. ఫోన్ ఉపయోగించే వాళ్ళ సంభాషణ మనకు తెలుస్తుంది" అన్నాను.

3

ఆ రోజు సాయంత్రం ఆపరేటర్స్ అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయాక టెలిఫోన్ ఊడదీసి దానిలోపల భాగంలో ఓ చిన్న మినీ టేప్‌రికార్డర్ అమర్చాను. దాదాపు అరగంట సంభాషణను టేప్ చేయగలదు ఆ రికార్డరు.

మర్నాడు సాయంత్రం అందరూ వెళ్ళిపోగానే నేనూ, మహదేవన్ వెళ్ళి రికార్డరు బయిటికి తీశాము. కంప్యూటర్లు పనిచెయ్యడం ఆగిపోవడంవల్ల హాలంతా నిశ్శబ్దంగావుంది. చకచకా టేప్ రివర్స్ చేసి 'ప్లే' బటన్ నొక్కాను. ఆటోమాటిక్ రికార్డరు అది. అంటే టెలిఫోన్‌లో సంభాషణ జరుగుతున్నప్పుడే రికార్డ్ చేస్తుంది. మిగతా సమయాల్లో ఆగిపోతుంది.

ఆ రోజు కళ్యాణి ఒక్కతే ఫోన్ ఉపయోగించింది. ఆతృతగా ఆ సంభాషణ విన్నాను నేను.

"హలో ఆపరేటర్....దిసీజ్ కళ్యాణి."—కళ్యాణి గొంతు.

"హలో ఓకే కళ్యాణి. మీ ఇంటి నంబరేనా?" ఆపరేటర్ అడిగింది.

"యస్ ప్లీజ్...."

మరో నిముషంలో ఎవరో కళ్యాణి ఇంట్లో ఫోన్ తీశారు.

"హలో! కళ్యాణేనా?"—ఫోన్‌లో అవతలి కంఠం.

"అవునమ్మా....నేనే...." అన్నది కళ్యాణి.

సంభాషణతోపాటు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌గా కంప్యూటర్లు చేస్తోన్న శబ్దం వినబడుతుంది. కళ్యాణికి, ఆమె తల్లికి మధ్య సంభాషణ దాదాపు పావుగంటసేపు సాగింది. సామాన్యమైన విషయాలు. అన్నీ ఇద్దరు ఆడవాళ్ళు మాట్లాడుకొనేవి.

"చెప్పానుగా! టెలిఫోన్‌ద్వారా ఆ పత్రాలలో విషయాలు బయటికి తెలియబరచడం అసంభవం" అన్నాడు మహాదేవన్ అంతా విని.

నవ్వాను నేను. "అప్పుడే ఎలా నిర్ణయించగలను? వరుసగా కనీసం ఓ పదిరోజులు రికార్డు చేస్తేతప్ప ఏమీ తేలదు. అయినా ఈ రోజు కళ్యాణి తప్ప ఎవరూ మాట్లాడలేదుగా!" అన్నాను టేపు తీసి జేబులో వేసుకొని, మరో కొత్త టేపు అరేంజ్‌చేసి టేపురికార్డర్ని బిగిస్తూ.

హెడ్‌క్వార్టర్స్ స్టూడియో రూమ్‌కి వెళ్ళింతరువాత గాని నేను నక్కతోక తొక్కాను అనే విషయం స్ఫురించలేదు

నాకు. అవునుమరి మొదటి రోజే నేను దోషి ఎవరో కనుక్కోగలననుకోలేదు.

మొదటిసారి విన్నప్పుడు గమనించలేదుగాని, స్టూడియోలో ఫోర్‌ట్రాక్ సౌండ్ సిస్టమ్‌కి అటాచ్ చేసి ఆ టేపులో సంభాషణవింటే కళ్యాణి ఎంత తెలివిగా టెలిఫోన్‌లో పత్రాలలో విషయాన్ని పంపుతోందో అర్ధమవుతుంది.

వెంటనే విక్రాంత్ గదిలోకి పరిగెట్టాను.

టేపంతా ఆయనకు వినిపించి, "నిస్సందేహంగా కంప్యూటర్ సెంటర్లో వున్న దేశద్రోహి కళ్యాణే!" అన్నాను.

విక్రాంత్ నావైపు అర్ధంకానట్లు చూశారు...."డిన్ట్ అండర్‌స్టాండ్" అన్నారు.

"టేపు మళ్ళీ వినిపిస్తాను జాగ్రత్తగా వినండి. వినే ముందు ఈ టెలిఫోను కంప్యూటర్లు వున్న హాలుకు ప్రక్కనే వుందని మరిచిపోకండి. అంచేత కంప్యూటర్ల కీబోర్డులు చేసే టక....టక మనే చప్పుళ్ళు సంభాషణతో పాటు మనకు వినిపిస్తాయి...." అన్నాను టేపు రీవైండ్ చేసి మళ్ళీ బటన్ నొక్కబోతూ....

"అయితే?" అన్నారు విక్రాంత్.

"ఆ శబ్దాలతో కలిపి సంభాషణతోపాటు మరో శబ్దం వినిపిస్తుంది....వినండి" అన్నాను బటన్ నొక్కి.

ఈసారి విక్రాంత్ జాగ్రత్తగా విన్నారు. టేపు వినే కొలదీ ఆయన ముఖంలో మందహాసం చోటుచేసుకొంది.

"యు అర్ రైట్....పిట్ట దొరికింది" అన్నారు....

"అవును కళ్యాణి తన తల్లితో మాట్లాడేప్పుడు మాట్లాడుతూనే పెన్సిల్‌తోనో, పెన్‌తోనో మౌత్‌పీస్‌మీద 'టక్

టక్' మంటూ మోర్స్‌కోడ్‌లో కొడుతోంది. అంటే సంభాషణ జరుగుతూన్నంతసేపూ రెండు మూడు పత్రాలలో విషయాలు మోర్స్‌కోడ్‌లో ట్రాన్మిట్ చేయవచ్చు.... సంభాషణతోపాటు కంప్యూటర్ల మోత కూడా వినిపించడం వల్ల ఈ 'మోర్స్'ను జాగ్రత్తగా వింటే తప్ప కనిపెట్టడం కష్టం" అన్నాను విషయాన్ని స్థూలంగా వివరిస్తూ....

"వెల్ డన్ మైబాయ్! కాని ఇప్పుడు మనం సాల్వ్ చెయ్యాల్సిన ప్రాబ్లమ్స్ అనేకం వున్నాయి. కంప్యూటర్ సెంటర్ నుండి పత్రాలలో విషయాలు బయటికి పంపుతోన్న దెవరో మన కర్థమయింది. కాని, కళ్యాణి పంపుతోన్న మెసేజెస్ వ్రాసుకుంటున్న దెవరు? కళ్యాణి తల్లా? లేక కళ్యాణి తల్లితో మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా మధ్యలో ఆ సంభాషణవింటున్నారా? అలా అయితే కళ్యాణి ఫోన్ నుండి రహస్యంగా మరో ఎక్స్‌టెన్షన్ ఫోన్ వుండి వుంటుంది." అన్నారు విక్రాంత్ ఆలోచిస్తూనే తన ఆలోచన బయటపెడుతూ....

4

కళ్యాణి ఇల్లు భగత్‌పింగ్ కాలనీలో వుంది. హౌసింగ్ కాలనీవాళ్ళు కట్టి ఇచ్చిన ఇళ్ళు. అన్నీ ఒకే మాదిరిగా వున్నాయి. మిడిల్ ఇన్‌కమ్ గ్రూపుకు కట్టి ఆర్. టి. టైపు ఇంట్లో వుంటోంది కళ్యాణి.

పదకొండు గంటల ప్రాంతంలో టెలిఫోన్ డిపార్టుమెంట్ అనుమతి తీసుకొని సెంట్రల్ రిలేబాక్స్‌లో కళ్యాణి ఫోన్ వున్న లైనుకు కనెక్షన్ తీశాము. తర్వాత నేను, మరో ఆపరేటరూ కలిపి సైకిళ్ళు వేసుకొని కళ్యాణి వుండే ఇంటికి వెళ్లాము.

బెల్ మ్రోగించగానే "ఎవరూ?"—అని లోపల నుండి ఓ ఆడ గొంతు వినిపించింది.

"తలుపు తెరవండి"—అన్నాను బయటినుండి ఇంటికి కనెక్ట్ చెయ్యబడిన టెలిఫోన్ వైరింగ్ పరీక్షగా చూస్తూ.

రెండు మూడు నిముషాల తరువాత తలుపు తెరవబడింది.

ఒక్కక్షణం ఆశ్చర్యపోయాను. కళ్యాణి తల్లి అవిటిది అని తెలుసుగాని, ఈ రకంగా వుంటుందనుకోలేదు. దాదాపు అరవై యేళ్లు వుండొచ్చు ఆవిడకు....జుట్టంతా ముగ్గుబుట్టలా నెరిసిపోయింది. చక్రాల చైర్‌లో కూర్చుని వుంది.

"గుడ్‌మార్నింగ్ మాడమ్! టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుండి వస్తోన్నాం....రొటీన్ చెకింగ్‌లో మీ ఫోన్ పని చేయం లేదని మా వైర్‌మెన్ కనుక్కొన్నాడు....ఓసారి మీ ఫోన్ చెక్‌చెయ్యాలి" అన్నాను.

"అమ్మాయి ఇంట్లో లేదు_" అన్నదావిడ.

"ఫరవాలేదు! అయిదు నిముషాలకన్నా ఎక్కువపట్టదు. లేకపోతే మీ ఫోన్ అవుటాఫ్ ఆర్డర్‌లో వుండిపోతుంది_" అన్నాను.

నా మాటలు ఆవిడ మీద మంత్రంలా పనిచేశాయి. "లోపలకు రండి. టెలిఫోన్ మధ్యగదిలో వుంది" అన్నదామె వీల్‌చైర్ కష్టంమీద వెనక్కి తిప్పుకొంటూ.

మేమిద్దరం ఆవిడ వెనకే మధ్య గదిలోకి నడిచాము.... డ్రాయింగ్ రూమ్‌లా వుంది. గదంతా ఉన్ని కార్పెట్ పరిచి వుంది....ఓ ప్రక్కగా సోఫావుంది. గదిలో ఓ మూలగా పుస్తకాలరాక్, దానికి ప్రక్కగా టేబిల్, టేబిల్‌మీద ఓ మూలగా టెలిఫోన్ పెట్టబడివున్నాయి.

నేను తిన్నగా టెలిఫోన్ వద్దకు నడిచాను. రిసీవర్ ఎత్తి ఉత్తుత్తి నెంబరు ఒకటి తిప్పాను. ఎలాంటి శబ్దములేదు. ఆవిడ గుమ్మందగ్గరే ఆగిపోయి మేము చేసే పనులన్నీ పరీక్షగా చూస్తోంది.

నాతో వచ్చిన మా ఏజెంటు టెలిఫోన్ కనెక్షన్సు, వైరింగ్ కళ్ళతోనే పరీక్షగా చూస్తున్నాడు. నేను గుమ్మం దగ్గరున్న ఆవిడకు టెలిఫోన్ కనుపించకుండా అడ్డుగా నిల బడ్డాను. టెలిఫోన్‌ను వెనక్కి తిప్పబోయాను...క్రింద నుండి లాగి పట్టినట్లు వూడి రావడంలేదు. కొద్దిగా పైకిలేచి ఆగిపోయింది. నా బుర్ర చకచకా పనిచేయడం ప్రారంభిం చింది. ఏజెంట్‌కు కళ్ళతోనే సైగ చేశాను.

మౌత్ పీస్ విప్పి డయాఫ్రమ్‌ను టేబుల్ మీద పెట్టాను. చటుక్కున వెనక్కి తిరిగాను.

"రిసీవర్లో డయాఫ్రమ్ కనెక్షన్ తెగిపోయింది. మీ దగ్గర ఫ్యూజ్‌వైర్ వుందా? వెంటనే బాగుచేస్తాను" అన్నాను ఆవిడ వైపు తిరిగి.

"ముందుగది అలమరాలో వుంది టూల్‌బాక్స్! అందులో వుంటుంది. మీలో ఎవరయినా రండి చూపిస్తాను" అన్నదామె. నేను నాతో వచ్చిన ఏజెంట్‌ను వెళ్ళమన్నట్లు సైగ చేశాను.

వాళ్ళిద్దరూ ముందు గదిలోకి వెళ్లారు. సరిగ్గా ఈ సమ యం కోసమే నేను ఎదురు చూస్తున్నది. టెలిఫోన్ మళ్ళీ ఎత్తి చూశాను. టేబుల్‌మీద నుండి ఓ అంగుళం పైకి లేచి ఆగిపోతోంది. క్రిందకు వంగి చూశాను....విషయం అర్థ మయింది. టెలిఫోన్ నుండి రెండు వైర్లు క్రింద డ్రాయ ర్లోకి కనెక్ట్ చేయబడివున్నాయి.

టెలిఫోన్ యధాస్థానంలో వుంచేసి టేబిల్ సొరుగు లాగాను. తెరుచుకోలేదు. లాక్ చేసి వుంది. ముందు గదిలో టూల్ బాక్స్‌లో సామాన్లు కెలుగుతున్న శబ్దం వినిపిస్తోంది. అతను సాధ్యమైనంత ఆలశ్యం చేస్తాడని తెలుసు.

జేబులోంచి మారు తాళాలగుత్తి బయటకు తీశాను.... మూడోతాళానికి డ్రాయరు తెరుచుకొంది. డ్రాయర్లో వున్న వస్తువు చూడగానే విషయం అర్ధమయిపోయింది....ఇక చూడవలసింది ఏమీ లేదనిపించింది. అవును మరి! ఆ సొరుగులో ఓ పెద్ద టేప్‌రికార్డరు. గంటా గంటన్నర సంభాషణ రికార్డు చేయగలది టెలిఫోన్‌కు కనెక్ట్ చేయబడి వుంది.

డ్రాయరు మూసేసి తాళం వేశాను.

5

"కళ్యాణి తన తల్లితో చేసే సంభాషణంతా ఆ టేప్ రికార్డర్‌లో రికార్డ్ అవుతూ వుండాలి" అన్నాను హెడ్ క్వార్టర్స్ చేరుకోగానే విక్రాంత్‌తో.

"యస్! యు ఆర్ రైట్! కళ్యాణి ఆ టేప్‌ని చైనీస్‌కి అందజేయడమో, లేదా రిప్లేచేసి తనే స్వయంగా వాళ్ళకు ఫోన్ చెయ్యడమో చేస్తూవుండాలి'' అన్నారు విక్రాంత్ సాలోచనగా.

"అదే నిజమయితే మనం ఈ రోజునుండే పకడ్బందీగా కళ్యాణిపై నిఘా ఏర్పాటు చేయాలి! అలాగే కళ్యాణి ఇంటి నుండి ఫోన్‌లో మాట్లాడే సంభాషణలు కూడా రికార్డు చేసే ఏర్పాటు కూడా చెయ్యాలి" అన్నాను.

"మీరు కళ్యాణి ఇంట్లోంచి వచ్చేసిన తరువాత తిరిగి టెలిఫోన్ కనెక్ట్‌చేసేశారా?''

"యస్! వెంటనే చేశాము"—

"గుడ్! మరో విషయం కూడా ఆలోచించాలి మనం. మీరు వచ్చేసిన తరువాత కళ్యాణి తల్లికి ఫోన్‌చేస్తే ఆవిడ టెలిఫోన్ చెడిపోతే డిపార్ట్‌మెంట్ వాళ్ళు వచ్చి బాగుచేశారని చెప్పవచ్చు. అలాంటప్పుడు కళ్యాణికి అనుమానం కలిగే అవకాశం వుంది.

"వెంటనే కళ్యాణిని'కంప్యూటర్ సెంటర్' దగ్గరనుండి ఇంటివరకూ నీడలా వెన్నాడేటట్లు మన వాళ్ళను ఏర్పాటు చేస్తాను నేను. నీవు వెంటనే వెళ్ళి కళ్యాణి ఇంటి ఫోన్‌ను 'బగ్' చేసే ఏర్పాటు చెయ్యి. ఒకవేళ కళ్యాణికి అనుమానం కలుగకపోతే సాయంత్రం ఇంటికి వచ్చిం తరువాత వాళ్ళను కలుసుకోవడమో, ఫోన్‌చెయ్యడమో చేస్తుంది.... గెట్‌క్రాకింగ్" అన్నారు విక్రాంత్ ఇంటర్‌కమ్‌లో ఆపరేషన్స్ రూమ్ బటన్ నొక్కుతూ.

నేను వెంటనే గదిలోంచి బయటకు పరిగెత్తాను.

6

భగత్‌సింగ్ కాలనీలో కళ్యాణి ఇంటి వీధిలో చివరగా వాను ఆపించాను. డ్రైవర్ని అక్కడే వుండమని చెప్పి ఇన్‌స్ట్రుమెంట్స్, చిన్నమినీ టేప్ రికార్డరూ తీసుకొని, చేతి సంచిలో వేసుకొని, కళ్యాణి ఇంటివైపు బయలుదేరాను.

నేను వాన్ దిగి రెండడుగులు వేశానో లేదో, సందు అవతలివైపునుండి ఆటోరిక్షా ఒకటి రయ్యిన రావడం కనిపించింది.

ఆ ఆటో కళ్యాణి ఇంటి ముందు ఆగడం, కళ్యాణి ఆటో డ్రైవర్ చేతిలో ఓ నోటు కుక్కి, ఇంట్లోకి వెళ్ళడం

క్షణంలో జరిగాయి. క్షణంలో ఆశ్చర్యం నుండి తేరుకొని వేన్ దగ్గిరికి నడచాను.

వైర్‌లెస్‌లో విక్రాంత్ కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది. "బహుశా మీరు వచ్చిన వెంటనే కళ్యాణి రోజులా ఫోన్‌చేసి వుంటుంది. టెలిఫోన్ బాగుచెయ్యడానికి ఎవరో వచ్చి వెళ్లారని గ్రహించి వెంటనే బయలుదేరి వుంటుంది. అక్కడే వుండి జాగ్రత్తగా వాచ్ చెయ్యి. నీకు తోడుగా నీవు మరొకర్ని వెంటనే పంపిస్తాను" అన్నారు.

డ్రైవరు వాన్ దిగి బోనెట్ తెరిచి ఏదో రిపేరు చేస్తున్న వాడికి మల్లే నటించసాగాడు. నేను జాగ్రత్తగా కల్యాణి ఇంటనే గమనించసాగాను. పదిహేను నిముషాలు గడిచాయి....ఇంతవరకూ కల్యాణి ఇంట్లోంచి బయటకు రాలేదు.

ఇంతలో నల్ల అంబాసిడర్ కారొకటి వచ్చి కళ్యాణి ఇంటిముందాగింది. ఎవరో సూటు వ్యక్తి లోపలకు వెళ్ళాడు. సన్నగా, తీగెలా వున్నాడతను. ఏమాత్రం సంకోచం లేకుండా తేలిగ్గా అడుగులు వేస్తూ నడుస్తున్నాడతను.

బహుశా టెలిఫోన్ రిపేర్ చెయ్యడానికి వచ్చింది డిపార్టమెంట్ మనుషులు కారని గ్రహించి వుండాలి కళ్యాణి. అంచేత వెంటనే చైనీస్‌కు ఆ విషయం తెలియజేసి వుండొచ్చు. కాని; కళ్యానికి అనుమానం ఎందుకు కలిగి వుంటుంది? నేనేదయినా పొరపాటు చేశానా?

వెంటనే విక్రాంత్‌ను పిలిచాను వైర్‌లెస్‌లో. "మన ఏజెంట్ నొకణ్ణి అక్కడకి పంపి పది నిముషాలు దాటుతోంది. బహుశా ఈసరికి అక్కడికి చేరుకొని వుంటాడు.

ఈలోగా కళ్యాణి దగ్గరికి వచ్చిన వ్యక్తి బయటికివస్తే అతన్ని వెంటాడుతూ నీవు వెళ్ళు" అన్నారు.

ఈలోగా మోటారు సైకిలు శబ్దం వినిపించింది. తల త్రిప్పి చూశాను....విక్రాంత్ పంపిన ఏజెంటు వస్తున్నాడు. ....సంఘటనలు చకచకా ఒకేసారి జరగడం ప్రారంభించాయి.

ఎక్కడో 'కెవ్వు' మని అరిచిన కేక వినిపించింది. ఆ కేక కళ్యాణి యింట్లోంచే....సందేహం లేదు. వాన్‌లోంచి ఎగిరి కిందికి దూకాను.

"ఫాలోమీ! క్విక్!" అరిచాను, కళ్యాణి ఇంటివైపు పరిగెడుతూ.

ఇల్లు ఇంకా యాభై గజాలు వుందనగా సూట్‌వాలా రయ్యిన ఇంట్లోంచి బయటకు దూసుకు వచ్చాడు. క్షణాల్లో అతని కారు మా వైపుకు దూసుకు వచ్చింది....జేబులోంచి పిస్తోలు బయటకు తీసేలోపలే అతను మా ఇద్దర్ని, వానునూ దాటి దూసుకుపోయాడు.

వాను డ్రైవర్ బానెట్ మూసి, డ్రైవింగ్ సీట్లోకి ఎక్కి, ఇంజన్ స్టార్ట్‌చేసి, చకచకా వాన్‌ని రివర్స్ చెయ్యసాగాడు. కాని అప్పటికే నల్ల అంబాసిడర్ వీధి మలుపు తిరిగింది.

"హోప్‌లెస్!" అనుకొన్నాను కళ్యాణి ఇంట్లోకి పరిగెడుతూ.

తలుపులన్నీ బార్లా తెరిచి వున్నాయి. మధ్య గది గుమ్మం ముందు కళ్యాణి తల్లి వీల్ చైర్లోంచి క్రింద పడి వుంది. గుండెల్లోంచి రక్తం ఇంకా కారుతోనే వుంది. బాధతో ముఖం బిగుసుకుపోయింది.

జాగ్రత్తగా ఆమె శవాన్ని దాటి లోపలకు వెళ్లాము. సోఫాలో ప్రక్కకు ఒరిగిపోయి వుంది కళ్యాణి. నుదుటి మధ్య పిస్తోలు గుండు చేసిన రంధ్రం మమ్మల్ని వెక్కిరిస్తూ కనిపించింది.

"డామిట్" అనుకొన్నాను కసిగా.

7

కళ్యాణి, ఆమె తల్లి శవాలను మార్చురీకి తరలించగానే, ఇల్లంతా ప్రతి అంగుళము వెతికాము - ఎక్కడయినా ఆ చైనీస్ గూఢచారి గురించి వివరాలేమైనా దొరుకుతాయేమోనని....ఏమీ దొరకలేదు.

టెలిఫోన్‌కు కనెక్టు చేసిన టేప్‌రికార్డర్ మాత్రం టేబుల్ పై సొరుగులో అలాగే వుండిపోయింది. కళ్యాణి తల్లి వేసిన కేకవల్ల, ఆ చైనీస్ గూఢచారికి ఆ టేపు తీసుకొనే అవకాశం లేకుండా పోయింది.

నల్ల అంబాసిడర్ కారు ఆచూకీ ఏమాత్రం తెలియలేదు, ఆ చైనీస్ గూఢచారి ఎవరో తెలుసుకునే ఒక్క ఆధారం మా చేతిలోనుండి జారిపోయింది. టేప్ రికార్డర్‌ను డిస్‌కనెక్ట్ చేసి, హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకు వెళ్లాము.

నేను దిగులుగా విక్రాంత్ వైపు చూశాను...."సారీ బాస్! ఆ అంబాసిడర్ కారు వచ్చినప్పుడే నేను విషయం గ్రహించి వుండాల్సింది" అన్నాను విచారంగా.

"అవును! ఇటీజ్‌యే మిస్‌టేక్....ఇప్పుడు ఆ చైనీస్ గూఢచారి ఎవరో తెలుసుకొనే అవకాశం మనకు పూర్తిగా పోయింది" అన్నారు విక్రాంత్.

తలుపుమీద చిన్నగా చప్పుడయింది. మా ఏజెంట్ ఒకరు

తలుపు తెరుచుకొని గదిలోకి వచ్చాడు. అతని చేతిలో కళ్యాణి ఇంట్లోంచి తెచ్చిన టేప్ రికార్డర్ వుంది.

"జరిగిన విషయాలు ఈ రికార్డర్‌లో వున్న టేప్ వింటే అర్థమవుతుందనుకొంటాను సర్! బహుశా తన కంగారులో కళ్యాణి టేప్‌ను డిస్‌కనెక్ట్ చెయ్యడం మరిచిపోయి వుంటుంది" అన్నాడతను.

"ప్లీజ్ ప్లే ది టేప్!" అన్నారు విక్రాంత్ సిగరెట్ వెలిగిస్తూ.

టేప్‌రికార్డరులో టేపు మెల్లిగా తిరగడం ప్రారంభించింది....అతను వాల్యూంలు పెంచి సౌండ్ ట్రాక్ అడ్జెస్ట్ చేశాడు.

ముందు.... టక్ మని క్రెడిల్ మీదనుండి రిసీవర్ పైకెత్తిన శబ్దం....తరువాత సంభాషణ....

"హలో! కళ్యాణేనా?" కళ్యాణి తల్లి గొంతు.

"అవునమ్మా నేనే. మందు తీసుకొన్నావా?" కళ్యాణి గొంతుతోపాటు కంప్యూటర్ల రొద వినిపిస్తోంది.

"ఆ తీసుకొన్నాను....ఇంతకు ముందే టెలిఫోన్ డిపార్ట్‌మెంటువాళ్ళు వచ్చి టెలిఫోన్ బాగుచేసి వెళ్లారు. వాళ్ళు వెళ్ళగానే తీసుకొన్నాను."

"ఎవరూ?....టెలిఫోన్ కేమయింది? బాగానే ఉందిగా?" కళ్యాణి గొంతులో ఆశ్చర్యం, కంగారు.

"మౌత్‌పీస్‌లో డయాఫ్రమ్ కనెక్షన్ తెగిపోయిందని బాగుచేసి వెళ్లారు."

"డయాఫ్రమ్ కనెక్షనా?....వాళ్ళు బాగు చేస్తున్నప్పుడు నీవక్కడే వున్నావా?" కళ్యాణి గొంతులో ఆత్రుత.

"ఆ....అక్కడే వున్నాను....ఉహూ కాదు....మధ్యలో ఓసారి ఫ్యూజ్ వైర్ అడిగితే అవతలికి వెళ్ళాను...."

క్లిక్‌మని అవతల టెలిఫోన్ పెట్టేసిన చప్పుడు....
"కళ్యాణీ! కళ్యాణీ! హలో....హలో...." కళ్యాణి తల్లి గొంతులో ఆందోళన....తర్వాత మళ్ళీ ఈవైపు ఫోన్ పెట్టేసిన శబ్దం....

టేపు ఇంకా తిరుగుతోనేవుంది. రిసీవర్ పైకెత్తిన శబ్దం. తర్వాత కిర్ర్....కిర్ర్ర్ర్ర్....కిర్ర్....కిర్ర్ర్ ....కిర్ర్ర్ర్ర్....మంటూ ఏదో నంబరు డయల్ చేస్తున్నచప్పుడు. అవతల రింగ్ అవుతోన్న శబ్దం....

క్లిక్‌మని రిసీవర్ ఎత్తారు. "హలో...." సన్నని కంఠం జవాబు. ఆడో, మగో, స్పష్టంగా తెలియడంలేదు.

"హలో....నేను....ఎ. శ్రీ ని" కళ్యాణి గుసగుసలుగా జవాబు.

"ఏమిటి?"—

"ఇంటలిజెన్స్ వాళ్ళకు నా మీద అనుమానం కలిగినట్లు తోస్తోంది. ఈ ఉదయం నేను ఇంట్లో లేనప్పుడు ఎవరో ఇద్దరు టెలిఫోన్స్ మనుషుల్లా ఇంట్లోకి వచ్చారు. వాళ్ళు టేబిల్ సొరుగుతెరచి, రికార్డర్ చూశారని నా అనుమానం. డ్రాయర్ అడుగున ఫ్రేమ్‌కీ, సొరుగుకూ అంటించిన సెలోఫిన్ టేపు ఊడిపోయివుంది. బహుశా మరో తాళంతో వాళ్ళు డ్రాయరు తెరిచి వుంటారు"—అన్నది కళ్యాణి.

'వాట్ ఫూల్ అయామ్'—అనుకొన్నాను మనసులోనే, కళ్యాణి అలాంటి ఏర్పాట్లేమైనా చేస్తుందేమో చూడకుండా సొరుగు తెరవడం నా పొరపాటు.

అర నిముషంపాటు లైన్లో నిశ్శబ్దం. "ఆల్‌రైట్! కొంప మునిగింది ఏమీ లేదు. ఇప్పుడే మనవాణ్ణి ఒకడ్ని పంపిస్తున్నాను. ఫర్ దర్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తాడు. అంత

వరకూ ఇంట్లోనేవుండు" అవతలవైపు టెలిఫోన్ పెట్టిన శబ్దం. మరుక్షణానికి కళ్యాణి ఫోన్ పెట్టేసింది.

"అంతే!'' అన్నాడు మా ఏజెంటు బటన్ ఆఫ్‌చేస్తూ.

"దిసీజ్ మైఫాల్ట్. అయామ్ వెరీసారీ సర్!" అన్నాను ఏమనాలో తోచక.

విక్రాంత్ నా వైపు చిత్రంగా చూశారు. "ముందు చేయవలసిన కార్యక్రమం ఆలోచించాలి మనం. ఆ చైనీస్ గూఢచారి ఎవరో తెలుసుకునేందుకు మనకున్న ఒక్క ఆధారం పోయింది. టెలిఫోన్ సంభాషణ బట్టి, కళ్యాణి డైరెక్టుగా ఆ గూఢచారుల నాయకుడితో మాట్లాడినట్లు మన కర్థమవుతుంది. అంటే ఆ గూఢచారి టెలిఫోన్ నంబరు కళ్యాణికి తెలిసివుండాలి. కనీసం ఆ టెలిఫోన్ నంబరయినా మనం తెలుసుకోగలిగితే "అ ర్ధ వ ం త ం గా ఆగాడు విక్రాంత్.

"ఐ విల్ డు మై బెస్ట్ సర్!" అన్నాను లేచి నిలబడుతూ.

టేప్‌రికార్డర్ తీసుకొని స్టూడియోకు నడిచాను.

స్టూడియో రూమ్‌కు రాగానే స్టౌమీద వేడి కాఫీ తయారు చేసి, ఓ కప్పు తాగి, సిగరెట్ వెలిగించాను.

టేప్ రికార్డర్‌ను ఫోర్‌ట్రాక్ సౌండ్‌సిస్టమ్‌కు కనెక్ట్ చేశాను.

టేప్ రికార్డరు ఆన్‌చేసి జాగ్రత్తగా వినసాగాను. కళ్యాణి ఫోన్ ఎత్తడం....ఆ చైనీస్ గూఢచారి నెంబరు డయల్ చేయడం స్పష్టంగా వినిపిస్తున్నాయి. తర్వాత కళ్యాణికి, గూఢచారికీ మధ్య జరిగిన సంభాషణ....పదేపదే అరడజను సార్లు విన్నాను టేపులో ఈ భాగమంతా....

కిర్ర్....కిర్ర్‌ర్ర్....మంటున్నది నెంబర్ డయలింగ్

శబ్దం అని తెలుసు....కాని అది ఏ నెంబరో తెలిస్తే ఎంత బావుండును.

మరో సిగరెట్ వెలిగించి ఆ డయిలింగ్ సౌండ్ మళ్ళీ విన్నాను. చటుక్కున మెఱుపులా ఐడియా వచ్చింది....

టేబిలు సొరుగులోనుండి స్టాప్ వాచ్ తీసి....గదిలో మూలనున్న టెలిఫోన్ దగ్గరకు నడిచాను. పది నిముషాల్లో కళ్యాణి ఫోన్ చేసిన చైనా గూఢచారి టెలిఫోన్ నంబరుతో విక్రాంత్ గదిలోకి పరిగెత్తాను.

విక్రాంత్ నా వంక ఆశ్చర్యంగా చూశారు. "ఆ నెంబరు ఇదేనని ఎలా తెలుసు?"—

నేను చిన్నగా నవ్వాను.

"తెలుసుకొంటె చాలా సింపల్ అనిపిస్తుంది. కళ్యాణి దగ్గర దొరికిన టేప్ రికార్డర్‌లో, కళ్యాణి, చైనీస్ గూఢచారికి ఫోన్‌చేసినప్పుడు ఆ డయిలింగ్ సౌండ్స్ టేప్ మీద రికార్డయ్యాయి. ఆ సౌండ్స్ పదేపదే వింటూంటే నాకు ఈ అయిడియా వచ్చింది.

టెలిఫోన్ డయల్ చేసినప్పుడు ఒక్కొక్క నంబరు డయల్ చెయ్యడానికి కొంత టైం పడుతుంది....అందుచేత ఒక్కొక్క నంబరు డయిల్ చెయ్యడానికి ఎంత టైం పడుతుందీ స్టాప్‌వాచ్ సహాయంతో మన ఫోన్‌మీద డయల్ చేసి కనుక్కొన్నాను. తర్వాత ఇంకేముందీ! టేప్ మీద రికార్డయిన డయలింగ్ సౌండ్స్ ఒక్కొక్కదానికీ ఎంత టైం పట్టిందో చూసి, దాన్నిబట్టి కళ్యాణి డయల్‌చేసిన అంకెలు కనుక్కున్నాను. అదే ఆ గూఢచారి టెలిఫోన్ నంబరు!"—అన్నాను నవ్వుతూ....

మరో అరగంటలో ఆ చైనా గూఢచారి, అతని బృందం మాకు దొరికిపోయారు.

***

తెలివి ఒకరి సొత్తు కాదు!

పెందుర్తి వెంకటేశ్వర్లు

నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంది రత్న మహల్. వందేళ్ళనాడు కట్టబడివున్న భవంతి పాతిక ఏళ్ళ పైగా పాడుబడిపోయింది. కూలినగోడలు, రాలిన సున్నం, పోయినరంగుతో వున్న ఆ మహల్‌లో దయ్యా లుంటాయని వినికిడి. గోడలు చీల్చుకొని పెరిగిన రావి, మర్రిచెట్లు, చుట్టు దట్టంగా పెరిగిన అడివి. అందుకే ఆ భవంతికి ఎవరు రారు.

ఐదేళ్ళనాడు ఎవరో ఓ యువతి ఆత్మహత్యచేసుకొంది. ఆమె దయ్యమయి తిరుగుతూవుంటుందంటారు. యిప్పుడు ఆ భవంతిలో వుంటున్నది దయ్యంకాదు. రంజిత్ అనే ఒక ఖైదీ.

రంజిత్ రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో ఒక్కడే ఒకరాయిమీద కూర్చున్నాడు. ప్రక్కనేవున్న రాతిపై నుండి బ్రాంది అందుకొని ఒకపెగ్ త్రాగాడు.

తలెత్తి ఆకాశంవైపు చూశాడు.

ఆకాశంలో మబ్బులున్నాయికాని వర్షంలేదు. అక్కడక్కడ చుక్కలున్నాయిగాని, వెన్నెల లేదు, శ్మశాన నిశ్శబ్దంతో గాలి వూళలు వేస్తుంది.

కోటులోనుండి సిజర్‌లైటర్‌తీసి కాండిల్ వెలిగించాడు. టైము చూశాడు.

తొమ్మిది ఐదు నిమిషాలయింది.

ప్రక్కచెట్లలో ఎవరో కదిలిన అలికిడి అయింది. గబాలున రివాల్వర్ తీశాడు.

"ఎవరు? ఎవరది?" కటువుగా గంభీరంగా అన్నాడు.

రంజిత్ ఎన్నో దొంగతనాలుచేసి మూడుసార్లు జైలుకు వెళ్ళిన సామాన్యపు దొంగ. జేబుదొంగగా ప్రారంభమయిన అతనిజీవితం, యిప్పుడు వజ్రాలమార్పిడి వరకు వచ్చింది.

రంజిత్ వయసు నలభై ఏళ్ళు. ఎత్తు ఐదు అడుగులు నల్లగా, నీగ్రో మనిషిలా వుంటాడు.

పొదలోనుండి ముందుకువచ్చాడు ప్రచండ.

"నీకొరకే చూస్తున్నాను," రంజిత్ నవ్వాడు.

"టైముప్రకారం రావటం నా హాబీ."

ప్రచండ ముప్పైఏళ్ళ యువకుడు. మెక్సికన్ మీసకట్టుతో, ఎర్రగా వుంటాడు. ఎన్ని హత్యలుచేసినా శవాల్ని మాయంచేసి ఆచూకి తెలియకుండ చేయగల ఆగంతకుడు.

సిగరెట్‌పాకెట్ తీసి, సిగరెట్టు వెలిగించాడు ప్రచండ.

"యిప్పుడు నేనేం చెయ్యాలి?"

"యిప్పుడు వజ్రాలు తీసుకొని ఒక వ్యక్తి వస్తాడు. అతన్ని నీవు అడ్డగించి హత్యచెయ్యాలి. అతని శవాన్ని నామరూపాలు లేకుండా చెయ్యాలి. అతని పేరు మహేంద్ర."

"ఎంత యిస్తావ్ ?"

"ఎంతకావాలో చెప్పు ?"

"అతని ప్రాణం ఖరీదు నీకు తెలుసు కాబట్టి నీవే నిర్ణయించి చెప్పు." ప్రచండ అడిగాడు.

"పాతికవేలు !" రంజిత్ అడిగాడు.

"నొ, యాభై వేలు. అతని శవాన్నికూడా కనిపించ కుండా చేయగలను కాబట్టి యాభై వేలు కావాలి. అది నెట్ కాష్‌గా యివ్వాలి," ప్రచండ పొగవదిలాడు.

"ఓ. కె. అతనిదగ్గర వజ్రాలకు సంబంధించిన ప్లాను వుంది. కాబట్టి ఆ ప్లాను యివ్వాలి."

"నీకాభయం అవసరంలేదు. వజ్రాలు, బంగారం నాకు అనవసరం. రేపటి నెమలికంటె, యీ వేళ పావురం నయం, నా దృష్టిలో పదిలక్షల బంగారంకంటె లక్ష కరెన్సీ తీసుకుంటాను."

"గుడ్ ! అందుకే నిన్ను ఎన్నుకున్నాను. నేను ఓ గంట తర్వాత వస్తాను. పని ముగించు యిదిగో రివాల్వర్. యీ రివాల్వర్‌లో ఒకే ఒక బుల్లెట్ వుంది. రెండో బుల్లెట్‌కి చాన్స్ యివ్వకూడదు," అంటూ రివాల్వర్ అందించాడు.

"అడ్వాన్స్?"

"యిదిగో పదివేలు. పని అయ్యాక మిగిలింది యిస్తాను."

"ఓ. కె." అన్నాడు.

రంజిత్ వెళ్ళిపోయాడు. ప్రచండ రాతిపై కూర్చొని కోటు జిప్ వదులుచేశాడు. టాబ్‌లెట్ ఒకటి తీసివేసుకొని సీసాలోవున్న బ్రాంది కొస్త త్రాగాడు. టైము చూశాడు. తొమ్మిది నలభై అయింది.

రాబోతున్న మనిషి ఎలావుంటాడు? ఎవరు?

చెట్లమధ్యగా ఓ మనిషి వచ్చాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది.

"ఎవరు నువ్వు?" అడిగాడతను, ప్రచండను ఆశ్చర్యంగా చూస్తూ.

"మిస్టర్, నీ చేతిలో రివాల్వర్ వున్నంతమాత్రాన నీవు అడిగినదానికి అర్జంటుగా సమాధానం చెప్పే సైకాలజీ నాకులేదు. యిక్కడకు వచ్చింది నీవు. నీ పేరు?"

నవ్వాడతను, "మహేంద్ర," అన్నాడు.

రెప్పపాటులో ప్రచండ అతనిచేతిపై కొట్టటం, అతని చేతిలో రివాల్వర్ క్రిందపడటం జరిగాయి.

"గుడ్. నీకొరకే ఎదురు చూస్తున్నాను, మహేంద్ర! ఐలైక్ యువర్ యిన్నొసెన్స్. యికపోతె నేను ప్రొఫెషనల్ కిల్లర్ని, పేరు ప్రచండ, నిన్ను చంపబోతున్నాను."

అదిరిపోయాడు మహేంద్ర "నన్ను చంపితే నీకే మొస్తుంది."

"అనవసర ప్రసంగం, నీవు అడిగే ప్రతి ప్రశ్నకు నా దగ్గర సమాధానం సిద్ధంగాలేదు. నీవు అదిరిపడి గుండాగి చచ్చిపోతే ఐమీన్ నేను చంపకుంటే నాకు యాభై వేలు నష్టం. అంటె నీ ప్రాణం ఖరీదు యాభై వేలు."

"వెరీగుడ్! అయితే రంజిత్ నాకంటె గొప్పవాడన్న మాట."

"ఎలా?"

"వెరి సింపుల్. వాడి ప్రాణం ఖరీదు లక్ష. నీవు ప్రొఫెషన్ కిల్లర్వి. వ్యక్తిగతంగా మన యిద్దరికి ద్వేషం లేదు. వృత్తిరీత్య నీకు శత్రువును. అలాగే రంజిత్ను చంపు లక్ష రూపాయలిస్తాను."

ప్రచండ ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? నీకు కావలసింది డబ్బు."

"అవును. కాని రంజిత్‌ని చంపితే నీకు లాభం ఏమిటి? ప్రాణం దక్కటమేనా?"

"కాదు. స్మగుల్డ్ వజ్రాలు కొన్ని ఒకచోట దాచి, ప్లాను చింపి చెరిసగం వుంచుకున్నాం. నేను చస్తే ఆ కాగితం వాడికి వెళుతుంది. వాడు చస్తే ఆ కాగితం నాకొస్తుంది."

ప్రచండ ఆలోచిస్తూనే వున్నాడు.

"ఆలోచించుకో, యిదిగో అడ్వాన్స్ యాభై వేలు." ముందుంచాడు.

ప్రచండ క్షణం ఆగి "ఓ. కే. మళ్ళీరా రంజిత్ శవాన్ని చూపుతాను," అన్నాడు ప్రచండ.

"ఓ. కే." అంటూ వెళ్ళిపోయాడు మహేంద్ర.

నవ్వుకున్నాడు ప్రచండ. రెండుపిల్లులమధ్య కోతి కథ గుర్తుకువచ్చింది. యిప్పుడు తనచేతిలో ఒక హత్యవుంది. కొన్ని నిమిషాలక్రితం మహేంద్రను చంపాలనుకున్నాడు. కొన్ని నిమిషాల తరువాత రంజిత్‌ను చంపాలనుకుంటున్నాడు.

అనుకున్నప్రకారం రంజిత్ వచ్చాడు.

ఎక్కువ మాట్లాడదలచుకోలేదు. మాట్లాడితే హత్య పథకం మరొకదిశగా మారుతుంది. "నిన్ను చంపాలనుకుంటున్నాను రంజిత్. అధిక ప్రసంగంచేయక ఆఖరు కోరిక కోరుకో."

"ఎవరు? ఎందుకు?"

"చెప్పాను. అనవసర ప్రసంగం. నీ కోర్కె ఏమిటి?"

రంజిత్ గుండెను రంపంతో కోసినట్లయింది. మెదడు

మొద్దుబారింది. ఆలోచనలు తారుమారయ్యాయి. తాను తీసిన గొయ్యిలో తానే పడబోతున్నాడు.

"ఎంత యిస్తానన్నాడు?"

"షటప్" అరిచాడు ప్రచండ.

ప్రచండ చేతిలో రివాల్వర్ పేలింది.

వికృతంగా అరచి క్రిందపడ్డాడు రంజిత్. ప్రచండ బేరల్‌ని వూదాడు. ప్రక్కనుండి ఆతృతగా వచ్చాడు మహేంద్ర.

"ఐ కిల్‌డ్ హిమ్. యాభై వేలు."

మహేంద్ర నవ్వాడు. "నీలాంటి సిన్సియర్ ఒక్కడు వుంటే చాలు. కార్యక్రమాలు దిగ్విజయం అవుతాయి. ఓ గంటలో యిస్తాను," అంటూ శవాన్ని చూస్తూ బ్రాంది గ్లాసులో వంపుకొని అందించాడు.

ప్రచండ, మహేంద్ర చీర్స్ అని త్రాగారు.

మహేంద్ర వాలెట్‌లోనుండి సిగిరెట్ తీసి వెలిగించి, క్షణం తల విదిల్చాడు.

రంజిత్ నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

"మిస్టర్ ప్రచండ! ఎత్తుకు పైఎత్తు లేయటంలో రంజిత్ అందెవేసిన చెయ్యి. నీకు యిచ్చిన రివాల్వర్‌లో డమ్మీబుల్లెట్ పెట్టాను. ఎందువల్లనంటే నీవు రివాల్వర్ పేల్చితే చాటుగావుండి నా రివాల్వర్‌తో నేను మహేంద్రను చంపుతాను. నేను మహేంద్రను చంపగలిగినా నిన్ను ఎందుకు తెచ్చానంటే కేవలం హెల్ప్. రెండు నీవు ప్రొఫెషనల్ కిల్లర్‌వి. శవాన్నికూడా మాయం చెయ్యగలవు కాని నీవు డబ్బుకు గడ్డితిన్నావ్, నేను బ్రాందిలో విషం కలిపాను. అది మీ యిద్ధరు త్రాగారు. సొ, మీ యిద్దరు

కొద్ది క్షణాలలో మరణిస్తారు." వికృతంగా నవ్వాడు రంజిత్.

మహేంద్ర క్రిందపడి క్షణాలలో ప్రాణాలు వదిలాడు.

"మిస్టర్ రంజిత్! నేను నీవు అనుకున్నంత తేలిగ్గా చావను."

"మహేంద్ర చావు చూస్తున్నావు."

"మహేంద్ర శవాన్ని చూస్తున్నాను. కాని నేను శవం కాను. నీ విషం నామీద పనిచెయ్యదు. ఎందువల్ల? యిలాంటి కార్యక్రమాలకు వచ్చేటప్పుడు ముందే యాంటి పాయిజన్ టాబ్లెట్ తీసుకుంటాను."

"అంటె?"

"నేను బ్రతుకుతాను. నీవు చస్తావ్!" అంటూ తన రివాల్వర్ బయటకు తీశాడు ప్రచండ. "కదలొద్దు!"

"యిప్పుడు నన్నెందుకు చంపుతున్నావ్?"

"నిన్ను చంపితే వజ్రాలకు సంబంధించిన ప్లాను నాకే దక్కుతుంది. క్రొత్త వ్యాపారం ప్రారంభిస్తాను." ప్రచండ వికృతంగా నవ్వాడు.

'ఢాం' మని రివాల్వర్ పేలింది.

రంజిత్ క్రింద పడిపోయాడు.

ప్రచండ వికృతంగా, విచిత్రంగా నవ్వాడు "ఎత్తుకు పై ఎత్తు" మళ్ళీ నవ్వాడు.

'ఢాం' మని మళ్ళీ రివాల్వర్ పేలింది.

ప్రచండ కుడివైపు చాతిలో దిగిపోయింది. పడిపోయిన రంజిత్ లేచాడు. "మిస్టర్, ప్రచండ! నీవు చాలా సరదాగా చంపగలవు కాని చచ్చిపోయావ్."

"నువ్వు ...నువ్వు."

"యింకా చావలేదు. నేను వేసుకుంది బుల్లెట్ప్రూఫ్ కోటు. యీ కోటుకు రివాల్వర్ దెబ్బ తగలదు. నీకిచ్చిన రివాల్వర్‌లో నిజమైన బుల్లెటేవుంది. దీనివల్లనే రక్షించ బడ్డాను." నవ్వాడు రంజిత్.

ప్రచండ ఛాతిలోనుండి రక్తంకారిపోతుంది. ప్రక్కకు ఒరిగిపోయాడు.

రంజిత్ మహేంద్ర దగ్గరవున్న బాక్స్ చేతిలోకి అందు కున్నాడు. "నన్ను చంపాలనుకున్నారు, పూర్ ఫెలోస్!" అంటూ బాక్స్ తెరిచాడు.

క్షణంలో బాక్స్‌లోవున్న బాంబ్ పేలిపోయింది.

వికృతంగా అరచి పడిపోయాడు. చివరిసారి కళ్ళుతెరిచి చూపిన ప్రచండకు ప్రాణం విడుస్తున్న రంజిత్ కని పించాడు. అదోలా నవ్విన పెదవులు, సగం తెరిచిన కళ్ళు అలాగే ఆగిపోయాయి. ***

పరీక్ష హాలులో ఒక విద్యార్థి మాటి మాటికి వెనక్కి తిరిగి చూస్తున్నాడు. అతడి వ్యవహారం చాలా సేపట్నుంచి ఇన్విజిలేటర్ గమనిస్తూనే ఉన్నాడు.

''ఇంకోమారు అలాగే వెనక్కి తిరిగి చూసావంటే బయటకు పంపించి వేస్తాను.'' అన్నాడు ఇన్విజిలెటరు కోపంతో.

''మరేనండీ......క్వశ్చన్ పేపరులో వెనుక చూడు అని ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.'' అన్నాడా అబ్బాయి తలగోక్కుంటూ.

—యస్. వెంకటరమణ ఆచారి, బెంగుళూరు.

కలికి!

కంచర్ల రమణా

ఆ టేబిలుమీద సుమారు రెండడుగుల పొడవున్న నల్లని మానవాకారం ఉంది. అది అనేక మానవ, మృగ శరీర భాగాల్నించి ఎంచి, కూర్చి రూపొందించబడినది.

ఆ మానవాకారానికి చైతన్యం యివ్వడం ఒకటే మిగిలి ఉంది. ఎంత ప్రయత్నించినా, గత వారంరోజులుగా ప్రొఫెసర్ సువర్ణో ఆ అంశంలో సఫలుడు కాలేక పోతున్నాడు. ఆ కాస్త సంభవిస్తే, సువర్ణోకృషి ఫలించినట్టే.

ఆ మరుగుజ్జు మానవాకారానికి అన్నివైపుల్నించి లెక్క-లేనన్ని తీగెలు, రకరకాల యంత్రాలనించి తెచ్చి తగిలింపబడి ఉన్నాయి.

ఒక తీగె నుదురుచుట్టూ ఉండి, మెదడుని అంటి ఉంటే యింకొకటి, దానిగుండెకు తగిలించి ఉంది. రెండు తీగెలు కాళ్ళకు, మరి రెండుతీగెలు చేతులకు తగిలించి ఉన్నాయి.

ఇవిగాక రంగురంగుల సన్నని తీగెలు, ఆ ఆకారంలోని ప్రతి అంగుళంమేరను ఆవరించి ఉన్నాయి.

వింతగా, భయంకరంగా ఉన్న ఆ ఆకారం ప్రొఫెసర్ సుపర్ణో సృష్టి.

జన్యశాస్త్రం (జెనిటిక్స్)లో అపారమైన విజ్ఞానం సంపాయించి, అవిరళ పరిశోధనలు జరిపాడు సుపర్ణో.

ఆ పరిశోధనల ఫలితమే, వర్కింగ్ టేబిలుమీదున్న ఆ మరుగుజ్జు మానవుడు.

పులికుండే భీకరత్వం, గాభీర్యం, క్రూరత్వం; పాముకుండే చురుకుదనం; మనిషికుండే తెలివితేటలు, చాతుర్యం సామర్థ్యం ఆ సరికొత్త జీవిలో నిక్షిప్తమయ్యేలా; కసాయి గుండెగల ఓ హంతకుడి మెదడులోని కొన్ని జీన్సు, యవ్వనంలోవున్న ఓ పులి కండరాల్లోని కొన్ని జీన్సు, భయంకర విషనాగులోని కొన్నిజీన్సు, ఆ చిన్న మరుగుజ్జు శరీరంలో నిక్షిప్తంచేశాడు.

అయితే, ఆ జీన్సు ముద్దని ఎంత ప్రయత్నించినా చైతన్యవంతం (యేక్సిలేట్) చెయ్యలేకపోతున్నాడు సుపర్ణో.

ఆ వింత సృష్టికి కారణమైన సిద్ధాంతాన్ని ఓ సారి చదివాడు, మనస్సంతా కేంద్రీకరించి, అందులో అతడికి యే లోపమూ కన్పించలేదు. ఒకసారి, తీగెలన్నింటినీ చెక్ చేశాడు. అవిగూడా సరిగ్గానే ఉన్నాయి.

తనుకూర్చిన జీన్సులో యేవైనా వ్యర్థమైపోయాయేమోనని, 'జెనీలైఫ్ ఇండికేటర్'తో చెక్‌చేసి చూశాడు. జీన్సు అన్నీ మాంచి కండిషన్‌లో ఉన్నాయి.

ఒకసారి, ఆ మాంసపు ముద్దగుండా వెయ్యి వోల్టుల

కరెంటు ప్రసరింపజేశాడు.

ఎప్పటిలా ఆ మాంసపు ముద్దలో చైతన్యంలేదు.

డామిట్! ....అతడి గుండెలో ఏడుపు సుడులు తిరగ సాగింది. వారంరోజులనుండి నిద్రాహారాలు మాని చేసిన కృషి ఫలించలేదు. విసుగు, దుఃఖం అతడిని ఆవరించాయి చివరకు.

మరుక్షణం ఆ దుఃఖం, తన జీవితంమీద, తన పరిశోధనల మీద చెప్పరాని క్రోధంగా మారింది.

"యూ! గుడ్‌ఫర్ నథింగ్‌ఫెలో! సుపర్ణో!" పిచ్చిగా కేకపెట్టాడు ప్రొఫెసర్ సుపర్ణో.

తను ఆ క్షణంవరకూ ఎంతో ఓర్పుతో, నేర్పుతో సమకూర్చిన ఆ మానవాకారాన్ని తక్షణం నాశనం చెయ్యాలన్న వెర్రి ఆలోచన వచ్చింది అతడికి.

ఆ మాంసపు ముద్దలోంచి పాస్‌చేసిన కరెంటుని వెయ్యి నుంచి రెండువేల వోల్ట్‌లకు.......ఆ తరువాత మూడు.... నాలుగువేల వోల్టులకు....అలా పెంచుకుంటూ పోసాగాడు.

వోల్టేజి, పదివేలకు పెరిగేసరికి, హఠాత్తుగా, ఆ మానవాకారంలో చైతన్యం కలిగింది.

ఆ వింత మానవుడు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. కాళ్లూ చేతులూ కదిల్చాడు.

అది చూస్తున్న సుపర్ణో నోరు, ఆశ్చర్యంతో తెరుచుకుని ఉండిపోయింది.

ఓల్టేజి పెంచడం ఆపేశాడు. ఇంకోక్షణం తరువాత, కరెంటు కనెక్షన్ లాగేశాడు.

"అహాతో!" ఆనందంతో కేకేశాడు సుపర్ణో.

అహాతో, ప్రొఫెసర్ సుపర్ణో అసిస్టెంట్. చైతన్యంతో

కదులాడుతున్న మానవాకారాన్ని చూసి, తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు అహాత్తో.

"సక్సెస్! సక్సెస్!....కమాన్! లెటజ్ సెలిబ్రేట్!" అంటూ అహాత్తోని అమాంతంగా కౌగలించుకుని, అతన్ని లేవనెత్తి దూరంగా లాక్కుపోయాడు సుపర్ణో.

అక్కడున్న ఓ కప్‌బోర్డు తెరచి, అందులోంచి ఓ ఖరీదైన విస్కీబాటిలు తీశాడు. విసురుగా దానిమూత లాగేసి ముందుగా ఆ సీసాని, అహాత్తో నోటికి తగిలించాడు.

గబగబా గుటకవెయ్యలేక ఉక్కిరిబిక్కిరై పోయాడు అహాత్తో. రెండుక్షణాలు పోయాక, ఆ బాటిలు తన నోట్లో పెట్టుకుని, బాటిలు పూర్తిచేసేశాడు సుపర్ణో.

"చూడు అహాత్తో!....ఇప్పుడు చూపిస్తాను నా ప్రతాపం! ....ఇక, యీ ప్రపంచం యీ గుప్పిట్లో ఉంటుంది......... భూమిచుట్టూగాకుండా, యీ వేలిచుట్టూ తిరుగుతుంది యిక ముందు యీ ప్రపంచం.........".

"బై దిబై....మనవాడికి యేంపేరు పెడదామంటావ్?" అన్నాడు సుపర్ణో.

సాధారణంగా కనిపెట్టినవాడిపేరు కనిపెట్టబడిన వస్తువుకు ఇవ్వడం శాస్త్రరంగంలో పరిపాటి. ఆ విషయం గుర్తుకొచ్చింది అహాత్తోకి.

"మీ పేరే పెట్టండి" అన్నాడు అహాత్తో.

"నో! నో!....నా పేరు వద్దు....నేను సృష్టించిన వ్యక్తి యీ యుగానికే అపూర్వ విషయం కాబట్టి, యీ యుగం పేరే బెడితే?" తన వూహని బయటపెట్టాడు సుపర్ణో.

"మీ ఆలోచన చాలాబావుంది! .... అయితే....అతడ్ని 'కలి' అని పిలుస్తారన్నమాట" తన ఏకీభావాన్ని తెలియ

జేస్తూ అన్నాడు అహేతో.

"కాని....చిన్న సవరణ....'కి' అనేమాట చేర్చి 'కలికి' అని పిలుద్దాం....పద" అంటూ కదిలాడు సుపర్ణో.

ఇద్దరూ కలిసి, కలికి ఉన్న టేబులువద్దకు వచ్చారు.

అప్పటికి కలికి లేచికూచుని, లేబొరేటరీ అంతా విస్మయంగా చూస్తున్నాడు.

ప్రొఫెసర్ సుపర్ణో, అసిస్టెంట్ అహేతోకూడా తన కెదురుగా వచ్చి నిలుచోగానే వారివైపుకూడా చూడసాగాడు.

కలికి అలా యెందుకు చూస్తున్నాడో క్షణంలో అర్థం చేసుకొన్నాడు ప్రొఫెసర్ సుపర్ణో. కలికి యెవరో వారికి తెలుసుగాని, వారెవరో కలికికి తెలీదుగదా ?

"నీ పేరు కలికి. నిన్ను సృష్టించింది నేను....అంటే ప్రొఫెసర్ సుపర్ణో. అతను నా అసిస్టెంట్ అహేతో," అంటూ తనను తాను పరిచయం చేసుకొన్నాడు సుపర్ణో.

ఆ తరువాత, కలికి సృష్టికి తాను కారణభూతుడు కాబట్టి, కలికి తనకు విధేయుడై ఉండాల్సిన అవసరం గురించి వివరంగా కలికితో చెప్పాడు సుపర్ణో.

"అవును ప్రొఫెసర్! .... అర్థం అయింది...." కలికి మొట్టమొదటిసారిగా మాటలు తూచి తూచి మాట్లాడాడు.

కలికి గొంతుక వినడానికి మహాదుర్భరంగా వుంది. ఓ ఎలుక కిచ కిచ మన్నట్టుగా వుంది. సుపర్ణోకి మాత్రం కలికి తన ఎదురుగా ప్రాణంతో వుండడమే మహదానందంగా వుంది.

అప్పటికి బాగా తెల్లవారింది.

"నువ్విక్కడేవుండు కలికీ!....ఇది మన లేబరేటరీ.... మేం కాసేపు బయటకువెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని వస్తాం!...."

అని ప్రొఫెసర్ సుపర్ణో, అహాతోని వెంటబెట్టుకుని. లేబ్‌కు తాళాలువేసి బైటకు వెళ్ళాడు.

2

కలికి లేబ్ అంతా కలయజూసాడు.

రక రకాల గాజు కుప్పెలు, సీసాలు, ట్యూబులు, కొన్ని ఏవేవో ద్రవాలతో, మరికొన్ని యేవో ఘనపదార్థాలతో, నిండివున్నాయి. ఇవిగాక, పెద్ద గాజుగోలేలు, పైన మూతలుపెట్టి వున్నాయి.

కలికి ముక్కుకు యేదో యిష్టమైనవాసన తగిలినట్టనిపించగానే, గట్టిగా గాలిపీల్చి వదిలాడు.

ఆ వాసన అతనినోట్లో నీళ్ళు వూరించాయి.

వాసన వస్తున్నచోటుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

తనున్న టేబులుమీంచి కాళ్ళ క్రిందికి జార్చి, దిగబోయేడు, కాని, భూమి అతడికాళ్ళకి అందలేదు.

మళ్ళా టేబిలుపైకి యెక్కి, పైనించి ఒక్క గెంతు గెంతాడు క్రిందకు.

నేలమీద దబ్బున శబ్దంచేస్తూ పడ్డాడు. తల గట్టిగా నేలకు తగిలి టంగుమంది. అయినా, నొప్పి తెలీలేదు అతనికి.

పడినంతవేగంగానే లేచినించుని, తన ముక్కుపుటాల్ని గాఢంగా తగుల్తున్న వాసనవస్తున్న దిక్కుగా బయలుదేరాడు.

కలికి గునగునలాడుతూ గాజు గోలేల దగ్గరకు చేరుకొన్నాడు.

తన కందుబాటులోవున్న గోలెంమూత తీయబోయాడు. కాని, గోలెం పై అంచు కలికి యెత్తుకు మించివుంది.

చప్పున నలువైపులా చూసి, ఓస్టూలు అతని కంటబడగానే, దాన్ని గోలెంవద్దకు యీడ్చుకొచ్చాడు.

స్టూలుమీదనించి, గోలెం అంచు అందింది, మెల్లిగా గోలెంపైనున్న మూతను లాగిపారేశాడు.

ఇప్పుడు, యిందాకటి నోరూరించేవాసన ఉధృతంగా కలికి నాసికాపుటాలకు తగలసాగింది.

గోలెంపైనించి వంగి, లోనికి ఓ మొగ్గవేశాడు.

కలికి తిన్నగావెళ్ళి, మానవశరీర ఖండాలమధ్య పడ్డాడు. ఆ శరీర ఖండాలు ఓ పేరుమోపిన హంతకుడివి. ఆ హంతకుడి మెదడులోని కొన్నిభాగాల్ని మాత్రం, కలికి బుర్రలో నిక్షిప్తంచేసి, మిగతావాటిని తరువాత పారేయడానికి ఆ గోలెంలో కెమికల్స్‌లో పడేసివుంచాడు ప్రొఫెసర్ సుపర్ణో.

అందులోపడ్డ కలికి పెదాలకు కాకతాళీయంగా రక్తం అంటుకుంది. నాలికతో దాన్ని నాకాడు. అది ఎంతోరుచిగా అమృతంతో సమానంగా వున్నట్టనిపించింది.

మరుక్షణంలో, తనచేతికందిన మాంసఖండాన్ని తీసి నోటబెట్టుకుతినడం ఆరంభించాడు. నిముషంలో, ఒట్టి యెముకతప్ప యింకేమీ మిగలకుండా, ఆ మాంసఖండాల్ని తినేశాడు.

అరగంట గడిచింది.

ఆ గోలెంలోవున్న ఆఖరి మాంసఖండాన్ని కాళీ చేస్తుంటే, "కలికీ! కలికీ!" అంటూ ప్రొఫెసర్ వేసిన కేక విన్పించింది.

"ఇక్కడ ప్రొఫెసర్! ఇక్కడున్నాను" అన్నాడు కలికి.

కలికి కంఠస్వరం వినవచ్చిన గోలెంవద్దకు వచ్చాడు సుపర్ణో.

గోలెం లోని యెముకలపోగుల మధ్య, చేతిలో ఓ ఎముకతో నిలుచున్న కలికిని చూడగానే, సంగతి అర్థమై సుపర్ణో గుండాగినట్టయింది.

ఆ శరీర భాగాలు రెండువందల ఏభై పౌనులున్న ఓ పోట్ల యెద్దులాంటి మానవుడివి. వాటిని ఒక్క పిసరు మిగలకుండా, కలికి కాళీచేశాడంటే, కలికికి ఎంత ఆకలి వుందో అంచనావెయ్యటం కష్టం, అనుకున్నాడు సుపర్ణో.

తను కలికిలో పులిజీన్సు పెట్టినందుకు, ఆ క్రూరత్వమే గాకుండా, దాని ఆకలికూడా వచ్చింది.

కలికి శరీరతత్వం అర్థం అయింది సుపర్ణోకి. కలికికి ఆకలి అన్న ఫీలింగ్ లేదు. అయితే, ఒకసారి, మాంసం రుచిగాని, వాసనగాని అతనికి తగిలితే, అది తినేంత వరకూ వదలడు.

తన వూహ యెంతవరకూ నిజమో, తెలుసుకోవాలను కున్నాడు సుపర్ణో.

తనకు కుడిప్రక్కన, పులి శరీర భాగాలున్న గోలెం లోకి కలికిని దింపాడు.

మాంసం మళ్ళా కంటబడగానే, కలికి తిండిలో పడ్డాడు. పావుగంటలో పులిని ఊదేశాడు, పిసరు మిగలకుండా.

తను యెలాంటి భయంకర, విచిత్ర ప్రాణి సృష్టికి కారకుడయ్యేడో తలుచుకోగానే సుపర్ణో హృదయం గర్వంతో ఉప్పొంగింది.

కలికి ఉండటానికి, తిరగడానికి, యేలాటి యేర్పాట్లు చెయ్యాలో తన అసిస్టెంట్ తో చర్చించడానికి, బయటకు కదిలాడు సుపర్ణో.

3

వారంరోజులు గడిచాయి. ఈ వారం రోజుల్లో తను సృష్టించిన అపూర్వ ప్రాణి, అద్భుత మానవాకృతి కలికి గురించి, యెన్నో విషయాలు తెలుసుకున్నాడు సుపర్ణో.

కలికికి ఆకలి తెలీదు. అసలు ఆకలి అంటే యేమిటో అతనికి అనుభవంలో లేదు. కాని, మాంసం వాసన తగిలినా రక్తం రుచి తగిలినా, ఆ మాంసం అంతా ఒక్క పిసరు వదలకుండా తినేస్తాడు. అలా ఎంత పెట్టినా, ఎంత దొరికినా తినేయగలడు.

అయితే. తిన్నదంతా యేమవుతోంది? కనీసం అతడి పొట్ట అంగుళం ఎత్తుగా రావడంలేదు.

పులికైనా, యేనుగుకైనా. తినే తిండికి పరిమితివుంది. కాని కలికి విషయంలో అలాంటిదేమీలేదు.

అలాగని ప్రతిరోజూ ఎంతో కొంత ఆహారం ఇవ్వాల్సిన అవసరములేదు. ఎప్పుడూ ఆకలితో అల్లాడుతున్నట్టుగాని, ఆహారంకోసం ఆరాటపడుతున్నట్టుగాని కనిపించడు.

అంతేగాదు! కలికికి నిద్ర అవుసరంలేదు. క్షణంసేపు కన్ను మూస్తున్నట్టుగాని, ఒళ్ళు వాల్చి విశ్రాంతి తీసుకున్నట్టుగాని, కలికిని చూళ్ళేదు సుపర్ణో.

ఈ వారం రోజుల్లో కలికిమీద మరికొన్ని ప్రయోగాలు కూడా జరిపాడు సుపర్ణో.

కలికిని మంటల్లో పడేశాడు. కలికి కనీసం కందనయినా లేదు. అతనిమీద యాసిడ్ చిమ్మాడు. నీళ్ళు జారిపోయినట్టుగా, అతని వంటిమీంచి యాసిడ్ కారిందే తప్ప, కలికి శరీరం రవంత పాడవలేదు.

పెద్ద నీళ్ళ కుండీలో కలికిని పడవేసి, అతన్ని నీటి

అడుగున నొక్కిపట్టి ఉంచాడు గంటకు పైగా. కలికి, నీటిలో చేపలాగ, ఆరోగ్యంగా, హుషారుగా ఉన్నాడు తప్ప, ఊపిరాడక చావలేదు.

సుపర్ణో అంతటితో ఊరుకోలేదు.

పదునైన కత్తి తీసుకుని కలికిని రెండు ముక్కలుగా నరికాడు. కలికి రెండు ముక్కలుగా చీలిపోయాడు. కాని, తెగిన ముక్కల్లోంచి, చారెడు నల్లని జిగురువంటి ద్రవం కారాక, ఆశ్చర్యకరంగా, ఆ రెండు ముక్కలూ కదుల్తూ వచ్చి, అతుక్కుపోయాయి.

దాంతో తను సృష్టించిన కలికి యెంతటి మృత్యుం జయుడో అర్థమైంది సుపర్ణోకి.

అతని ఆనందానికి అవధులు లేవు.

ప్రపంచాన్ని తన గుప్పిట బిగించే సమయం ఆసన్న మైందనుకున్నాడు.

భయం!.....మనిషిని దాసోహం చేయించుకునే కీలకం భయంలోనే ఉంది. మనిషి తన యిష్టాయిష్టాల్ని సైతం మరిచిపోయి ఆజ్ఞలిచ్చేవాడ్ని తూచా తప్పకుండా అనుస రించేలా చేసేది భయం ఒక్కటే.

మానవ లోకం హృదయంలో భయాన్ని నింపి, ఆ లోకాన్ని తనకు 'జీ హుజూర్!' అనిపించేది కలికి.

తుపాకీ చూపెట్టి, దొంగ దోచుకున్నట్టుగా, తను కలికిని చూపి, ప్రపంచాధిపత్యం దోచుకుంటాడు.

అయితే కలికి శక్తి సామర్థ్యాలు లోకం తెలుసుకునేలా చేసి, ముందుగా లోకాన్ని హడలు గొట్టించాలి.

సుపర్ణో నిశితంగా ఆలోచించాడు.

ఏ విధంగా చూసినా, తనకు అడ్డుగా అహూతో నిలిచే ట్టుగా అవుపించేడు. కనీసం, తన చేజిక్కిన అధికారం

కొంత తనకు కూడా ధారా దత్తం చెయ్యమని అహోతో అడగవచ్చు.

సుపర్ణో ఓ నిశ్చయాని కొచ్చాడు ఎట్టికేలకు. తను ప్రపంచాధిపత్యం సాధించే కార్యక్రమం మొదలుపెట్టే ముందు, అహోతోని తన మార్గం నుంచి తొలగించాలి!

4

ప్రొఫెసర్ సుపర్ణో పరిశోధనలు కలికి సృష్టికి దారి తీశాక, అసిస్టెంట్ అహోతోకి ఆటవిడుపులా ఉంది.

ముందులా, లేబొరేటరీకి ఎక్కువగా వెళ్ళడంలేదు.

జీవితాన్ని ఆనందించడానికి సిద్ధమయ్యాడు. అతనికి ఇటీవల జరీనా అనే అమ్మాయితో పరిచయం యేర్పడింది. జరీనా కూడా సరదాలకోసం పడి చచ్చే మనిషి. ఇద్దరివీ ఒకే రకం అభిరుచులు కావడం మూలాన వీలుచిక్కినప్పుడల్లా యిద్దరూ యెవరో ఒకరి యింట్లో గడప నారంభించారు.

అవాళ సాయంకాలం జరీనా తల్లిదండ్రులు ప్రక్కవూళ్ళో జరిగే పెళ్ళికి వెళ్ళారు, కూతుర్ని ఒక్కర్తినీ యింట్లో వదలి. వారు మర్నాడు ఉదయానికిగాని తిరిగి యింటికి రారు.

ఆ రాత్రికి తన యింట్లోనే ఆనందంగా గడపడానికి అహోతోని ఆహ్వానించింది జరీనా.

రాత్రి తొమ్మిది కావస్తుండగా అహోతో జరీనా యింటికి వచ్చాడు హుషారుగా.

ఊరికి కాస్త చివరగా, ముచ్చటైన చిన్న తోట మధ్య మేడమీద నాలుగు, దిగువన నాలుగు గదులున్న ఆ చిన్న

భవంతి అంతా తమదే!

రెండు పెగ్గుల విస్కీ తరువాత, కబుర్లు చెప్పుకుంటూ తీరిగ్గా భోంచేశారు.

అప్పటికి రాత్రి పదిన్నరయింది.

దిగువ తలుపులకు తాళాలు బిగించి, మేడమీది పడక గదికి చేరారు, అహోతో, జరీనా.

పెద్ద లైటు తీసేసి, నైట్‌లాంప్ వెలుగులో, ఇద్దరూ నగ్నం అయి, పాల నురుగులాంటి దుప్పటి పరచిన మంచంమీదకు చేరారు.

అదే సమయంలో, బాల్కనీవైపున్న తలుపు కిర్రుమన డంతో అహోతో తలెత్తి చూశాడు, అటువైపు.

మసక వెలుతులో, నల్లగా, జిడ్డోడుతూ, భీకరంగా అవుపించే ఆ మరుగుజ్జు రూపాన్ని చూడగానే, అహోతో ఒళ్ళు జలదరించింది.

"కలికీ! నువ్వా....యిక్కడి కెందుకొచ్చావ్?" కాస్త విసుగ్గా అన్నాడు అహోతో.

కాని, కలికి జవాబియ్యలేదు. కుంకుడు గింజ ప్రమా ణంలో ఉన్న మెరుస్తున్న కళ్ళతో అహోతోవైపు తీక్షణంగా చూశాడు. అది నవ్వో, కోపంతో గుర్రుమనడమో తెలీలేదు గాని, తెరుచుకున్న అతని నోటిలోంచి వంకీ కత్తుల్లాంటి రెండు పళ్ళు, వాటి మధ్యన పారపళ్ళు అవుపించాయి, భయంకరంగా.

ఒక్కక్షణం అహోతో గుండెలు గుభేలు మన్నాయి.

జరీనా కంగారుగా లేచి కలికిని చూసి "ఎవడీ డర్టీ క్రీచర్?" అంది.

క్షణంసేపు నిశ్చలంగా నిలుచున్న కలికి చెంగున ఎగి

రాడు. అహాతో కుడిచెయ్యి చప్పున అందుకుని, నోట బెట్టుకుని కసుక్కున కొరికాడు.

"అమ్మో!"

ఇల్లు కూలిపోయేలా ఓ వెర్రికేక పెట్టాడు అహాతో. వెంటనే చెయ్యి గట్టిగా విదిలించాడు కూడా.

కలికి బంతిలా యెగిరి, గోడకు గుద్దుకుని పడ్డాడు. అహాతో చెయ్యి రక్తం కారడం ఆరంభించింది. కలికి కొరికినంతమేర కండవూడొచ్చి, ఎముక కనిపించసాగింది.

అహాతో భీతావహుండై వణకసాగాడు. జరీనా సంగతి సరేసరి! కెవ్వున కేకవేసి, స్పృహతప్పి పడిపోయింది.

నేలనుపడ్డ కలికికి పెద్దగా దెబ్బ తలిగినట్టులేదు. వెంటనే లేచాడు. అహాతోమీదకు లంఘించాడు. నోటికి దొరికిన శరీర భాగం కండ వూడొచ్చేలా కొరికాడు.

తన ప్రాణాలు అప్పుడే కడబట్టి పోయినా యనుకున్నాడు అహాతో.

ఇహ, అక్కడుండడం ఏ మాత్రం మంచిది కాదనుకున్నాడు. తలుపు తెరిచి బయటకు పారిపోవాలని తలుపు వద్దకు పరుగెత్తాడు.

తీరా తలుపువద్దకు వెళ్ళాక తాను నగ్నంగా ఉన్న విషయం గుర్తొచ్చింది. బట్టలకోసం వెనక్కు పరుగెత్తు కొచ్చాడు.

బట్టలు అందుకుని, తిరిగి పారిపోయేలోపల, కలికి ఎగిరి, అహాతో కంఠాన్ని దొరక పుచ్చుకుని, కొరికేశాడు.

మెడకోసిన మేకలాగ నేలమీదపడి, కాసేపు తపతపా కొట్టుకుని ప్రాణాలు వదిలాడు అహాతో.

ఆ తరువాత తీరిగ్గా అహాతో శవాన్ని ఆరగించడం

ఆరంభించి, పావుగంట గడిచేసరికి, అహూతోని అస్థి పంజ రంగా మాత్రం మిగిల్చాడు కలికి.

మంచంమీద స్పృహతప్పి పడున్న జరీనాకు తెలి వొచ్చింది. తలెత్తి అటువైపు చూసింది.

ఎముకలమీద చిన్న చిన్న మాంసపు పిసర్లని కూడా వదిలేయకుండా అహూతో శవాన్ని ఊదేస్తున్న కలికి కనిపించాడామెకు.

ఆమె గుండాగిపోయింది.

కాని, వెంటనే తేరుకుని, వేటగాడ్ని చూసిన లేడిలా, మంచం మీంచి ఒక్కపరుగుతో తలుపువద్దకు పరుగెత్తింది.

కాని, అదేసమయంలో, ఆమె కలికి కంటబడింది. అతడు మెరుపులా ఆమెమీదకు లంఘించి, ఆమె తొడ ఒడిపి పట్టుకుని కొరికేశాడు ఆత్రంగా.

ఆమె గట్టిగా కేకపెట్టి, అతడ్ని తన తొడమీంచి చేతులతో విసిరి గొట్టింది.

కలికి యెగిరి విసురుగా గోడకుతగిలి పడ్డాడు. కాని, వెంటనే లేచి, ఓ గెంతు గెంతి ఆమె కంఠాన్ని కొరికాడు.

ఆ తరువాత, పావుగంటలో, ఆమె ఒక అస్థిపంజరంగా మాత్రం మిగిలింది.

5

మర్నాడు ఉదయం పెళ్ళినించి తిరిగివచ్చారు జరీనా తల్లి దండ్రులు.

దగ్గరగా చేరవేయబడ్డ వికెట్ గేట్ తోసుకుని లోనికి వచ్చారు. కాని, ఆ వేళకే తమ కూతురు లేచి, తమకోసం యెదురుచూస్తుందనుకొన్న వారికి, దగ్గరగా బిగించి వున్న తలుపుల్ని చూడగానే నిరాశపడ్డారు. అయినా తలుపుల్ని

గట్టిగా తట్టి, కూతురి పేరెట్టి పిలిచారు. వారు ఎంతసేపు పిలిచినా, లోనించి నిశ్శబ్దమే జవాబు.

వారి మనస్సులు ఏదో ఘోరాన్ని శంకించడం ఆరంభించాయి. నలుగుర్నీ పిలిచి, తలుపులు బ్రద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు.

మేడమీద పడకగదిలో, వికృతంగా, వెల్లకిలా పడివున్న రెండు అస్థిపంజరాల్ని చూడగానే, స్థాణువులై పోయారు.

ఆ అస్థిపంజరాలు ఎవరివి అని తెలుసుకోవడం వారికి కష్టంకాలేదు. అక్కడే గదిలో చిందర వందరగా, జరీనావి అహీతోవి బట్టలు పడివున్నాయి. వాళ్ళు తొడుక్కునే చెప్పులు దిగువ గదిలో పడివున్నాయి.

అయితే, వారిద్దరూ ఒక్కరాత్రిలో అస్థిపంజరాలుగా యెలా మారారు?

యెముక మాత్రం మిగిల్చి, మాంసాన్ని ఫలహారం చేసిన ఆ వింత జంతువేమిటి?

జరీనా మరణం గురించి పోలీసులకు రిపోర్టిచ్చారు జరీనా తల్లిదండ్రులు.

అహీతోకి బంధువు లెవరూ లేకపోవడంవల్ల, అతని మరణం గురించి, ప్రొఫెసర్ సుపర్ణోకి తెలియజేసారు వాళ్ళు.

అహీతో మరణవార్త వినగానే, మొదట ఆశ్చర్యం, ఆ తరువాత దుఃఖం నటించాడు సుపర్ణో.

ఆ తరువాత జరీనా యింటిలో. అస్థిపంజరాల్ని చూడగానే, మెల్లగా కలికి విషయం బయట పెట్టాడు ఇలా:

"మనుషుల్ని చంపి, వాళ్ళ మాంసాల్ని భోంచేసి, అస్థిపంజరాల్ని మిగిల్చేది ఎవరోకాదు. కలికి!....అదే, నా జెని

టిక్స్ పరిశోధనలతో సృష్టింపబడిన వింతమానవుడు. కలికి నాతోనే, నా బంగళాలోనే ఉంటున్నాడు. రాత్రి ఏదో పని మీద లేచి చూసేసరికి, అతడు నా యింట్లోలేడు. అర్ధరాత్రి పూట వెతికే ఓపికలేక నిద్రపోయాను. కాని, తీరా తెల్లారే సరికి, కలికి మళ్లా యింట్లోనే ఉన్నాడు. రాత్రివేళ పారి పోయి, కలికి చేసిన నిర్వాకం యిదన్నమాట.... ఒరేయ్! కలికీ .. నా ప్రాణమిత్రుడ్ని. నా అసిస్టెంట్‌ని పొట్టబెట్టు కున్న నిన్నేం చేస్తానో చూడు," ఆవేశంగా లేచాడు సుపర్ణో.

లేచిన వాడ్ని లేచినట్టుగానే కూచోబెట్టి, కలికి గురించి ఓ డిటెయిల్డ్ స్టేట్‌మెంట్ తీసుకొన్నారు పోలీసులు.

జరీనా యింట్లోకి అస్థిపంజరాల ఫొటో, దాని ప్రక్కన కలికి ఫొటో, వీటితో ప్రొఫెసర్ సుపర్ణో యిచ్చిన స్టేట్‌మెంట్ మర్నాడు దేశంలోని పత్రికలన్నీ మొదటి పేజీల్లో పతాక శీర్షికలతో ప్రచురించాయి.

కలికి ఒక సెన్సేషన్ అయిపోయాడు, ప్రపంచ వింతల్లో మహా వింత అయిపోయాడు.

అతడ్ని సృష్టించిన ప్రొఫెసర్ సుపర్ణో 'అపరబ్రహ్మ' గా శాస్త్రవేత్తల కూటాల్లో పిలవబడసాగాడు.

6

అవాళ ఉదయంనుంచీ ఆకాశం మబ్బులతో వుంది. ఏ క్షణానైనా వర్షం ఆరంభమైతే, కుంభవృష్టి కురుస్తుంది.

ఉదయం పది దాటి పావుగంట అయింది. మంచు ముక్కలా ఒళ్ళు జల్లుమనిపించే చల్లగాలి వీయడం మొదలు పెట్టింది.

అలాంటి వాతావరణం అంటే, సుపర్ణోకి చాలా ఇష్టం. పైగా, తను కలికి గురించి పోలీసులకు యిచ్చిన స్టేట్

మెంట్, జనం మీద ఆశించిన విధంగానే పనిచేసింది. కలికి పేరు విన్నా, కలికి కనీసం తలంపుకు వచ్చినా, జనం తారెత్తిపోతున్నారు. ఇహ తను చేయాల్సింది ఒక్కటే. కలికిని చూపించి, పదవుల్లో ఉన్న ప్రెసిడెంట్లని, ప్రైం మినిష్టర్లని గద్దె దింపి, ఆ అధికారం తన హస్తగతం చేసుకోవాలి.

సుపర్ణో పగటి కలల్లో తేలిపోసాగాడు. అప్పుడే వివిధ దేశాల నాయకులు తనకు అధికారం అప్పచెప్పినట్టూ, తన చేతిక్రింద 'వరల్డ్ గవర్నమెంట్' యేర్పడినట్టూ, సుపర్ణో కళ్ళముందు పంచరంగుల దృశ్యాలు కనిపించసాగాయి.

సుపర్ణో హృదయం ఆనందంతో చిందులు వేయసాగింది. తోటవైపుకు తెరుకునే కిటికీకి దగ్గరగా, రెండు కుర్చీలు మధ్యకు ఓ టీపాయ్ లాగాడు. తన కెదురుగా ఉన్న కుర్చీలో, కలికిని కూచోబెట్టాడు.

బ్లాక్ నైట్ విస్కీ రెండు గ్లాసుల్లో సగానికి ఒంపి, మిగతా సగం చల్లని నీటితో నింపి ఓగ్లాసు కలిక్కి అందించాడు. తనొకటి తీసుకుని, కుర్చీలో విశ్రాంతిగా వెనక్కి చేరబడి, సిప్ చెయ్యసాగాడు.

"యేమిటిది ప్రొఫెసర్?" అన్నాడు కలికి, గ్లాసు వాసన చూసి.

"అమృతం. త్రాగి చూడు. స్వర్గం చేతిలో ఉంటుంది క్షణాల్లో" చెప్పాడు సుపర్ణో.

"అలాగా?" అంటూ కలికి గ్లాసులోని ద్రవాన్ని కాస్త చప్పరించాడు. చేదుగావుంది. ఊసెయ్యబోయాడు. కాని, తమాయించుకుని, గుటక వేశాడు మృదువుగా. గొంతు దిగాక, బాగానే వుందనిపించింది. రెండో గుటక ద్రవం

పొట్టలో కెళ్ళేసరికి విస్కీ ప్రభావం చూపించడం ఆరం భించింది.

"థేంక్యూ ప్రొఫెసర్!" అంటూ కలికి గ్లాసు ఖాళీ చేసేశాడు నిముషంలో.

సుపర్ణో దిగ్భ్రాంతుడయ్యాడు. తన గ్లాసులో విస్కీ యింకా మూడొంతులుంది. కాని, కలికి, తన గ్లాసు పూర్తి చేసేశాడు.

ఖాళీ గ్లాసు నేలను పారేసి, కలికి మెల్లగా తూగుతూ లేచాడు. కుర్చీలమీద, బెంచీలమీదకు యెక్కి గెంతడం ఆరంభించాడు. నేలమీద పడి దొర్లుతూ, పిల్లి మొగ్గలు వెయ్యసాగాడు.

విస్కీ త్రాగుతూ సర్కస్ బఫూన్ చేష్టలు చూపి ఆనందిస్తున్నట్టుగా కలికి విస్కీ మత్తులో చేసే పనులు చూసి ఆనందిస్తున్నాడు సుపర్ణో.

ఆకాశంలో ఒక్కసారి పెద్ద మెరుపు మెరిసింది. వెను వెంటనే, భూమి అదిరిపోయేటట్టుగా ఉరుము వినబడింది.

అదిరిపడి కిటికీలోంచి బయటకు తోటలోకి చూశాడు సుపర్ణో. వర్షం యెప్పుడు మొదలయ్యిందో యేమోగాని, నిలిచి కురుస్తోంది దడ్డంగా.

కాసేపు వర్షంవైపు ధ్యాన్నంగా చూసి, కలికి సంగతి గుర్తుకు రాగానే, కలికివైపు దృష్టి మరల్చాడు. కలికి ఎదురుగా నిలబడి గుర్రుగా చూస్తున్నాడు తననే. సుపర్ణో ఏదో అనబోయేంతలో, సుపర్ణో గొంతుక అందుకుని కొరికేశాడు, కలికి యెగిరి.

మెడ కోసిన మేక లాగు సుపర్ణో నేలమీదపడి, రెండు క్షణాలు తపా తపా కొట్టుకుని ప్రాణాలు వదిలాడు.

ఆ తరువాత మెల్ల మెల్లగా, సుపర్ణోని భోంచెయ్యడం ప్రారంభించాడు కలికి.

కడుపులో కెక్కిన విస్కీ, కలికిని అల్లరి పెట్టడం మానలేదు.

పావుగంట తర్వాత సుపర్ణో యిల్లు వదిలి, వెలుపలికి వచ్చాడు కలికి.

హోరుమంటూ వాన కురుస్తోంది. మెరుపులతో ఉండి ఉండి ఆకాశం చీలిపోతోంది.

నిలువునా వాన నీటిలో తడిసిపోతూ వీధిన నడవ సాగాడు కలికి.

ఇప్పుడు కలికిని తెలియనివారు లేరు. పిన్నలు, పెద్దలూ, చదువుకున్నవాళ్లూ, చదువు లేనివాళ్లూ—అందరికీ కలికి సంగతి తెలుసు.

కలికి రోడ్డుమీద పోతుంటే, భయాందోళనలతో ఇళ్ళల్లోకి పోయి జనం తలుపులు బిగించుకోసాగారు.

అయితే అందరి యిళ్లూ రోడ్డు ప్రక్కనే లేవు.

రోడ్డుమీద దొరికిన వారిని దొరికినట్టుగా ఒకరి తర్వాత ఒకరిని కలికి ఫలహారం చేయసాగాడు.

కలికి వెళ్తున్న రోడ్డంతా అస్థిపంజరాలతో నిండిపో సాగింది.

7

"రోడ్డుమీద అస్థిపంజరాలు"—కలికి దేశంమీద పడి, జనాన్ని తినేస్తున్న వైనం గురించి, మర్నాడు పత్రికల నిండా వార్తలే.

వీలయినంతమట్టుకు కలికిని ప్రాణాలతో పట్టుకుని బంధించడానికీ, మరీ వీలుకాకపోతే, కాల్చి చంపడానికీ, పోలీసులకు ఆర్డర్లు జారీ చేయబడ్డాయి.

కలికిని తుదముట్టించే బాధ్యత ఇన్స్పెక్టర్ నరసింహా నికి అప్పగించబడింది.

నరసింహం ఉద్దేశంలో కలికి ఓ పొట్టి వెధవ. అర్థంలేని భయాలతో, ప్రజలు వణికి చస్తున్నారు. నిజానికి ప్రజలు నిరాయుధులు. వాళ్లేం చేయగలరు?

కలికిని ఓ పట్టుపట్టడానికి బయలుదేరాడు నరశింహం, మోటార్ బైక్ మీద.

బైక్ మీద కదలి వెళ్తున్న నరశింహం, ఎనుపోతు ఎక్కిన యమధర్మరాజులా ఉన్నాడు.

నాలుగు రోడ్ల జంక్షనుకు వచ్చాడు. ఆ చుట్టుపట్ల యెక్కడో కలికి తిరుగాడుతున్నాడని వార్తలొచ్చాయి అంతకు ముందే.

జనసమ్మర్దంతో కిటకిటలాడుతూ వుండాల్సిన జంక్షన్, ఊళ్ళో కర్ఫ్యూ విధించినట్టు నిర్మానుష్యంగా ఉంది.

ఒకటి రెండుచోట్ల, రోడ్డు కడ్డంగా ఒకటి రెండు అస్థి పంజరాలు అవుపించాయి. అవి కలికి తినేసిన మనుషుల తాలూకావేనని అర్థంకాగానే, అతని గుండెలు దడదడ లాడిపోయాయి.

అయినా తమాయించుకుని, ముందుకు కదిలాడు.

దూరంగా పేవ్ మెంట్ మీద ఏదో నల్లని పొట్టి ఆకారం కదులుతూ అగపడింది. అతడే కలికి!

దగ్గరగా వెళ్ళి, బైక్ ఆపి, నిలబడ్డాడు.

కలికి గుర్రుగా నరశింహంవైపు చూశాడు! ఆ ఒక్క చూపు చాలు! నరశింహం వెన్నెముకలోంచి భయం కరెంటులా ప్రాకింది. చటుక్కున రివాల్వర్ తీసి టపటపా ఆరు రౌండ్లు కాల్చాడు, గురిచూసి. కలికి మాత్రం చెక్కు

చెదరలేదు.

భయాన్ని గుండెలోనే అదిమిపట్టి, బైక్ స్టార్ట్ చేశాడు నరశింహం. అదేసమయంలో కలికి, దూది పింజంత తేలిగ్గా గాలిలోకి యెగిరి, నరశింహం చెయ్యి నోట కరుచుకున్నాడు.

భయంవల్ల వంట్లో రక్తం నీరయిపోగా, పెద్ద కేకపెట్టి, చెయ్యి విదిలించాడు గట్టిగా.

కలికి విసురుగా పోయి రోడ్డుమీద పడ్డాడు.

ఓ ప్రక్క కలికి కరచినచోట రక్తం ఆగకుండా కారి పోతున్నా, అదే అదనుగా కనిపెట్టి, బైక్ దూకించాడు ముందుకు.

రోడ్డుమీద పడ్డ కలికి తాపీగా లేవడానికి ప్రయత్నిస్తు న్నాడు.

బైక్ని ఓ రౌండు కొట్టించి, క్షణం ఆలస్యం చెయ్య కుండా సర్రున కలికిమీంచి పోనిచ్చాడు నరశింహం.

కలికి బైక్ చక్రాలక్రింద నలిగి, అప్పచ్చిలా రోడ్డుకు అంటుకుపోయాడు. అతడి నోట్లోంచి ఆకుపచ్చని జిగురు లాంటి పదార్థం బయటికొచ్చింది.

"పొట్టి వెధవ! ఫినిష్డ్!" అనుకుంటూ బైకుని ఓ చుట్టు చుట్టి, తను చేసిన ఘనకార్యం పరిశీలించడానికి వచ్చాడు వెనక్కి.

అప్పటికి రబ్బరు బంతిలా తిరిగి పొంగి నిటారుగా నిలిచి ఉన్నాడు కలికి.

బైకుమీద నరశింహం చేరువుకు రాగానే, ఒక్క ఎగురు యెగిరి, అతడి కంఠం దొరకపుచ్చుకున్నాడు కలికి.

కల్లో గూడా తలవని విధంగా జరిగేసరికి, నరశింహం బేజారెత్తిపోయాడు. అతని మతి గతి తప్పింది.

తన కంఠం అందుకున్న కలికిని వదిలించుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు నరశింహం. ఆ ప్రయత్నంలో అతని చేతులు బైక్‌ని వదిలేశాయి.

బైక్ స్పీడుగా పోయి, పేవ్‌మెంటును గుద్దుకుంది.

పుచ్చకాయలాగ నరశింహం దొర్లాడు రోడ్డుమీదకు. ఇంత జరుగుతున్నా, కలికి అతడి కంఠం విడువలేదు.

పావుగంటలో నరశింహాన్ని ఫలహారం చేసేసి, అస్థి పంజరాన్ని మాత్రం మిగిల్చాడు కలికి.

8

నరశింహం కలికి వాతబడ్డంతో పోలీసుడిపార్టుమెంటులో పెద్ద సంచలనమే కలిగింది.

నరశింహానికి అటు డిపార్టుమెంటులోనూ, యిటు ప్రజల్లోనూ నరశింహం రాక్షసుడనీ, పచ్చినెత్తురు తాగే పరమ కిరాతకుడనీ, చంటిపిల్ల చావు చూసినా గుండె కరగని పాషాణమూర్తనీ, గొప్ప పేరుంది. అలాంటివాడ్ని కలికి ఉల్లిపాయలాగు నంచేసుకున్నాడనగానే, డిపార్టుమెంటు అధికారులకి మతిపోయింది.

ఈ లోపున కలికి అజీర్తి అన్నది యెరగకుండా జనాన్ని ఒకరి తర్వాత ఒకర్ని భోంచేస్తూనే వున్నాడు.

"కలికిని చంపడం మీకు చేతకాధని చెప్పండి. ఆర్మీకి ఆ పని అప్పజెప్తాం," అంది ప్రభుత్వం ఆగ్రహంగా, పోలీసు డిపార్టుమెంటుతో.

తమ చేతగాని తనాన్ని ఒప్పుకోమనేసరికి పోలీసు డిపార్టుమెంటుకు కోపం వచ్చింది.నరిశింహం ఒక్కడికి చేతగానంత మాత్రాన, డిపార్టుమెంటంతా గొడ్డుపోయినట్టేనా అని అనుకుంది.

ఈ సారి కలికిని వధించే పని డి. యస్. పి. దీక్షిత్ కి అప్పజెప్పారు.

తనకు అప్పజెప్పే పనులేవీ పూర్తయేంతవరకూ నిద్ర పోడనీ, దీక్షతో పనిచేస్తాడనీ, దీక్షిత్ కు డిపార్టుమెంటులో పెద్ద పేరుంది. అతి ప్రమాదకరమైన నేరస్తుల్ని, కోర్టు విచారించి శిక్షవేసే లోపల తగిన శిక్ష. అంటే మరణ దండనకు తక్కువ గాకుండా విధించే పని సర్వ సాధారణంగా దీక్షిత్ తనమీద వేసుకుంటాడు.

అలా చాలామందిని తుడిచిపెట్టేసి, డిపార్టుమెంటుకు తలనొప్పి, కోర్టులకు అనవసరపు పని తగ్గించేడు దీక్షిత్.

డి. యస్. పి దీక్షిత్ రంగంలోకి దిగాడు. చాకుల్లాంటి నలుగురు జవాన్లని వెంటబెట్టుకుని కలికిని వెతుక్కుంటూ పోలీసు వేనులో బయలుదేరాడు రోడ్డుమీద.

కలికి కంటబడగానే కాల్చి పారేయ్యడానికి తన అనుచరులు నలుగురికీ ముందే చెప్పి ఉంచాడు దీక్షిత్.

దీక్షిత్ అనుకొన్నట్టుగానే రోడ్డుమీద ఓ మనిషిని అస్థిపంజరంగా మార్చేస్తూ అవుపించాడు కలికి.

కలికిని చూడగానే, వేను ఆపించాడు దీక్షిత్, అతడి అనుచరులు వేను దిగబోతూనే, దీక్షిత్ యిచ్చిన ఆజ్ఞ ప్రకారం కలికిమీద తుపాకీలు కాల్చారు.

గుళ్ళు కలికి ఒంటికి కన్నాలుచేస్తూ బయటకుపోయాయి. కాని, కలికి మరణించలేదు. గుళ్ళవల్ల కలిగిన కన్నాలు, యేర్పడినంత వేగంగా మూసుకుపోయాయి.

దీక్షిత్ దిగ్భ్రాంతుడయ్యాడు. మొట్ట మొదటిసారిగా అతని జీవితంలో, తన శక్తి సామర్థ్యాలమీద అపనమ్మకం యింకో ప్రాణిని చూడగానే గుండెల్లో యేదోరకం దడ

కలిగాయి అతడికి.

కలికి యిప్పుడు మెల్లిగా తనమీద తుపాకీలు కాల్చిన వాళ్ళమీదకు రావడం మొదలు పెట్టాడు.

అది చూసిన జవాన్లు నలుగురూ తారెత్తిపోయి. తుపాకీలు ముడిచేసి వెనుదిరిగి పరుగు లంకించుకున్నారు.

ఆ క్షణంవరకూ 'బ్రతుకు తీపి' అనే మాటకు అర్థం తెలీని వారికి అనుభవంలోకి వచ్చింది మొదటి సారిగా.

"దొంగనా కొడకల్లారా!....పిరికిపిందల్లా పరుగులెడుతున్నారేమర్రా....కత్తులు తీసి నరికి చంపండి" అరిచాడు దీక్షిత్.

దీక్షిత్ కేకలకు జవాన్లు వెనుదిరిగారు. మొలలకు తగిలించుకున్న కత్తులు బయటకు లాగారు.

వస్తున్న కలికిని వచ్చినట్టుగానే, ఒక జవాను తన బారు కత్తితో రెండు ముక్కలుగా నరికాడు.

కలికి రెండు ముక్కలుగా చీలిపోయి దూరంగా పడ్డాడు.

అయితే, రెండు క్షణాల్లో, ఆ రెండు ముక్కలూ ఒక చోటకు చేరి, ఒకటిగా అయిపోయాయి ఆశ్చర్యంగా.

ఆ సంఘటన చూడగానే, మెరుపులాంటి ఆలోచన వచ్చింది దీక్షిత్‌కి.

కలికిని ముక్కలు ముక్కలుగా నరికి, అవి తిరిగి అతుక్కునే లోపల, భూమిలో దూరంగా పాతిపెడ్తేనో?....

క్షణం ఆలస్యం చెయ్యకుండా ఆర్డర్లు జారీ చేశాడు దీక్షిత్.

ఇలాంటి సందర్భాల్లో పై అధికార్లు యిచ్చే ఆర్డర్లు తూచా తప్పకుండా అమలుజరిపే అతని అనుచరులు వెంటనే పనికి ఉపక్రమించారు.

కలికి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా దీక్షిత్ నరికితే,

నరకబడిన ముక్కల్ని పెద్ద గోతులు తీసి కప్పెట్టేశారు అనుచరులు.

పావుగంట గడిచింది. అరగంట గడిచింది. గంట గడిచింది. కప్పబడిన గోతులు కప్పినట్టుగానే ఉండిపోయాయి.

"వెల్‌డన్!" తన అనుచరుల్ని అభినందించాడు దీక్షిత్.

"మీరు జీనియస్ సార్!" దీక్షిత్ అనుచరులు తిరిగి అతడ్నీ అతడి అయిడియాని మెచ్చుకొన్నారు.

లోకానికి కలికి బెడద శాశ్వతంగా తొలగించిన హీరోగా దీక్షిత్ ఫొటోలు, అతని జీవిత సంగ్రహం, అతనితో ఇంటర్వ్యూ వగైరా అంశాలతో, దీక్షిత్ గురించి ప్రముఖ వార్తలు ప్రచురించాయి మర్నాడు పత్రికలన్నీ.

'స్పెషల్ ఎవార్డ్ ఫర్ కాన్స్పిక్యుయస్ వేలర్' అనే ప్రత్యేక బహుమతి యేర్పాటుచేసి, మొదటిసారిగా దీక్షిత్‌కు యివ్వడానికి తీర్మానించింది ప్రభుత్వం. ***

ఒక ఆఫీసులో ఇంటర్వ్యూ జరుగుతోంది—

ఆఫీసరు:- మీకు పనిలో అనుభవం లేక పోయినా, జీతం ఎక్కువ కావాలంటున్నారెందు చేత?

అభ్యర్థి:- అది అంతేనండి! పనిని గురించి బొత్తిగా తెలీనప్పుడే కదా కష్టం ఎక్కువ. కష్టం ఎక్కువ కాబట్టి ఎక్కువ జీతం కోరటం న్యాయమే కదా!

—గోగుల జగన్నాథరావు, యలమంచిలి.

సుమత్రా దీవి

సంపత్

"మన దేశానికి తూర్పుగా జావా, సుమత్రా మొదలయిన దీవులున్నాయని నీకు తెలుసు. వాటిల్లో సుమత్రా దీవి చాలా పెద్దది. సుమత్రాకు సౌత్-వెస్ట్ దిశలో చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. ఒక్కొక్క దీవి వైశాల్యం నాలుగయిదు చదరపు మైళ్ళనించి, పదిహేను, ఇరవై చదరపు మైళ్ళవరకూ ఉంటుంది.

సుమత్రా దీవిమీద "రాకెట్ లాంచింగ్ స్టేషన్" ఒకటి వెలిసిందీమధ్య. "క్రైనా" దేశం అధ్వర్యంలో ఆ రాకెట్ లాంచింగ్ స్టేషన్ పనిచేస్తూంది. ఆ స్టేషన్ ఉద్దేశ్యం వాతావరణ పరిశోధన, అంతరిక్ష పరిశోధన అని చెబుతున్నా వాటి వెనక ముఖ్యోద్దేశం మరొకటి ఉంది.

ఇది చెప్పబోయేముందు ఇటీవల సంభవించిన సంఘటనలు కొన్ని చెప్పాలి. ఇటీవల కొన్ని దేశాలలో చిత్రంగా అతివృష్టి, అనావృష్టి సంభవిస్తూంది. ఇది మామూలే,

దీనిలో విచిత్రం ఏమిటని నీకు సందేహం కలగవచ్చు. ఎప్పుడూ అతివృష్టితో బాధపడే దేశాలు చిత్రంగా అనావృష్టిని ఎదుర్కోవాల్సి వచ్చింది. అలాగే అనావృష్టితో బాధపడే దేశాలులో అతివృష్టి సంభవించింది. ఇండియాలో కూడా కొన్నిచోట్ల ఇలా జరిగాయి.

ఈ మార్పులు ప్రపంచ రాజకీయ నాయకులనేగాక, వాతావరణ శాస్త్రజ్ఞులను కూడా కలవరపెట్టింది. వారు అనేక పరిశోధనలు జరిపి తెలుసుకున్న విషయం ఏమిటంటే, వాతావరణంలో ఉన్న గాలిలో తెలియని రసాయనాలు కొన్ని ఉన్నట్లు కనుగొన్నారు.

ఈ 'వింత' 'కైనా'నే చేస్తోందా అన్న అనుమానం ప్రపంచాధినేతలకు కలగపోలేదు. అందుకే 'కైనా'కు సంబంధించిన లాంచింగ్ స్టేషన్‌ని పరిశోధించటానికి చాలా దేశాలు ఏజంట్లను నియమించాయి. అయితే ఏ ఒక్కరూ తిరిగిరాలేదు.

ఈ వివరాలనుబట్టి చూస్తే 'కైనా'నే తన రాకెట్ లాంచింగ్ స్టేషన్ ద్వారా రసాయనాలను రాకెట్‌లలో అంతరిక్షంలోకి పంపి, జల్లుతోందని నిర్ణయించవచ్చు.

అందుకే ఈ రాకెట్ లాంచింగ్‌స్టేషన్‌ని ధ్వంసం చేయడానికి రహస్యంగా కొన్ని దేశాలు నిర్ణయించుకున్నాయి. వాటిల్లో ఇండియా ఒకటి. మానవాళికి హాని కల్గించే ఏ ప్రయత్నాన్నయినా ఇండియా మొదటినుంచి గర్హిస్తోంది.

కాని ఆ స్టేషన్‌ను ధ్వంసం చేయడం రహస్యంగా జరగాలి. డైరక్టుగా ఆ పనిచేయడానికి వీలులేదు. ఎందుకంటే ఆ స్టేషన్‌లో ఇతర కార్యక్రమాలు కూడా మామూలు

గానే జరుగుతున్నాయి. వారిని అనుమానించటమే తప్ప, ఆధారాలు చూపలేము. అందుకే దానిని ధ్వంసంచేసే పని రహస్యంగా జరిగిపోవాలి.

ఈ ఆపరేషన్ చాలా ప్రమాదకరమయింది. ఇది వరకులా నీకు ప్రభుత్వంనుండి ఎటువంటి సహాయమూ రాదు. నీ స్వబుద్ధితో, తెలివితేటలు, సమయస్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించవలసి ఉంటుంది."

'చీఫ్' చెప్పటం ముగించి, ప్రక్కనే ఉన్న ఫ్రిజ్‌లో నుండి వాటర్ తీసుకుని తాగారు.

నేను మరికొన్ని వివరాలు తెలుసుకొని బయటకు నడిచాను.

2

శత్రువుల కంటబడకుండా సుమత్రా దీవి చేరుకోవాలంటే, టూరిస్టుగా వెళితే బాగుంటుందనుకున్నాను.

వెంటనే వెళ్ళి పాస్‌పోర్టు, వీసాకోసం అప్లికేషన్ పడేశాను. దీనివల్ల నామీద అనుమానం కొంత తగ్గటమే కాకుండా, ఒకవేళ పట్టుబడితే టూరిస్టునని చెప్పవచ్చు.

వారంరోజులకు పాస్‌పోర్టు, వీసా వచ్చాయి. వీటి వెనక చీఫ్ హస్తం ఉందని తెలుసు.

పదిరోజుల తర్వాత టూరిస్టుగా బయలుదేరాను. నా మొదట మజిలి పారిస్. ఈ ఆపరేషన్ పుణ్యమా అని ప్రపంచయాత్ర చేయగల్గుతున్నాను. తరవాత వాషింగ్టన్. అక్కడినుంచి ఆస్ట్రేలియాలోని 'డార్విన్' నగరానికి చేరుకున్నాను.

డార్విన్ చేరిన తరువాత నా ఉద్దేశాన్ని మార్చుకున్నాను. సరాసరి సుమత్రా వెళ్ళి, ఆపరేషన్ ప్రారంభించే

కంటే, ఇక్కణ్నుంచి ప్రారంభిస్తే బాగుండునని తోచింది. ఆ ఆలోచన రావడమే తడవుగా, అద్దెకు తీసుకున్న కారులో సముద్రతీరాన్ని చేరి, క్షుణ్ణంగా పరిశీలించి వచ్చాను.

మరునాడు మధ్యాన్నం పది గంటలకు 'డార్విన్'కి చాలా దూరంగా వున్నాను.

మోటారు బోటును చాలా వేగంగా నడుపుతున్నాను. పాపం! అబద్ధం ఆడక తప్పలేదు.

తీరాన వున్న కొన్ని 'సైక్లింగ్ క్లబ్'లు మోటారు బోట్లను అద్దెకిస్తారు. గంటకింత అని చెల్లించాలి. ఆ బోట్ల ద్వారా కావాలంటే మోటారుబోట్ డ్రైవింగ్ నేర్పుతారు కూడా. చాలామంది ఊరికే సముద్రంలో తిరిగి రావటానికి తీసుకుంటారు.

అంతకుముందే నా సూట్‌కేస్‌ని బోట్‌లో ఉంచాను. బోట్ కండిషన్ కూడా చాలా బాగుంది. పైగా టాంక్ నిండా పెట్రోలు వుంది. అంత దూరం సరిపోతుందో లేదో నన్పించింది.

అందరితోపాటే ఓ అరగంట తిరిగి, సముద్రంలోకి బోట్‌ని మళ్ళించాను. క్రమంగా మిగిలినవారు దూరం అయిపోయారు.

రెండు గంటలు ప్రయాణించాను. దూరంగా అయిదారు చేపలుపట్టే ట్రాలర్స్ కన్పిస్తున్నాయి.

వాటిని దాటి చాలా ముందుకు వచ్చేశాను. ఎండ విపరీతంగా ఉండటంవలన ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. హోరుమన్న గాలి చప్పుడు. తలకి టవల్ చుట్టుకోవటానికి స్టీరింగ్ ముందు నుంచి లేవకుండానే. కేస్‌వైపు తిరిగాను.

అదిరిపడ్డాను. దూరంగా నాలుగు బోట్లు వస్తున్నాయి.

ఓ పెన్‌బోట్సు. అవి నా వెంట పడుతున్నాయని వాటి వేగమే చెపుతుంది.

ఇంతకు ముందు లేనివి యిప్పుడెలావచ్చాయి? హఠాత్తుగా ట్రాలర్స్ గుర్తుకొచ్చాయి. యస్. అక్కడనుంచే నన్ను వెంటాడటం ప్రారంభించి ఉండాలి. గాలి హోరులో నాకు ఆ సంగతే తెలియలేదు.

3

బోట్ స్పీడ్‌ని మాక్సిమమ్‌కు పెంచాను.

కనుసన్నలలోనుండి వారిని గమనించాను. బోట్లు మరింత దగ్గరయ్యాయి. నాలుగు బోట్లలోను పన్నెండు మంది ఉన్నారు. ఒక్కొక్కదానిలో ముగ్గురు. ఒకడు నడుపుతున్నాడు. మిగిలిన యిద్దరు గన్స్‌పట్టుకొని కూర్చున్నారు.

ఒకవేళ సెక్యూరిటీగార్డ్స్ కాదు గదా! లేక కస్టమ్స్‌వాళ్లా? వెనుదిరిగి చూశాను. కస్టమ్స్ ఫ్లాగ్ కన్పించలేదు. ఖచ్చితంగా శత్రువుల మనుషులే.

వెనకనుంచి మెషిన్‌గన్ కాల్పులు ఆరంభం అయ్యాయి. బోట్ ప్రక్కనే నీళ్ళల్లోపడి, నీటిని చిమ్ముతున్నాయి. నేను రేంజ్‌లోకి వచ్చానని అర్థం అయింది.

బోట్‌ని తిన్నగా పోనివ్వకుండా, అటూ ఇటూ పోనిస్తూన్నాను. ఒక చేత్తో స్టీరింగ్ కంట్రోలు చేస్తూ, రెంటోచేత్తో జేబులోనుంచి రివాల్వర్ లాగాను. దీని రేంజ్ ఎక్కువ. స్పెషల్ రివాల్వర్.

ఒకచేత్తో స్టీరింగ్ కంట్రోలు చేయడం, మరో చేత్తో రివాల్వర్ పట్టుకొని గురి చూడటం చాలా కష్టంగా ఉంది. బోటు కంట్రోలులో నుంచి పోవచ్చు. గురి తప్పుతుంది. రెండు విధాలా నష్టం.

వెనక్కు తిరిగి చూశాను. పొడుగాటి స్టీల్ గొట్టం కన్పించింది. చేపలు పట్టటానికి ఉపయోగించేది. ఆ స్టీల్ గొట్టంలో గొట్టంలా వుండి, అవసరమయితే పెద్దదిగానూ, చిన్నదిగానూ చేయవచ్చు.

దానిని చిన్నదిచేసి, విండ్‌షీల్డ్ కొద్దిగా తెరిచి స్టీరింగ్ పంగలోనుండి అద్దంలోనికి పోనిచ్చి, బిగించాను. ఇప్పుడు బోట్ స్టెడీగా పోతూంది.

ఇదంతా చేయటానికి ఎక్కువ టైం తీసుకోలేదు నేను. చకచక రెండు నిమిషాలలో ముగించాను. సూట్‌కేస్ అడుగునుంచి, మెషిన్‌గన్ పార్టులు తీసి, క్షణాల్లో బిగించాను.

వెనక్కి చేరి, బోర్లా పడుకొని నేనూ కాల్పులు సాగించాను.

వారు కాలుస్తున్న గుళ్ళు బోటు వెనక పడి నీటిని చిమ్ముతున్నాయి. బోటు విపరీతం అయిన స్పీడ్‌లో పోవటంవల్ల నీళ్ళు చుట్టూ చిందుతున్నాయి.

నేను కూడా కాల్పులు ప్రారంభించేసరికి, వెనక బోట్లు విడిపోయినాయి. ఇందాకటి కంటే వేగంగా దూసుకొస్తున్నాయి.

వారి ఉద్దేశ్యం అర్థం అయింది. నన్ను చుట్టుముట్టి, మట్టుపెట్టడానికి పథకం వేస్తున్నారు.

నా ప్రక్కకు రావటానికి ప్రయత్నిస్తున్న బోట్ కన్పించింది. వెంటనే గన్‌కి పని కల్పించాను. పెద్దగా అరుస్తూ ఎగిరి పడ్డారిద్దరు సముద్రంలో. అంతటితో ఆగలేదు నేను. ఆ బోటుకి చిల్లులు పెట్టాను. టాంక్‌కి తగిలాయి కాబోలు, భగ్గుమన్న శబ్దంతో పేలిపోయిందా బోటు.

అయితే ఈ లోపున మిగిలినవాళ్ళు కాల్చిన గుళ్ళకి నేనున్న బోటు విండ్‌షీల్డ్ బద్దలవడంతో గాలి ఈడ్చికొడుతూంది. మొహం పచ్చడయేలా ఉంది. అయినా పోనిస్తున్నాను గుడ్డిగా. వెనుకనుంచి కాల్పులు ఎక్కువయ్యాయి.

స్టీరింగ్‌ని ఇష్టం వచ్చినట్లు తిప్పుతున్నాను. అష్ట వంకరలు తిరుగుతోంది బోటు. వేగంగా పోతూ జిగ్‌జాగ్‌గా తిరగటంవల్ల ఏ క్షణంలో అయినా తల్రకిందులయే ప్రమాదం ఉంది. అయినా మెలకువగా తప్పిస్తున్నాను ప్రమాదాలను. వెనకనుంచి కాల్పులు ఆగలేదు.

అలా పోనిస్తూనే వెనక్కు తిరిగి చూశాను. అంతే! స్టీరింగ్ వదిలి ఎగిరి సముద్రంలోకి దూకి, అడుక్కిపోయాను. వెనుక బోటులోని వ్యక్తి విసిరిన బాంబు నా బోట్ మీద పడి, బోట్ బద్దలవటం నేనూహించాను, పైన భయంకరమైన శబ్దం విని.

రివ్వున లోనికి ఈదుకుంటూ పోయి, దూరంగా వెళ్ళి, పైకి లేచి చూశాను. పేలిపోయిన బోట్లు కణకణ మంటల్లో మండుతున్నాయి. మిగిలిన మూడు బోట్లు ఆగి ఉన్నాయి. నాకోసం వెదుకుతున్నారు. ఎవరో చూశారు నన్ను. మెషిన్ గన్‌లు మొరిగాయి. రివ్వున లోనికి పోయాను. దూరంగా పోయాను.

ఇలా ఎంతసేపు దాగుడుమూత లాడగలనో అర్థం కాలేదు. ఎక్కువసేపు నీటిలో ఉండలేను. వాళ్ళకి పట్టుబడక తప్పదు. ఏం చేయాలి?

ఊపిరి బిగపట్టగల్గినంతసేపు నీటిలో ఉండి, పైకి తేలి ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకొని లోనికిపోతున్నాను. నాకోసం చుట్టూ వెదుకుతున్నారు. నేను వాళ్ళకి కన్పించిన చోట్లల్లా మెషిన్‌గన్‌లు కాలుస్తున్నారు.

ఈసారి పైకి తేలినప్పుడు వారెక్కడున్నారో గుర్తు పెట్టుకున్నాను. నీటిలో మునిగి ఒక బోట్ దగ్గరికి ఈదు కుంటూ పోయాను.

నెమ్మదిగా బోటు క్రిందకు చేరాను.

నాకోసం నలుగురయిదుగురు నీటి లోనికి దిగినట్లు న్నారు. ఇదీ నాకొక అవకాశమే. నేను పైకి తేలినా వెంటనే గుర్తు పట్టలేరు. ఈ అవకాశం ఉపయోగించు కోవాలి.

పైకి తేలాను. బోట్ అవతలివైపుకి చూస్తున్నారిద్దరు వ్యక్తులు. "హాయ్!" నెమ్మదిగా పిలిచాను. ఉలిక్కిపడి వెనక్కి తిరిగారిద్దరు. నా చేతిలో రెడీగా ఉన్న బూటు మెషిన్‌గన్ పట్టుకున్నవాడి ముఖాన్ని బలంగా తాకింది. వెంటనే పైకి జంప్ చేశాను అంచు పట్టుకుని. రెండోవాడిని తేరుకోకముందే గడ్డం క్రింద గుద్ది, ఇద్దర్నీ కలిపి ఒకేసారి నీటిలోకి తోసేసాను. క్షణాల్లో జరిగిపోయింది ఇదంతా.

బోట్‌లో ఉన్న రెండో మెషిన్‌గన్ తీసుకుని టపటప పేల్చాను. మిగిలిన బోట్లలోనివాళ్ళు జరిగింది గ్రహించే లోపునే ఆహుతి అయ్యారు. నీటిలో మునిగినవాళ్ళు పైకి తేలారు. అంతే! వాళ్ళ తలలు కూడా పేలిపోయాయి. బోటులో ఉన్న మిని బాంబులు ఆకర్షించాయి. వాటిని విసి రాను, మిగిలిన రెండు బోట్లమీదికి.

పెద్ద పేలుడుతో పేలిపోయాయి అవి. నేనున్న బోట్‌ని వాటికి దూరంగా తీసుకుపోయి, చూస్తున్నాను.

భగభగ మండుతున్నాయి. బోట్‌ని స్టార్ట్ చేయబోయి ఆగాను. హెలికాప్టర్ చప్పుడు. తలెత్తి పైకి చూశాను. దూరంగా వస్తూ కన్పించింది.

4

ధడధడ మంటూన్న శబ్దంతో హెలికాప్టర్ ప్రొపెల్లర్స్ గిర్రున తిరుగుతున్నాయి. జుయ్ మంటూ దగ్గరకు వచ్చి, నా తలమీదుగా యెగిరిపోయింది.

ఆ హెలికాప్టర్ మీద ఆస్ట్రేలియా నేవీ ఫోర్సెస్ గుర్తులు కన్పిస్తున్నాయి. ఎటునుంచి వచ్చిందీ గమనించలేదు గాని, శత్రువులు అతి జాగరూకతతోనే మెలుగుతున్నారని అర్థమయినది. హెలికాప్టర్‌లో ఇద్దరున్నారు. పైలెట్ కాక మరో వ్యక్తి కూర్చొని ఉన్నాడు. జుయ్ మంటూ వచ్చి నా తలమీద రెండు చెక్కర్లు కొట్టింది.

నీళ్ళు కారుతున్న తలతో అలానే చూస్తూ నిల్చుండి పోయాను.

అయిదు నిమిషాల తర్వాత, నా బోటు ప్రక్కనే, నెమ్మదిగా నీటిమీదకు దిగింది హెలికాప్టర్. నీటిలో మునిగిపోకుండా, గాస్‌తో నిండిన రబ్బరు సిలిండర్స్ అడుగున ఉన్న ఇనుప కమ్మీలకు అమర్చబడి ఉన్నాయి. పైలెట్ గాక, రెండో వ్యక్తి చేతిలో లైట్ మెషిన్‌గన్ ఉంది.

అతను దిగి, బోటులోనికి అడుగుపెట్టి "హూ ఆర్ యూ?" అని ఇంగ్లీషులో అడిగాడు. నేను చెప్పాను టూరిస్టునని.

మండుతున్న బోట్లవంక చూసి, నావైపు అనుమానంగా చూశాడు.

అప్పటికప్పుడు అల్లిన కట్టుకధని తడబడకుండా, నిజంగా జరిగినట్లు, వర్ణించి చెప్పాను.

బోట్ డ్రైవింగ్ నేర్పుతామని తీసుకువచ్చారని, కాని మధ్యకి వచ్చిన తర్వాత నా దగ్గరున్న డబ్బు ఇవ్వమని బెది

రించారని, కాని నేను తప్పించుకొని, సముద్రంలోకి దూకి వారిని చిందరవందర చేశానని చెప్పాను. ఆ హడావుడిలో నేను కాల్చిన గుళ్ళు టాంక్ కి తగిలి బోట్లు పేలిపోయాయని చెప్పాను.

నా మాటలు విని అతను ఆలోచనలో పడ్డాడు. నేను చెప్పిన కథలో లూజ్ ఎండ్స్ చాలా ఉన్నాయని నాకు తెలుసు. అతను నేను చెప్పిన దాన్ని నమ్మలేదని అతని ముఖం చూస్తుంటేనే తెలుస్తోంది.

బోట్ అంతా గాలించాడు. అంతకుముందే బోట్ లో ఉన్న అమ్యూనిషన్ అంతా నీటిపాలుచేశాను. నా దగ్గర మెషిన్ గన్ తప్ప మరేమీ లేదు. ఇది కూడా వారిదేనని చెప్పాను.

అంతా చెప్పి "మీ రెవరో తెలుసుకోవచ్చా?" అని ప్రశ్నించాను.

"మేము ఆస్ట్రేలియన్ నేవీ ఫోర్సెస్‌కి సంబంధించిన సిబ్బందిమి. ఇక్కడ ఏదో చప్పుడు రావటం గమనించి బయలుదేరి వచ్చాము" అన్నాడతను.

అతను చెబుతున్నదానిని వింటూనే, మరొకవైపు ఆలో చిస్తున్నాను.

వీళ్ళ బారినుండి తప్పించుకోవడం యెలా? వీళ్ళ ముఖాలు చూస్తుంటే శత్రువుల్లాగా లేరు. అయినా వీరి వెంట పోతే చాలా చిక్కువస్తుంది. నేను బయటపడాలంటే కష్టం. కాని అతని చేతిలో లైట్ మెషిన్ గన్....?

"సారీ మై ఫ్రెండ్! మీమీద అనుమానంగా ఉంది. ఈ మధ్య ఆస్ట్రేలియాలో విద్రోహచర్యలు అధికం అవు తున్నాయ్. మాతో రాక తప్పదు" మర్యాదగా చెప్పాడు.

నేనూ మరేమి చెప్పదలుచుకోలేదు. మౌనంగా హెలికాప్టర్ ఎక్కి కూర్చున్నాను. అతను కూడా ఎక్కగానే గాలిలోకి లేచింది.

ఇరవై నిముషాలనంతరం ఒక స్టీమర్‌ని సమీపించాము. సముద్రం మధ్యలో 'ఏంకర్' అయి ఉన్న గస్తీ నౌక అది.

ఆ స్టీమర్ చుట్టూ రెండు రౌండ్లు కొట్టి, హెలికాప్టర్‌ను డెక్‌మీదకు దింపాడు పైలెట్. డెక్‌మీద యూనిఫాంలోనున్న సిబ్బంది తమతమ పనులలో మునిగిపోయి, మా రాకను కూడా పట్టించుకోలేదు.

తరువాత నేను ఒక కాబిన్‌లో బంధించబడ్డాను.

5

ఎవరో కాబిన్ తలుపులు తెరుచుకు రావటంతో ఆలోచనల నుండి బయటపడ్డాను. షిప్ కాప్టెన్, మరో వ్యక్తి లోనికి ప్రవేశించారు. ఇద్దరు లోనికి రాగానే కెప్టెన్ తలుపులు బంధించాడు.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ రాజ్‌కుమార్!" విష్‌చేశాడా యువకుడు. నేనూ తిరిగి విష్ చేశాను. కెప్టెన్ నాకు సిగిరెట్ ఆఫర్ చేశాడు. అందుకొని ముట్టించాను.

"నౌ! టెల్ మి మిస్టర్ రాజ్‌కుమార్! మిమ్మల్ని ఎందుకు బంధించారో చెప్పగలరా?" అన్నాడు ఆ యువకుడు నవ్వుతూ.

"చెప్పండి" అన్నాను నేనూ నవ్వుతూ, అలా అన్నా, తప్పించుకోవడానికి దారులు వెదుకుతూనే ఉంది మెదడు.

"మిస్టర్ రాజ్‌కుమార్! మీ రెవరో నాకు తెలుసు. నేనెవరో మీకు తెలియదు. నా పేరు విలియం కాసిల్.

అందరూ విలియం అంటారు. సి. ఐ. ఏ. ఏజంట్ ని."

ఆ మాట విని అదిరిపడ్డాను. అనుమానంగా చూశానతని వంక.

"భయపడకండి. మీరూ, నేనూ ఒకే కార్యం మీద బయలుదేరాము. ఈ ఆపరేషన్ లో ఒంటరిగా కంటే ఇద్దరు, ముగ్గురు కలిసి పనిచేస్తేనే బాగుంటుంది. అందుకే ఈ ఆపరేషన్ మీద ఎవరెవరు బయలుదేరారో ఎంక్వయిరీ చేశాము. చివరికి మీతో కలిసి పనిచేయటానికి నిశ్చయించుకున్నాను. మీ అభిప్రాయం చెప్పండి."

"మీకు సాయం కావాలంటే నేనే దొరికానా? మీ బ్రాంచ్ లో ఎంతమంది ఏజంట్లులేరు?"

నా మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించినట్లున్నాడు విలియం. ఒక్క క్షణం అతని ముఖం నల్లబడి, అంతలోనే తేరుకుంది.

"యు ఆర్ కరెక్టు. మా బ్రాంచ్ లోని ఏజంట్ల సంగతి మీరు బాగా తెలుసుకున్నట్లున్నారు. అయినా మీ ధైర్యం, తెలివితేటలు వారికెలా వస్తాయి?"

అతని జవాబులోని వ్యంగ్యం గుర్తించాను. ఏదో అనబోయేంతలో కెప్టెన్ అందుకున్నాడు.

"వాద ప్రతివాదాలు తరువాత రాజ్ కుమార్! మీ అభిప్రాయం చెప్పండి. వారు పేరుకి సి. ఐ. ఎ. ఏజంటయినా ప్రస్తుతం ఆస్ట్రేలియన్ గవర్నమెంటు తరఫున పనిచేస్తున్నారు," అన్నాడు షిప్ కెప్టెన్.

"నాకు అభ్యంతరంలేదు," అన్నాను తడుముకోకుండా, ముందిక్కణ్నించి బయటపడాలి అన్న ఆలోచనతో.

"థాంక్స్! మమ్మల్నిక్కడ బంధించడంలో మరో ఉద్దేశ్యం కూడా వుంది మిస్టర్ రాజ్ కుమార్. ఈ ప్రపంచం

మీద అడుగడుగునా 'క్రైనా' ఏజంట్లు అలుముకుపోయి ఉన్నారు. ఎవరిని నమ్మాలో, నమ్మకూడదో తెలియటం లేదు. అలాగే ఆస్ట్రేలియన్ ఫోర్సెస్‌లో కూడా శత్రువుల హస్తం ఉందని మా అనుమానం.

మీరెవరో శత్రువులకు తెలుసు. సాధారణంగా ఆర్మీ నేవీ మొదలయిన ఫోర్స్‌స్‌కి అనుమానం వచ్చి బంధించబడితే విడిపించుకోవటం చాలా కష్టం. ఇప్పుడు మీరు కూడా బందిఖానాలో ఉన్నారని అనుకోవాలని, అలా నాటకం ఆడాము."

చిన్నగా నవ్వాను నేను. "ఇంతకీ మీరా సి. ఐ. ఏ. ఏజంటువని నమ్మకమేమిటి?"

విలియం తన ఐడెంటిఫికేషన్ చూపించిన తర్వాతగాని నేను నమ్మలేదు.

"మిస్టర్ రాజ్‌కుమార్! ప్రస్తుతం మీరు మా బంధితులుగానే ప్రవర్తించండి, యిక్కడ నుండి ఎలా బయటపడాలో తర్వాత ఆలోచిద్దాం!"

ఆ రాత్రే నేను విలియం కాసిల్ రహస్యంగా ఒక బోట్‌లో బయలుదేరాము.

దారిలో తను పరిశోధించిన కేసు వివరాలు, ఎలా పరిశోధించినది చెప్పి, నా చేత కూడా చెప్పించుకున్నాడు విలియం.

తెలతెలవారుతుండగా సుమత్రాదీవిని సమీపించాము. దాని చుట్టూ అనేక ద్వీపాలు, చిన్నవీ, పెద్దవీ ఉన్నాయి. దూరంనుంచే రాకెట్ లాంచింగ్ స్టేషన్ ఉన్న దీవి, ఆ దీవిలో పైకి ఆకాశంలోకి నిలబడివున్న పెద్ద రాకెట్ కన్పిస్తున్నాయి.

ఆ దీవి చుట్టూ చిన్నా, పెద్ద లాంచీలు, మోటారుబోట్లు తిరుగుతున్నాయి. దూరంగా అక్కడక్కడ షిప్స్ కన్పిస్తున్నాయి.

హఠాత్తుగా ఎవరయినా మమ్మల్ని చూసినా, బెస్తల వేషంలో ఉన్న మమ్మల్ని గుర్తుపట్టలేరు. మా బోటును మరో చిన్నదీవి వైపు మళ్ళించాము.

6

సాయంత్రం చీకటి పడే సమయానికి సముద్రతీరానికి చేరుకున్నాము ఇద్దరము.

ఎవరూ మమ్మల్ని గమనించటం లేదని నిర్ధారించుకొని, అప్పటి వరకు రహస్యంగా దాచిన మా పడవ వద్దకు చేరుకున్నాము. మా వంటి మీద నున్న దుస్తులు విప్పేసి, 'డైవింగ్ సూట్' తొడుక్కొని, భుజంమీదుగా ఆక్సిజన్ సిలిండర్స్ తొడుక్కొని, నిశ్శబ్దంగా నీటిలోకి జారాము.

మా యిద్దరి చేతుల్లోను శక్తివంతమయిన పెన్ టార్చ్ లున్నాయి. దాని సహాయంతో సముద్ర గర్భంలో ఈదుకుంటూ పోసాగాము.

రాత్రి అయినప్పటికీ సముద్రం మీద పడవలు, లాంచీలు మొదలయిన నౌకా సంచలనం తగ్గలేదు. అప్పుడప్పుడు దూరంగా వున్న షిప్స్ సైరన్‌లు వినపడుతున్నాయి, పైకి తేలినప్పుడల్లా.

నీటి అడుగున రివ్వున దూసుకుపోతున్న నన్ను, విలియం చేయిపట్టుకొని ఆపటంతో చటుక్కున ఆగిపోయాను.

నన్ను ఆపిన విలియం, టార్చ్‌ని ముందుకు వేసి, కొద్ది దూరం వెళ్లాడు. అతన్ని అనుసరించి నెమ్మదిగా ఈదు

కుంటూ దగ్గరికిపోయాను. ఇనుపకడ్డీలతో చేసిన వలవంటి ఫెన్సింగ్ సముద్రం అడుగున, నీటి ఉపరితలం వరకువుంది. బహుశా ఆ దీవి చుట్టూ ఇటువంటి ఫెన్సింగే ఉండి వుండాలి.

ఇద్దరం పైకి తేలాము. దూరంగా ఫ్లడ్‌లైట్ల కాంతితో దీవి పట్టపగలులా వుంది. దీవి ఆవల చివర ఆకాశంలోకి నిలబడి వున్న రాకెట్ స్పష్టంగా కన్పిస్తున్నదా కాంతిలో.

ఫెన్సింగ్ ఆవల, సముద్ర జలం మీద నాలుగయిదు బోట్లనిండా గన్స్ ధరించిన వ్యక్తులు కాపలా కాస్తూ కన్పించారు. అంతేగాక, దీవి మీద అడుగడుక్కీ కాపలా వున్నట్లు కనబడుతూంది. ఒక్క మాటలో చెప్పాలంటే, అనుమతిలేనిదే పురుగు కూడా ఆ దీవి మీద కాలు మోపలే దనిపించింది.

"ఏం చేద్దాం?" అతి చిన్నగా అడిగాను విలియంను. నా మాటలు విలియంకి విన్పించాయో, లేదో అన్నంత చిన్నగా అన్నాను.

ఏ మాత్రం అలికిడి అయినా వాళ్ళు మమ్మల్ని గమ నిస్తారు.

ఏదో అంటున్నాడు విలియం. మా మీద చివ్వున ఫ్లడ్ లైట్లు బోట్లలో ఒకదానిమీద నుంచి కాబోలు, పడింది. ముఖానికి కప్స్ ధరించి రివ్వున లోనికిపోయాము. మేమున్న చోట ఇంకా బాంబు పడలేదేమో అని ఆలోచిస్తున్నాను. ఇంతలో నీళ్ళన్నీ అల్లకల్లోలం అయ్యాయి.

మాకు నాలుగు ప్రక్కలా టార్చ్‌లైట్ల కాంతి. ఆ కాంతిలో, "యారోగన్స్" ధరించి మా వైపు దూసుకు వస్తున్న వ్యక్తులు కన్పించారు.

ఎదురు తిరిగి పోరాడినా లాభం లేదు. వారికి లొంగక తప్పలేదు.

7

మా దగ్గర ఉన్నవస్తువులు, ఆఖరికి ఆక్సిజన్ సిలిండర్స్‌లో సహా లాక్కుని, ఒక బోటులోకి ఎక్కించారు.

ఫెన్సింగ్ వెంట కొంతదూరం వెళ్ళిన తరువాత, ఫెన్సింగ్‌లో కొంతభాగం, గేటులా తెరుచుకుంది. నీటిపైకి ఏమాత్రం కన్పించని ఆ ఫెన్సింగ్. అక్కడ లోపలకు ప్రవేశించింది బోటు.

మా ఇద్దరిని పెడరెక్కలు విరిచికట్టి, గన్స్‌తో కవర్ చేస్తున్నారు. పదినిముషాలనంతరం అందరం దీవిమీద ఉన్నాము.

ఆ దీవిమీద భవనాలలోకూడా లైట్లు వెల్గుతున్నాయి. స్వంత జనరేటర్ ఉన్నట్లుంది. భవనాలన్నీ ఒకేచోట నిర్మించారు. ఒకప్రక్కగా ఉన్న పెద్ద హాలులాంటి వర్క్‌షాప్‌నుంచి ఇనుప రైలు బద్దీలు వెళుతున్నాయి. అవి పోయి, దూరంగా కన్పిస్తున్న రాకెట్‌ను చేరుకుంటున్నాయి.

వర్క్‌షాపులో రాకెట్‌ను తయారుచేసి, ప్రయోగానికి పట్టాలద్వారా దూరంగా తీసుకుపోతాయి. ఇక్కడినుంచి రాకెట్‌కి దూరం మూడు, నాలుగు కిలోమీటర్లుంటుంది.

ఆ దీవిమీద అడుగడుక్కీ సైనికకాపలా ఉంది. అందరూ "కైనీయులే" అక్కడే దగ్గరదగ్గరగా ఉన్న భవనాలు చూసి, ఆఫీసు స్టాఫ్ క్వార్టర్స్ అనుకున్నాను. వీటిల్లో కంట్రోలింగ్ రూం ఏదో తెలిస్తే బాగుండును. ఆఖరి క్షణాలలోనయినా తెగించి ధ్వంసం చేయవచ్చు.

తీరానికి చేరగానే. అక్కడే ఉన్న ఒక జీపులో మమ్మ

ల్నిద్దరినీ ఎక్కించి తీసుకుపోతున్నపుడు నేను గమనించిన విషయాలవి.

రాకెట్ చుట్టుప్రక్కల భవనమనేది లేదు. అంతా నున్నటి మైదానం. చెట్లు, చేమ మొదలయినవి పీకిపారేసి నున్నగా మైదానంలా చేశారు.

జీప్ ఆగింది. మమ్మల్నిద్దరిని ఒక భవనంలోనికి తీసుకు పోయారు.

మా వెంటవచ్చిన సైనికులలో ఒకడు వెళ్ళి, టీపాయ్ మీద అమర్చివున్న ఫోన్ఎత్తి, ఎవరితోనో మాట్లాడాడు.

అది విశాలమయిన హాలు. క్రింద మెత్తటి, ఎర్రటి తివాచీ పరిచి ఉంది. ఖరీదయిన సోఫాలు, చాలా అందంగా అమర్చబడి ఉన్న పెయింటింగ్స్.

అయిదు నిమిషాలనంతరం పొట్టిగా, లావుగా, గుమ్మటంలా ఉన్న ఒకవ్యక్తి లోనికి ప్రవేశించాడు, మేడ మెట్లు దిగి.

అతను ఆ స్టేషన్కు డైరెక్టర్ అని పరిచయం చేసుకున్నాడు అతనే. మా పేర్లుమాత్రం చెప్పి వదిలేసాము.

నైట్గౌన్ ధరించి ఉన్న అతను, వచ్చి సోఫాలో కూర్చుని, మా వంక పరిశీలనగా చూశాడు.

మా వెంటవున్న సైనికులలో, ఫోన్ చేసినవాడు "చైనా" భాషలో అతనితో ఏదో చెబుతున్నాడు. నాకా భాష రాదు. అక్కడక్కడ కొన్ని మాటలు మాత్రం అర్థం అయ్యాయి. విలియంకి కూడా ఈ భాషరాదు కాబోలు, నిరాసక్తంగా ఉన్నాడు. నాకు అర్థం అయిన మాటలనుబట్టి మేమెలా పట్టుబడింది చెబుతున్నాడని ఊహించుకున్నాను.

అతను, చెప్పేది వింటూ, మా వంక చూస్తున్నాడు డైరెక్టర్.

అంతా విని అన్నాడు ఇంగ్లీషులో, "ప్చ్! దురదృష్ట వంతులు. అంతగా మీ కీ రాకెట్ లాంచింగ్ స్టేషన్ చూడాలని ఉంటే, మా అనుమతి తీసుకొని రావచ్చుగా?"

అతను సీరియస్‌గా అంటున్నాడో, వ్యంగ్యంగా అంటు న్నాడో తెలియక, విలియం, నేను ముఖముఖాలు చూసు కున్నాము.

"ఓ. కె. ఫ్రెండ్స్! పాపం చాలాదూరం నుంచి వచ్చి నట్లున్నారు. నువ్వు ఇండియన్‌వి. ఇతను తెలియటంలేదు. బహుశా అమెరికన్ అయి ఉండవచ్చు. మీ రాక నాకు ఎంతో సంతోషాన్ని కలుగజేస్తోంది. కానీ మీరు వచ్చిన పద్ధతి నచ్చలేదు. మీ రెందుకొచ్చారో నాకు తెలుసు. మీరు మమ్మల్ని తప్పుగా అర్థంచేసుకున్నారు. మీతో, మాపై ఉన్న దురభిప్రాయాన్ని పోగొట్టే బాధ్యత నామీద ఉంది. ఈ రాత్రి ఇక్కడే ఉండి రెస్ట్ తీసుకోండి. రేపు మీకు అంతా వివరిస్తాను."

చిరునవ్వుతో అన్నాడు డైరెక్టర్. అతని మనస్సులోని భావాలు కనిపెట్టడానికి విఫలప్రయత్నం చేశాను. చాలా తెలివిగలవాడిలా ఉన్నాడు. ఏమాత్రం బయపడటం లేదు.

"రేపటివరకు ఎందుకు? ఇప్పుడే చూపించవచ్చుగా?" నోరు తెరిచాడు విలియమ్స్ మొదటిసారి.

"సారీ మైబోయ్! రాత్రిపూట 'గార్డ్స్' తప్ప ఇతరు లెవరూ తిరగకూడదు, ఎంత అర్జెంటయినా సరే. ఓ. కె. లెట్స్‌గో. రేపు కలుసుకుందాం!" అతను సైనికులకు ఏదో సైగచేసి, వెళ్ళిపోయాడు మేడమీదికి.

8

ఉదయాన్నే ఫలహారాదులు వచ్చాయి. మొదట సంశ యించినా, ఇద్దరం తిన్నాము ఒకరి తర్వాత ఒకరము.

కొత్త శక్తి వచ్చినట్లయింది.

ఎనిమిదిగంటల ప్రాంతంలో ఇద్దరు సైనికులు వచ్చి, మా ఇద్దరిని రాకెట్ లాంచింగ్ స్టేషన్ డైరెక్టర్ వద్దకు తీసుకుపోయారు.

ఆ దీవిమీద తిరగటానికి అనువుగా వేయబడిన మార్గాల మీద రకరకాల వ్యక్తులు, వాహనాలు తిరుగుతూ కన్పిస్తు న్నాయి. ఆడవాళ్ళు కూడా కొందరు కన్పించారు.

మే మిద్దరం కూడా తొందరపాటు పనులేమీ చేయ కుండా వారివెంట బుద్ధిగా నడిచాము. డైరెక్టర్ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి కుశల ప్రశ్నలు వేశాడు, మేమేదో వివిపీ ల మయినట్లు.

ఆ డైరెక్టర్ కేమీ తీసిపోలేదు విలియం కాసిల్ కూడా. తాను కూడా నవ్వుతూ, ఏమీ ఎరగనట్లు మాట్లాడుతున్నాడు. నేను పెద్దగా కలగజేసుకోలేదు వారి సంభాషణలో. అసలు వారిద్దరిని చూస్తుంటే, మమ్మల్ని బంధించినది ఆ డైరెక్టర్ మనుషులనిగాని, మేము పరస్పరం శత్రువులమనిగాని అన్పించటం లేదు. నిజంగా ఆ వాతావరణం గమ్మత్తుగా ఉంది. ఇంతకుముందు లేని అనుభవం.

డైరెక్టర్ ఆఫీసుకి బయలుదేరుతున్నాడు కాబోలు తెల్లటి కోటు, పాంటు ధరించి ఉన్నాడు. కోటు పై జేబులో ఎర్రటి రుమాలు బయటికి కన్పిస్తోంది. అదొక యూనిఫాం లాగుంది.

అక్కడ కూర్చొని వారి మాటలు వింటూ, పరిసరాలు పరిశీలిస్తున్నాను.

"మీ ఫ్రెండ్ ఏమిటో వెతుకుతున్నట్లుంది?" డైరెక్టర్ ప్రశ్నకు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను.

"ఈ భవనంలో వింతలు, విశేషా లేమయినా కన్పిస్తా యేమోననిః"

"కాదు. కంట్రోలింగ్ రూమేదన్నా కన్పిస్తుందేమో నని!" విలియమ్స్ అన్నాడు మధ్యలో అందుకొని.

ఆ మాటలకి డైరెక్టర్‌తోపాటు, నేనూ అదిరిపడ్డాను. అంత డైరెక్టుగా రంగంలోకి దిగుతాడని మేమిద్దరం అను కోలేదు. బాప్‌రే! సి. ఐ. ఏ. ఏజంటంటే ప్రపంచంలో అందరు ఎందుకింత భయపడతారో అర్థం అయ్యింది. ప్రాణాలమీద ఆశలు వదులుకొని ఏజంట్‌గా చేరతారు కాబోలు. విలియమ్‌తో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

మరో అయిదు నిమిషాలనంతరం ముగ్గురం జీప్‌లో బయలుదేరాము.

మా ఇద్దరినీ కవర్ చేస్తూ వెనక సైనికులు.

రెండుగంటలపాటు ఆ దీవిలోని వింతలు, విశేషాలు, రాకెట్ నిర్మాణం. దానిని ప్రయోగించే విధానం అన్నీ వివ రించాడు డైరెక్టర్. ఈయనకి ఇంకో పనేమి ఉన్నట్లు లేదు కాబోలు.

అంతా చూపించడం అయ్యాక "మీ మిత్రుడి కోరిక ప్రకారం కంట్రోలింగ్ రూం కూడా చూపించదల్చుకు న్నాను," అన్నాడు క్లుప్తంగా.

ఆ మాటలకి నాకే కాకుండా, విలియంకి కూడా రక్తం వడిగా ప్రవహించిందని చెప్పగలను. అయినా మేమిద్దరం ఆతృత కనుపరచలేదు. మా ఇద్దరినుంచి తను ఆశించిన రెస్పాన్స్ రాకపోవటంతో డైరెక్టర్ కొద్దిగా నిరాశచెందిన ట్లున్నాడు.

"కంట్రోలింగ్ రూంలోకి ప్రవేశించటం అంత తేలిక

గాదు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసిగాని వదలరు. ఏమాత్రం అనుమానం వచ్చినా కాల్చిపారేస్తారు."

డైరెక్టర్ అన్న ఆ మాటలతో మమ్మల్ని బెదిరిస్తున్నాడో, కంట్రోలింగ్ కేంద్రం గురించి తెలుపుతున్నాడో అర్థంగాలేదు. నిర్లక్ష్యంగా నవ్వి ఊరుకున్నాము.

మనిషికి గర్వం పనికిరాదని మరోసారి రుజువయ్యింది. తమ నేమి చెయ్యలేరన్న గర్వం, అపోహతో మా ఇద్దరినీ కంట్రోలింగ్ రూం లోనికి తీసుకువెళ్ళటానికి నిశ్చయించుకున్న డైరెక్టర్‌కు, మతిలేదేమో ననిపించింది.

జీప్‌లోనే వెనక్కు తిరిగి భవనాలను సమీపించాము. ఒక చిన్న భవనంముందాగింది జీప్. అంత చిన్న భవనం కంట్రోలింగ్ రూం అంటే నమ్మలేక పోయాను. విలియం కూడా సంభ్రమంగా దానివంక చూస్తున్నాడు.

"కమాన్!" అంటూ దారితీశాడు డైరెక్టర్. ఆ ఇంటి ముందు కూడా సైనిక కాపలా ఉంది. ఆ భవనం లోపల హాలుకి ఒక చివర, గోడకి టెలివిజన్ స్క్రీన్స్ ఉన్నాయ్. వాటిముందు వివిధరకాల స్విచ్‌లు, బటన్‌లు, కలర్ బల్బులు గల డయాస్ ఒకటీ ఉంది. ఆ టేబుల్ ముందు ముప్పై ఏళ్ళ యువతి ఒకామె కూర్చొని ఉంది. అందంగా లేకపోయినా, అనాకారి మాత్రం కాదు.

డైరెక్టర్‌ని చూసి, లేచి నిలబడి విష్‌చేసింది. ఆయన, ఆమె ఏదో మాట్లాడుకున్నారు కైనా భాషలో. తరవాత మాకేసి తిరిగి "రండి" అన్నాడు.

మా ముగ్గురితోపాటు, మా వెనక వస్తున్న ఇద్దరు సైనికులు వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తున్నారు.

అయిదుగురం ఇంటి మూలకి నడిచాము. అక్కడకు

పోగానే, గోడలో కొంతభాగం తప్పుకొని, లిఫ్ట్‌వంటి చిన్న గది ఒకటి కన్పించింది.

అయిదుగురం నడిచి దానిలోకి చేరుకోగానే, తలుపు మూసుకుపోయింది.

రెండు క్షణాలనంతరం లిఫ్ట్ కదిలినట్లయి, ఇద్దరం తూలి డైరెక్టర్ మీద పడబోయాము. మా వెనక నున్న మెషిన్ గన్స్ మా వీపులకు బలంగా గుచ్చుకున్నాయి. మేము నిలదొక్కుకొని డైరెక్టర్ వంక చూశాము. శ్రీకృష్ణ పరమాత్ముడిలా, చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

అయిదు నిమిషాలనంతరం లిఫ్ట్ ఆగింది. అండర్ గ్రౌండ్ అని అర్థం అవుతూనే ఉంది.

లిఫ్ట్ తలుపులు తెరిచాడు సైనికులలో ఒకడు.

పొడుగాటి వరండా కన్పించింది. దానికి అటూ, ఇటూ బుడిపెలు లాగా టెలివిజన్ కెమెరాలు అమర్చబడి ఉన్నాయి. అంతేగాదు, నడవా ఆ చివర, లిఫ్ట్ లోపల కూడా కెమెరాలు అమర్చబడి ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఎవరు వచ్చేది, పోయేది తెలుస్తుంది.

అయిదుగురం నడుచుకుంటూ వచ్చాము. తలుపు తెరిచిన తరువాత సైనికులు మమ్మల్ని మరలా చెక్ చేశారు. తర వాత విశాలమయిన హాలులో ఉన్నాము.

"యస్. మై ఫ్రెండ్స్. దిసీజ్ ద కంట్రోల్ రూం!" అన్నాడు డైరెక్టర్.

9

"ఈ కంట్రోలు రూమ్‌ని వర్ణించాలంటే చాలా టైం పడుతుంది. అందుచేత క్లుప్తంగా చెప్పి వదిలేస్తాను. పైన దీవిమీద, దీవి చుట్టుపక్కల, సముద్ర గర్భంలో ఏమి

జరుగుతుందో ఇక్కడినుంచే తిలకించవచ్చు.

ప్రతి అంగుళం కూడా మేము ఏర్పాటుచేసిన టెలివిజన్ కెమెరాల ద్వారా ఇక్కడ కన్పిస్తూ ఉంటుంది. సముద్రపు నీటిలో కదలిక అయినా చాలు, మేము ఏర్పరచిన సాధనాలు కొన్ని రకాల కాంతి కిరణాలను ప్రసారం చేస్తాయి. మామూలు కంటికి కన్పించేవి కావా కాంతికిరణాలు. ఆ ఆ కిరణాలవల్ల ప్రవేశించిన ఆబ్జక్టల షేడింగ్స్ ఇక్కడి స్క్రీన్స్‌మీద ప్రత్యక్షమవుతాయి. అందుకే చీకటిలో ఉన్నప్పటికి మావాళ్ళు మిమ్మల్ని పోల్చుకొని, పట్టుకున్నారు" ఆగాడు డైరెక్టర్.

అర్థమయింది నాకు; వివిధ దేశాలనుంచి వచ్చిన ఏజంట్లు ఎందుకు పట్టుబడ్డారో, మేము కూడా ఎలా బంధింపబడ్డామో.

"యస్ ఫ్రెండ్స్!" తిరిగి మొదలుపెట్టాడు డైరెక్టర్.

"ఈ ఏర్పాట్లన్నీ ఆటోమాటిక్‌గా జరిగిపోతుంటాయి. ఇంతేగాదు, దూరంగా వొచ్చే విమానాలు, షిప్స్ మొదలయినవి కనిపెట్టడానికి రాడార్‌లవంటి అధునాతన యంత్రాలన్నీ ఉన్నాయిక్కడ. ఈ రాకెట్ లాంచింగ్ స్టేషన్‌ను ఏమాత్రం ధ్వంసం చేయాలని చూసినా, ఆ ప్రయత్నం మాకు తెలిసిపోతుంది.

ఈ హాలు అవతల మరొక హాలు ఉంది. అది రాకెట్ ప్రయోగానికి సంబంధించిన కేంద్రం. అంటే రాకెట్ కంట్రోలింగ్ సెక్షన్ అది. అక్కడకి పోవాలంటే ఇతరులకు సాధ్యపడదు.

మీరూహించినట్లు అంతరిక్షంలోని మార్పులకు, వాతావరణంలోని భిన్న పరిస్థితులకు కారణం మేమే. మాకున్న

సైన్సు పరిజ్ఞానంతో ఇలా ఇండైరెక్టుగా ప్రపంచంమీద దెబ్బతీయ దల్చుకున్నాము.

అందుకే మామూలు పద్ధతులకు భిన్నంగా, ప్రకృతినే మార్చివేస్తున్నాము. ఇలా ఒక్కొక్కటిగా దేశాలనన్నిటిని స్వాధీనం చేసుకుంటాము. ఈ ప్రపంచంలో "కైనా" జెండా తప్ప, మరొకటి ఎగరకుండా చేస్తాం!"

ఆవేశంతో అతని కంఠం పూడుకుపోయింది.

వారి భావాలు చూసి నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు నాకు.

తరవాత మరో అరగంట తమ ఆశయాలు, ఆశలతో బోరుకొట్టించాడు డైరెక్టర్. మమ్మల్ని కూడా వారితో చేరిపొమ్మన్నాడు. ఎవరో రాజకీయ నాయకుణ్ని దీనికి డైరెక్టర్‌గా వేయలేదు గదా అన్న అనుమానం వొచ్చింది నాకు.

తరవాత హాలులోనుంచి, ఇవతల ఉన్న పెద్ద గదిలోకి ప్రవేశించాము. నిజానికి అదికూడా చిన్నపాటి హాలు అని చెప్పవచ్చు.

ఆ గదిమధ్య స్విమ్మింగ్‌పూలు ఒకటి ఉంది. దానిపైన గాజు గ్లాసు మూత వేయబడి ఉంది. ఆ గ్లాస్‌గుండా పూల్‌లోని ద్రవం కన్పిస్తోంది.

"అది సల్ఫ్యూరిక్ ఆసిడ్!" క్లుప్తంగా అన్నాడు డైరెక్టర్.

విలియం, నేను అదిరిపడ్డాము.

"మీలాంటివారికోసం ఏర్పాటు చేయబడింది" అంటూ గోడ దగ్గిరికి నడిచి, ఒక స్విచ్ నొక్కాడు డైరెక్టర్. వెంటనే స్విమ్మింగ్‌పూల్‌మీద ఉన్న గాజు తలుపులు ప్రక్కకు తప్పుకున్నాయి. సల్ఫ్యూరిక్ ఆసిడ్ వాసన ముక్కుల్ని బద్దలు చేసింది.

"మీరు మాలో చేరటానికి అంగీకరించరని నాకు తెలుసు. మీలాంటి వారందరూ దానిలో స్నానం చేస్తారు. మీరు కూడా!" అన్నాడు డైరెక్టర్.

ఒమర్‌షరీఫ్ గుర్తుకొచ్చాడు నాకు. ఇందాకటి నవ్వుతూ, ఆప్యాయంగా మాట్లాడిన డైరెక్టర్ గొంతు కాదిది. కఠినంగా, బండబారిపోయినది. ఆయన ముఖం ఇంతకుముందు లేనంత కఠినంగా ఉంది. అసలు ఆయనది ఇందాకటి ముఖమేనా, లేక డ్రాక్యులా ముఖమేదైనా అద్దెకు తెచ్చుకున్నాడా అన్పించింది.

"ఊఁ! మీరు కూడా స్నానం చేయండి!" అధికారికంగా ఆజ్ఞాపించాడు. గుమ్మందగ్గర యిద్దరు సైనికులు, మెషిన్ గన్స్ మా వంకే గురిపెట్టి నిలబడి ఉన్నారు.

వాతావరణం మారింది. ఎవరికివారే, తమ తమ వృత్తుల లోనికి వెళ్ళిపోయాము. అతను మాకు శత్రువు. మేమతనికి మిత్రులం కాము. మా అంత్యకాలం సమీపించింది. నా బుర్ర చురుగ్గా పని చేస్తోంది. ఇటువంటి సమయాలలోనే అది బాగా పని చేస్తోంది. ఆ పూల్‌లోకి దిగితే ఎముకలు కూడా మిగలవని తెలుసు.

పరిసరాలు తిలకించాను జాగ్రత్తగా. నా ప్రక్కనే విలియం కాసిల్ ఉన్నాడు. మాకు పదిగజాల దూరంలో డైరెక్టర్, గోడదగ్గర ఉన్నాడు. అతనికి ఎడమవయిపున గుమ్మం దగ్గర, తలుపులు ఇవతల సైనికులు. తలుపులు మూసి ఉన్నాయి.

ఆ గదిలో టెన్షన్ పెరిగింది.

"ఊఁ! క్విక్. నడవండి!" హెచ్చరించాడు డైరెక్టర్. ఈ సమయంలో ఏమి చేద్దామనుకున్నా ప్రమాదమే.

పూల్లోకి దూకకపోతే మెషిన్‌గన్ గుళ్ళకి బలవటం ఖాయం.

డైరెక్టర్ కళ్ళవంక చూసిన నాకు, ఎర్రగా జ్యోతులు లాగా మెరవటం కన్పించింది. మా ధోరణి పరిశీలించాడు లాగుంది. "చేతులు ఎత్తి పూల్ దగ్గరికి నడవండి!" అని ఆజ్ఞాపించాడు.

నేను, విలియం చేతులు ఎత్తాము. వెనక్కు ఓమారు చూసి, వెనకడుగు వేశాము. అంచుకి కొద్దిదూరంలో ఆగి డైరెక్టర్ వంక చూశాము. వికృతమయిన నవ్వొకటి అతని పెదాలమీద డాన్సు చేస్తోంది.

"ప్లీజ్! మమ్మల్ని చంపొద్దు. వదిలేస్తే మా దేశానికి తిరిగిపోతాం. మీ గురించి ఒక్క ముక్కకూడా చెప్పం!" బ్రతిమలాడుతున్నాడు విలియం.

ఈ సమయంలోనే విలియం నా వంక తిరిగి కన్ను గొట్టటం బహుశా ఆ గదిలోని యితరులు గమనించి ఉండరు.

మేము బ్రతిమలాడటం చూసి డైరెక్టర్‌కి నవ్వాగలేదు. పొట్ట చెక్కలయేలా నవ్వుతున్నాడు.

"మీలాంటి పిరికి సన్నాసుల్ని ఏజంట్లుగా ఎవరు నియమించారు?" నవ్వటం ఆపి అడిగాడు. చటుక్కున ఆగిపోయి, మావంక చూశాడు. మా ఉద్దేశ్యం అర్థం అయినట్లుంది.

"యూ! వెరీ డేంజరస్ ఫెలోస్. మీ ప్లాన్‌ను కనిపెట్టలేనంత మూర్ఖుణ్ణిగాను.'' అని సైనికులవయిపు తిరిగాడు. అతని సైగను అందుకొని, గన్సు మా గుండెలకి గురి పెడుతూ ముందుకి నడిచి వచ్చారిద్దరూ.

మాకు, డైరెక్టర్‌కి మధ్యగా సైనికులు వచ్చి, బారెల్స్‌తో

మా గుండెలమీద నెట్టుతూ వెనక్కి వెళ్ళమని సైగ చేస్తున్నారు.

ఇద్దరం మరో అడుగు వెనక్కి వేశాము. చటుక్కున గన్ బారెల్ పట్టుకొని క్రిందకి గుంజడం, వారిని ముందుకి లాగి, మేము తప్పుకోవడం, సైనికులిద్దరూ అరుస్తూ ఆసిడ్ పూల్ లోకి పడిపోవటం, కళ్ళు తెరిచేలోపల జరిగిపోయింది.

నిర్ఘాంతపోయిన డైరెక్టర్, తేరుకునే లోపున, విలియం ఎగిరి అతని మీదకు లంఘించాడు. నేను ఏసిడ్ వైపు చూశాను. అప్పటికే సైనికులు శరీరంమీద మాంసం అంతా కరిగిపోయి, ఎముకలు కన్పిస్తున్నాయి.

ఇటు చూసేసరికి ముఖం పచ్చడి చేయబడి, నిర్జీవంలో వున్న డైరెక్టర్ కన్పించాడు. అతన్ని ఎత్తి పూల్ లోకి విసిరి ద్వారం వైపు కదిలాము.

10

ఒక్కొక్కప్పుడు అనుకోనివిధంగా అదృష్టం కలిసి వస్తుంది. జరగవని అనుకున్నవి జరిగినపుడు కలిగే అనుభూతి వర్ణనాతీతము. అందులోనూ మనకి ఆనందం కల్గించేవి, మనకి మంచిని జరిపేది అయితే ఇహ చెప్పలేము.

ద్వారం తలుపులు కొద్దిగా తెరిచి హాలు లోపలకు చూసిన మాకు అదృష్టం వెతుక్కుంటూ వచ్చిందంటే మాకే నమ్మ శక్యం గావటంలేదు. ఆ అండర్ గ్రౌండ్ హాలులోని కంప్యూటర్లు, మిషన్ ల ముందు ఎవరికి వారే తమ తమ పనులలో మునిగిపోయి వున్నారు. కాపలా కూడా లేదు.

లోపలికి నడిచి మా చేతుల్లో వున్న మెషిన్ గన్ కి పని కల్పించాము. ఎంతోమంది అమాయక ప్రజలు, తాము చేయని నేరానికి బలవుతున్నారు. అయినా తప్పదు. పై

నుంచి ప్రమాదం ముంచుకొస్తూంది.

హాహాకారాలు, ఆర్తనాదాలు! హృదయ విదారకమయిన కేకలు. మాకు జాలి కలగటం లేదు. ఆ సమయంలో మేము లేము. అక్కడ సి.ఐ.ఏ. ఏజంటు, ఇండియన్ ఏజంట్ మాత్రమే వుంది అక్కడ.

విలియం తన గన్ కూడా నాకు యిచ్చి, కంప్యూటర్ల మీద బడ్డాడు, ఖాళీ అయిన నా గన్‌ని తీసుకొని వైర్లు తెంపటం, బట్‌తో యంత్రాలన్ని ఛిన్నాభిన్నం చేయటం అతను చేస్తుంటే, అతన్ని కవర్ చేస్తూ లోనికి రాబోతున్న గార్డ్స్‌ని కాలుస్తున్నాను నేను.

జుగ్ జుగ్ జుగ్ మంటూ మోగుతోంది నా చేతిలోని మెషిన్ గన్. ఉన్నట్లుండి శబ్దం మానేసింది. గుళ్ళు అయిపోయాయి. విలియం నా పరిస్థితి చూసినట్లున్నాడు. అప్పటికే అక్కడి యంత్ర సామాగ్రి దాదాపు అంతా నాశనం అయిపోయింది.

విలియం తన షర్ట్, ఫాంట్ బటన్స్ ఊడబెరికి, ఆ యంత్రాల మధ్య అక్కడక్కడ అమరుస్తున్నాడు. అవేమిటో అర్థం అయ్యాయి. టైంబాంబ్స్ సి.ఐ.ఏ. ఏజంటు దగ్గర అటువంటి ఆధునిక పరికరాలు లేకపోతే ఆశ్చర్యపడేవాడిని.

పై నుంచి సైనికులు దిగుతున్నారు. ఒక బటన్ వారి మధ్యకు విసిరేశాడు విలియం. పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ శబ్దంలో హాహాకారాలుగాని, ఆ పొగలో తుత్తినియలైన సైనిక శరీరాలు కాని ఎవరికీ కన్పించలేదు.

అక్కడి జనంలో హాహాకారాలు మరింత ఎక్కువయ్యాయి. దోపిడి అధికం అయ్యింది. ఎమర్జెన్సీ ఎక్జిట్ తెరిచినట్లున్నారు కాబోలు అందరూ గుంపులు గుంపులుగా

పైకి పరుగెత్తుతున్నారు.

ఈలోపున తనపని ముగించాడు విలియం. అవతలి హాలులోకి చొరబడి ఆ పొగలో తమ శత్రువులెవరో, మిత్రులెవరో అర్థంగాని 'కైనా' సైనికులు తికమక పడు తున్నారు. ఇదే అదనుగా భావించి వారితో కలిసి మేమూ బయటికి పరుగెత్తాము.

లోపల అండర్‌గ్రౌండ్‌లో ప్రేలుళ్ళు మొదలయ్యాయి. అవి ఇక ఆగవని తెలుసు. ఆ సంగతి తెలుసుకున్న కైనా సైనికులు వాటి జోలికిపోక, వస్తున్న జనసందోహాన్ని చూస్తూ నిస్సహాయంగా నిలబడిపోయారు.

మేమిద్దరం అందుబాటులోవున్న జీప్ ఒక దానిలో ఎక్కాము. విలియం డ్రైవింగ్ సీట్‌లో వున్నాడు.

బుల్లెట్‌లా దూసుకుపోతుంది జీప్, రాకెట్ వయిపు.

మమ్మల్ని గమనించిన సైనికులు, మరో జీపులో మా వెనక పడ్డారు.

విలియం రాష్ డ్రైవింగ్‌కి అదిరిపోతున్నారు. వాళ్ళు కాలుస్తున్న మెషిన్‌గన్ గుళ్ళు మా జీప్ వరకి చేరటంలేదు. అడ్డదిడ్డంగా పోతున్నాయి.

జీప్ నేలమీద నడవటం లేదు. గాలిలో తేలుతున్నట్లు పోతూంది. ఏ క్షణాన్నయినా జీప్ ఎక్సిడెంట్ అవుతుందేమో నన్పించింది.

రాకెట్ దగ్గర కాపలా సిబ్బంది కూడా కంట్రోలు రూం దగ్గరకు వచ్చినట్లున్నారు. ఎవరూ కన్పించడంలేదు.

పెద్దగా అరిచి చెబుతున్నాడు విలియం.

రాకెట్ సమీపించగానే చటుక్కున క్రిందకి జంప్‌చేసి, బాలెన్సు మీద ప్రక్కకి దొర్లాను. మా వెనక ధడధడ మంటున్న చప్పుళ్ళూ మానలేదు.

విలియం కూడా క్రిందకి దూకాడు. యిద్దరం లేచి సముద్రం వైపు శక్తికొద్ది పరుగెట్టాము.

ఈ లోపుగానే మేము వదిలిన జీప్ తిన్నగాపోయి రాకెట్ అమర్చిన చట్రం అడుగున గుద్దుకుంది. అంత వేగంతో గుద్దుకోవటంతో చిన్నాభిన్నం అయింది. దానిలోనుంచి మంటలు వెలువడినాయి. తర్వాతేమి జరుగుతుందో అందరికీ తెలుసు.

ఇద్దరం నీటిలోకి ఉరికాము. విలియం పళ్ళు బిగపట్టి ఈదుతున్నాడు. అతని కాలిలో దిగాయి గుళ్ళు. నీటిలో మునిగి, పైకి తేలుతూ పోతున్నాము.

అప్పటికే చాలా రక్తం పోవటంవల్ల శక్తిహీనంగా వున్నాడు విలియం. అయినా ఓపిక తెచ్చుకొని ఈదుతున్నాడు. మా వెనక కొంతమంది సైనికులు నీటిలోకి దిగి ఈదుకుంటూ వస్తున్నారు.

ఫెన్సింగ్‌కి దగ్గరయ్యాము. నీటిపైకి తేలి, జాగ్రత్తగా అవతలికి దిగాము.

పెళపెళార్భాటాలతో రాకెట్ కూలిపోతూంది. మేమిద్దరం అదేమి చూడటంలేదు. దూరంగా పోతున్నాము.

దీవిలో జరిగే ఈ విపరీత పరిణామాలు అర్ధంగాక చుట్టు ప్రక్కల సంచరిస్తున్న నౌకలు, బోట్లు, బెస్తల పడవలు, ఈ వింతని చూడటానికి దగ్గరికి వచ్చారు.

అదృష్టవశాత్తు అప్పుడే ఒక మోటారుబోట్ అటుగా వచ్చింది. దానిని ఆపి ఎక్కాము. మరుక్షణమే విలియం చేతులు చకచక పనిచేశాయి. మరుక్షణమే ఆ బోటుని నడుపుతున్న వ్యక్తి తలవాల్చి కూలబడిపోయాను.

నేను డ్రైవింగ్ సీట్ దగ్గర కూర్చున్నాడు.

క్షణాలలో ఆ దీవి మాకు దూరం అవసాగింది. ***



సీరియల్

(గత సంచిక తరువాయి)

ఐరన్ సేఫ్ డయలింగ్ సిస్టం ప్రకారం ఏర్పాటు చేయబడింది. చకచక ఏవో నంబర్లు తిప్పాడు ధర్మేంద్ర. క్లిక్ మంది. అయిరన్ సేఫ్ తెరుచుకుంది. లోపల వజ్రాల పేకట్లన్నీ ఓ పెద్ద కేసులో సర్దబడి వున్నాయి. ఆ కేసు చేతిలోకి తీసుకున్నాడు.

ఏ పని చేస్తున్నా దృష్టి మాత్రం గదిలోవున్న ముగ్గురి మీద మాత్రం కేంద్రీకరించే వుంచాడు.

ధర్మేంద్రకు ఐ. జి.తో మాట్లాడి మురళి విషయం తెలుసుకోవాలని వుంది. కానీ యింతకుముందే X-లైట్ అనుచరుడు 'నీ వెనుక నీడలా మరో మనిషి వుంటాడని గుర్తుంచుకో' అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

చివరకు ధైర్యం చేశాడు.

అంతలో ఐ. జి. జేబులోంచి చటుక్కున రివాల్వర్ తీయబోయాడు.

"మిస్టర్, కదలకు. నీ గుండెలో గుండు దూసుకుపో తుంది." హెచ్చరిస్తూ ముందుకు నడిచాడు ధర్మేంద్ర.

ఐ. జి. స్టన్ అయిపోయాడు. అతని హృదయం అవ మానంతో దహించుకుపోతోంది. ఎంతో పటిష్టమైన రక్షణ యేర్పాట్లు దగ్గరుండి చేయించాడు. అయినా ప్రయోజనం చేకూరలేదు. శత్రువు అతి నైపుణ్యంతో లోనికి ప్రవేశిం చాడు. అయితే ఐ. జి. కి ఒకే ఒక్క ధైర్యం మిగిలి వుంది. దుండగుడు వచ్చేటప్పుడు మాయోపాయంతో లోపలకు వచ్చినా, ఇక్కడనుండి పారిపోవడం దుర్లభం. దాదాపు వందమంది రిజర్వ్ పోలీసులు బయట రక్షణకొరకు నిలబడివున్నారు.

"మిస్టర్ కిషోర్‌కుమార్" అతి చిన్నగా, సౌమ్యంగా పిలిచాడు.

ఆశ్చర్యపోయాడు ఐ. జి.

"మిస్టర్ ధర్మేంద్ర!" అన్నాడు ఆశ్చర్యానందాలు మిళిత మైన కంఠంతో.

సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ కమల్‌నాథ్ చేతులు దించ బోయాడు.

"సారీ, మిస్టర్ కమల్‌నాథ్! ఎత్తిన చేతులు దించితే మృత్యువును కౌగలించుకోక తప్పదు." తిరిగి కంఠం మార్చి గర్జించాడు.

ఎస్. బి. డైరెక్టర్ స్తంభించిపోయాడు, అలాగే చేతులు యెత్తి ధర్మేంద్ర వైపు విచిత్రంగా చూడసాగాడు.

"మిస్టర్ కిశోర్, మురళి గురించి సమాచారమేమైనా చెప్పగలరా?" ఆతృతగా అడిగాడు.

"ఎస్ సార్! మురళి హైద్రాబాద్‌లో ఇప్పటివరకు

మొత్తం తొమ్మిదిమంది లైట్ రాకెట్ మెంబర్స్‌ను బంధించి మాకు స్వాధీనం చేశాడు. మేము వారి స్థానంలో తొమ్మిదిమంది. సీక్రెట్ బ్రాంచ్ ఏజంట్లను తయారుచేసి రెడీలో వుంచాం. అవకాశం దొరికిన వెంటనే లైట్ రాకెట్‌లో చేరిపోతారు వాళ్ళు."

"వెరీగుడ్! మురళి మరి ఇక్కడికి బయలుదేరలేదా?" అడిగాడు ధర్మేంద్ర.

"తెలియదుసార్! ముఖ్యమంత్రిగారి సెక్రటరీ రామ్మూర్తి గారింట్లో ఓ వ్యక్తి స్పృహతప్పి వున్నాడని, అతన్ని స్వాధీనం చేసుకొమ్మని, రామ్మూర్తిగారికీ విషయం తెలియనివ్వద్దని ఫోన్‌లో చెప్పాడు. 'మీరు స్టేషన్‌కు రారా?' అని అడిగితే యెక్కడికో అత్యవసరమైన పనిమీద వెళుతున్నానని, త్వరలో కలుస్తానని చెప్పారు. ఆ తరువాత ఆయన జాడ తెలియదు" చెప్పాడు ఐ. జి.

ధర్మేంద్ర క్లుప్తంగా వివరాలు చెప్పి "డియర్ సర్స్, శత్రువుల రాకెట్‌లోకి ప్రవేశించడానికి ఇంతకన్నా వేరే మార్గం కన్పించలేదు. త్వరగా మిష్టరీ తేల్చేయడానికి ఇంతకన్నా వేరే దారి లేదు," అన్నాడు.

"మిష్టర్ ధర్మేంద్ర! చాలా సాహసం చేస్తున్నారు. మీకు ఎప్పుడు ఏ సహాయం కావలసినా సిద్ధంగా వుంటాం. విష్‌యూ బెస్టాఫ్ లక్!" అన్నాడు ఎస్. బి. డి. కమల్‌నాథ్.

"థ్యాంక్యూ సర్! మీరు మాత్రం మీ మామూలు కార్యక్రమం అనుమానం లేకుండా జరిపించండి. నేను బయటకు వెళ్ళిన రెండు నిమిషాల తర్వాత డేంజర్ సిగ్నల్ ఇవ్వండి. ఇక మీ పోలీస్ వారినుండి తప్పించుకునే బాధ్యత నాదే!"

అంటూ చటుక్కున ప్రక్కనే వున్న కిటికీలోనుండి బయటకు దూకాడు ధర్మేంద్ర.

రెండు నిమిషాల తర్వాత 'బొంయ్' మంటున్న పోలీస్ విజిల్స్‌తో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది.

31

హోటల్ 'కాసినో' లోని స్పెషల్ ఎయిర్‌కండిషన్డ్ రూంలో కూర్చొని వున్నాడు మురళి. అతని చేతిలో డైరీ వుంది. అందులో వున్న నంబర్‌నే పరీక్షగా చూస్తున్నాడు అతని మనసు కంప్యూటర్‌లా పనిచేస్తోంది. ఏవేవో కూడకలూ, తీసివేతలు, భాగహారాలు మదిలో గిరగిర తిరుగుతున్నాయి.

హైదరాబాద్ నగరంలో ఎయిర్‌కండిషన్డ్ రూమ్‌లో కూర్చొని వున్న మురళి షర్ట్ చమటతో తడిసిపోయింది.

'తనింతవరకు ముఖ్యమైన సమాచారం ఏదీ తెలుసుకోలేదు. ఒక్క నంబర్ మాత్రం తెలిసింది. ఆ నంబర్‌ను బట్టి ఏమైనా తెలుస్తుందేమోనని ప్రయత్నం! నంబర్ కోడ్ ఏమిటో తెలుసుకోవాలి. అసలు ఇంతకూ ఆ నంబర్‌లో యేదైనా అర్థముందో, లేదో? తను వూరికే అనవసర శ్రమ పడటం లేదుకదా! ఏమో? శ్రమపడకుండా ఫలితం దక్కదు కదా!' ఆలోచనలతో మునిగిపోతున్న మురళి మెదడులో చటుక్కున ఓ ఆలోచన మెరిసి మాయమయింది.

వెంటనే మూలగా వున్న టెలిఫోన్ వద్దకు నడిచాడు. ప్రక్కనే వున్న టెలిఫోన్ డైరెక్టరీ తీశాడు. అందులో 155 నంబర్ వుందేమో వెదికాడు. ఎక్కడా కన్పించలేదు. అయినా నగరంలో అన్ని ఫోన్ నంబర్లు అయిదు అక్షరాల మీదే కదా!

మళ్ళీ ఏదో ఆలోచన వచ్చింది. గబగబ రూంకు తాళం వేసి బయటకు వచ్చి టాక్సీ ఎక్కి 'సిటీ ఇన్ఫర్మేషన్ సెంటర్'కు పోనిమ్మని చెప్పాడు.

సిటీ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో అతనికి కావలసిన వివరాలు వెంటనే దొరికాయి.

నగరంలో పెద్ద హోటల్స్ మూడు వున్నాయి. అది 'హోటల్ మెక్సికో', 'హోటల్ స్వప్న', 'హోటల్ లైట్ హౌస్'. ఆ మూడు హోటల్స్ లోనూ 155 నంబరుగల రూంలు వున్నాయి.

వారికి థాంక్స్ చెప్పి బయటకు వచ్చి మళ్ళీ టాక్సీలో కూర్చున్నాడు.

"ఎక్కడకు పోనిమ్మంటారు సార్?" డ్రైవర్ అడిగాడు.

ఒక్కక్షణం ఆలోచించాడు మురళి. ఆ మూడు హోటల్స్ పేర్లలోనే హోటల్ లైట్‌హౌస్ పేరు అతన్ని ఆకర్షించింది. ముందుగా ఆ హోటల్‌ను పరిశోధించాలనుకున్నాడు.

"హోటల్ లైట్‌హౌస్" చెప్పాడు.

టాక్సీ రివ్వున దూసుకుపోయింది.

పదిహేను నిమిషాలలో టాక్సీ హోటల్ లైట్‌హౌస్ ముందు ఆగింది.

మీటరు చూసి టాక్సీ ఫేర్ చెల్లించి హోటల్‌లోకి నడిచాడు.

రిసెప్షన్‌వద్ద ఓ అందమైన ఆంగ్లోయిండియన్ యువతి కూర్చుని వుంది.

మురళి రిసెప్షన్‌వద్దకు నడిచాడు. ఆ యువతి అందంగా నవ్వింది.

"వాట్ కెన్ ఐ డు ఫర్ యు సర్!"

"నాకొక రూం కావాలి" ఇంగ్లీషులోనే అడిగాడు.

"సింగిల్ రూమ్ చాలుకదా!" రిజిష్టర్ తీస్తూ అడిగిందా యువతి.

"చాలు. అయితే ఓ చిన్న రిక్వెస్టు?"

"చెప్పండి!"

"మీ హోటల్‌లో 154వ నంబర్ రూం వుంటే ఇవ్వండి."

ఆశ్చర్యంగా చూసిందా యువతి.

"మరేంలేదు. ఆ నంబర్ నా లక్కీ నంబర్."

"ఓ ఇటీజ్ నాచురల్! జస్ట్ వెయిట్" అంటూ రిజిష్టర్ పరిశీలించి చూసింది.

తరువాత చిన్నగా నిట్టూరుస్తూ "సారీసర్! 154, 155 నంబర్‌గల రూములు ఖాళీగా లేవు. మీకు అంగీకారమైతే 156వ నంబర్‌గల రూం ఖాళీగానే వుంది" చెప్పింది.

ఒక్కక్షణం ఆలోచించాడు మురళి. "నెవ్వర్! 156 అయినా ఫర్వాలేదు. బుక్ చేయండి" చెప్పాడు.

"థాంక్యూ. మీ పేరు, వృత్తి, అడ్రస్ చెప్పండి."

"ఎన్. బాబూరావు, కాస్మెటిక్స్ రిప్రజంటేటివ్, ఖాజీపేట" చెప్పాడు మురళి.

రిజిష్టర్‌లో వ్రాసుకుని "సంతకం పెట్టండి సార్" అని రిజిష్టర్ ముందుకు జరిపింది.

రిజిష్టర్‌లో సంతకంచేస్తూ ప్రక్కపేజీ చూశాడు, మురళి.

'జి. ఫణిభూషన్-కంట్రాక్టర్-పూనా' అని వుంది.

రిజిష్టర్ తిరిగి ఇచ్చేస్తూ "ఫణిభూషన్‌గారి పేరు ఎక్కడో విన్నట్లుంది" అన్నాడు ఏదో గుర్తుచేసుకున్నట్లు నటిస్తూ.

చెప్పుకోండి చూద్దాం?

1. ఎత్తుగా వున్న ప్రదేశం నుండి ఒక వ్యక్తి దూకిన చప్పుడును బట్టి ఆ వ్యక్తి కాళ్ళకు ఏమి వున్నాయో గుర్తించగలమా?

2. పేల్చబడిన రివాల్వర్ శబ్దాన్ని బట్టి, దాని కాలిబర్ నెంబరు చెప్పవచ్చునా?

3. యుద్ధరంగములో 'వికలాంగు'లైన సైనికులను వాళ్ళు బాగు అయిన తర్వాత మళ్ళీ వాళ్ళను సైన్యంలోకి తీసుకుంటారా?

4. మామూలుగా నిల్చుండి పీల్చే గాలిని, తలక్రిందులుగా వుండి అదే స్థాయిలో గాలిని పీల్చగలమా?

5. రాజకీయ హత్యలు ఏ దేశంలో విరివిగా కొనసాగుతాయి?

6. దొంగ నోట్లు ముద్రించిన నేరస్తులకు కోర్టు వారు 'మరణ శిక్ష' లాంటి శిక్షను విధిస్తారా?

7. ఒక వ్యక్తిని, నలుగురు కలిసి చంపేశారు. అయితే ప్రభుత్వం నలుగురికి సమాన శిక్ష విధిస్తుందా?

—కె. చందర్‌రావ్.

జవాబులు:

1. గుర్తించవచ్చు.
2. చెప్పలేరు.
3. 'వికలాంగుల'ను తీసుకోరు.
4. పీల్చలేము.
5. అమెరికాలో.
6. విధించరు.
7. అవును. విధిస్తుంది.

"ఆయన పెద్ద కంట్రాక్టర్ సార్. ఎక్కడైనా విని వుండటలో ఆశ్చర్యంలేదు" చిన్నగా నవ్వేందా యువతి.

"ఎస్ ఎస్! గుర్తుకు వచ్చింది. అయితే ఆయన్ను ఈ రోజు కలుసుకోవడానికి వీలవుతుందా?" అడిగాడు.

"సారీసర్! ఆయన రెండు రోజులక్రితమే వూరు వెళ్ళాడు. మీరు కలుసుకోవాలంటే మరో నాలుగురోజులకు వస్తారు."

"వెరీగుడ్! అయితే ఈ నాలుగురోజులూ మీ అందాన్ని ఆస్వాదించొచ్చు!" చిలిపిగా చూశాడు.

చిరుకోపం అభినయిస్తూ చూసిందా యువతి.

"ఎక్సలెంట్! కోపంలో కూడా ఎంత అందంగా వున్నారు మీరు?"

ఆమెలో కోపం చెక్కిలిపై కెంపులుగా మారింది.

"మీరు చాలా చిలిపిగా మాట్లాడతారు?" చిన్నగా నవ్వింది.

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్!" నవ్వాడు మురళి.

ఆమె రూంబోయ్‌ను పిలిచి మురళిని చూపించి ఏదో చెప్పింది.

"రండి సార్!" ముందుకు దారితీశాడు రూంబోయ్.

అతన్ని అనుసరించాడు మురళి. లిఫ్ట్‌లో మూడవ అంతస్థుకు వెళ్ళారు ఇద్దరూ.

"ఇదే సార్, మీ రూం" తాళంతీసి లోపలకు తీసుకు వెళ్ళాడు బోయ్.

"వెరీగుడ్! వెంటనే వెళ్ళి ఓ బోర్నవిటా తెచ్చిపెట్టు" బోయ్‌కు ఓ రూపాయి టిప్ అందిస్తూ చెప్పాడు.

అపరాధ పరిశోధన పోటీ-95 [ఫలితాలు]

జూన్ '76 నెల "అపరాధ పరిశోధన పోటీ-95"కి సరియైన సమాధానాలు:

1. బెర్లినర్.
2. పిల్లలతో.
3. అప్పుల వాళ్ళు.
3. పెట్టుబడి.
5. దుఃఖం.

పై జవాబుల ప్రకారం ఇద్దరు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి సెప్టెంబర్ '76 నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేతలు:

(1) శ్రీ ఎన్. జ్ఞానేశ్వర రావ్,
చిగురు కోట పోస్టు,
కైకలూరు తాలూకా,
(క్రిష్ణా జిల్లా.)

(2) శ్రీ ఎస్. వాసు,
కేరాఫ్—వి. కోటయ్య,
ఐరన్ మర్చంట్,
మార్కాపూర్,
(ప్రకాశం జిల్లా.)

అతను సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయాడు.

మురళి బయటకువచ్చి ఆ నడవా అంతా పరిశీలిస్తూ ఒక రౌండ్ కొట్టాడు.

ఆ లైన్‌లో మొత్తం పాతిక గదులు వున్నాయి. పదిహేను గదులు ఫుల్ అయివున్నాయి. తన గదికి వస్తూ చూశాడు ప్రక్క గదులవైపు.

154 వ గదిలో ఎవరో ఇద్దరు వ్యక్తులు చెస్ ఆడుకుంటున్నారు. 155 వ గదికి తాళం వేసివుంది.

తన గదిలోకి ప్రవేశించేసరికి బోయ్ రెడీలో వున్నాడు. అతని చేతిలో బోర్నవిటా అందుకొని అతన్ని పంపించేసి తలుపు లోపల లాక్ చేసి సోఫాపై కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

బోర్నవిటా, సిగరెట్ ఒకేసారి అయిపోయాయి. ఇక కర్తవ్యం ప్రారంభించాలి.

ప్రక్కనున్న గదిలోకి ప్రవేశించి ఆ గదిని టెస్ట్ చేయాలి. ఆ గది రామ్మూర్తికి సంబంధించినదే అయితే ఏమైనా రహస్యాలు దొరక్కపోవు. ముందాగదిలోకి ప్రవేశించాలి. ఎలాగ?

తలుపు తెరచి బయటకు చూశాడు. కొంచెం సందడిగానే వుంది. లాభంలేదు. ఎవరైనా చూశారంటే దొంగను కుంటారు. వెంటనే తలుపు మూసేశాడు. వేరే మార్గం ఏమైనా దొరుకుతుందేమోనని వెనుక నున్న బాత్‌రూంలోకి నడిచాడు.

బాత్‌రూంలో పైనున్న వెంటిలేటర్ చూసేసరికి మురళిలో ఆశారేఖ తళుక్కున మెరిసింది. హోటల్ రూములన్నీ ఒకే మోడల్‌లో కట్టివుంటారు కాబట్టి, ఈ బాత్

సప్లిమెంట్ పోటీ-21 [ఫలితాలు]

మే '76 నెల "సప్లిమెంట్ పోటీ_21"కి సరియైన జవాబు :

J	K	H	I	G

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వీరికి ఆగస్టు '76 నెల నుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీ ఆర్. వి. ప్రభాకరరావు, (టీచర్,)
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
నోముల—పోస్టు,
వయా—నకిరేకల్,
(నల్లగొండ జిల్లా).

రూంలో నుండి అవతలి బాత్‌రూంలోకి చేరుకుంటే, ఆ రూంలోకి తేలికగా చేరుకోవచ్చు.

గబ గబ లోపలకు వెళ్ళి టేబుల్ తీసుకువచ్చి వేశాడు. దానిపై కుర్చీ, దానిపై మరో కుర్చీ, దానిమీద స్టూలు వేశాడు. ఇక రూంలో ఎత్తైన సామానులు లేవు. మెల్లగా ఒక్కొక్కదానిమీదుగా పైకెక్కాడు. రెండు చేతులూ పైకెత్తాడు. ఇంకా అర్థమీటర్ ఎత్తులో వుంది వెంటిలేటర్. అడుగున స్టూలు కదులుతోంది. ఎగురుదామనుకున్నాడు. కానీ గోడ అంచు దొరకకపోతే, అవయవలోపం తప్పదు. అయినా ధైర్యం చేయక తప్పదు.

గట్టిగా ఊపిరి పీల్చాడు. రెండు చేతులు బాగా చాపాడు. ఒక్కసారి పైకెగిరాడు. అతని చేతులకు గోడ అంచు దొరకడం, కాళ్ళక్రింద వున్న స్టూలు, కుర్చీలు వరుసగా పడిపోవడం ఒకేసారి జరిగాయి. గాలిలో లోలకంలా వూగసాగాడు. ఒకసారి వూపిరి వదలి మళ్ళీ పీల్చుకుని పైకెగశాడు. వెంటిలేటర్‌ను చేరుకున్నాడు.

బాక్‌పాకెట్‌లోంచి స్క్రూడ్రైవర్ తీశాడు. పూర్తిగా వెంటిలేటర్ అద్దం వూడదీశాడు. జాగ్రత్తగా లోపలకు దూరి అవతలవైపుకు లాఘవంగా దూకాడు.

బట్టలకు అంటిన దుమ్ము దులుపుకొని ముందుకు నడిచి బాత్‌రూం తలుపు లాగాడు. తలుపు తెరుచుకోలేదు. అంటే బాత్‌రూం అవతలవైపు లాక్‌చేసి వుందన్నమాట!

విచిత్ర పరిస్థితిలో చిక్కుకొనిపోయాడు మురళి. ముందుకు వెళ్ళడానికి దారిలేదు. వెనక్కు తిరిగి చూశాడు. ఎత్తుపెట్టడానికి ఏమీ కన్పించలేదు. క్రిందకు దూకడమైతే దూకాడు కానీ, పైకి అంత ఎత్తు ఎగిరి మళ్ళీ వెంటి

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇప్పటికి వెయ్యికి పైగా సభ్యులు చేరారు. వెంటనే మీరూ చేరండి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్ని ఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెల నెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఏ నెలలోనైనా కాపీలు తీసుకోకపోతే మీ సభ్యత్వం రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని కూడ వి. పి. ద్వారా పంపగలము.

7. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ ద్వారా 'హోమ్ డెలివరీ' ఏర్పాటు వున్నది: రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, హైద్రాబాదు, అనకాపల్లి, తెనాలి, పామిడి, కరీంనగర్, సీలేరు ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, హిందూపురం, తాడేపల్లిగూడెం, గుంటూరు, నెల్లూరు, భీమవరం, జెల్లంపల్లి, నంద్యాల, సూర్యాపేట, కర్నూలు.

లేటర్‌ను చేరుకోవడం చాలా కష్టం!

ఏం చేయాలో తోచక సందిగ్ధంలో పడిపోయాడు మురళి.

32

డిటెక్టివ్ ధర్మేంద్ర కాలు సత్తుపకొద్దీ పోలీసులను తప్పించుకొని పరిగెడుతున్నాడు. వెనుక తుపాకులు ప్రేలుతున్నాయి.

చటుక్కున పరిగెడుతున్న ధర్మేంద్ర ప్రక్కన కారాగడం. బాక్ సీటులోని వ్యక్తి ధర్మేంద్రను లోపలకు లాక్కోవడం, కారు మళ్ళీ వేగంగా దూసుకుపోవడం ఒకే ఒక్క క్షణంలో జరిగిపోయింది.

వెను వెంటనే రెండు పోలీస్ జీప్‌లు బయలుదేరాయి. మూడు వాహనాలు పందెం కార్లలా పరిగెడుతున్నాయి. అంతలో ప్రక్క క్రాస్ రోడ్‌నుండి ఓ లారీ వచ్చి ముందు కారుకు, వెనుక జీప్‌లకు మధ్య అడ్డంగా నిలబడిపోయింది. జీప్‌లు రెండూ హఠాత్తుగా ఆగిపోయాయి.

ఇన్‌స్పెక్టర్ రంజన్ కోపంగా జీప్ దిగి లారీవద్దకు వచ్చాడు. డ్రైవరు, క్లీనరు బాయినెట్ ఎత్తి ఏదో చూస్తున్నారు.

"ఏయ్ మిష్టర్స్, ఏం జరిగింది?" రౌద్రంగా అడిగాడు.

"ఇంజన్ ఆగిపోయింది సార్. సెల్ఫ్ కావడం లేదు. ఏమిటా అని చూస్తున్నాం." చేతులు నులుముకుంటూ చెప్పాడు డ్రైవరు.

రంజన్ కడుపు మండిపోయింది. ఇది కేవలం దుండగుల ప్రణాళికే! ఈపాటికి దుండగుల కారు కనుచూపుమేర దాటిపోయివుంటుంది.

పది లక్షలు', సుజనశ్రీగారి 'ఆఫ్రికా అడవుల్లో భయంకర రాత్రులు' కథలు నన్ను ఆకర్షించాయి.

—ఎన్. ఎన్. రెడ్డి, సింద్రి.

'ఖైదీ' సీరియల్ ముగింపు చక్కగా వుంది. నిజంగా రాజ్ మీద నాకెంతో సానుభూతి కలిగింది. ముగింపులో డెల్లా, రాజ్‌తో మాట్లాడవలసింది. ఇంతమంచి సీరియల్‌ను అందించిన రచయితకు, ప్రచురించిన మీకు నా ధన్యవాదాలు. 'చావు కబురు' కథ నా హృదయాన్ని కదిలించి వేసిందంటే నమ్మండి.

—బి. షాజు, హిందూపురం.

ఈనెల కథల్లో 'వ్యసనాలకు బానిస' చక్కగా ఉంది. 'అర్ధరాత్రి హంతకుడు' కన్నా 'హత్య చేయని హంతకుడు' నాకు బాగా నచ్చింది. 'అగ్నిపరీక్ష' సహజత్వానికి దగ్గరగా ఉంది. సప్లిమెంట్‌లోని నాలుగు నవలలు ఎక్సెలెంట్‌గా ఉన్నాయి.

—టి. విజయకిషోర్, రాజమండ్రి.

'ఖైదీ' చివరి భాగం ఆతృతగా చదివాను. దాదాపు రెండు సంవత్సరాలపాటు పాఠకులను ఉత్రూతలూగించిన గొప్ప అడ్వెంచరస్ నవల 'ఖైదీ' ముగింపు. ఖైదీ రాజ్ లాగే మనకీ బాధగా తోస్తుంది. ఇంత సాహసపూరిత నవల 'నభూతో నభవిష్యతి' అనిపించే రీతిలో చిత్రించిన రచయితకు నా ప్రత్యేకాభినందనలు. పోతే, చాలాకాలం తర్వాత మరో మంచి వెరైటీ నవల రాశారు నా అభిమాన రచయిత్రి

'వసుంధర'గారు. కమ్మని శైలితో—ఏకబిగిన చదివించే సస్పెన్స్ నవల—'నకిలీ బాస్'.

—కాసారపు సంజీవయ్య, జగిత్యాల.

'ఖైదీ' సీరియల్ మమ్మల్ని "అపరాధ పరిశోధన"కు శాశ్వత ఖైదీలను చేసింది. సప్లిమెంట్‌కు కవరుపేజి మార్చి పుస్తకానికి వన్నె తెచ్చారు. కథల్లో అర్ధరాత్రి హంతకుడు, బంగారు గనులు చాలా బాగున్నాయి. అన్నిటికి మించి మీరు ప్రవేశపెట్టిన మార్పులు మమ్మల్ని బాగా ఆకర్షించాయి.

—కేశిరాజు క్రిష్ణ, దొడ్డిపట్లి.

'ఖైదీ' పూర్తి కావడంతో సప్లిమెంట్‌లో ఓ ధృవతార రాలిపోయిందా,అనిపించింది. ముగింపు చాల బాగుంది. 26 నెలలుగా చక్కని అనుభూతిని, ఎక్సైట్‌మెంట్ అందించిన రచయిత ఏ. వీ. మోహన్రావుగారికి నా హృదయపూర్వక అభినందనలు. ఈ నెల సప్లిమెంట్‌కు వాడిన రేపర్ అపనకు కూడ వాడవలసిందిగా కోరుతున్నాను.

—యం. ఏ. గోపాల్, కూచనపల్లి.

[మీ కోరిక వచ్చే నెలలో తీరుస్తున్నాము —సం॥]

Editedand Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1